భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

★

సెప్టెంబరు 1965

★


సంపుటము 42 : సంచిక 9

విడిప్రతిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక


సెప్టెంబరు 1965

జీవన పరీవాహం	శ్రీ బసిరెడ్డి ఈశ్వరరెడ్డి	1
నాగేశ్వరరావు పంతులుగారు తత్త్వవేత్త, గ్రంథకర్త	శ్రీ నోరి నరసింహశాస్త్రి	3
స్వవిషయము		11
ఆంధ్రపత్రిక స్వర్ణోత్సవం	"తా. వేం. కృ."	14
దీపం	శ్రీ బాలగంగాధరతిలక్	19
ఆర్తజన బాంధవుడు ఆల్బర్ట్ ష్వైట్జర్		20
ఆరాత్రి	శ్రీ కస్తూరి లక్ష్మీనారాయణ	23
రామాయణ కృతిపతి	శ్రీ దేవరపల్లి వేంకటకృష్ణారెడ్డి	29
అసురసంధ్య	శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం	33
నన్నయ సౌపర్ణాఖ్యానము	శ్రీ వడలి మందేశ్వరరావు	57
భారతచరిత్రలో అజ్ఞాత పుటలను తెరిచే లోథాల్	శ్రీ ఎస్. ఆర్. రావ్	65
లేఖలు		73
కలగూర గంప		75
గ్రంథ విమర్శలు		76



బొంబాయిలో ఆంధ్రపత్రిక స్థాపన మొదలు ఆంధ్రపత్రికా కార్యాలయంలో అనవరతం అర్చనలు అందుకుంటున్న మహాగణాధిపతి.

[ఆంధ్రపత్రిక స్వర్ణోత్సవ సంచికనుండి]



స్థాపకులు:
శ్రీ నాగేశ్వరరావు పంతులుగారు



శ్రీ నాగేశ్వరరావు పంతులుగారు, వారి సతీమణి శ్రీమతి రామాయమ్మగారు

(బొంబాయిలో ఉన్నప్పుడు)

నాగేశ్వరరావు పంతులు గారు: తత్త్వవేత్త, గ్రంథకర్త

శ్రీ నోరి నరసింహశాస్త్రి

మొన్నటి వినాయక చవితి ఆంధ్రపత్రిక స్వర్ణోత్సవం. ఆ సందర్భంలో ఆంధ్రపత్రిక స్వర్ణోత్సవానుబంధం ప్రచురించింది. విశ్వావసు సంవత్సరాది సంచిక స్వర్ణోత్సవ సంచికగా వెలువడింది. ఈ విశేషావకాశం పురస్కరించుకొని, ఆంధ్రపత్రిక స్థాపకులు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారిని గురించి ఈ ప్రత్యేకవ్యాసం ఇక్కడ ప్రచురిస్తున్నాము. సం॥

"ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబున కగుఁ దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్."

నేటికి మన మనుభవింప నారంభించుచున్న సర్వతోముఖమగు నాంధ్రాభ్యుదయము నాగేశ్వరరావు గారి జీవితముతో ఎంత పెనవేసికొని యున్నదో, వారి నిరంతర కృషిమీద నెంత యాధారపడియున్నదో, సామాన్యులకు విప్పరాని చిక్కు. ఆయన ప్రతిభా వ్యుత్పత్తు లెంత విస్తార గంభీరములో, వాని పరిపూర్ణత్వ మెట్టిదో పూర్తిగా తెలిసినవారు అరుదు!

ఆయన దేశోద్ధారకుడు. బిరుదములు పలువుర కలంకార ప్రాయములు. సార్థకమైన బిరుదములు కల కొలది మందిలో పంతులుగారు అగ్రశ్రేణి వారు. ఆంధ్ర ప్రభుత్వాధినేతలు ఇప్పు డిప్పుడే వారి దేశోద్ధారకత్వ స్వరూపము గుర్తింప నారంభించుచున్నారు. సామాన్య జనులు గుర్తించినట్లు లేదు.

విశ్వదాతగా ఆయనను కీర్తించువారు వారి వితరణ మాత్రమే ఎరుగుదురు. ఆ దాతృత్వమునకు మూలమైన వారి పరమకారుణిక హృదయ మెరుగరు. ఎంత చిన్న సత్కార్యమును తలపెట్టినవారికైనను వారిచ్చుచుండెడి చేయూతకు కారణమైన వారి విశ్వప్రేమను భావింపగలవా రరుదు. వారి దాతృత్వమునకు అవకాశమిచ్చిన వారి సంపదకు అంతరాంతరములలో నొక్కింత యసూయ కూడ కలవారే పలువురు!

ఆంధ్ర విశ్వ విద్యాలయము వారికి 'కళాప్రపూర్ణ' పట్ట మొసగినది. అప్పుడు ఎందరో మహాపండితు లుండగా, పండితులుగా కనబడని వీరి కిచ్చుటకు వీరి కున్న పలుకుబడియే కారణమని పలువు రభిప్రాయపడియుందురు. కాని ఏ ఒక్క పండితునికిని లేని బహుముఖమగు కళా ప్రపూర్ణత్వము వారికే కలదనుట యతిశయోక్తి కాదు. ఆ పట్టము పొందిన వారిలోనెల్ల వారే యుత్తములు. పాండిత్య ప్రకర్ష ప్రకటించుకొను నితరులవలె గాక, వారి పాండిత్యములోతు గంభీరమైనది; మహా సముద్రము లోతువలె పైకి కనుపించునది కాదు.

విరోధికృత్సంవత్సరాది సంచిక పీఠికలో ఒకా నొక ప్రసిద్ధాంధ్రుని గూర్చి నాగేశ్వరరావు గారు వ్రాసిన ఈ క్రింది మాటలు వారికే అక్షరశః అన్వయించును. ఎట్టి యాదర్శములు వారిని నిరంతర మావేశించి యుండెడివో కూడ నీ వాక్యములు సూచించును:

"స్వయం సహాయమునకును, సత్య ప్రియత్వ మునకును, నిరంతర వ్యవసాయ పరత్వమునకును ప్రమాణముగా నెన్నదగిన ఈ పూజ్యుని సచ్చారిత్రము పఠనార్హము!"

ఆంధ్ర దేశ ప్రజలలో ఒక విచిత్ర ప్రకృతి ద్యోతకమవుచున్నది. చేతులార తెచ్చుకొన్న దారిద్ర్య ముతో బాధపడువారిని, సత్పథభ్రష్టులైనవారిని, అల్పాయుష్కులను, యాచన మభ్యాసముగా కలవారిని అతిశయముగా శ్లాఘించి పూజించునట్లుగా, స్వశక్తి వలన నార్జించిన సంపదతో తృప్తిపడుచు ఇతరులను యాచింపనివారిని, ఎట్టి సందర్భములందును సత్ప థము విసర్జింపని పుణ్యపురుషులను, దీర్ఘాయు ష్మంతులై నిరంతర ధర్మ దీక్షా పరతంత్రులైన పూజ్యులను, వారిని తగినట్లు మనవారు గౌర వింపరు. సాంస్కృతిక రంగము లన్నిటిలో నిది ప్రతి ఫలించుచుండుట శోచనీయము! పంతులుగారు ఆంధ్ర హృదయములలో పొందదగిన ఉత్తమోత్తమ స్థానము పొందకుండుటకు ప్రధాన కారణ మిదియే కావచ్చును.

2

నాగేశ్వరరావుగారి సంస్కార స్వరూపము అవగాహన చేసికొనుటకు వారి యౌవన దశలోను పరిణత యౌవనములోను ఎట్టి భావములు ప్రపంచ మందును భారతదేశమునందును ప్రచలితమైయుండె డివో తెలిసి కొనుట యవసరము.

ఆ కాలమున విజ్ఞాన శాస్త్రజ్ఞుల కందరికి కనువిప్పు కలిగించినది డార్విను పరిణామ వాదము. అది జీవశాస్త్రమునకు సంబంధించి ఉద్భవించినదైనను దాని ప్రభావము విజ్ఞాన శాస్త్రము లన్నిటియందే కాక, మత సాంఘిక వేదాంత కళా సాహిత్యాది సమస్త రంగములందును చూపసాగినది. ఈ కాలములో ఐన్ స్టీన్ సాపేక్ష వాదమున కెంత ప్రాబల్యమున్నదో అంతకంటె ఎక్కువ ప్రాబల్యమే ఆనాడు పరిణామ వాదమున కుండెడిది. నేటి సాపేక్ష వాదము ప్రపం చఖ్యాతి పొందక పూర్వమే దానిని పంతులుగారు గ్రహిం చిరి. వారి ఉత్తర కాలీన రచనలలో నది ప్రతిఫలిం చుటయేకాక స్పష్టముగా పేర్కొనబడినది. అయి నను వారి సంస్కృతిని విశేషముగా ప్రభావితము చేసినది పరిణామ వాదమే. వారి యుపన్యాసములందు వలెనే రచనలయందును పరిణామ శబ్దము తరచుగా దొరలుచుండును.

ఇక రెండవది. ఆ కాలమున భారతీయ విద్యా వంతులందు రామకృష్ణపరమహంస జీవితము బోధలు ముఖ్యముగా వివేకానందుల ద్వారా విశేష వ్యాప్తి గాంచినవి. వా రిద్దరును ఔత్తరాహులును వంగీయు లును నైనను, వారి ప్రభావము ఆ ప్రాంతములందు కంటె దక్షిణ భారతముననే దృఢతరముగా వ్యాపించి నది. వివేకానందులు శంకరాద్వైతమునే అభిమా నించి యుపదేశించినను, వారి యుపదేశములలో నది వేదోక్త కర్మాచరణమునకు శిరోభూషణముగా గాక, కులమతాతీతమై విశ్వ సాధారణతత్వముగా రూపొంది నది. పరమహంస బోధలు పురాణములనుండియు, ప్రాచీన భక్తుల కథానుభవములనుండియు గ్రహించి నవేయైనను, ఆయన ప్రదర్శించిన జీవితమువలన నూతనోజ్జీవితములై ప్రాణ ప్రతిష్ఠ పడిసినవి. మత కలహములతోను, విజృంభించుచున్న క్రైస్తవ మత ప్రచారముతోను సతమతమవుచున్న భారత భూమిలోని సంస్కారవంతులను పరమహంస ఉపదే శించిన సర్వ మత సమరసభావము విశేషముగా నాక ర్షించినవి. ఈ సామరస్యము, విశ్వ విస్తృతభావన పంతులుగారు కావించిన ప్రతి రచనయందును ద్యోత మగుచుండును.

వారు విద్యాభ్యాసము చేయుచుండిన కాల ములో జర్మను తత్వవేత్తయైన 'కాంటు' గ్రంథము లకు ఎక్కువ ప్రాబల్య ముండెడిది. ప్రాచ్య తత్వ వేత్తలలో శంకరులవలెనే, పాశ్చాత్య తత్వవేత్తలలో కాంటు అద్వితీయు డను ప్రతిష్ఠ విద్యార్థి లోక ములో నుండెడిది. నీతిశాస్త్రమునకు మూలసూత్ర ముగా ఒక సిద్ధాంతమును ఆయన ప్రతిపాదించెను. అది యిప్పటికిని ఏదిక్కులో పరమ ప్రధానమైన సూత్రములలో నొకటియే. అది పంతులుగారి హృదయములో నాటుకొని యుండవలె. దాని స్వరూ పమునే వివరించు భారత పద్యమే నేటివరకును ఆంధ్రపత్రిక సంపాదకీయముల కన్నిటికి శిరోధా ర్యమై మకుటాయమానముగా శోభిల్లుచున్నది. 'ఒరు లేయవి యొనరించిన' ఇత్యాది పద్యము పంతు లుగారి ధర్మదీక్షకు ప్రత్యక్ష చిహ్నము! అది కాంటు సూత్రమునకును భారత ధర్మమునకును సామరస్యము.

వారు బందరు గుంటూరు, మదరాసులలో ఉన్నత విద్యాభ్యాసము చేసినను, విద్య పూర్తి ఐన

నాగేశ్వరరావు పంతులుగారు: తత్త్వవేత్త, గ్రంథకర్త

కొలది కాలముననే సాహసముతో బొంబాయి కేగిరి. ఆనాడు మహారాష్ట్రమున కంతటికి పూనా పట్టణము సాంస్కృతిక కేంద్రముగా నుండెడిది. గోఖలే, తిలకు, రానడేవంటి మహానుభావు లెందరో మహారాష్ట్రమునేకాక భారత జాతినంతటికిని వీర్యవంతము చేయుచున్న రోజులవి. బ్రిటిషు ప్రభుత్వము మనదేశమున నెలకొనకుండ ప్రతిఘటించిన వారిలో చివరివారు మహారాష్ట్రులు. అంతవరకు భారతదేశములో చాల భాగము మహారాష్ట్రుల పాలనముననే యుండెడిది. అట్లు పాలించిన యోధాగ్రేసరుల వంశములలోని మహనీయులతోపాటు పూర్వ వీరుల స్మృతి యప్పటి కింకను మాయక యక్కడ సజీవమై యుండెను. గణేశ నవరాత్ర ముల పేరితో జాతీయత యానా డక్కడ విజృంభించి భరతభూమిని దీపించుచుండెను. కేవల రాజకీయ రంగముననేకాక, సర్వతోముఖముగ ప్రాచీన హైందవ సంస్కృతియందు చైతన్యముతో గూడిన అభిమానము విజృంభించి ఉత్తమ కృషి జరిగినది. భండార్కరువంటి విద్వాంసులు సంస్కృత భాషకు చేసిన సేవ అపారమైనది. భారతదేశ మందంతటను లభ్యమైన సంస్కృత గ్రంథప్రతులను తెప్పించి పండితులచే పరిష్కరింపజేసి నిర్ణయ సాగరువారు నిర్దుష్టముగా అచ్చు వేయించి తక్కువ ధరకు దేశమంతట వెదజల్లిరి. ఆనాడు వా రచ్చువేసిన వేద భాష్యములు అష్టాదశ పురాణ గ్రంథములు నేటికిని తదభిమానులకు ఆధారముగా నున్నవి.

అట్టి చైతన్యము పొంగులువారుచున్న మహారాష్ట్రములో వర్తక సంస్థలో చేరి జీవిత మారంభించిన నాగేశ్వరరాయలు ఉన్నతాదర్శపూరితులై, ఆ మహా చైతన్య స్రవంతిని ఆంధ్ర దేశమునందు వెల్లివిరియునట్లు చేయుటకు దీక్ష పూనిరి. వారి కంటె వయస్సులో పిన్నలయ్యును, సంస్కృతిలో గాని, ఉన్నతాదర్శములలోగాని వారి కేమాత్రము తీసిపోని కొమర్రాజు వెంకట లక్ష్మణరావుగారు వారికి సహచరులైరి. లక్ష్మణరావుగారు మహారాష్ట్ర భాషలో గూడ సద్గ్రంథములు వ్రాసిన విద్వాంసులు. ఆంధ్రపత్రిక బొంబాయినుండి మదరాసుకు రాకముందే లక్ష్మణరావుగారు చెన్నపట్టణమునకు వచ్చి విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి స్థాపించి అద్వితీయ గ్రంథములను ప్రచురించుటకు పూనుకొనిరి. సత్యాన్వేషణతత్పరత్వములోను, విద్యా సంస్కృతులు ఆంధ్రదేశ మంతట వ్యాప్తి చేయవలెనను దీక్షలోను, తలపెట్టినది సాధించుటకు చేయు కృషిలోను, ఆ యిద్దరును ఒకరి కొకరు తీసిపోని మహావ్యక్తులు. వ్యాపార సంస్థలతోడి సంబంధముతో ప్రారంభించిన నాగేశ్వరుల లోకానుభవము, వారు తలపెట్టిన ప్రతి ఉద్యమమును సంపూర్ణముగా కార్యరూపమున సాధించు శక్తిని మాత్రము వారిద్దరిలో నాగేశ్వరుల కొక్కరికే యిచ్చినది. లక్ష్మణ రావుగారు ప్రీతితో పెనగులాడి ఆంధ్ర విజ్ఞాన సర్వస్వమునందు అకారము కూడ పూర్తి చేయలేక దివంగతులైరి. ఆ పిమ్మట వారి స్మృతి చిహ్నముగా పంతులుగారు లక్ష్మణరావుగారు వ్రాసికొనిన నోట్సు ఉన్నంతవరకైనను పూర్తి చేయించి ప్రకటింపగలిగిరి. అంతకుపూర్వము సంచికలుగా వచ్చుచుండిన ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము రెండు సంపుటములును, పంతులుగారి చేతిలో ఆంధ్రభాష ఇంతవరకు నోచుకొనని ఉజ్జ్వల రూపముతో సాక్షాత్కరించినది. డెమ్మి 1/4 సైజులో ఒక్కొక్కటి 600 పేజీలు గల సంపుటము లవి. విషయ గౌరవముననేకాక కాగితము, అచ్చు, సాధారణ చిత్రములు, త్రివర్ణ చిత్రములు, పటములు, బైండింగు, తక్కువ వెల—వానికి సాటియైన సంపుటములు తెలుగులో నిప్పటికి చూచి ఎరుగము. పంతులు గా రీ ప్రకటనలో ధనము వెదజల్లియుండవలెను. వారెన్నో దానములు చేసి విశ్వదాత యని ప్రసిద్ధి కెక్కినను, వారి వితరణమునకు ప్రత్యక్ష చిహ్నము, నభూతో న భవిష్యతిగా ప్రకటింపబడిన ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము!

బొంబాయికి జీవయాత్రకై వెళ్లిన నాగేశ్వర రాయలు అక్కడినుండియే ఆంధ్ర వారపత్రిక ప్రారంభించినారు. అది కీలక సంవత్సర భాద్రపదశుద్ధ చతుర్దశి బుధవారమున (9—9—1908) ప్రారంభింపబడినది. ఆనాడు వెలువడుటకు మహారాష్ట్రములో నానాడు మహోత్సాహముతో జరుగుచుండిన గణపతి నవరాత్రోత్సవములే కారణము. ఉత్సవము ముగిసిన వెంటనే పత్రిక ప్రారంభించిరి. స్మార్త సంప్రదాయమునను, శైవసంప్రదాయమునను గూడ ప్రథమపూజ్యుడు శ్రీ మహాగణాధిపతి. నాగేశ్వర రాయల కార్యదీక్షకు, వారికి శ్రీ మహాగణాధిపతియందలి

భక్తి తోడ్పై, వారు తలపెట్టిన కార్యములు నిర్విఘ్నముగా నెరవేర్ప గలిగెను.

ఆంధ్రపత్రిక బొంబాయిలో నారేండ్లు వార పత్రికగానుండి చెన్నపట్టణము వచ్చి, వారపత్రికగనే కాక దిన పత్రికగా గూడా వెలువడ సాగినది. పత్రిక వెలువడసాగిన మూడవ సంవత్సరమునుండియే (సాధారణ సంవత్సరాదినుండి) సంవత్సరాది సంచిక లారంభమైనవి. అవి వందల కొలది చిత్రపటములతో ఉత్తమ వ్యాసములతో ఆంధ్రభూమి నలంకరించెడివి. మొదటి సంచికను బాల్యమునందే చూచు భాగ్యముగల ఈ వ్యాస కర్త దాని నెన్ని పర్యాయములు ముగ్ధుడై తిరుగ వేసెనో లెక్కింప శక్యముకాదు. సర్వ రంగములలో ప్రసిద్ధులైనవారి ఛాయా పటములు చూచుచున్నప్పుడెంత ఉన్నతాదర్శములు రేకెత్తుచుండెనో ఊహింప వలసినదే!

పంతులుగారు చెన్నపట్టణములో విద్యాభ్యాసము చేయుచుండిన రోజులలో నక్కడ రెంటాల వెంకట సుబ్బారావుగారను గొప్ప మేధావి, హైకోర్టు వకీలుగా నుండెడివారు.

3

నాగేశ్వరరావులు గ్రంథశతములు రచించినను అవి గ్రంథ రూపముగా కనుపింపవు. వారి భగవద్గీత కూడ వారి నిర్యాణానంతరమున వారు వ్రాసిన అసంపూర్ణమైన ఉపోద్ఘాతముతో ప్రచురింపబడినదే. వారి ఆంధ్ర వాఙ్మయ చరిత్ర వారు ఆంధ్ర వాఙ్మయ సూచికకు పీఠికగా వ్రాసినదే, వారి యనంతరమున గ్రంథరూపము ధరించినది. వారు వ్రాసిన పీఠికలు, ప్రత్యేక వ్యాసములు కొన్ని కలిపియు, కొన్ని ప్రత్యేకముగను గ్రంథములుగా గ్రహింపదగినవే. విజ్ఞాన సర్వస్వములో అజంతా విహారములపై వ్రాసిన వ్యాసము ప్రత్యేక గ్రంథముగా రాదగిన వానిలో నగ్రగణ్యము! అజంతా విహారములను గూర్చి బహుగ్రంథములు చదివినవారికి గూడ కలుగని వాని స్వరూపమును గూర్చిన విస్పష్ట భావన ఆ వ్యాసమువలన కలుగగలదు. అందులోనిదే 'అనాహతము' అను వ్యాసము కూడ కొంత వర కట్టిదే. బసవ పురాణ ప్రస్తావన, మాలపల్లి తొలిపలుకు, స్నానఘట్టము పీఠిక, శతకమంజరి సంపాదకీయము, శతకముల పీఠికలు సమగ్రతకు, వారి నిష్పక్షపాత దృష్టికి, విశాల వృత్తికి ప్రత్యేకముగా నెన్నదగినవి. ఇక వారి సంవత్సరాది సంచికల పీఠికలు ప్రస్తావనలు నిరుపమానములు. ఆ యా సంవత్సరముల ఆంధ్ర సాంస్కృతిక చరిత్రకు ప్రధానముగను, భారతభూమి సంస్కృతికిని ప్రపంచ సంస్కృతికిని కొంతవరకును, భవిష్యచ్చరిత్రకారులకు ప్రధానాధారములుగా నుండదగిన ఉదాత్త సమీక్షలు. పంతులుగా రిట్లు బహు గ్రంథకర్తలు. అయినను భారత దేశములో పూర్వముండిన మహాశిల్పులు చిత్రకారులు గ్రంథకర్తలు తమ నామమునకు కంటె తమ సృష్టికే ఎక్కువ ప్రాధాన్య మిచ్చినట్లే, పంతులుగారును ఎందరో గ్రంథకర్తలను ప్రచారమునకు తెచ్చినను తాము గ్రంథకర్తగా యశస్సు తెచ్చుకొనుటకు ఎంతమాత్రము ప్రయత్నింపలేదు. వారు 'సంపాదకులుగా' నుండుటకే అభిమానించిరి. వ్యాస శబ్దార్థము కూడ దానికి తుల్యమైనదని విజ్ఞులకు ప్రత్యేకముగా వివరింప నక్కరలేదు.

పంతులుగారు ఇంత విస్తారముగా చేసిన రచనలకును, ఇతరుల రచనలు వ్యాప్తికి తెచ్చుటకును మూలసూత్రము లేవి? ఏ తత్త్వము వారి నావేశించి కార్యాచరణ నిమగ్నుల గావించినది? వారి తాత్త్వికదృష్టి ఎట్టిది? వారి ప్రధానాదర్శ మేది ? ఈ రెండు ప్రశ్నలకు క్లుప్తముగా సమాధానము చెప్పినచో వారిది సమన్వయ తత్త్వమని, వారి యాదర్శము విశ్వశ్రేయస్సు అని వెంటనే చెప్పవచ్చును. వారి హృదయములో సమన్వయము, విశ్వశ్రేయస్సు ఎంతగా స్థిర ప్రతిష్ఠ చేసికొన్నవో తెలియుటకు వారి రచనలకు ఆ రెండు శబ్దములు తరచుగా ప్రతిశబ్దించుచుండుటయే ప్రత్యక్ష నిదర్శనము!

4

వారి సమన్వయ తత్త్వ స్వరూప మేమి?

ప్రపంచము నే డనేక విరోధ భావములలో సతమతమవుచున్నది. అనేకమతములు, మతములలో శాఖాంతరములు కలవు. విజ్ఞాన శాస్త్రము మత విశ్వాసముల నన్నిటిని కూకటి వ్రేళ్లతో పెల్లగించి వేయుచున్నది. పాశ్చాత్య సంస్కృతికి ప్రాచ్య సంస్కృతికి ఘర్షణము, ప్రజాస్వామ్యసంగ్రామములు, పారిశ్రామిక సంగ్రామములు కలవు. ప్రాచీన భావములకు నవీన భావములకు విరోధము చెలరేగుచున్నది. ఆంధ్ర భాషా విషయములో గ్రామ్య గ్రాంథిక వివాదములును గలవు. ఈ విషయము లన్నిటిలో

భేదము బాహ్యమైనదనియు ఆంతర్యమున నన్నిటి లక్ష్య మొకటే యనియు వారి సమన్వయము. అదియే వారి తాత్త్విక దృష్టి!

వారొకచో 'నాద మంతర్లింగ రూపమున విశ్వమంతటను విలసిల్లుచున్నది. మానవ దేహమున సహస్రారమునందు దేదీప్యమానముగా విరాజిల్లుచున్నది. బుద్ధ క్రీస్తు కృష్ణావతారములం దీ దివ్యతేజమును భక్తులు సందర్శించి చిత్రించిరి' అని వ్రాసిరి. వ్రాయుటే కాదు. విరోధికృత్సంవత్సరాదిసంచికలో క్రైస్తవ మతమును గూర్చిన రెండు వ్యాసములును మహమ్మదు జీవితమును గూర్చి యొకటియు, బుద్ధ జయంతి వ్యాస మొకటియు ప్రచురించిరి. క్రైస్తవ మత సంబంధములైన రెండు వ్యాసములలో నొకటి క్రైస్తవ మతమన్న భయపడనవసరము లేదని చెప్పుచుండగా, రెండవది భవిష్యత్కాలమున 'ఇండియా యను కిరీటము క్రీస్తుకు తప్పక దొరుకును, అని క్రైస్తవ మతమయమగుననీ ఉద్ఘాటించినది. ఆ సంచికలోనే ఒకే పేజీలో ప్రక్క ప్రక్క పార్వతీ పరమేశ్వరులయు, ఏసుక్రీస్తు, గౌతమబుద్ధుడు, సుజాత, జొరాస్టరుల చిత్రములను ప్రచురించిరి.

అపరోక్షానుభూతియందు 'శంకరాచార్యులు సాపేక్షములైన కర్మయోగమును సన్యాసయోగమును బుద్ధియోగమును, నిరపేక్షమైన ఆత్మయోగమునందు వేదాంత రూపమునను సమన్వయము చేసి సనాతన వైదిక మతము నుద్ధరించి ఆచార్యపదము నధిష్ఠించెను' అని పేర్కొనిరి.

వీరశైవులు జైన బౌద్ధ మతములను ఖండించి ఆ మతస్థులను హింసించినను బౌద్ధమతములోని త్రిశరణములే వీరశైవములో గురు లింగ జంగమ శరణు రూపముల దాల్చినవని సమన్వయించిరి. యోగ విషయములో గూడ పరిభాషలో భేదమే కాని స్వరూపములో భేదము లేదనుటకు యోగమునకును వీరశైవాగమములకును సమన్వయము చేయుచు, ఒక పట్టిక రూపములో ఒకదాని కొకటి యెదురుగా షల్లింగములు, షట్ స్థలములు, షడక్షరి, షట్చక్రములు, షడ్వ్యాహృతులు చూపి సిద్ధాంత మొనర్చిరి. 'వీరశైవాగమములందు వేదాంత మంత్ర శాస్త్ర రహస్యములు భిన్నరూపముల సమన్వయమును బొంది భక్తి యోగ ప్రభావమును నిత్య జీవనమందు విస్తరింపజేసిన' వనిరి. 'ఆదియుగమునందు కర్మపరమైన వైదిక మతము తదనంతరము జ్ఞానపరమును భక్తిపరమునునై పరివర్తనము పొందినది. వైదిక మంత్రోపస్థిత రుద్రుడు వేదాంతమున శివ స్వరూప పరిణామమును బొందుచు, సర్వ వ్యాపకుడై 'శివోహం' తత్వమును వ్యక్తము చేయుచున్నాడు. శివుడు యజ్ఞ పురుషుడు, సగుణ నిర్గుణ పరబ్రహ్మము' అని వక్కాణించిరి.

ఈ సమన్వయ తత్త్వము వారికి భగవద్గీతను నిష్ఠతో అధ్యయనము చేయుటవలననే అబ్బినది. భగవద్గీతకంటె వేద వేదాంగ వేదాంతములను, సాంఖ్య యోగ భక్తులను, శాస్త్రానుభవములను సమన్వయము చేయు సద్గ్రంథము మరియొకటి లేదు. అందువల్లనే అర్జునునిచే వ్యామిశ్రములైన వాక్యములతో నా బుద్ధిని మోహింపజేయుచున్నట్లున్నావు అనిపించినది. ప్రత్యేకముగా గ్రంథ రూపముగా పంతులుగారు రచించిన గ్రంథము భగవద్గీతావివరణ మొక్కటే యని కూడ మనము గుర్తించుకొనవలెను.

ఈ సమన్వయ తత్త్వము మత విషయములతో నాగలేదు. అప్పటినుండి నేటివరకు వాద ప్రతివాద కారణమైన గ్రాంథిక గ్రామ్య భాషా వాదమును ప్రస్తావించుచు, 'గ్రామ్య భాష గ్రాంథిక భాషగాను గ్రాంథిక భాష గ్రామ్య భాషగాను మారుచుండుట ప్రకృతి సిద్ధము......సహజధర్మము మారకుండ భాషాభివృద్ధిని జేయుట భాషాభిమానుల విధి' యని యుద్బోధించిరి. విజ్ఞాన శాస్త్ర గ్రంథములలో పారిభాషిక పదములు సంస్కృతమునుండి సృష్టింపవలెనా, పర భాషా పదములనే గ్రహింపవలెనా అను విషయమున 'సంస్కృత భాషలో లేని నూతన పరిభాషకుగాను అన్య దేశ పదములను వాడుట లోకాచార సిద్ధము. ఉన్న పదములకు బదు లన్య దేశ పదములను వాడుట నిరర్థకము' అని నిర్ధారించి హిందూ దేశ భాషలు సంస్కృత సంపర్కములేక బలహీనములై కళా విహీనములగుచున్నవని నిర్దేశించిరి. ఈ సందర్భములోనే హిందూదేశ భాషలకు సన్నిహిత సంబంధము కల్పించుటకు సంస్కృతము సాధనము అని సిద్ధాంతము చేసిరి.

పై విషయములు ఇప్పటికి 55 సంవత్సరములకు పూర్వమే పంతులుగారు చెప్పినవి. వారు అభిమానములకు మొగ్గు చూపక, సత్య పథాన్వేష

ణముచేయు నాదర్శముతో యోగదృష్టితో దర్శింపగలవారు కనుకనే, వివాద విషయములలో సుతిసూత్రముగా మధ్యే మార్గ మన్వేషింప గలిగిరి. వారి రచనలలో తఱుచుగా నొక యాదర్శము ప్రదర్శితమగుచుండును. మనము మన జీవయాత్రను దేహయాత్రార్థము కాక లోక కల్యాణార్థముగా మలచినచో, జీవయాత్రయే దేవయాత్రయై క్రమముగా కైవల్య యాత్రయు శివయాత్రయు మోక్షయాత్రయు కాగలదు. వారి జీవితాదర్శ మదియే!

పంతులుగారు పూర్వాచార పరాయణులనుట ప్రసిద్ధమే. కాని వారిది అభ్యుదయ మార్గమున సాగిపోవు నిత్య యౌవన దృష్టి. బొంబాయి నగరమున యౌవనవతులు పాఠశాలలకు పోవుటచూచి యానందించి, ఆ యీడున తెలుగు యువతులు నలుగురు పిల్లల తల్లులై ఉత్సాహమును గోల్పోవుచున్నారని వాపోవుచు, ఆంధ్రదేశమున కీమహద్దశ ఎప్పుడు పట్టునో తెలియదని చింతపడిరి. అట్లే వాణిజ్య పరిశ్రమల యందును నాంధ్రులు వెనుకపడియున్నారని యాభై యేళ్లకు పూర్వమే వారు విచారము ప్రదర్శించిరి. ఆంధ్రములో గత సంవత్సరములలో ప్రచురింపబడిన గ్రంథసంఖ్య లిచ్చుచు, అందులో ముప్పాతిక గ్రంథములు పద్యరూపములని తెలిపి, విద్యావ్యాప్తి గల పాశ్చాత్య దేశములందు వచన గ్రంథము లధికముగా నుండు ననుచు తెలుగు గ్రంథకర్తలు వచన రచనల కెక్కువగా పూనుకొన్నచో జ్ఞానము వ్యాపించి భాషాభ్యుదయమును దేశాభ్యుదయమును కాగలదని ఉద్బోధించిరి.

సంచిక ముఖ చిత్రపటమును గూర్చి 'ఇది యీ యుత్సాహ భరితావస్థకు నిదర్శనము. సుందరోద్యానము. వసంతకాలము. పుష్ప శోభితము. రూపవతి. సురుచిర వస్త్రాలంకృత, ఎలజవ్వని. కుసుమాపచయము. పరమోత్సాహము' అని వర్ణించిరి. పంతులుగారిని నిత్య యౌవన వసంతమూర్తి ఎంతగా ఆవేశించి యుండెడిదో మరి!

5

మరి నాగేశ్వరరాయల రచనలలో ప్రధాన లక్షణము లేవి? విశ్వశ్రేయః కావ్యమ్ అని సూత్రించి, శ్రేయసే భూయాసుః అని మంగళాచారణము చేసిన నన్నయ భట్టారకుని ఆదర్శమునే వారును తమ సమస్త రచనలలో కార్యరూపమున ప్రదర్శించిరి. జీవయాత్రను కైవల్య యాత్రనుగా జేయు నాశయమే వారి రచనలలో విశ్వ శ్రేయస్సు రూపము ధరించినది.

దానికి సాధనముగా పంతులుగారు పరిగ్రహించిన సమన్వయతత్త్వమే విశాల దృష్టిగా రూపొందినది. సత్పథమునే తమ గమ్యముగా నెన్నుదురు. తమకు తోచినదేకాక ఇతర మార్గములు దుష్పథములుగా భాసించును. నదీనాం సాగరో గతిః—సర్వ దేవ నమస్కారః కేశవం ప్రతి గచ్ఛతి—మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః—ఇత్యాది వాక్యముల స్ఫూర్తి కలవారికి ఈ విశాలదృష్టి యలవడును. పూజ్యులైన యాచార్యులు ఉద్దండులైన పండితులు అనేక వ్యాఖ్యలు రచించిన భగవద్గీతవంటి ఉద్గ్రంథమునకు వారు వ్రాసిన టీకా తాత్పర్య వివరణములో కొన్ని ఎంతో ముచ్చట గొల్పు స్వతంత్ర వివరణములు కలవు. 'శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్' అను వాక్యమును వివరించుచు, ఆత్మ యోగ ధర్మము స్వధర్మమనియు, దేహేంద్రియధర్మము పరధర్మమనియు వివరించుట యట్టివానిలో నొకటి. ఆ క్రింది శ్లోకములోనే భగవానుడు ఇంద్రియ విషయములందు రాగ ద్వేషములకు వశము కాగూడదని ఉపదేశించినది గుర్తుకు తెచ్చుకొన్నచో పంతులుగారి స్వతంత్ర వివరణ మెంతయు సమంజసమని రూఢమగును.

గీతా గ్రంథము వ్యాఖ్యానించుటలో వారు ప్రధానముగా తిలకు గీతా రహస్యము నవలంబించినట్లు తోచును. కొంత మహాత్ముని గ్రంథమును అవలంబించిరి. కాని పూర్వాచార్యుల నెక్కువ గౌరవముతో భజించిరి. చేతనైనంతవరకు సమన్వయము చేయుచు అది సాధ్యముకానిచోట్ల, ఎవరిని ఖండించుటకు పూనుకొనక వారి వారి భావము లిట్లున్నవని సంక్షేపముగా ప్రదర్శించి ఔచిత్యము పాటించిరి.

వారి రచనలలో నితరులను స్పష్టముగా ఖండింపవలసిన యవసరము వచ్చిన చోట్లను గూడ నిగ్రహము సౌజన్యము చూపుదురే కాని విషయ ప్రదర్శనములో వెనుకాడరు. ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో నేటి ద్రావిడ పరిశోధకుల విపరీత తమిళ వాఙ్మయ ప్రాచీనతా సిద్ధాంతములను విమర్శించుచు 'దామో

నాగేశ్వరరావు పంతులుగారు : తత్త్వవేత్త, గ్రంథకర్త

దరం పిళ్లెగారి మాతృ భాషాభిమాన మవ్యక్త సిద్ధాంతములకు గారణమైన' దనిరి. ఒక సంవత్సరాది సంచికలో గత సంవత్సరమునం దాంధ్రలోకమునందు కవుల కలహములు ముదిరినవని ప్రస్తావించి యివి జాతి ద్వేషాభిమానములుగా బరిణమించు దురవస్థనుండి భాషను గాపాడుట తమ విధి యని భాషాభిమానుల నుద్బోధించిరి.

పంతులుగారి రచనలు చూచిన వారికి వారి సర్వతోముఖ వ్యాసంగమును, గ్రహించిన ప్రతి విషయమందును సమగ్ర పఠన పరిశోధనములు నద్భుతము లనిపించును. ఆంధ్ర వాఙ్మయ సూచికకు పీఠికాప్రాయముగా రచించిన ఆంధ్ర వాఙ్మయచరిత్ర మిందులకు నిదర్శనము. ఆంధ్ర కవులను వాఙ్మయమును గురించియేకాక తమిళాది భాషా వాఙ్మయములను గూర్చి కూడ నప్పటికి వచ్చిన గ్రంథ జాతమును వ్యాసశతములను మూల కావ్యములతోపాటు ఎంత క్షుణ్ణముగా నెట్టి పరిశీలనా దృష్టితో పఠించిరో ఆ గ్రంథమే ప్రత్యక్ష సాక్ష్య మిచ్చును. అజంతా విహారములు అను సుదీర్ఘ వ్యాసములో గూడ నీ లక్షణము స్పష్టముగా చూడనగును.

పంతులుగారివలె బహుముఖ వ్యాసంగములు గలవారికి బహు గ్రంథ పఠనము అస్పష్టతకు కారణమగుట సామాన్య ధర్మము. కాని యది ఎంతమాత్రమును వారి రచనల కన్వయింపదు. ఎంత విపుల విషయమైనను స్పష్టముగా సులభముగా చెప్పుటలో వా రద్వితీయులు. కావలసినచోట్ల వారు పట్టికలు సిద్ధము చేయుదురు. ఆంధ్ర వాఙ్మయ చరిత్రలోని పట్టికలు విషయావగాహనమున కెంతయు నుపకరించును. ఇక అజంతా విహారముల వ్యాసము చదివినవారికి కలుగు నాశ్చర్యమునకు మేరయుండదు. ఆ ప్రదేశము చేరు మార్గములతో ప్రారంభమైన వ్యాసము, ఆ విహారము లెట్టి రమణీయ ప్రదేశములో నిర్మింపబడినవో వర్ణించి ఏ గుహ ఏ యాకారమున నున్నదియు, దేనిలో నేతావున ఏ చిత్రము వ్రాయబడినదో స్పష్టముగా కన్నుల కట్టినట్లు ప్రదర్శించును. ఆ చిత్రములలో రెండవ గుహాలయములోని పద్మపాణి బోధిసత్త్వుని చిత్రము ఉత్తమోత్తమమైనదిగా చిత్రకళావిదులు భావింతురు. పంతులుగారు దానినే విస్తరించి 'మౌన వ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మ తత్త్వ'మిత్యాది దక్షిణామూర్తి భావనతో సమన్వయించి, ఆ మహా చిత్రములోని తక్కిన వివిధ భాగములను ఉత్సాహముతో వర్ణించినది చదివినవారికి చిత్రకళయందు పంతులుగారి యభిరుచి ఎంత సున్నితమైనదో విస్మయము కలిగించును. అజంతా విహారముల స్వరూపము ఆ వ్యాసము చదివినప్పుడు కలిగినంత స్పష్టముగా కలుగుటకు బహుకాలము, బహు శ్రద్ధగా, బహు కష్టముతోగాని లభ్యముకాని బహు గ్రంథములను పఠించిననేకాని కలుగదనుట యతిశయోక్తి కాదు.

ఇతర గ్రంథములకు వారు వ్రాసిన ప్రస్తావనలు తొలి పలుకులందు ముఖ్యముగా వారి గుణగ్రహణ పారీణత గోచరించును. ఈ లక్షణమునకు బసవ పురాణ ప్రస్తావము, మాలపల్లికి, స్వానఘట్టమునకు వ్రాసిన తొలి పలుకులు దృష్టాంతములు. బసవ పురాణ ప్రస్తావము వారి మత తత్త్వ సమన్వయమునకు నికషోపలము. నేటికాలపు గ్రంథమైన మాలపల్లిని వారెన్ని విధముల శ్లాఘించిరో చూడదగును. శైలిని గూర్చివ్రాయుచు, "తెనుగు మాటలు, తెనుగు దేశము, తెనుగు సాహిత్యము, తెనుగు హృదయము, తెనుగు సంకల్పము మాలపల్లి కనిర్వచనీయమైన ప్రతిభను సమకూర్చినవి.....వాడుక భాషయందు నవరస భరితమైన కావ్యమును రచించిన లక్ష్మీ నారాయణ గారు ధన్యులు......భారతీయ వేదాంత విజ్ఞాన సారమైన విశేష ధర్మోపదేశముతో...కథ నుపసంహారము చేయుట సర్వోత్తమముగా నున్నది" అని ఉగ్గడించిరి.

పంతులుగారి కెంత సౌజన్యమున్నను, సత్యపథమునుండి తొలగుట కంగీకరింపరు. ఆ తొలి పలుకులలోనే "సందర్భానుసారముగా చేసిన వర్ణనలు, బోధలు, వ్యాఖ్యానములు జ్ఞానదాయకములైనను కావ్యరసానుసంధానమునకు ప్రతిబంధకములై కావ్యము పురాణ పరిణామమును బొందినది" అని వ్రాసిన దానిలో ఎట్టి నిశిత విమర్శన మున్నదో బోధపడగలదు. ఇది ముఖ్యముగా నేటి నవలాకారులును విమర్శకులును గమనింపదగిన సూక్ష్మధర్మము!

అట్లే బసవ పురాణ ప్రస్తావములో "వీరశైవము తలపెట్టిన కులావరణ నిర్మూలనము దుస్తరమైనది. లింగాయతులు, జంగములు,సాలెలు, జాంద్రలు ప్రత్యేక కులమువారై మరికొన్ని కులము లేర్పడి

నవి......భక్తి ప్రధానమైన వీరశైవము నిర్జీవమైన యాచార సంప్రదాయబద్ధమై సాంఘిక ప్రయోజనములకును, మానవ కల్యాణమునకును నిరుపయోగమైనది'' అని వ్రాయుటకును వారెంతమాత్రము వెనుకాడలేదు.

వారి యుదాత్త గంభీర శైలి ముఖ్యముగా నెన్నదగినది. వారి కాయమువలెనే వారి యాశయములును ఉన్నతములు. వారి ఛాయాపటము చూచువారికి నిండుదనము, సౌమ్యతతోపాటు, ఒకానొక విచిత్రమైన దూరభావము కూడ కానవచ్చును. అది యల్పబుద్ధులకు భయము కూడ కల్పించును. ఇక్కడ కుబుదులకు అల్పులకు కుటిలులకు స్థానము లేదని యట్టి వారిని దరిచేరనీయని ఉదాత్త భావమే!

పంతులుగారి రచన లన్నిటిలో వారికి అభిమానపాత్రమైనవి సంవత్సరాదిసంచికలు, వానికి వారు వ్రాసిన పీఠికలు, ప్రస్తావములు నని మా విశ్వాసము. వానిలో పంతులుగారు తమ సర్వ శక్తులు సంపూర్ణముగా వినియోగించెడివారు! అవి సామాన్యముగా వసంత శోభను వర్ణించుటతో నారంభమగును. సూర్య సిద్ధాంతము ననుసరించి గత సంవత్సరముతో సృష్ట్యాది నుండి 195 కోట్ల యాభై ఎనిమిది లక్షల, ఎనభై ఐదువేల, ఎనిమిది వందల పైచిలుకు సంవత్సరములు గతించినవని లెక్కవేసి ఈ యనంత కాలములో సంవత్సరకాల మెంత స్వల్పమో సంభావింతురు. అప్పైన నీ గత సంవత్సర కాలములో ప్రపంచమునందలి ప్రధాన పరిణామముల సమీక్ష చేసి ప్రత్యేకముగా భరతభూమిలోను, ఆంధ్రభూమిలోను జరిగిన విశేషములు సమగ్రముగా ప్రదర్శింతురు. తుద కా సంచికలోని వ్యాసములను చిత్రములను స్థూలముగా వివరింతురు.

ఇది సామాన్య ధర్మమైనను, వారికి ప్రతి సంవత్సరాది సంచికలోను ఏదో ఒక విశేష విషయమునకు ప్రాధాన్యమీయవలెనను గొప్ప యాలోచన యుండెడిదను విషయము 1916 నల సంవత్సరాది సంచిక ప్రస్తావన చదివినప్పుడే కాని స్ఫురింపలేదు. ప్రతిసంవత్సరము చేయు నాలోచనలే కాక ఎన్నో సంవత్సరములు ముందుగానే ఒక ప్రణాళికాబద్ధముగా వారీ సంచికలు ప్రచురింపసాగిరను విషయము బోధపడినది. ఆ ప్రస్తావములో పూర్వము ప్రచురించిన ఆరు సంచికల విషయములు ప్రస్తావించి ఏ సంచికలో నేది ప్రముఖమో వివరించిరి. సాధారణ సంచికలో విద్య జీవిత చరిత్రములును, విరోధికృత్తులో సాంఘిక మత విషయములును, పరీధావిలో పంచమ జార్జి రాజ్యాభిషేకముతో ఢిల్లీ నగర చరిత్రము స్వదేశ సంస్థానముల చరిత్రలును, ప్రమాదీచలో వాఙ్మయ సంబంధములును, ఆనంద సంచికలో మహా పురుషుల చరిత్రములును, రాక్షసలో, ఐరోపా మహా సంగ్రామ చరిత్రయు ప్రముఖస్థాన మలంకరించెనని తెలిపి నల సంచికలో వ్యవసాయాభివృద్ధి, నాట్యరంగము, చిత్రలేఖనము, రూపకల్పన, దేవాలయములు, ప్రాధాన్యము వహించినవని వివేచన మొనర్చిరి. ఈ దృష్టితో చూచినచో ప్రస్తావనలు వారి రచనలలో మకుటాయమానము లనిపించును.

సర్వకార్యములందువలె తమ రచనలం దంతట విశ్వశ్రేయస్సు ప్రతిఫలింపజేయుచు తమ జీవయాత్రను శివయాత్రనుగా జేసికొన్న నాగేశ్వరరాయలకు నమోవాకములు!

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమ ధర్మపథములకెల్లన్.

(మహాభారతము)

స్వవిషయము

[ఆంధ్రపత్రిక తొలి సంచికలోని తొలి సంపాదకీయం]

కాలవేగమును గనుగొనుట యసాధ్యము. కాల ప్రభావము నెరుగుట కష్టము. కాలగతి యొక పనికై యాగదు; ఒక నిమిత్తమునకై నిలువదు. తలంపులు గలుగుచుండును. యోచనలు పుట్టి గిట్టుచుండును. కాలచక్రము యథేష్టముగ దిరుగుచుండును. కీలక సంవత్సర భాద్రపద శు. 14 బుధవారము ఆంధ్రపత్రికకు జనన దివసము; బొంబాయి జననస్థానము. ముహూర్త స్థానములను జూచి గుణించిన జ్యోతిష్కు లరిష్ట ఫలమును దెలిపిరి. తెలుగు పత్రిక. మహారాష్ట్ర దేశమునందు ప్రచురణము. కాలము కల్లోలమయము. హైందవ నాయకుల కంతఃకలహములు. ప్రజలకు స్వదేశ స్వరాజ్యాందోళనము. పాలకులకు భయ విషాదములు. విదేశమునం దిట్టి సందిగ్ధ సమయమునందు బుట్టిన యాంధ్ర పత్రికకు మంచి ఫలమును జెప్పుట కెవరు సాహసించ గలరు! అదృష్టము దైవాధీనము. దైవానుగ్రహము సకలాభీష్టసిద్ధికి సాధనము. ఆ సాధన సంపత్తివలనను నాంధ్ర మహాజనుల సహాయ పోషణమువలనను నాంధ్రపత్రిక వర్ధిలుచున్నందులకు బత్రికా నిర్వాహకులు కృతజ్ఞులు.

కార్యారంభమునందు కార్యోద్దేశమును దెలుపుట, కార్య నిర్ణయమును జేయుట యాచారము. కాని యాంధ్రపత్రిక క్రొత్తది కాదు. పత్రికాదర్శములు పాఠకులకు విదితములు. అయినను వారపత్రికను ప్రారంభించినపుడు వ్రాసిన వ్యాసమునందలి భాగమిచట పత్రికాదర్శమును దెలుపుట కెత్తి వ్రాయబడుచున్నది.

"ప్రజలకు విద్యాభివృద్ధియు ప్రపంచ జ్ఞానాభి వృద్ధియు గావించుటయే మా ముఖ్యాభిప్రాయము. ప్రజల యోగక్షేమాభివృద్ధికి దేశాభిమానమును స్వామిభక్తియు మిగుల సహకారులని మే ముద్ఘోషించుచుందుము. స్వామిభక్తి లేని దేశాభిమానమును, దేశాభిమానములేని స్వామిభక్తియును ననర్థ ప్రతిపాదకంబు లగునని మా చదువరులకు హెచ్చరించుచుందుము. స్వామిభక్తి దేశాభిమానములను గుణద్వయమును ప్రజల హృదయమున సదా నెలకొల్పు పాటుపడుచుండెదము......ఆంగ్లేయ ప్రభుత్వమునకు లోబడిన ఇతర రాజ్యములందు వలెనే స్వకీయ పరిపాలనమును కాలక్రమమున బొందుటయే మా స్వరాజ్యాదర్శము..... కాలమును, ధర్మమును, దైవమును మా యుద్యమముల సఫలీకృతములను జేయుగాత."

ఆరేండ్లక్రితమీ యాదర్శములు మొదటి పత్రికయందు ప్రచురింపబడినవి. నిందా స్తోత్రములను బాటింపక శక్తికొలది యుద్దేశ నిర్వహణమునకై నిర్వాహకులు పాటు పడిరి. ముందును నిట్టి యాదర్శములను బోధించుటయె పత్రికోద్దేశము. కాలమానమును బట్టి పత్రికాకృతి మారుట యవసరమైనది. ఎనిమిది పుటలతో నారంభమైన పత్రిక ఇరువది పుటలకు పెరిగినది. వేలకొలది చందాదారులు చేరిరి. అయిదు సంవత్సరాది సంచికలు చందాదారులకు స్వల్ప క్రయమున కొసంగ

బడినవి. వ్యాసలేఖకులు విరివిగ బయలుదేరిరి. పత్రికా పాఠకుల సంఖ్య వింతగ హెచ్చినది. దేశ భాషాభిమానములు ప్రబలినవి. దేశస్థితి మారినది. దేశము శాంతి భూయిష్ఠమై యొప్పుచున్నది. బీహారురాష్ట్రము నూతనముగ నిర్మింపబడినది. రాజధాని ప్రాచీనమైన ఢిల్లీ నగరమునకు మార్చబడినది. హిందూ మహమ్మదీయ విశ్వ విద్యాలయములు స్థాపితములు గానున్నవి. బర్మామధ్యరాష్ట్రములందు విశ్వవిద్యాలయములు నిర్మితములుగానున్నవి. పరిహాసపాత్రమైన స్వరాజ్యాదర్శమును రాజనీతిజ్ఞు లంగీకరించిరి. సంస్కరిత శాసనలందు రాజ్యాంగ చర్చలను విపులముగ జేయుట కవకాశ మేర్పడినది. హిందూదేశమునం దంతటను నూతనోత్సాహము వ్యాపించినది. ఆ యుత్సాహము నానారూప భావములను దాల్చి యాంధ్రదేశమునందును వ్యాపించినది. ఆ మహోత్సాహమును నిరూపించి నిర్ణయించుట యాంధ్ర దేశాభ్యుదయమునకు ప్రధాన సాధనము. ఆంధ్రులు 2,25,00,000 గలరు. దేశము విశాలము. భాష మధురము. జను లుత్సాహ సంపన్నులు. ఆంధ్రభాషయందు పత్రికా పాఠకులు 26,000 మంది గలరు. వ్యాసలేఖకు లనేకులు గలరు. విచారణీయంబులైన విషయంబు లనేకములు గలవు. జనాభిప్రాయముల కనుకూలముగ విషయ విమర్శనమును జేయుచు ననుదినమును నాంధ్రదేశ వృత్తాంతాదులను బ్రచురించుటకు దినపత్రికను బ్రచురించుట కేర్పాటులు చేయబడినవి. కాని యనివార్యంబులైన యాటంకములవలన విలంబన మేర్పడినందులకు జింతిలుచున్నాము.

దేశీయమహాసభాదర్శములును రాష్ట్రీయసభా దర్శములును నాంధ్రపత్రికాదర్శములు. హైందవ జాతీయాభ్యుదయమును నాంధ్ర జాతీయాభ్యుదయమును నుపపాదించుట పత్రికా నిర్వాహకుల ముఖ్యోద్దేశము. ఆంధ్ర జాతీయాభ్యుదయము హైందవ జాతీయాభ్యుదయమునకు సహకారిగాని ప్రతికూలము గాదని పత్రికా నిర్వాహకుల మతము. ఉభయ భావములకు విరుద్ధభావ మేర్పడినపుడు హైందవ జాతీయతకు బ్రతికూలముగ బ్రవర్తింప జూడము. నిమిత్తము ఆంధ్రాభ్యుదయము గాని యితర జాతి ద్వేషము గాదు. అవసరమైనపుడెల్ల యాంధ్రుల వృద్ధికి దగిన సదుపాయములను విసుకు విరామము లేకను బ్రజలకును, పాలకులకును నివేదించెదము. శాఖాభేదములను, కులభేదములను, మతభేదములను, జాతి భేదములను గమనింపక మిత్రభావమును వ్యాపింపజేయుటకై బ్రయత్నించెదము. ఆంధ్రోద్యమముపట్ల సంపూర్ణ సానుభూతి నుపయోగించెదము. ఆంధ్రభాష, ఆంధ్ర విద్యా వ్యాపనము, ఆంధ్ర విశ్వ విద్యాలయ నిర్మాణము, ఆంధ్ర రాష్ట్ర నిర్మాణావశ్యకత మొదలగు విషయములను సమదృష్టితో సమర్థించుటయె దినపత్రికను బ్రచురించుటకు గల ముఖ్యకారణము. భేదాభిప్రాయములు గలవారు మా యుద్దేశములను వేరుగ గ్రహింపకుండుటకు బ్రార్థితులు. పత్రికయందు విదేశ స్వదేశ తంతివార్తలు ఎప్పటికప్పుడు తెలుగునందును నాంగ్లభాషయందును బ్రచురించుటకు సాహసించితిమి. దైవానుగ్రహమువలన దినపత్రిక యించుకేనియు దేశాభ్యుదయమునకు దోడ్పడిన పత్రికా నిర్వాహకులు కృతకృత్యులు. ఇంతవరకును సహాయమును జేసిన వారలకును చందాదారులుగ జేరిన వారలకును వందనములు. ఆంధ్ర మహాజనులు సదభిమానమును బూని పత్రికను బోషించి దేశోపయోగకరముగ జేయుటకు బ్రార్థితులు.

[1914 ఏప్రిల్ 1 వ తేదీ ఆంధ్రపత్రిక నుండి]

స్వ విష యము

[స్వర్ణోత్సవానుబంధం సంపాదకీయం]

ఇది మాకు మహదానంద సమయము. ఆంధ్రపత్రిక స్వర్ణోత్సవమును జరుపుకొనుచున్నది. వ్యక్తి జీవితమున ఏబది దాటిన తరువాత పైబడు ప్రతి సంవత్సరమును బలహీనతకు కారణమగుచున్నది. వ్యవస్థ జీవితమున బలాభివృద్ధికి హేతువగుచున్నది.

ఈ స్వర్ణోత్సవమును క్రిందటి సంవత్సరమే జరుపవలసి యుండినది. జరుపవలయునని కూడ సంకల్పించినాము. విజయవాడనుండి "ఆంధ్రపత్రిక"ను ప్రచురించు సందర్భమున నా యుత్సవమును జరుపవలయునని తలపెట్టినాము. కారణాంతరములవలన నది కలిసిరాలేదు.

'పత్రిక' చరిత్ర రెండు అధ్యాయములు. మొదటి అధ్యాయము స్థాపకులు శ్రీ నాగేశ్వరరావుపంతులుగారి జీవిత పర్యంతము. పాతికయేండ్లపాటు 'పత్రిక' పంతులుగారి అధ్వర్యమున, సంపాదకత్వమున నడచినది.

పంతులుగారు ఒక్క నాయకులే కారు; బహుముఖ ఉద్యమము. ఆ ఉద్యమములో 'పత్రిక' ఒకభాగము; ఒక సాధనము. అప్పుడు పంతులుగారే 'పత్రిక'; 'పత్రిక'యే పంతులుగారు. అది 'పత్రిక' చరిత్రలో ప్రథమ అధ్యాయము. ప్రధాన ఘట్టము.

వారి అనంతరము 'పత్రిక' చరిత్రలో ద్వితీయ అధ్యాయము ప్రారంభమైనది. అంతవరకు 'పత్రిక' వారిని అంటిపెట్టుకొని యున్నది కాబట్టి, వారు విశ్వదాతలు కాబట్టి, అది వ్యవస్థకాని వ్యవస్థగా నిల్చియుండినది. అప్పుడు 'పత్రిక'కు స్వంత వ్యక్తిత్వమును, స్థిరత్వమును సాధించుకొనవలసి వచ్చినది. స్థాపకుల సంకల్ప బలమువలన, అదృశ్య శక్తుల సహాయ సంపత్తివలన 'పత్రిక'కు వ్యవస్థా స్వరూప మేర్పడినది. విజయవాడనుండి 'పత్రిక'ను ప్రచురింపవలయుననెడు పంతులుగారి చిరవాంఛయు నెరవేరినది.

పంతులుగారు 'పత్రిక'కు కొన్ని లక్ష్యములను పెట్టిరి. కొన్ని సంప్రదాయములను దిద్దిరి. ఆంధ్రపత్రిక తొలి సంచిక తొలి సంపాదకీయమున "నిందా స్తోత్రములను పాటింపక యుద్దేశ నిర్వహణమునకు పాటుపడుట"యే 'పత్రిక' పద్ధతి యని వ్రాసిరి. ఆ సంప్రదాయమునే అనుసరించుచున్నామని మా విశ్వాసము.

పంతులుగారికాలము నాటికిని, ఇప్పటికిని పరిస్థితులు మారినవి. దేశమునకు స్వాతంత్ర్యము వచ్చినది. ఆంధ్రప్రదేశ మేర్పడినది. పత్రికా నిర్వహణ పద్ధతులలో కూడ నెన్నియో పరిణామములు సంభవించినవి. ఇన్నిమార్పులకు ఆకృతిమారినను ప్రమాణములు మాత్రము మారలేదు.

అర్ధ శతాబ్దికిపైగా 'పత్రిక' చేసిన సేవ జగద్విదితము. స్వర్ణోత్సవ సంచికయందది ప్రతిఫలించుచున్నది. పెద్దలు కూడ తమ శుభాకాంక్షలలో నీ విషయము చెప్పిరి. వారికి మా ధన్యవాదములు.

"అదృష్టము దైవాధీనము. దైవానుగ్రహము సకలాభీష్టసిద్ధికి సాధనము. ఆసాధన సంపత్తివలనను, ఆంధ్ర మహాజనుల సహాయ పోషణములవలనను ఆంధ్రపత్రిక వర్ధిల్లుచున్నందులకు పత్రికా నిర్వాహకులు కృతజ్ఞులు." ఇవి పంతులుగారు తొలి సంచిక సంపాదకీయములో వ్రాసిన మాటలు. ఇప్పుడు వీటికిమించి చెప్పవలసినదిలేదు. చెప్పలేము.

[1965 ఆగస్టు 30 వ తేదీ ఆంధ్రపత్రికనుండి]

ఆంధ్రపత్రిక స్వర్ణోత్సవం

"తా. వేం. కృ."

ఆంధ్రపత్రిక వినాయకచవితి శుభదినాన స్వర్ణోత్సవం జరుపుకొన్నది. ఆంధ్ర ప్రజల జీవితంలో అంతర్భాగంగా, అంతర్వాహినిగా అర్ధ శతాబ్దికి పైబడి 'ఆంధ్రపత్రిక' చేసిన, చేస్తున్న అఖండ సేవకు అనేక మంది పెద్దలు, పిన్నలు, ఆ సందర్భంలో అభినందన లందజేశారు.

స్వరాజ్య సముపార్జనలోను, స్వరాష్ట్ర సాధనలోను ఆంధ్రపత్రిక నిర్వహించిన ఉజ్జ్వల పాత్రను గురించి యిక్కడ ప్రస్తావించడం అనవసరం. ఆంధ్ర మహాజనులే అందుకు సాక్షీభూతులు.

తెలుగునాట తొలి దినపత్రికను ప్రారంభించిన దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారి దూరదృష్టికి యావదాంధ్ర జాతి నమోవాకము లర్పిస్తోంది. పంతులుగారు, పత్రిక, ప్రజలు—త్రివేణీ సంగమంవలె భాసిల్లారు.

దేశము అస్వతంత్రంగావున్న రోజులలో, ప్రజల విజ్ఞాన వికాసా లింకా కొంత ప్రారంభదశలోనే ఉన్నప్పుడు, అందునా ఆంధ్రులకు ప్రత్యేక వ్యక్తిత్వం అంటూ లేని కాలంలో దినపత్రికను ప్రారంభించడం, జయప్రదంగా నిర్వహించడం సామాన్యమైన విషయాలు గావు. పైగా పత్రికా స్వాతంత్ర్యం దాదాపు మృగ్యంగా వున్న రోజులవి. అర్థంలేని, అంతులేని పరిమితులు. వీటన్నిటినీ అతిక్రమించి పత్రికా నిర్వహణను జయప్రదంగా జరపడం పంతులుగారి కార్యదీక్షకు, ధైర్య సాహసాలకు నిదర్శనం.

దినపత్రికగా ఆంధ్రపత్రిక ఆవిర్భావంతో ఆంధ్ర జాతి అభ్యుదయానికి చక్కని బాట ఏర్పడింది. ఆంధ్ర ప్రజల ఆశయాలకు, ఆశలకు ఒక ఆధారం లభించింది. స్వరాష్ట్ర వాంఛకు ఒక ఆకృతి ఏర్పడింది. వారి ఆకాంక్షలు ప్రతిధ్వనించేందుకు ఒక వేదిక రూపొందింది.

ఆరోజులలో ఆంధ్రదేశం నలుమూలలా, మారుమూల గ్రామాలలో సైతం ప్రజలు పత్రికకోరకు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తూ ఉండేవారు. పత్రికా పఠనం 'వేదపఠనం'వలె సాగుతుండేది.

ఒక్క క్షేత్రంగాదు; ఒక్కరంగంగాదు; ఆంధ్ర ప్రజలకు సంబంధించిన అన్ని రంగాలలోను—ఆర్థిక, సాహిత్య విషయాలన్నింటా తానై నిలిచి ఆంధ్రజాతి సమగ్రాభివృద్ధికి దర్పణంగా ఖ్యాతిగాంచింది ఆంధ్ర పత్రిక.


ఆంధ్రపత్రిక స్వర్ణోత్సవానుబంధం పర్యాలోకించినప్పుడు, పలువురు ప్రముఖులు వ్రాసిన వ్యాసాలను పరిశీలించినప్పుడు యాభై ఏళ్లుగా పత్రిక నిరహించిన ప్రశంసనీయమైన పాత్ర మనకు దిఙ్మాత్రంగా ద్యోతకమౌతుంది.

ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారన్నట్లు ఆంధ్ర దినపత్రిక, సచిత్ర వారపత్రిక, భారతి—యివి పంతులుగారు నాటిన కల్పవృక్షాలు.

వయసులో వారపత్రిక ఈ మూడింటిలోను పెద్దది. భారతి కడగొట్టు బిడ్డ. దినపత్రిక మధ్య వయస్క. ఆంధ్రరాజధాని కొత్త మేయర్ శ్రీమతి బి. సరోజినీదేవి అన్నట్లు "ఆంధ్రపత్రికకు అప్పుడే ఏబదేండ్లా? నమ్మశక్యం గాకున్నది. ఇంకను మదవతి వలె నున్నది."

ఈ ఏబదేండ్ల జీవితంలోను 'ఆంధ్రపత్రిక' జాతీయ, అంతర్జాతీయ సంఘటనలను జనులకు తెలియపరచడమే గాకుండా, దేశ స్వాతంత్ర్య సమరానికి పూర్తిగా చేయూత నిచ్చింది. గాంధిమహాత్ముడు ప్రారంభించిన స్వరాజ్యోద్యమాన్ని సంపూర్ణంగా సమర్థించింది. అంతేగాదు ఆంధ్రకు సంబంధించినంత వరకు తానే ఉద్యమమై అగ్రరంగంలో నిలుచున్నది.

ఆంధ్ర పత్రిక స్వర్ణోత్సవం



ఆంధ్రపత్రిక సంపాదకవర్గంతో శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు. (ఎడమనుండి కూర్చున్నవారు) శ్రీయుతులు జరుగుమిల్లి సాంబశివరావు, కిరీటిరావు, వెదురుమూడి శేషగిరిరావు, పంతులుగారు, చల్లా శేషగిరిరావు (సహాయ సంపాదకులు), కొడాలి శివరామకృష్ణారావు, మోచర్ల కృష్ణమూర్తి (నిలుచున్నవారు) శ్రీయుతులు పార్థసారథి, బచ్చు నరసింహస్వామి, చంద్రశేఖరశాస్త్రి, ఓగేటి సుబ్బయ్య శాస్త్రి, గుర్రం సుబ్రహ్మణ్యం, వామనరావు, ఆర్కాటు హనుమంతరావు, నీలంరాజు వేంకట శేషయ్య.

ఉప్పు సత్యాగ్రహం, బార్డోలీ సత్యాగ్రహం, పెదనందిపాడు పోరాటం, వ్యష్టి, సమిష్టి సత్యాగ్రహాలు, సైమన్ కమిషన్ బహిష్కరణ ఆదిగాగల అన్ని ఉద్యమాలకు ఆంధ్రపత్రిక అండగా నిలచింది.

బీహారు భూకంపం, బెంగాల్ క్షామం, రాయలసీమ కరువువంటి అరిష్టాలు, అనర్థాలు దాపురించినపుడంతా 'పత్రిక' ప్రజల ప్రక్కన నిలిచింది. వారిని ఆదుకోవాలని యావదాంధ్ర జాతిని ప్రబోధించింది. ఉత్తేజపరచింది. కృతకృత్యమైనది కూడా.

ఆదిలో అన్నట్లు ఆంధ్రజాతికి ప్రత్యేక వ్యక్తిత్వాన్ని సాధించటమేగాక, రాష్ట్ర శ్రేయస్సుకు సంబంధించిన సమస్త విషయాలలో శక్తివంచన లేకుండా కృషి చేసింది.


ఆంధ్రరాష్ట్రోద్యమం విజయానికి పత్రిక చేసిన కృషి వేరుగా చెప్పనక్కరలేదు గదా! ఈ ఒక్క మహత్తర కృషికే యావదాంధ్ర ప్రజలు పంతుల

గారికి, పత్రికకు కృతజ్ఞులై ఉంటారు. స్వరాష్ట్ర సాధనానంతరం సైతం అది పటిష్ఠంగాను, పరిపుష్టంగాను ఉండేందుకే ఆంధ్రపత్రిక శాయశక్తులా పాటుబడుతూవుంది. కాంగ్రెసు మూసలో కాచి వడపోసిన పత్రికైనప్పటికీ, రాష్ట్ర సమస్యలు, దేశ సమస్యలు వచ్చినప్పుడు మొత్తం ప్రజల శ్రేయస్సుకే ప్రాధాన్యం యిస్తూ, పార్టీలకు అతీతంగా పనిచేసింది.

"ఆంధ్రపత్రిక ఆంధ్రులకు చేసిన సేవ ఏ కాలములోను, ఏ వ్యక్తి, ఏ సంస్థ చేయలేదు. ఆంధ్ర రాష్ట్రం కావలెనని ఆందోళన ప్రారంభించింది. ఆంధ్రుల రాష్ట్రం చూచింది. విశాలాంధ్ర కావలెనని కోరింది. అదీ వచ్చింది......'ఆంధ్రపత్రిక' అప్పుడు కాంగ్రెసు పత్రిక. ఇప్పుడు ఆంధ్రుల పత్రిక" అన్న శ్రీ మంతెన వెంకటరాజుగారి మాటలు సమయస్ఫూర్తేగాక, భావస్ఫూర్తితో కూడుకొని ఉన్నాయి.

పంతులుగారు - పత్రిక

పత్రికపేరు చెబితే పంతులుగారు, పంతులుగారి పేరు చెబితే పత్రిక వెంటనే గుర్తుకు వస్తారు.



ఆంధ్రసచిత్రవారపత్రిక రజతోత్సవం (1934). మొదటివరుసలో ఎడమనుంచి నాలుగవవారు రజతోత్సవం అధ్యక్షులు శ్రీ సి. ఆర్. శ్రీనివాసన్ ('స్వదేశమిత్రన్' సంపాదకులు), ఐదవవారు పంతులుగారు, ఆరవవారు శ్రీ రంగస్వామి ('హిందూ' సంపాదకులు).



శ్రీ చల్లా శేషగిరిరావు [1934 వరకు ఆంధ్రపత్రిక ప్రథమ సహాయసంపాదకులు.]

అది విడదీయరాని సంబంధం. పంతులుగారు ఒక మహోద్యమం. అందులో పత్రిక ఒక ప్రధానమైన విభాగం.

"జాతీయోద్యమం, ఆంధ్రోద్యమం, సారస్వతోద్యమం, హరిజనోద్యమం, దేవాలయ జీర్ణోద్ధరణోద్యమం—ఒక్కటేమిటి? ఆంధ్రదేశమే తానుగా మనుగడ సాగించిన మహా మనీషి" అన్న శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారి పలుకులతో పంతులుగారు పరిపూర్ణ మానవుడుగా మనకు ప్రత్యక్షమౌతారు.

పత్రిక ప్రజలకు పంతులుగారు యిచ్చిన వర ప్రసాదం అంటే అతిశయోక్తి కానేరదు. అందుకనే పంతులుగారితో ప్రత్యక్ష పరిచయభాగ్యం కలిగిన శ్రీ మల్లెల శ్రీ రామమూర్తి యిలా అన్నారు:

"ఆంధ్రోద్యమ ఆంధ్రరాష్ట్రోద్యమములకు ఆరోజులలో ఆంధ్రపత్రిక జవసత్వము లిచ్చినది..... ఆంధ్రపత్రిక చేసిన ప్రచారమువల్లనే ఆంధ్రోద్యమం అన్ని రంగాలలోను విజృంభించినది. అనాడాంధ్రపత్రిక లేకపోతే, దేశమే లేదు."

"పంతులుగారు ప్రారంభించిన యీ పత్రిక ఆంధ్ర ప్రజల విద్యా విషయక, సాంస్కృతిక, రాజకీయ ఆర్థిక ప్రమాణాలలో అభివృద్ధిని సాధించడం కోసం అంకితమైపోయింది. ఆంధ్రులకు అగణ్యమైన సేవ చేసింది. ఏలక్ష్యాలతో, ఉద్దేశాలతో పత్రిక నెలకొల్పబడిందో, ఆ లక్ష్యాలు, ఉద్దేశాలు అనుకున్నదానికన్నా ఎక్కువగా నెరవేరాయి" అని సభాపతి శ్రీ బి. వి. సుబ్బారెడ్డి చెప్పినది పత్రికపట్ల ఆంధ్రుల మనోభావాలను వ్యక్తీకరిస్తోంది.

ప్రధాన న్యాయమూర్తి శ్రీ పెనుమత్స సత్యనారాయణగారాజుగారి మాటల్లో "వ్యవస్థాపకులైన దేశోద్ధారక శ్రీ నాగేశ్వరరావుగారి సమర్థమైన సారథ్యంలో 'పత్రిక' స్వాతంత్రోద్యమంలో ప్రముఖంగా పని చేయడమేగాక, ఆంధ్ర సారస్వతం, లలిత కళలు, సంస్కృతి అభివృద్ధికి ఎంతో దోహదాన్ని కల్పించింది. చేయూత నిచ్చింది. దేశానికి, ముఖ్యంగా ఆంధ్రులకు 'పత్రిక' చేసిన సేవ ఇప్పుడు చరిత్ర అయిపోయింది."

"ఆంధ్రుని సర్వ కళామయునిగ రూపొందించుటకు ఆంధ్రపత్రిక చేసిన కృషి అసమానము, అద్వితీయము. పిమ్మటికాలమందు తెలుగుపంట ఆనాటి ఆంధ్రపత్రికారచిత రమ్యాక్షర క్షేత్రఫలితమే" అని శ్రీ తెన్నేటి విశ్వనాథంగా రన్నారు.

హరిజనోద్ధరణ, అస్పృశ్యతా నివారణ కరుడు గట్టిన దక్షిణ దేశములో ఇంత త్వరలో, అంత చురుకుగ జరిగినవంటే, దానికి కారకులు, మూల పురుషులు పంతులుగారు. వారు స్థాపించిన దినపత్రికయే యనుటలో ఎంతమాత్రము అతిశయోక్తిగాని, అనుమానంగాని లేదు" అని పంతులుగారి ప్రేమాదరణ చవిగొన్న హరిజన నాయకుడు శ్రీ వేముల కూర్మయ్య మనసారా చెప్పిన మాటలు మనకు పాత స్మృతులను ప్రసాదిస్తాయి.

శ్రీ గౌతు లచ్చన్న చెప్పిన విధంగా "స్వరాజ్యోద్యమానికే గాక—ఆంధ్రులకు సంబంధించిన ప్రతి ఉద్యమానికి ప్రోత్సాహ సహాయా లందిస్తూ, అనన్య భావస్ఫూర్తిని, విజ్ఞాన జ్యోతిని వెలిగించిన ఈ పత్రికా రాజమునకు ఆంధ్రులెల్లరు సర్వదా కృతజ్ఞులై ఉండగలరు."

ఆంధ్రపత్రిక స్వర్ణోత్సవానుబంధానికి రాష్ట్రపతి డా. రాధాకృష్ణపండితులు, కేంద్రమంత్రులు, గవర్నర్లు, ముఖ్యమంత్రులు, సాహితీపరులు, రాజకీయ నాయకులు, వ్యాసాల రూపంలోను, సందేశాల రూపంలోను పంపిన శుభాకాంక్షలు పర్యాలోకించినప్పుడు ఆంధ్ర ప్రజల హృదయంలో పత్రిక చెరగిపోని ముద్రవేసి, చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉన్నదని స్పష్టం ఔతోంది.

రేవా తరంగ శీకర
సేవాహేవాక పాక శిశిర మరుత్ప్రి
స్రావ పరికంప్యమాన జ
టావలియగు చతడు వింధ్యమల్లన జేరెన్.

(శ్రీనాథుడు—కాశీఖండం)

దీపం

శ్రీ బాలగంగాధరతిలక్

దీపాలు బాగుంటాయి;
పాపల్లాంటి దీపాలు, కనుపాపల్లాంటి దీపాలు,
పాపాలవంటి సహజ స్వచ్ఛ తీవ్రమైన దీపాలు.


చీకట్లో చీకటి కనపడదు,
దీపం పాపం వంటి చీకటిని చూపెడుతుంది,
దీపాల మధ్య చీకటి దివ్యంగా మెరసి పోతుంది,
దీపం ఆసరాతో చీకటి నిజాన్ని తెలుసుకో,
పాపం ఆసరాతో మానవుడి నైజాన్ని తెలుసుకో,
ఆకలేసినపుడు కొట్లో మిఠాయి కాజేద్దామనే యానాది పిల ఆబకళ్ళు,
ఆపుకోలేని యౌవనంలో తప్పటడుగు వేసిన పెళ్ళికానిపిల్ల కన్నీళ్ళు,
ఆరు లక్ష లున్నా దొంగ నిలవలువేసే షాహుకారు అజ్ఞానపు కళ్ళు,
తోడేలు గొర్రెను చంపి తాగుతూన్న నెత్తుటిలో సృష్టి క్రూరపు ముళ్ళు,
ఆకతాయి మొగుడైనా ఆ వెధవ ప్రతిబింబాన్ని ఆప్యాయంగా మోసే ఆడదాని ఒళ్ళు,
ఎన్ని కోరికలు — ఎన్ని ప్రవృత్తులు,
ఎన్ని విచిత్ర ప్రకృత్యార్భాట ఝంఝామరుత్తులు,
ఎన్ని చలద్హేమంత వర్షానిదాఘ ఋతు శకుంత గరుత్తులు?
ఈ అనంతద్రవ్యం నుండి ఎంత వైశ్వానరశక్తి?
శిలను చీల్చి సిరలు దాల్చి చిగురించిన ప్రాణయుక్తి
ఏంత సృష్టి లాలస!
ఎన్నెన్ని ప్రాణాలు — ఇవన్నీ దీపాలు!

ప్రాణంలోంచి పాపం పాపంలోంచి ప్రాణం పుటా యి,
పాపాన్ని చూసి పాపం అని జాలిపడడం పుణ్యం అని చెప్పాయి,
సమాధిమీద దీపం చావుని వెలిగించి చూపుతుంది
దేవాలయంలోని దీపం దేవుని బందిఖానాను తెలుపుతుంది,
ఇంటిముందు పెట్టిన దీపం ఇంటిలోపలి గుట్టును దాచుతుంది,
ప్రతి రక్త కణంలో ఒక వాంఛా కీలిక
ప్రతి మనోంగణంలో ఒక సృష్టి దీపిక.

ఏడమ్ అండ్ యీవ్‌లు చేసిన పాపం యిలపై వెలిగించిన తొలి దీపం
ఈడేరని కోర్కెల మంటల పిలుపులు యెద యెదలో తెరచిన కత్తుల తలుపులు
ఇది ఆరని ఎర్రని దీపం,
ఇది నిరంతర జీవన తాపం,
తనని తాను కాల్చుకుంటూ భస్మమయే దారుణ మోహన శాపం.

ఆర్తజన బాంధవుడు ఆల్బర్ట్ ష్వైట్జర్

ఆఫ్రికాలో దీనులయిన రోగుల చికిత్సకే తన జీవితం అంతా అంకితం చేసిన 90 ఏళ్ళ వృద్ధ డాక్టర్ ఆల్బర్టు ష్వైట్జర్ ఇటీవల అస్తమించారన్న వార్త ప్రపంచాన్ని దుఃఖసాగరంలో ముంచివేసింది.



డాక్టరు ష్వైట్జర్ సుమారు అర్ధ శతాబ్ది కాలం ఆఫ్రికాలో స్వయంగా నిర్మించిన ఆస్పత్రిలో అసంఖ్యాకులయిన కుష్ఠురోగులకేగాక వేర్వేరు రోగాలతో కుములుతున్న వారికి నిరంతరాశా జ్యోతి వెలిగించిన పరమ కారుణ్యమూర్తి.

ష్వైట్జర్ జర్మనీ—ఫ్రాన్స్ సరిహద్దులోని ఆల్‌శాస్‌లో 1875 లో జన్మించారు. బాల్యంలోనే పరుల బాధలు, దుఃఖాలు ఆయన కెంతో మనస్తాపం కలిగించేవి. ఒకనా డాయన స్నేహితునితో కలిసి పిట్టల వేటకు బయలుదేరారు. ఆ సమయంలో అల్లంత దూరంలో చర్చి గంటల ధ్వని వినిపించింది. అవి 'ప్రాణులను హింసించరాదుసుమా?' అన్న బైబిలు అనుశాసనాలవలె ప్రతిధ్వనించాయి. ఆ తరవాత చేపలు పట్టుకోవడానికై వినియోగించే ఎరగిలగిల లాడడం చూసిన తరవాత ఆయన కిక చేపల వేటకే పోవాలని బుద్ధిపుట్టలేదు!

డాక్టరు ష్వైట్జర్‌లో మొట్ట మొదట విద్యాభ్యాసం విషయంలో అంతగా చురుకుదనం కనబడ లేదు. ఆయన సంగీతాసక్తి కూడా అంతంతగానే ఉన్నట్టు తోచింది. అయితే ఒక ఉపాధ్యాయు డాయన ప్రత్యేక శక్తి సామర్థ్యాలు గుర్తించిన తరవాత అత్యద్భుత మయిన ఫలితాలు కనిపించాయి.

1893 లో స్ట్రాస్‌బర్గ్ విశ్వ విద్యాలయంలో ప్రవేశించిన తరవాత ష్వైట్జర్‌లో జ్ఞానతృష్ణ అత్యధికంగా పెచ్చు పెరిగింది. ఆ తరుణంలో ఆయ నకు చరిత్రమీద, సారస్వతంమీద, ప్రాకృతిక శాస్త్రాలమీద అత్యధికమయిన ఆసక్తి కలిగింది. అయితే 21 సంవత్సరాలు నిండిన తరవాత ఆయనకు ప్రపంచంలో దుఃఖితు లనేకులున్నప్పుడు తన సుఖ జీవితం సరిఅయిన దారిలో నడవడం లేదని తోచింది.

1899 లో తత్త్వశాస్త్రంలో డాక్టరుపట్టం పుచ్చుకున్న తరవాత ష్వైట్జర్ స్ట్రాస్‌బర్గ్‌లో సెంట్ నికోలాస్ చర్చిలో మతాధికారిగా కుదురు కున్నారు. ఆ తరువాత దైవశాస్త్రం పరీక్షలో ఉత్తీర్ణు లయినారు. అప్పైన ఆయనకు ఈ శాస్త్రంలో ఎన్నెన్నో గౌరవ పట్ట ప్రదానాలు జరిగాయి. ఆ తరవాత ఆయన బెర్లిన్‌లోను, పారిస్‌లోను తత్త్వశాస్త్రము, ఆర్గన్ అన్న జంత్ర వాద్య సంగీతము కూడా అభ్యసించారు.

1902—1912లలో ఆయన దైవ శాస్త్ర కళాశాలకు ప్రధానాచార్యులుగాకూడా పనిచేశారు. అదే

కాలంలో ఆయన తమ ప్రత్యేక జంత్ర వాద్యగానంతో ఘనులన్న ప్రసిద్ధి గణించుకున్నారు.

జీవిత లక్ష్యం

1904లో డాక్టరు ష్వైట్జర్ ఒక పత్రికలో ఫ్రెంచి భూమధ్యరేఖ ఆఫ్రికాలో, ఆఫ్రికా నివాసులలో కుష్టురోగం విశేషంగా వ్యాపించిన వార్త చదివారు. తక్షణమే ఆయన అక్కడికివెళ్ళి సేవ చెయ్యాలని నిశ్చయించుకున్నారు. దానికోసం ముందుగా స్ట్రాస్ బర్గ్ విశ్వవిద్యాలయంలో వైద్యశాస్త్ర విభాగంలో విద్యార్థిగా చేరారు. వైద్యం అంటే ఆయన కంతగా ఇష్టం లేకపోయినా కేవలం ఆఫ్రికాలో కుష్టు రోగ పీడితుల సేవ కోసమే ఆ శాస్త్రం కూలంకషంగా అభ్యసించారు.

డాక్టరు ష్వైట్జర్ ఆఫ్రికా ప్రయాణ లక్ష్యం ఆయన జీవితంలో ఒక మహత్తర పరిణామమని చెప్పాలి. అంతకుమునుపు ఆయనకు సంగీత విద్వాంసులని, దైవ శాస్త్రవేత్తలని గొప్ప ప్రసిద్ధి వచ్చింది. ఆఫ్రికా వెళ్ళే పక్షంలో ఇక తత్త్వ శాస్త్ర సంగీతాల వ్యాసంగం విడిచిపెట్టి, రోగుల చికిత్సలకే జీవితం పూర్తిగా ఆహుతి చెయ్యవలసి ఉంటుంది. ఇందుచేత స్నేహితు లాయనకు ఆఫ్రికా వెళ్లవద్దని సలహా లిచ్చారు. అయినా ఆయన తన దృఢ నిశ్చయం విడనాడలేదు. ఏడేళ్లపాటు అచంచల దీక్షతో వైద్య విద్య అభ్యసించి 1913 లో డాక్టరుపట్టం పుచ్చుకున్నారు. అదే సంవత్సరంలో భార్యతో కలిసి లాంబరీన్‌కు ప్రయాణమయినారు. అంతకుమునుపు ఏడేళ్లలోను ఆయన అనేక సారులు జంత్ర వాద్యగోష్ఠులు జరిపారు. వానివల్ల వచ్చిన సొమ్మంతా లాంబరీన్‌లో వ్యయానికి, ఆ తరవాత ఒక ఆస్పత్రి నిర్మాణానికి ఖర్చయిపోయింది.

అక్కడఉన్న మొట్ట మొదటి కొలది మాసాలలోను డాక్టరు ష్వైట్జరు మలేరియా, కుష్టు, మొదలయిన రోగాలతో బాధ పడుతున్న రెండువేల మంది రోగులకు చికిత్స చేశారు. ఆఖరికి ప్రసవ సహాయం అవసరమయినా డాక్టర్ ఎన్నడూ కాదనలేదు. క్రమ క్రమంగా ఆయన ఘన మానవ సేవ ఖ్యాతి యూరపులలోను, అమెరికాలోను మార్మ్రోగింది. లాంబరీన్ మిత్ర సంఘా లెన్నో ఆ ఖండాలలో ఏర్పడి ఆయన కృషికి అనేక విధాల తోడ్పడ్డాయి.

మూలశంకకు
త్వరగా నమ్మకమైన
హెడెన్‌సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

సహించలేని బాధ ఉందా! తీవ్రంగా దురద వుందా? మంటతో నెత్తురు పడుతుందా? అమోఘమైన చికిత్స ఎంతమాత్రము కాలయాపన చేయవద్దు! ఉపేక్షిస్తే తీవ్రమైన పరిస్థితులకు దారితీసి- శస్త్ర చికిత్స తప్పనిసరి ఔతుంది. సకాలంలో హెడెన్‌సాతో ఉపశమనాన్ని పొందండి. ఇది నమ్మకమైన జర్మను మూలశంక విరేచనము. 108 దేశాలలో వైద్యులందరూ శిఫారసు చేస్తున్నారు. హెడెన్‌సా శీఘ్రంగా గుణాన్నిచ్చి బాధను దురదను శమింపజేస్తుంది—విరేచనము ఎంతమాత్రము కష్టమనిపించదు. హెడెన్‌సా లోఉండే అమోఘమైన మందులు సామర్థ్యంగా గుణాన్ని కలిగించి రక్తశంకలను ముకుళింపజేసి ఆరోగ్యకరమైన టిస్యూ రంధ్రాలప్రవృద్ధికి సహకరిస్తుంది. గమనించండి. మూలశంకలకు సకాలంలో హెడెన్‌సా చికిత్సచేసుకుంటే మున్ముందు శస్త్ర చికిత్స అవసర ముండదు! హెడెన్‌సాలో మత్తును కల్గించే మందులు ఏమియు లేవు.

అసలైన జర్మన్ సూత్రాలకు అనుగుణంగా ఇండియాలో వీరిచే తయారు చేయబడుచున్నది.

ది డాలర్ కంపెనీ
337, తంబుచెట్టి స్ట్రీటు మద్రాసు-1.
ప్రసిద్ధి పొందిన కెమిస్టు లందరివద్ద లభిస్తుంది.

BJ-DOL-2ATG

కారాగార నివాసం

ప్రపంచ సంగ్రామం ద్వితీయ భాగంలో జర్మనీ దేశీయుడయిన డాక్టరు ష్వైట్జర్‌ను లాంబరీన్‌నుండి తొలగించివేసి ఫ్రాన్సులో నిర్బంధించారు. యుద్ధానంతరం ఆయన యూరపులో అంతటా విశేషంగా పర్యటించారు. తమ జంత్ర వాద్యంతో కచ్చేరీలు జరిపి విరివిగా ఉపన్యాసా లిచ్చారు. ఇప్పటి కాయన్ని సంగీత విద్వాంసుడు ఇమాన్యుయల్ బాక్ కొక గొప్ప వ్యాఖ్యాత అని అందరు గుర్తించారు.

1924 లో ఆయన లాంబరీన్‌కు తిరిగి వచ్చారు. యూరపులో అనేక దేశాలనుంచి డాక్టర్లు, నర్సులు అక్కడికి రావడం మొదలు పెట్టారు. 1927 లో అదే ప్రాంతంలో ఇంకొక కొత్త ఆస్పత్రి నిర్మించారు.

రెండవ ప్రపంచ యుద్ధంలో మళ్లీ డాక్టరు ష్వైట్జరు ఆస్పత్రికి కొన్ని ఇబ్బందులు వచ్చాయి. కాని యుద్ధ తీవ్రతవలెనే ఆయన విఖ్యాతి ప్రశస్తత కూడా బాగా పెరిగింది. అందుచేత ఆ సమయంలో ఉభయ శత్రుపక్షాలు ఆయన ఆస్పత్రి కేవిధమయిన ఇబ్బంది కలగకుండా సంరక్షించాయి. రవాణా అడ్డంకులవల్ల మొట్ట మొదట కొన్ని ఇబ్బందు లేర్పడినా ఆ తరవాత అన్నీ సవ్యంగా సాగిపోయాయి. ఆస్పత్రిలో డాక్టరు ష్వైట్జర్ కేవలం వైద్యులు మాత్రమే కాదు. రోగులకందరికి ఎంతో ఆత్మీయ బంధువు. రాత్రివేళ డాక్టరు స్వయంగా వచ్చి ప్రతి ఒక్కరికి గుడ్‌నైట్ చెప్పేదాకా రోగు లెవ్వరు నిద్ర పోయేవారు కాదట!

ప్రపంచ విఖ్యాతి

1955 లో లాంబరీన్‌లో పూర్తిగా స్థిరపడిపోయేవరకు డాక్టరు ష్వైట్జర్ యూరపులో అనేక పర్యాయాలు పర్యటించారు. ఆసమయంలో ఆయన తమ యంత్రవాద్య గోష్ఠులు జరిపి ఉపన్యాసాలిచ్చేవారు.

1934 లో ష్వైట్జర్ ఆక్సుఫర్డులో హిల్బర్ట్ ఉపన్యాసా లిచ్చారు. ఇలాగే 1935 లో ఎడింబరో విశ్వ విద్యాలయంలో గిఫ్ఫర్డు ఉపన్యాసా లిచ్చారు. 1951 లో ఆయన్ని ఫ్రెంచి ఎకాడమీకి సభ్యులుగా ఎన్నుకున్నారు. 1953 లో నోబెల్ శాంతి బహుమానంతో గౌరవించారు. 1955 లో బ్రిటన్ ఆయనకు 'ఆర్డరు ఆఫ్ మెరిట్' పదవి బహూకరించింది. స్వదేశంలోను, విదేశాలలోను కూడా ఇంకా ఆయన కనేక గౌరవ బిరుదాలు లభించాయి.

90సంవత్సరాల ప్రాంతంలోకూడా ఆయన ప్రతి క్షణము తమ విధ్యుక్తధర్మానికే అంకితం చేశారు. 85 వ సంవత్సరం దాకా ఆయన శస్త్ర చికిత్స విసర్జించలేదు.

డాక్టరు ష్వైట్జర్ దీన జన సేవకులుగానే గాక బహుళ గ్రంథకర్తగా కూడా ప్రసిద్ధి కెక్కారు. సంగీత విద్వాంసుడు బాక్‌ను గూర్చి ఆయన 1905లో రచించిన గ్రంథం బహుళ ఖ్యాతి పొందింది. ఇలాగే 'నా జీవితము; భావాలు' అన్న ఆయన ఆత్మ చరిత్రకు కూడా విశేష విఖ్యాతి లభించింది.

చిట్టచివరికి డాక్టరు ష్వైట్జర్ తమ అరణ్య చికిత్సాలయంలోనే పరమపదించారు. ఈ శతాబ్దంలో ఇంతటి మహనీయ మానవసేవా నిరతులు వేరొకరు జన్మించలేదని పలువురు భావిస్తున్నారు. ఆయన జీవితంలో చాలా భాగం లాంబరీన్‌లో వైద్యాలయంలో రోగుల చికిత్సలోనే గడిపి వేశారు. ఇంకా డాక్టరు ష్వైట్జర్ గొప్ప తత్త్వవేత్తగా, ఆర్గన్ జంత్ర సంగీతవేత్తగా, దైవ శాస్త్రవేత్తగా, ప్రపంచ ప్రజల మన్నన లందుకొన్నారు.

డాక్టరు ష్వైట్జర్ భారతీయ తత్త్వ శాస్త్రం పఠించి దానిపై ప్రత్యేకంగా ఒక గ్రంథం కూడా రచించారు. ఇది ఆయన సునిశిత మేధ కొక చక్కని తార్కాణమని విమర్శకుల మన్ననలందుకొన్నది. ఇలాగే రామకృష్ణ వివేకానంద గాంధీల తాత్త్విక దృక్పథం కూడా ఆయన నిశితంగా పరిశీలించారు.

గాంధిజీకి డాక్టరు ష్వైట్జరు చాలా సన్నిహిత మిత్రులు.

ఆయన స్వతంత్ర దృక్పథం కల గొప్ప మేధావి. క్రైస్తవమతం డాక్టరుకు పూర్తిగా సంతృప్తి కలిగించలేదు. షోపెన్‌హోర్ తాత్త్వికచింతన పరిశీలించిన తరవాత క్రమ క్రమంగా ష్వైట్జరుకు బౌద్ధ, జైన వేదాంతాలమీద ప్రగాఢాభిమానం కలిగింది. అయినా ఈ వేదాంతాలుకూడా ఆయనకు సంతృప్తి కలిగించ లేదు. ఆఫ్రికారణ్యాలలో దీనమానవసేవ ప్రారంభించిన తరవాత సర్వ ప్రాణి కారుణ్యమే సంపూర్ణమైన పరమ సత్యంగా భాసించింది.

ఈ పరమార్థమే ఆయనకు ఆ జీవితాంతము ఒక ఆరనిజ్యోతిలా మార్గదర్శకమయింది. డాక్టరు ష్వైట్జరును అజరామరులయిన మహాపురుషులకోవలో చేర్చింది.

ఆ రాత్రి

శ్రీ కస్తూరి లక్ష్మీనారాయణ

ప్రొద్దువాలిపోయింది. క్రుంకిపోయిన సూర్యుడి కిరణాలకు, పశ్చిమాకాశానవున్న వెండిమబ్బులు కాలి, ఎర్రగా పచ్చగా వెలుగుతున్నాయి. సంచారానికి వెళ్లిన పక్షులు బృందాలు బృందాలుగా గూళ్లకు చేరుకుంటున్నాయి. కాలువ ఒడ్డునవున్న సర్వితోపులో ఏవో పక్షులు కూర్చుని గోల చేస్తున్నాయి. కొంచెం ఇవతలగావున్న గుడిసెలలోనుంచి లేచిన పొగ చుట్టూ వ్యాపించి వాతావరణాన్ని తెల్లగా చేస్తోంది.

మల్లి ఏడుస్తున్న పిల్లవాణ్ణి చంక నేసుకుని గుడిసెలోనుంచి బయటకు వచ్చింది. బయట కుక్కిమంచంలో కూర్చునివున్న మల్లి ముసలిఅత్త మంగమ్మ, ఎదురుగావున్న చింతచెట్టు గుబురులోకి చూస్తోంది. గడచిపోయిన తన జీవితంలోని ఏవేవో సంఘటల్ని తలుచుకుని అప్పుడప్పుడు గొణుక్కుంటోంది. పిల్లవాణ్ణి భుజం మీద పడుకోబెట్టుకుని జోకొడుతూ సముదాయిస్తోంది మల్లి. కాని వాడి ఏడుపు మాత్రం ఆగటంలేదు. మంగమ్మ తన జ్ఞాపకాలలోనుంచి బయటపడి, మల్లివైపు తిరిగి, ''ఏందే! ఆడి జరం యింకా దిగిపోనేదా?'' అని అడిగింది.

మలి పిల్లవాడి మెడమీద, వీపుమీద చెయ్యి వేసిచూసి అంది, ''మద్దెనేలకాడికి నయమే నత్తా. సాయంత్రపేల అర్దరూపా యెట్టి మందు తెచ్చి పోస్తిని గిందా! మునిమాపుకే తగ్గి పోద్ది పొమ్మన్నాడు, డాకటేరు బాబు.''

నగరానికి వెలుపలగా వున్న యీగుడిసెలకు దగ్గరలో ఒక చిన్న డిగ్రీవున్న డాక్టరు ఉన్నాడు. ఆయన ఈ బీదలందరికీ ఏరోజు దారోజు పావలా, అర్ధా తీసుకుని మందులిచ్చి పంపుతుంటాడు. అంతకంటే ఎక్కువ ఇచ్చుకోలేని జనమంతా అక్కడికే పోతుంటారు. అందుకే ఆయన ఆసుపత్రికి ''బీదల ఆసుపత్రి'' అని కూడ పేరు వచ్చింది.

మసక చీకటి క్రమంగా వల్లబడుతోంది. కాలువకు అవతలి ప్రక్కనున్న తుమ్మబీడు ఆకుల సందు నుంచి, ఉదయిస్తున్న చంద్రుడు ఎర్రగా కన్పిస్తున్నాడు. మంగమ్మ మంచం మీద కొంచెం సర్దుకు కూర్చుని, ''అణ్ణి నాకిచ్చి పోయే. గాలికి తొంగుంటడు. ముందు నువ్ పోయి కూడొండిపడెయ్...... ఈరణ్ణ వచ్చేయేల గూడయింది'' అంది. పిల్లవాణ్ణి అత్తచేతి కందించింది మల్లి; ''మావేందో అణ్ణానికి మద్దెనేల రాలే దత్తా, యాడికి పోయిండో ఏమో!'' అనుకుంటూ గుడిసెలోనికి పోయింది. మంగమ్మ పిల్లవాడికి జోకొడుతూ, మసగ్గ కన్పించే సర్విచెట్ల లోకి చూస్తూ మళ్లీ తన భూతకాలానికి రంగు లేసుకుంటూ వెళ్లిపోయింది.

మల్లి లోపలికి వచ్చి చూసేసరికి పొయ్యిలో మంట ఆరిపోయి, పొగ వస్తోంది. కుండ తీసి ప్రక్కన పెట్టి, లోపల బూడిదంతా లాగేసి, వెదురుగొట్టంతో వూది మంట చేసింది. మళ్లీ కుండ పొయ్యిమీద పెట్టి ప్రక్కనే వున్న చితుకులు ఒక్కొక్కటే పెట్టసాగింది. మంటల్ని చూస్తూ కూర్చుంటే చిన్నప్పటి సంగతులు ఏమిటేమిటో గుర్తుకు రాసాగినై.

*   *   *

అప్పుడు తనకు పదిపదకొండేళ్లు ఉంటాయేమో! చిన్న తమ్ముణ్ణి తన కిచ్చి, తల్లి కాలనీ ఇళ్లలో పనిచేసి రావటానికి వెళ్లింది. తండ్రి అప్పటికి రెండు మూడు నెలలనుంచి అంతులేడు. తల్లి పనిచేసే యిళ్లల్లో ఎవరన్నా పెట్టే చద్దన్నమూ, నెలాఖరుకు వచ్చే పది పన్నెండు రూపాయిలతో తమ జీవితం వెళ్లమార్చుకోవటానికి ఆధారంగా ఉండేవి. ఆరోజున తండ్రి అకస్మాత్తుగా యింట్లోకి వచ్చాడు. అప్పుడు త నిలాగే కూర్చుని కొద్దిగా నూకలుంటే, ఎండుటాకులుపెట్టి ఉడకేస్తోంది.

వస్తూనే చుట్టూ ఒకసారి కలియ చూసి, "అమ్మేడికి పోయిందే?" అని అడిగాడు. అతని వాలకమూ, అదీ చూస్తుంటే తన కేమీ సమాధానం చెప్పటానికి మనస్కరించలేదు. మెదలకుండా అతని ముఖం చూస్తూ కూర్చుంది.

"ఏందేశ్, కొవ్వు బలిసిందేటే, నా పెశ్నకి సమాధానం సెప్పవ్?" అని గద్దిస్తూ మల్లి దగ్గరకు వచ్చాడు. అప్పుడు తను చెదిరిపోయి, తత్తరలాడుతూ "కాలనీ ఇల్లల్లో పనిచేసి రాటాని కెల్లింది" అని నసిగింది. ఇంకేమీ మాట్లాడకుండా పరిచివున్న ఈతాకుల చాపమీద వాలాడు. అతని దగ్గరనుంచి ఏదో వాసన వస్తోంది.

"పొయ్యి మీద్దేందే, నూకలా? బియ్యమా? ఉడుక్కరాంగనే సెప్పు" అని ఇంకొక ఆజ్ఞ జారీ చేసి మొహంమీద చెయ్యి కప్పుకుని పడుకున్నాడు. తను కుండలో కలియబెడుతూ కూర్చుంది. తన పక్కనే తమ్ముడు చేటపెట్టి ఆడుకుంటున్నాడు. తండ్రి వాణ్ణి దగ్గరకు తీసుకోకపోగా చివరకు పలకరించనన్నాలేదు. ఆ వయసులోనే తన కెందుకో అతన్ని చూస్తూవుంటే తండ్రిని చూస్తున్నట్లుండేది గాదు. ప్రక్కింటి రాములుకోసం బట్వాడా అయిన సాయంత్రమే వస్తుండే కాబూలీవాడే గుర్తుకు వస్తుండేవాడు. తను వెనుకకు తిరిగి చూసేసరికి కునుకు తీస్తున్నాడు. అన్ని రోజులనుంచి ఎక్కడెక్కడ తిరిగి వస్తున్నాడో ఏమో!

తను కుండ దించి ప్రక్కకుపెట్టి పొయిలో నుసిలాగి నీళ్ళు చల్లుతుంటే లేచి కూర్చున్నాడు తండ్రి.

"ఏదే, ఆ సత్తు డేగిసా ఇటెయ్యి. ఆ కుండ కూడ యిపెట్టు."

మల్లేమీ మాట్లాడకుండా ముంతతో నీళ్ళిచ్చి, కంచం, కుండ దగ్గర పెట్టింది. క్రిందటి సాయంత్రం తల్లి ఎవరింట్లోనో తెచ్చిన కాస్త ఎండుకారం వుంటే వేసింది.

సగం కుండల్లా ఖాళీచేసి, మిగిలింది తన ముందరకు నెట్టి, "ఇది నువ్వూ, ఆడూ తినండే, నే యెల్లిపోతుండా" అని ముంతెడు నీళ్ళు గటగటా త్రాగేసి కాళ్ళూ, చేతులూ వూపుకుంటూ వెళ్ళిపోయినాడు. తన తల్లేం తినాలో అడుగుదా మనిపించిందిగాని, గొంతులో మాట గొంతులోనే ఉండిపోయింది. తనకు వూహ తెలిసినప్పటినుంచీ ఏనాడూ తల్లి సంగతి, తన సంగతి తండ్రి పట్టించుకున్నట్లు గుర్తు లేదు.

తల్లి రాగానే సంగతంతా చెప్పింది తను. విని మెదలకుండా వూరుకుందామె. ఒక్కమాట కూడ మాట్లాడ లేదు. తర్వాత తనకూ, తమ్ముడికీ పంతులుగారింట్లో తెచ్చిన పులుసు కలిపి ముద్దలు పెట్టింది. తరువాత తానేమో కుండలో మిగిలిన నూకలన్నమూ, తను తెచ్చుకున్న చద్ది కలిపి నీళ్ళు పోసుకుని ఉప్పేసి కలుపుకుని త్రాగేసింది.

* * *

తల్లి జ్ఞాపకాలతో మల్లికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. పమిట కొంగుతో తుడుచుకుంటూ, "ఏం జలమో ఏందో, ఒక్కనాటికీ సుకం నేక పోయె" అనుకుంది.

ఇంతలో ఎవరో బయటి నుంచి కేకేశారు, "ఎవరు లోపల? మల్లేనా?" మల్లి బయటకు వచ్చింది. రాములు నిలుచుని ఉన్నాడు.

"ఏంది రాములా, ఏటి సంగతి?"

"మీ సుబ్బులు, ఆ డెవుడో యింకోడు యాపారంలో టూబులు తెత్తుంటే పోలీసులు కాసిండ్రంట. సుబ్బులుగాడేమో టూబు లాడ పారేసి పారిపోయిండు. ఆ నెండోవోడు సిక్కిపోనాడంట. ఆనక పోలీసు లొత్తారేమో. కాత్త సూసుకోండి" అన్నాడు రాములు.

రాములు మాటలకు మల్లి బెదిరిపోయింది.

"టూబులతో యాపారం సేస్తుండడా సుబ్బులు! అయినా పోలీసోల్లు ఈడకెందు కొస్తరు? ఆడేమైన ఈడ ఉంటుండా డంటవా, పెట్టుండా డంటవా? ఈడకేం పని?"

రాములు తాపీగా చుట్ట ఒక పీల్పు పీల్చి, "సుబ్బ లేడుంటడో పోలీసుల కెట్ట తెలుస్తది? ఆడిదివర కీడ వుండి పోయిండుగెంద! అణ్ణా, వదినె యాడ ఉన్నారని తెలిస్తే కనుక్కపోదామని వస్తరు.. ఏదీ......ఈరిగాడు వచ్చినట్టులేదే. ఆడు రాగానే బేగి సెప్పమ్మాయ్. నే పోతుండా." అని భుజంమీది కండువా తీసి తలకు చుట్టుకుంటూ వెళ్ళిపోయినాడు.

మల్లికి మనసంతా ఆందోళనతో నిండి పోయింది. తన మరిది సుబ్బులు ఈ వ్యాపారం

చేస్తున్నాడని తనకుగాని, వీరన్నకుగాని ఇంతవరకు తెలియదు. సంవత్సరం క్రితంవరకు ఇక్కడే వుంటూ పనీ పాటా చూసుకుంటూ ఉండేవాడు. ఏదన్నా సంపాదించిన రోజున తెచ్చి మల్లికే యిస్తుండేవాడు. నగరానికి అవతలివైపున కట్టిన ఫ్యాక్టరీలో ఏదో పని కుదిరిందనీ, అక్కడికీ, ఇక్కడకూ తిరగటం కుదరదనీ, తనక్కడే ఏదన్నా గుడిసె తీసుకుని ఉడకేసుకుంటాననీ వెళ్ళిపోయి, ఈ సంవత్సరంనుంచీ అక్కడే ఉంటున్నాడు. చూచి పోవటానికి అప్పుడపుడు వస్తుంటే, వాడి ఇస్త్రీ బట్టలూ, చెప్పులూ చూసి వీరన్న, మల్లి కూడ సంతోషించారు మంచి పనికే కుదిరాడని. వచ్చినపుడల్లా పిల్లవాడికి ఏదో ఒకటి తెచ్చేవాడు. ‘‘ఈ యేడన్నా ఆడికి మనువేడన్నా సూడాలి మల్లీ’’ అని అనుకుంటున్న వీరన్న మాటలు జ్ఞాపకం వచ్చి నిట్టూర్చింది మల్లి. ‘‘ఇప్పటికీడు తయారయ్యిండు, యాపారానికి మల్లా’’ అని గొణుక్కుంది.

మంగమ్మ మనవణ్ణి డొక్కలో పడుకోబెట్టుకుని కుక్కిలో సన్నగా గురక తీస్తోంది. అత్తను లేపి సుబ్బులు సంగతి చెపుదామనుకుంది మల్లి. కాని మళ్లీ ముసలిదాని మనసు బాధపడుతుందేమో ననుకుని మానేసింది. గుడిసెలో పొయ్యి దగ్గరకు వెళ్ళింది. కుండలో అన్నం ఉడికి వుంది. కుండ దించి ప్రక్కన పెట్టి బయటకు వచ్చింది.

చంద్రుడు బాగా పైకి లేచాడు. వెన్నెల కిరణాలు పడి, కాలువలో పారుతున్న నీళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి. సర్వితోటలోని పిట్టలు నిద్రపోతున్నట్లున్నై. సవ్వ డేమీ విన్పించటంలేదు. మంచం కోడు కానుకుని కూర్చొన్న మల్లి మసక వెల్తురులో రోడ్డు చివరిదాకా ఒకసారి చూసి, ‘‘మాఁవింకా రానేదు. ఏమైపోయిండో!’’ అనుకుంది.

* * *

అనుకోకుండా ఆమె దృష్టి గుడిసెకు కొంచెం వెనుకగా వున్న మెరక మీద పడింది. తనకేమీ తోచనప్పుడు దానిమీదే పడుతుంటాయి కళ్ళు. తన తల్లి, తమ్ముడు ఉన్నపుడు తమ గుడిసె దానిమీద ఉండేది. ఆ మనుషులూ, గుడిసె ఇప్పుడు లేకపోయినా ఎండకూ, వానకూ కొంచెం కొంచెం కారిపోతూ యింకా ఆ దిబ్బ గుర్తుగానే ఉంది.

ఆరోజు, తండ్రి వెళ్ళిపోయిన రోజు రాత్రే కాబోలు తమ్ముడికి జ్వరం తీవ్రంగా వచ్చింది. తల్లి దిష్టి తీసేసి, ‘‘తెల్లారేపేలకి పోద్దిలే’’ అంది. కాని తెల్లవారేసరికి జ్వరమైతే కొంచెం తగ్గిందిగాని ఒళ్లంతా ఎర్రగా దద్దురు కన్పించింది. తన తల్లి కళ్ళల్లో ఆరోజు ఆందోళన స్పష్టంగా చూసింది తను. అప్పుడు వెంటనే మంగమ్మత్తనే పిల్చుకు వచ్చింది. అత్త చూసి, ‘‘ఆఁ! అదేనే పిల్లా అనుమాన మేంది! వూరంతా పొక్కిపోనాదంటగా. కొంచెం జాగత్తగుండు.’’ అని చెప్పి తనను తీసుకుని బయటకు వచ్చింది. ఆ మూడు రోజులూ మల్లి తల్లి పనిలోకి వెళ్లలేదు. మల్లిని మాత్రం మంగమ్మ తన దగ్గరే ఉంచుకుంది. తమ్ముడిని ఒకసారి కూడ చూడనివ్వలేదు, మూడో రోజునో, నాలుగో రోజునో ఒక సాయింత్రం తనను బయట కూర్చోబెట్టుకుని జడ వేస్తోంది మంగమ్మత్త. తల్లి ఇంట్లోనుంచి ఒక్కసారి పెద్దగా ఏడుస్తూ బయటికి వచ్చి, ‘‘మంగోదినో, నేనేం సేయునే, నా బిడ్డ పోయిండే!’’ అని జుట్టు పీక్కుంటూ, నేలమీద కూలబడిపోయింది. అప్పుడు కూడ తనని తమ్ముడు దగ్గరకు పోనీయలేదు. చీకటి పడిన తర్వాత ఈ రాములే తమ గుడిసెలోనుంచి తెల్లగా గుడ్డ చుట్టిన వస్తువు దేన్నో భుజంమీద వేసుకుని తీసుకుపోయా డెక్కడికో. మర్నాడుగాని అదేమిటో, ఏమైందో అర్థంగాలేదు తనకు.

తర్వాత రెండేళ్లకు కాబోలు తను పెద్దదయింది. అప్పటికి తన తల్లి రైలుకట్ట దగ్గర పని చేస్తోంది. కొత్తగా వేసిన రైలు పట్టాలకు ఆడ కూలీలు కంకర మోస్తుండేవాళ్ళు. తనుకూడ పనికి వస్తానని పట్టుపట్టింది మల్లి చాలా సార్లు. కాని తల్లి ఒప్పుకోలేదు. ‘‘నా ముప్పై రూపాల సంపాదన సాలకపోతే గంటే దిగులు. నువ్వా వద్దు, నీ పనీ వద్దు. ఇంటికాడే ఉండు’’ అని మంగమ్మత్తను పిలిచి తనను ఒప్పచెప్పి మరీ వెళ్ళేది పనికి.

‘‘సిన్నపిల్ల, దాని కేమే, తీసుకుపోనాదా ?’’ అనేది మంగమ్మత్త. కాని తన తల్లేమీ మాట్లాడకుండా వెళ్ళిపోయేది.

ఆరోజు బట్వాడా ఇస్తారని తన తల్లి చాల ఉత్సాహంగా ఉంది. ముందు తన కో మంచి వోణీ, పరికిణీ తెస్తానంది. మధ్యాహ్నం వాన పడుతుంటే అమ్మ

కోసం ఎదురుచూస్తూ సాయంత్రం ఎప్పుడవుతుందా అని ఆదుర్దా పడుతోంది మల్లి. ఆవాన సాయంత్రం వరకు తగ్గలేదు. తల్లి వచ్చేలోపల అన్నం వండుదామని పొయ్యి రాజేస్తోంది తను.

ఇంతలో బయటనుంచి "మల్లీ" అని పిలుపు వినిపించింది. ఎవరోనని బయటికి వచ్చేసరికి వీరన్న మంచుని ఉన్నాడు.

"గంగులు తాత, రాములు పిలుత్తుండారు నిన్ను. ఓసారి వచ్చి పోదువు రా."

అతని వెనకనే తనూ వాళ్ల ఇంటి దగ్గరకు వెళ్లింది. గంగులు తాతేదో నెమ్మదిగా చెప్తున్నాడు. మంగమ్మత్త నోరు తెరుచుకుని వింటోంది. తనని చూడంగానే గంగులుతాత లేచి, "రాములూ! నే పోతుండారా. ఆ సంగతి చెప్పి మిగతా పనేదో సూడు. ఆడు శండేల్లనుంచి అయివూ, ఆనమాలూ లేకుండానే పాయె" అంటూ వెళ్లిపోయాడు.

మంగమ్మత్త తనను దగ్గరకు తీసుకుని మంచం వాల్చి, దానిమీద కూర్చోబెట్టుకుంది. రాములు కొంచెం దగ్గరకు వచ్చి నేలమీద చతికిలపడి కూర్చున్నాడు. జేబులోనుంచి పొగాకు కాడ తీసి, దాని ఈనెలు నెమ్మదిగా తీస్తూ "సూడు మల్లెమ్మా, ఇదివరకి మల్లే కాదుగెందా. ఇప్పుడు కాత్తె పెద్దదానివైతివి. నువు కొంచెం ధైర్యం, అదీ సిక్కబట్టుకుని ఉండాల, ఏం?" అని ఆగాడు. రాములు ఈమాట లెందుకు చెప్తున్నాడో తన కర్థం కాకపోయినా, గుండెల్లో భయంలాంటి దేదో ఆవహించి, నోట మాట రాలేదు. అలాగే కళ్లు పెద్దవి చేసుకుని రాములు మొహం చూస్తోంది.

"పాపం, తమ్ముడు సచ్చిపోనాడనుకో. అయ్యేమో అంతే నేకపోయె. ఇగ.....ఆటితోపాటు అమ్మ గూడ......"

అంతే! తర్వాత తనేమీ వినలేదు. కాళ్ల క్రింద భూమి లోపలి కెక్కడికో పడిపోతున్నట్లనిపించింది. ఒక్కసారి పెద్దగా "అమ్మ యాఁవయిందత్తా" అంటూ బావురుమని మంగమ్మత్త వళ్లోకి పడిపోయింది.

తర్వాత మల్లి తనకు ఒళ్లు తెలిసేసరికి చుట్టూ చీకటిగా వుంది. ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయి. తన తలప్రక్కనే కూర్చుని వీరన్న విసురుతూ, "మల్లీ మల్లీ"అని నెమ్మదిగా పిలుస్తున్నాడు. తనకు వెంటనే తల్లి మరణం గుర్తుకు వచ్చింది. రెండు చేతుల్తోను ముఖం కప్పుకుని ఏడుస్తుంటే గుడిసెలో నుంచి మంగమ్మత్త కేకేసింది.

"అది లేసిందంట్రా ఈరన్నా! లెగిత్తే యేడిగా ఈ గంజిబట్టు కూతెంత, తేరుకుంటది."

లేచి పోబోతున్న వీరన్నను తను ఆపి, "అమ్మ ఎట్టా సచ్చిపోనాదంట మాఁవా?" అని అడిగింది.

"అల్లంతా మద్దేనపేల పనిసేత్తంటే తా నొచ్చినాది. దాపున యాడ నీడే లేదంట. టేశన్ సెద్దు దూరం గుంటంలో ఆడికెల్లలేక, ఆడో గూడ్సుబండి ఆగుంటే దానికింద సేరిండ్రంట ఈల్లంతా. ఆ వానలో బండి కదిలి, ఒక్క నాగు నాగేపాటికి, గాబరా పడిపోయి బయటికి దూరబూయిండ్రంట. మెడకాయలు కొందరికి, కాలుసేతులు కొందరికి తెగిపోనై. పదిమందిదాకా సచ్చిపోనారంట."

తనకోసం అన్ని అవస్థలు పడుతూ, అంత ప్రేమగా పెంచుతున్న తల్లి, ఇంత దారుణంగా మరణించిందంటే కల అనిపించింది. తల్చుకుంటుంటే ఏడ్పు ఆగలేదు. వీరన్న తొడ చాటున మొహంపెట్టి "నేనేమైపోను మాఁవా? నా బతు కేంగాను?" అని ఏడ్చింది. వీరన్న బలవంతంగా తన తలను ఒళ్లో పెట్టుకుని,

"సూడు మల్లీ, అత్తమ్మ సచ్చిపోనమాత్తరానికి నివ్వూ, నీ బతుకు ఏఁవైపోతదా? ఇదుగో, యిట్టనే ఉంటరు" అన్నాడు తన ముఖం మీది జుట్టును పక్కకి తీస్తూ. ఆ మాటల కర్థమేమిటో తన కర్థం కాలేదు అప్పుడు. లేచి కూర్చుని, "మరి అమ్మకాడికి ఎల్లద్దా మాఁవా? అమ్మని సూడద్దా?" అని అడిగింది.

వీరన్న కొంచెం సేపు ఆగి, తాపీగా అన్నాడు, "ఏం సూస్త వాడ? శవాల్ని ఆసిపత్రికాడికి తీసుకుపోయిండ్రు. రాములు ఆడికిపోయి వచ్చిండుగెందా! అత్తమ్మకు, కంటం, బుజాలు తెగిపోనయ్యంట. దిక్కులేనోల్లని ఆల్లే పూడ్చి పెట్టరు. ఇప్పుడిగ మనం పోయి సేసే దేవుం దాడ?"

తర్వాత ఎలాగో రెండు మూడు నెలలు గడచిపోయినాయి. మంగమ్మత్త దగ్గరే ఉంది మల్లి. ఒక రోజు వీరన్నకూ, తనకు చద్దెన్నం పెడుతూ మంగమ్మ,

"ఏమే మల్లి, పెద్ద పిల్లవయితివి గెందా? ఎంత కాల మిట్టుంట వీడ?" అని అడిగింది.

తనకు; నోట్లో పెట్టుకోబోయే ముద్ద చేతులోనుంచి జారి కంచంలో పడిపోయింది. అంటే తన నిక బయటికిపోయి, తన బ్రతుకు తనను చూసుకోమని అంటోందా అత్త? దిక్కు లేకుండ ఇంత నగరంలోకి పోయి తనెక్కడ ఉండగలదు? ఒంట్లో రక్తం పొంగి, దుఃఖం ముంచుకు వచ్చింది. కళ్లలో నీళ్లు తిరుగుతుంటే, పళ్లతో బిగబట్టుకుని ప్రక్కన వున్న వీరన్నమావ ముఖం చూసింది. అతడు తల వంచుకుని ముసి ముసిగా నవ్వుకుంటున్నాడు. తన కర్థం కాలేదు. ఇంతలో మంగమ్మత్త తన దగ్గరగా కూర్చుని, "ఏందే, మాట్లాడవ్? యిట్టం నేదేటి?" అని అడిగింది.

తను అలాగే ఎంగిలితోనే మంగమ్మత్త భుజాలమీద చేతు లేసి కావిలించుకుని గుండెల్లో బరువంతా దిగిపోయేట్లు ఏడ్చింది. తన వీపు నిమురుతూ మంగమ్మత్త అంది. "నిన్ను బజార్న తోల్తననుకుంటివేటే ఎర్రి మొగమా? వారం లోపటే ముడెట్టిత్త, సూస్తుండు."

* * *

గతాన్ని తల్చుకుంటూ మల్లి అత్తవైపు చూసింది. వెన్నెల్లో హాయిగా నిద్ర పోతున్న మంగమ్మను చూస్తుంటే ఆమె హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. మల్లి నిట్టూరుస్తూ అనుకుంది, "బక్క చిక్కిపోన ఈ శర్మంలో అంత పెద్ద గుండె నెట్టి పెట్టిండు బగమంతుడు. అత్తే నేకపోతే నేనేమైపోదును?"

ఏదో పిట్ట పెద్దగా అరుచుకుంటూ సర్వితోటలోనుంచి ఎగిరి కాలువ మీదుగా పోయింది. చుట్టు గుడిసెల్లో సందడి గూడ నెమ్మదిగా సద్దుమణుగుతోంది. వీరన్నకోసం రోడ్డు చివరిదాకా ఒకసారి చూసింది మల్లి. వస్తున్న జాడేమీ కన్పించలేదు. మంచంకోడు కానుకుని కళ్లు మూసుకుంది.

"ఏందే తడికె తీసే కునుకు తీస్తుండవే? కుక్కలు కుండెత్తికెల్తే అవుద్ది" అంటూ వీరన్న భుజం పట్టుకుని కదుపుతుంటే మెలకువ వచ్చింది మల్లికి. లేచి నుంచుంటూ, "ఎకెల్తివి మావా? పొద్దు టేలనుండి అంతా పొంతూ నేకపోతివే?" అంది.

వీరన్న వచ్చిన అలికిడికి మంగమ్మ కూడ లేచి కూర్చుంది. అప్పుడు అతడు గుడిసె ప్రక్కనే పరిచిన రాళ్లమీద నుంచుని బానలో నీళ్లు ముంచి పోసుకుంటున్నాడు. మల్లి కొంచెం ప్రక్కగా నుంచుని ఏవో మాటలు చెప్తోంది. అందులో మంగమ్మకు "సుబ్బులు", "దొంగసారా" అది ఏవో కొద్దిగా మాటలు విన్పించినాయి.

"ఏందే, మల్లి అది? సుబ్బులేంది, సారా ఏంది?"

"మన సుబ్బులు సంగతి కాదులే అత్తా. పొయ్యి బువ్వ తినరాదూ, పొద్దుపోతుంటే."

ముసలి మంగమ్మ నెమ్మదిగా లేచి ఏమిటో గొణుక్కుంటూ లోపలికి పోయింది.

వీరన్న స్నానమయింది. ఒళ్లు తుడుచుకుంటూ, "ఇయ్యాల మన సంగతి యింటివంటే మల్లే! నే పోయేతలికి రిచ్చా నేదు. సావుకారు పదిరిచ్చాలూ అమ్మేసిండంట మంచి బేర మొత్తే. నిన్న మాపటేలనే రాత కోతలన్నీ గూడ ముగించుకున్నడు. అయిద్రాబాదు పోయి ఏ యిల్లో, పొలమో కొంటడంట." మల్లి ఏదో అడగబోయి మళ్లీ ఆగిపోయింది. వీరన్నవంక చూస్తూ నుంచుంది.

"ఇయ్యాల్టి కేదో దొరికిందిలే. ఆ గోడవున్న కాడ లారీలకి సరు కెత్తిండ్రు. ఆడ ముటాలో పని చేసొచ్చినా. మల్లి రెండు మూడు రోజులదాకా పనిలేదు పొమ్మన్నారు. రేపేమన్నా ఎతుక్కోవాల" అన్నాడు వీరన్న.

మల్లేమీ మాట్లాడకుండా పోయి, వెదురు మీద ఆరేసిన పంచ, బనీను తీసుకువచ్చి అందించింది. మల్లి మౌనానికి వీరన్న కొంచెం నవ్వి అన్నాడు, "ఏందే అంత దిగాలుపడిపోతివి? పని చేసేవోడికి కూలే దొరక్కపోద్దా?"

ఇంతలో మంగమ్మ ఒక చెంబుతో మంచి నీళ్లు తీసుకుని, గుడిసెలోనుంచి బయటకు వచ్చింది.

"తెల్లారి బుడ్డోడి జరం సంగతి సూడ్రాయారయ్యా, మునిమాపుకాడ ఏడ్చినాడు ఏడ్చినట్టే ఉండడు" అని చెంబులో నీళ్లు కాసిని గొంతులో పోసుకుని చెంబు మంచంక్రింద పెట్టుకుని మేను వాల్చింది.

మల్లి లోపలికిపోయి వీరన్నకి అన్నం పెట్టింది. ప్రక్కన ముక్కాలిపీటమీద కిరసనాయిలు బుడ్డి వెలుగుతూ, నల్లని పొగ వదుల్తోంది. రోడ్డు ప్రక్కనే వున్న మలబారు సాయిబు టీ కొట్లోనుంచి రేడియో పాట గోల గోలగా విన్పిస్తోంది. సాయంత్రం నుంచి మల్లి మనసు చికాగ్గా ఉంది. దానికితోడు మర్నాటి నుంచీ వీరన్న కూలి వెతుక్కోవాల్సి వస్తుంది అనే భావం ఆందోళన కల్గిస్తోంది.

"అయితే మావా! గూడ్సు సెడ్డు వాగన్ల కాడ రోజువారి పని దొరుకుద్దిగా. గంగులుతాత మేస్త్రీ పని సేస్తున్నడు గెందా. ఏదన్న ముటాలో పనీమంటే ఏవంటడో!"

గుడిసె వాకిలికి కట్టిన తడిక చప్పుడయింది. వెనుక తిరిగి చూసేసరికి రాములు కన్పించాడు మల్లికి. అతడు వస్తూనే, "ఏందిరిది? ఇంత పొద్దోయి వచ్చినావు? అది సరే. ఇన్నావుగా సంగతి. మనాడు కూడ పట్టుపడిండు. పోలీసు టానాలో కనపడిండంట. బాధపడమాక. రెండు మూడు నెలల్లో తిరిగొస్తడులే. అంతకంటె ఎయ్యరు" అని బుడ్డీ దీపానికి చుట్ట ముట్టించుకుని లేచాడు. అతనితోపాటు వీరన్నా కూడ చేయి కడుక్కొని బయటికి వచ్చాడు.

మల్లి పని తెముల్చుకుని బయటికి వచ్చేసరికి మంగమ్మ పక్కన పడుకున్న పిల్లవాడు ఏడుస్తున్నాడు. పచ్చగా మొలిచిన గడ్డిమీద ఈతాకుల చాప పరుచుకుని, వెన్నెల్లో పడుకుని ఉన్నాడు వీరన్న. గుడిసె తడికె దగ్గరకు లాగి, త్రాడు గట్టిగా కట్టి, పిల్లవాణ్ణి ఎత్తుకుని వీరన్న పక్కన వచ్చి కూర్చుంది మల్లి.

వాడికి పాలిస్తుంటే సుబ్బులు జ్ఞాపకం వచ్చాడు. చిన్నప్పటినుంచి ఎంత అమాయకంగా పెరిగాడు? అలాంటిది తనకూ, అన్నకూ కూడ తెలియకుండా ఇన్ని పనులుచేసి, పోలీసుల చేతుల్లో పడిపోయినాడంటే ఆశ్చర్యమేసింది మల్లికి. ఏమయినా రెండు, మూడు నెలలు జైల్లో ఉండాల్సిందే. చిన్నపుడెపుడో తన తండ్రి కూడ బేడీ లేయించుకున్నాడని వింది. ఆఖరుసారి తను పెట్టిన అన్నం తిని చేతులూపుకుంటూ పోతున్న తండ్రి, తన ముఖంలోకి ఆప్యాయంగా చూస్తూ క్రొత్త పరికిణి, వోణి కొని పెడతానంటున్న తల్లి ఒకసారి మనస్సులో మెదిలారు.

ఒళ్లోవున్న పిల్లవాడి ఒంటిమీద చెయ్యి వేసి చూసి అనుకుంది, "ఆ రోజులూ, ఈ రోజులూ గూడ ఒక్కలాగే సచ్చినాయి. ఎలా గెల్లిపోను ఈ జలమలన్నీ."

మర్నాటినుంచి కూలికోసం వెతుక్కోవలసిన వీరన్న నిశ్చింతగా గుర్రుకొడుతూ నిద్రపోతున్నాడు. చాప మీద ఒక ప్రక్కన పాత దుప్పటి మడతపెట్టి, పరిచి, పిల్లవాణ్ణి పడుకోబెట్టింది మల్లి.

రోడ్డుమీద జనసంచారం ఆగిపోయింది. సాయిబు హోటల్లోని రేడియో పగలంతా అరిచీ, అరిచీ అలిసిపోయి నోరు మూసుకుంది. మర్రిచెట్టు క్రింద పడుకున్న ముసలివాడి మైకం ఇంకా దిగినట్లు లేదు, "ఒచ్చే, ఒచ్చే, వాన జల్లు, గూడుసేరవె రామ సిలక" అని అల్లాయి పదాలు పాడుతున్నాడు. కాలువలో పారే నీళ్ళు, అంచునవున్న కొండ రాళ్లకు తగిలి చప్పుడు చేస్తున్నాయి. దుఃఖాలు, కష్టాలు, పాపాలు కడుపునిండా నింపుకుని, మత్తుగా పడుకున్నాయి గుడిసెలన్నీ.

కొంచెం ఎడంగా ముసలి మంగమ్మ హాయిగా నిద్ర పోతోంది.

నందివర్ధనం పువ్వులా, చల్లగా, తెల్లగా వెలుగుతున్న చందమామను చూస్తున్న మల్లికి పెదవులమీద సన్నని దరహాసం విరిసింది. చందమామనుంచి కళ్ళు, పక్కనే పడుకున్న వీరన్నమీదకు తిప్పి, అతని నడుం మీద చెయ్యివేసి కదుపుతూ అంది,

"ఎన్నెట్లో అపుడే ఏం నిదర మావా, కొ[illegible] అసింట జరుగు."

శాస్త్ర మాచార్యసన్నిధి జదువ డేని,
ఇద్ధబోధంబు మది సంగ్రహింప డేని,
దెగువమీఱి ప్రతిజ్ఞ సాధింప డేని,
జ్ఞాతి జయమంద డేని తజ్జనుడు జనుడె?
(శ్రీనాథుడు — కాశీఖండం)

రామాయణ కృతిపతి

శ్రీ దేవరపల్లి వేంకటకృష్ణారెడ్డి

భాస్కర మంత్రుల శాసన కాలములనుబట్టి భాస్కర రామాయణ కాలము నిర్ణయించ వీలు కానట్లే—సాహిణి రుద్రుని శాసనమునుబట్టి కూడ కృతిపతి సాహిణి మారయ కాలము నిర్ణయించలేమని భారతిలోని[1] చర్చలు సూచించుచున్నవి. కాగా, చాటు పద్య చరిత్రనుబట్టి సాహిణి మారయ కృతిపతి కాలము నిర్ణయించగలమేమో చూతము.

భారతి (సం. 37/12) లో శ్రీ కె. హెచ్. వి. శర్మగారు భాస్కర రామాయణ విమర్శ పరామర్శ చేయునప్పుడు నా వాదము నిట్లు ఆక్షేపించిరి.

"ఇక నీ (భాస్కర మంత్రులు మొ.వారి) జంట పేర్లకుతోడు శ్రీ రెడ్డిగారు ప్రథమ ప్రతాప రుద్రుని కాలమున నొక అశ్వసాహిణి మారయను గూడ నూతనముగ సృష్టించిన చరిత్రాంశములు తబ్బిబ్బులగుటయేగాక యెవ్వరికిని సరిదిద్దుటకు వలను పడదు" అట! చూతము.

చాలకాలమునకుకాని, ఈ చర్చకు తగిన సాధనము చేకూరకపోవుటచేత, శ్రీ శర్మగారి కోరిక నెరవేరకపోవుట తటస్థించినది.

చాటు పద్య చరిత్రను పేర్కొన్న శ్రీ శర్మగారీ క్రింది చాటు పద్య చరిత్ర జోలికి పోకపోయినను, 'ఇవి గాక సాహిణి మారన్నను గూర్చిన చాటు పద్యము లనేకములు గలవు.' అని తమ వాదము కొనసాగించిరి.

అప్పకవీయములో విషమాక్షర శాపమునకు లక్ష్యముగా చూపబడిన చాటువు ఇట్లున్నది:

"చక్కదనంబు దీవియగు
సాహిణి మారఁడు మారుకై వడిన్
బొక్కి పడంగలండు చల
మున్ బలమున్ గల యీ చళుక్య పుం
జొక్క నృపాలుఁ డుగ్రుఁడయి
చూడ్కుల మంటలు రాల జూచినన్
మిక్కిలి రాజశేఖరుని
మీదికి వచ్చిన రిత్తవోవునే!"

శ్రీ ఆరుద్రగారు సమగ్రాంధ్ర సాహిత్యంలో దీని నుదాహరించి, క్రింది జిజ్ఞాసను బయట పెట్టినారు.

"ఇంతకూ సాహిణి మారనపై మూడవ కన్ను తెరచిన, రాజ శేఖరుడు ఎవరు?" అని. ఎవరో కాదు; రుద్రుడే కద!

ఆంధ్రకవి తరంగిణి చరిత్రకారులు చాటు పద్య గాథ చరిత్రను చక్కగా సమన్వయము చేయలేకపోయినను, ఈ చళుక్యపుం జొక్క నృపాలుని నెల్లూరుజిల్లా శాసనచరిత్రతో 'కులోత్తుంగ చోళు' డని నిరూపించినారు. కాని, ఆ శాసనములో కాలము లేకపోవుటనుబట్టి తప్పుదారి త్రొక్కినట్టు తోచుచున్నది.

గూడూరు తాలూకాలో రెడ్డిపాలెమునకు 'శివారు'గానున్న పాండురంగమునందలి పాండురంగాలయములోనున్న శాసనములలో నొకదానియందు "చొక్కనాయనారని నామాంతరముగల కులోత్తుంగ చోళుని పేరుతో నొక శాసన మున్నది. (నె. శా. సం. పుట 446. సంఖ్య 96. గూడూరు తా.) ఈ శాసనము పూర్తిగాఁ బ్రకటింపఁబడకపోవుటచే, నీ కులోత్తుంగచోళుఁ డెవ్వడో, ఈతని కాలమెద్దియో తెలిసికొనుట కవకాశము లేకపోయినది. కులోత్తుంగ చోళులు మువ్వు రున్నారు.........చొక్క నృపాలునకు వైరి యని పై పద్యములోఁ జెప్పఁగడిన సాహిణి మారఁడు ప్రతాపరుద్రుని సేనాధిపతియని చెప్పఁబడినట్టి సాహిణి మారఁడని యెంచితిమేని యాతఁడు పైని జెప్పిన మువ్వురు కులోత్తుంగ రాజుల కాలములోను లేక వారిలో మూఁడవ యాతనికిఁ బిమ్మట

1. భారతి ఆగస్టు 1954, మార్చి 1960, మే 1960, సెప్టెంబరు 1960, డిశెంబరు 1960.

దాదాపు ఎనుబది సంవత్సరములలో నున్నవాఁడు. కావున ఈ పద్య మర్థములేని దగుచున్నది. ప్రతాప రుద్రునికాలము నాటికి చాళుక్య వంశ మంతరించి పోయినది. చాళుక్య వంశములోని చొక్క నృపాలుని తీసికొనినచోఁ బ్రతాపరుద్రుని సాహిణి మారయను వదిలివేసి యంతకుఁ బూర్వము మరియొక సాహిణి యున్నాఁడని తలంపవలసియున్నది......'' అని అనుట సరికాదు.

పై పద్యములో శబ్దశక్తి ధ్వనిగా 'రాజశేఖర' నామము, 'రుద్ర—రాజశేఖరుని' దని వ్యంజకము చేయబడియున్నను, ఆ శ్లేష వ్యంగ్య చరిత్రనే 'ప్రతాపరుద్రుని'దని 'ఎంచితిమేని' అని సరిపెట్ట నక్కరలేదు; ఊహించ నక్కర లేదు.

చంద్ర శేఖరుడన్నను, రాజశేఖరు డన్నను రుద్రుడే కాబట్టి, పై చాటుపద్యములోని ('కాకతి) రుద్రుడు—చళుక్య చొక్క (రాజు)—సాహిణిమార(య) ముగ్గురు క్రీ. శ. 12 శతాబ్ది సమకాలికులనుట కాక్షేపము లేదు.

క్రీ. శ. 13 శతాబ్ది మధ్యకాలమునకు ముందే చాళుక్య చోళరాజ్య మంతరించినది.

చాటుపద్యమందలి 'రుద్ర' రాజ శేఖరుని వైరి సాహిణి మారయను వదిలివేసి కేవలము చాళుక్య చొక్క నృపాలుని మాత్రమే తీసికొని చాటు పద్య యుద్ధ కాలము నిర్ణయించవచ్చుననుట సమన్వయ కాల సమ్మతముకాదు. ఎవ్వరిని వదిలి పెట్టక, యిద్దరి కాలము నాటి సాహిణి మారయను కనుగొన్నచో శ్రీ చాగంటి వారన్నట్లు 'అంతకుఁ బూర్వ మొక సాహిణి యున్నా' డని అంగీకరింపక తప్పదు. నూతనముగ సృష్టించ నక్కరలేదు. ఉన్నవానిని గుర్తించిన చాలు.

పైన చాగంటివారు పేర్కొన్న ముగ్గురు కులోత్తుంగ చోళులు వారన్నట్లుకాక; చారిత్రకముగా చాళుక్య చోళులే కావున, ఆ ముగ్గురు చాళుక్య నృపాలులలో క్రీ. శ. 1178—1218 మధ్యకాలము నాటి మూడవ కులోత్తుంగ చాళుక్య చొక్కనయ నారే,—క్రీ. శ. 1158—95 మధ్యకాలమునాటి మొదటి కాకతి రుద్రరాజుకు సమకాలికు డగుట చేత అతనే నెల్లూరుజిల్లా పాండురంగపురి శాసన కర్త యన వీలున్నది.

సమకాలికుడైన వేములవాడ భీమకవి క్రీ. శ. 12 శతాబ్ది యుద్ధ చరిత్రనే శాప మిషతో శబ్ద శక్తి ధ్వనిగా వ్యంజకముచేసినట్లున్నది కాబట్టి, 'ఈ' చాటువు 'అర్థములేనిదగుచున్న' దన వీలులేదు.

మొదట కాకతీయ సామంతుడైన సాహిణి మారయ ఎప్పుడు దేవగిరి యాదవులతో చేతులు కలిపి, స్వామి ద్రోహియై స్వాతంత్ర్యము ప్రకటించెనో అప్పటినుండి కాకతీయ—చాళుక్య చక్రవర్తు లిద్దరితో తలపడి యుద్ధము చేయవలసినవిధి యేర్పడినట్లున్నది.

వివరములన్నియు తెలియకపోయినను, ఇరువురు చక్రవర్తుల నెదిరించి పోరాడిన సాహిణి మారయ శ్రీ శర్మగారన్నట్లు స్వతంత్ర ప్రభువై యుండునేకాని, స్థానిక చరిత్ర చెప్పినట్లు 'అశ్వ సాహిణి' కాడని సాహిణి మారయ చాటు పద్య గూఢ చరిత్ర చాటుచున్నది.

శ్రీ శర్మగా రుదాహరించిన శాసన మొకటి, కాలములేని దగుటచేత, నా వాదములో కూడ చేరుచున్నది. దానిని వాడుకొన్నందుకు శ్రీ శర్మగారికి కృతజ్ఞతా పూర్వక వందనములు.

''కృష్ణాజిల్లా గన్నవరము తాలూకా పురుషోత్తమ పట్టణ శాసన మొక దానిలో 'శ్రీమత్స కల సేనాధిపతి మహా సామంత పట్ట సాహిణి బుద్ధయ దేవ మహారాజు, అతని నిజ రాజ్యభార ధౌరేయకుండు గుంటూరు విషయ పాలకుండు' పేర్కొనబడినారు. ఇందుకాలము లేదు. భాస్కర రామాయణమున సాహిణి మారయ తండ్రిగా చెప్పబడిన బుద్ధయ ఈతడే కావచ్చును'' సందేహము లేదు.

క్రీ. శ. 12 శతాబ్ద్యంతమున కాకతి రుద్ర సామ్రాజ్యముపై దేవగిరి (జైతుగి) యాదవ రాజొక వంకను, కంచి ముమ్మడి కులోత్తుంగచోళ చాళుక్య చొక్కరాజొకవంకను దండయాత్ర జరిపినప్పుడు కాకతి సకల సేనాధిపతి సాహిణి మారయ ద్రోహియై యాదవరాజుతో కలసి కుట్రపన్ని తత్ఫలితముగ కాకతి రుద్రునిచేత యుద్ధములో వీరమరణము పొందినట్లు 'మిక్కిలి రాజశేఖరుని (రుద్రుని) మీాదికివచ్చిన రిత్తవోవునే!' అను చాటు పద్య చరిత్ర చాటుచున్నను, చారిత్రకులా విషయము నెత్తక పోవుట చిత్రమే కద!

'గూఢ వస్తు మయ కావ్య' ధ్వని చరిత్రను చారిత్రకులు విశ్వసింపకపోవుటచేతనే శ్రీ శర్మగారన్నట్లు 'చరిత్రాంశములు తబ్బిబ్బు లగుటయేగాక

యెవ్వరికిని సరిదిద్దుటకు వలను పడదు.' అని చెప్ప వీలున్నది.

ఇప్పు డీ చాటు పద్యములో నేను 'నూతనముగ సృష్టించిన 'సాహిణి మారయ కలడో' క్రీ.శ. 12 శతాబ్దమునాటి చాటు పద్య కవి చూచిన ప్రాచీన సాహిణి మారడు కలడో పరిశీలింపుడు.

పై చాటు పద్య యుద్ధ చరిత్రతో—కాకతీయ చాళుక్య చోళ—శాసన యుద్ధ చరిత్ర కూడ సమన్వయమగుచున్నదని మరచిపోరాదు.

సాహిణి మారయ వంశములో జంట పేర్లున్న వనక తప్పదు. ఆ వంశ మిట్లేర్పడుచున్నది.

కాకతి ప్రోల	పట్ట సాహిణి బుద్ధయ, సకల సేనాధిపతి.
|	|
రుద్ర (1195)	రథినీపాలాగ్రణి, సాహిణి మారయ—రామాయణ కృతిపతి (1194)
|	|
గణపతి	కుమార(కవి) రుద్రదేవుడు
|	+
రుద్రమ	గజసాహిణి మారయ
|	|
ప్రతాపరుద్ర (1326(	సాహిణి రుద్రదేవుడు (1311)

కావ్య సాహిణి వంశమును—శాసన సాహిణి వంశమును భిన్న వంశములు కావని వంశక్రమమును బట్టి పేర్చి చూచినచో సంపూర్ణ సాహిణి వంశము పై విధముగా సమన్వయమగును.

"పైన జూపిన సాహిణి వంశ వృక్షముతో సరి పోవునట్లు శాసనాద్యాధారములనుబట్టి స్థిరపడి ననేగాని శ్రీ రెడ్డిగారివాదము నంగీకరించలేము" అని అన్న శ్రీ హర్షవర్ధనశర్మగా రిప్పు డీ చాటుపద్యము నా సృష్టిలోనిది కాదన్న చాలు. నిజము నిలకడ మీాద గోచరించకపోదు గద!

కులోత్తుంగచోళ చక్రవర్తి తాను 'వేంగి మండలము' జయించిన పిమ్మట స్వర్ణనగరమైన 'ఉరంగై—(ఓరుగల్లు)'లో స్వర్ణవర్షము కురియించి ప్రవేశించినట్లు 19 శ్రాహి పుదుక్కోట శాసనములో చెక్కించుట అతిశయోక్తి అయినను, నిరాధారము కాదని సాహిణిమారయ మరణచాటువు చాటుచున్నది.

క్రీ. శ. 1194—95 మధ్య కాలములో స్వామిద్రోహియైన సాహిణి మారయ దేవగిరి యాదవ రాజుతో చేతులు కలిపి, తిరుగుబాటు కావించి, కాకతీయరుద్రునితో పోరాడి మరణించినట్లు చాటువు చెప్పుచున్నది.

రామాయణ కథలో 'హుళక్కి భాస్కర మహాకవి చెప్పగనున్న యుద్ధకాండము తరువాయి' బాల కాండము చెప్పకపోవుటకు కారణము స్వతంత్ర యుద్ధములో కృతిపతి మారయ సాహిణి మరణించుటయే కాబోలన వీలున్నది. అటుపిమ్మ టా యుద్ధ కాండ శేషము దేవాంకితముగా అయ్యలార్యు డెప్పుడో (శ్రీ శర్మ గారన్నట్లే ఇమ్మడి ప్రతాప రుద్రుని కాలములో క్రీ. శ. 1300 ప్రాంతమున) పూరించినట్లు స్పష్టమగుచున్నది.

క్రీ. శ. 1195 లో మొదటి కాకతి రుద్ర చక్రవర్తి యుద్ధ మరణమునకు పూర్వమే క్రీ. శ. 1194 లో మొదటి సాహిణి మారయ రుద్రుని కోప దృష్టితో యుద్ధములో మరణించినట్లున్నది.

" 'సోమదేవరాజీయములో ఈ విషయము (హుళక్కి భాస్కరాదుల కాలము) పొరపాటుగా మార్చి చెప్పబడినది.' అని శ్రీ రెడ్డిగారు వచించిరి. ఓరుగల్లు, కొండవీటి దండకవిలెలలో గూడ నీ విషయ మిట్లే— సాహిణి మారన్నయాదిగాగల సేనానులు హుళక్కి భాస్కరాది కవీశ్వరులు మున్నగు వారందఱు కాకతీయ ద్వితీయ ప్రతాపుని యాస్థాన ముండినట్లే దెలుపబడినది." అని శ్రీ శర్మగారు బలపరచినను, సాహిణి వంశవృక్షములో కూడ జంట పేర్లున్నవని గుర్తించక పోవడము చిత్రమే!

భాస్కరులు: (ఒక్కరైనను, ఇద్దరైనను) హుళక్కి భాస్కరాది కవులు మొదటి ప్రతాప రుద్రుని కాలము వారనక తప్పదని చాటుపద్య చరిత్ర చెప్పుచున్నది.


అమృతాంజనం
వాడి శీఘ్రంగా నివారణ పొందండి
స్థానికంగా ఉండే బాధను నివారణ చేసుకోడానికి ఊరికే మందులు ఎందుకు పుచ్చుకుంటారు? నొప్పి ఉన్నచోటుమీద అమృతాంజన్ రాసి అమోఘంగా శీఘ్రంగా నివారణను పొందండి. ఏ అపాయం లేకుండా బెణుకులకు కండరాల నొప్పులకు తలనొప్పికి ఇంకా కీళ్ల నొప్పులకు అమోఘంగా గుణమిచ్చే అమృతాంజన్ 10 రకాల ఔషధాలు చేరిన మందు. అమృతాంజన్ గుండెబలుబుకు సాధారణ జలుబులకు కూడా మంచి మందు. కొంచెం కొంచెమే ఉపయోగించవలసి ఉంటుంది. కాబట్టి ఒక సీసా మీ కుటుంబానికంతా కలిపి నెలలు తరబడి వస్తుంది. అవసరానికి ఎప్పుడూ అమృతాంజన్ ఉంచుకోండి. అమృతాంజన్ 70 ఏళ్ల ప్రసిద్ధిని పొందిన నమ్మకమైన ఔషధం.
అమృతాంజన్ నొప్పుల జలుబుల నివారణకు 10 రకాల ఔషధాలు చేరిన మందు
AMRUTANJAN
Pain Balm
AMRUTANJAN
PAIN BALM
AMRUTANJAN LTD.
బెణుకునొప్పి
ఎంత ఎక్కువగా ఉన్నా
బెణికినచోటేకదా!
అమృతాంజన్ లిమిటెడ్,
మద్రాసు - బొంబాయి - కలకత్తా - ఢిల్లీ
JWT/AM/2819

అసుర సంధ్య

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

[గతసంచిక తరువాయి]

"మారటం.. పరిపూర్ణత్వం, నిండుదనం రావటం"

అతని కళ్లల్లోని ఆరాధన గుర్తించింది కాబోలు, పద్మమణి నవ్వింది....

ఆనవ్వుతో శ్రీధర్ తెప్పిరిల్లాడు. సిగ్గు పడ్డాడు. మళ్లీ యీ లోకంలో పడటంతో తను అన్న మాటలు ఏ లోకంలో ఎలా అన్నాడో, వాటి పూర్తి అర్థ మేమిటో, అసలు అవి ఆమెతో ఎందుకు అనవలసి వచ్చిందో అతనికి అవగాహన కానే లేదు. తనలో తనే ప్రశ్నించు కుంటున్నాడు. ఈ పద్మమణి ఎదుట తనేమి దాచుకో లేదు. తలచు కుంటే, తన హృదయంలో బలవంతాన సరాసరి మాట్లాడ గల వింత శక్తి ఏదో ఈమెలో వుంది. ఆ విషయం స్పష్టమైంది అతనికి...

"ఎందు కంత సిగ్గు పడేవారు ఆరోజుల్లో? నేనంటే వ్యామోహమని మీరు నావైపు చూచినా నావెనుక నడచినా నాకు తెలుస్తూనే వుండేది! మీరెప్పుడో ఒక సారి మాట్లాడక పోతారా అనుకునే దాన్ని! ఎన్నాళ్లని! సిగ్గు కాదు, తెలివైన వాణ్ణన్న గర్వమేమో, యీ పిల్ల నన్ను పలకరించక పోతుందా అని బెట్టు చెయ్యటమేమో, అనుకునే దాన్ని!... నాకు పెళ్లయి లోకం తెలిశాక కాని మీరు పూర్తిగా అర్థం కాలేదు నాకు!" అంటోంది పద్మమణి. ఆమె చూపులు బాణాలు కావు యిప్పుడు, నిశా ప్రశాంత సరోవరాల నీటి తళుకులు, ఆకుల మీద నుండి చీకట్లో జారే వెన్నెల కిరణాలు...

"పెళ్లయ్యాక ఏమిటి అర్థమైంది?" అని ప్రశ్నించాడు శ్రీధర్.

"పెళ్లయ్యాక మీకు ఏమీ అర్థం కాలేదా? అని తిరుగు ప్రశ్నించింది పద్మమణి.

"ఆడవాళ్లని నమ్మటానికి వీల్లేదని, వాళ్లతో పెట్టు కోవటం గొడవ గొడవ అనీ అర్థ మైంది."

"పాపం !" అని చిరు నవ్వు నవ్వుతూ అతని వైపు చూస్తూ కూర్చుంది పద్మమణి.

"నీక్కావల్సిన వడ్డీవో చలమయ్యతో చెబితే వచ్చేవి కదా! నన్ను బాధించటం దేనికి?"

"చిన్న నాటి స్నేహితుడవని!"

"ఏమిటి ఆస్నేహానికి విలువ, అర్థం?"

"అలాంటి ప్రశ్నలు నాకేం తెలుస్తాయి? నేనేం కాలేజిలో చదువుకో లేదు..."

"కాని పెళ్లయాక లోకం తెలిశాక అర్థం అయింది కదా!"

పద్మమణి మౌనం వహించింది. ఆమె కన్నుల్లో నీళ్లు తిరిగాయి. తొనక్కుండా కళ్లు తుడుచుకుని లోపలికి వెళ్లింది.

శ్రీధర్ ఆమెను గమనిస్తూనే వున్నాడు.

తుపానుతో చిక్కుకున్న నావలా వుంది అతని హృదయం. ఒక వైపు లేచి వెళ్లి పోదా మన్న వూహ; మరొక వైపు లేవలేని అశక్తత.

కాలం గడుస్తోంది.. పద్మమణి యింకా తిరిగి రాలేదు..

తార..చంద్రావతి ... ఏం తెలుసుకో గలరు ఆడవాళ్ల ట్రాజెడీలు ఈ మగవాళ్లు? పద్మ సంగతేమిటో ఆమె నుంచే తెలుసుకో గూడదా తను? తప్పా?.. ఎవరు, ఎవరీ పద్మ?..పద్మ! పద్మమణి!

పద్మమణి కాఫీ తెచ్చి యిచ్చింది.

"కాఫీ నువ్వే తయారు చేశావా? సత్యమా?"

"నేనే.. సత్యమెందుకు చేస్తాడు? మా అమ్మ చేస్తూంటుంది."

"మీ అమ్మ యిక్కడే వున్నారా? కనిపించ లేదే?"

"ఈసారి వచ్చి నప్పుడు పరిచయం చేస్తాను. పాపను తీసుకొని ఎవరింటికో వెళ్లింది"

"సత్యం, పాప, యిద్దరూ నీపిల్లలా?"

"ఊఁ"

"సత్యం నీకెప్పుడు కలిగాడు?"

పద్మమణి నవ్వుతోంది "ఏం ప్రశ్నలు ఎడ తెగకుండా? అడగటం ప్రారంభిస్తే యిక అంతూ పొంతూ వుండక్కర్లా?"

"సత్యం నీకొడుకు కాదు."

"అవును, మా ఆయన కొడుకు"

"అంటే?"

"నన్ను రెండో పెళ్లి సంబంధాని కిచ్చారు. అప్పటికి ఆయనకి మూడేళ్ల కొడుకున్నాడు.. ఆయన పోయాక వాడిప్పుడు నాకొడుక్కాక మరే మవుతాడు?"

"పాప?"

"పా—ప! ఏమిటా ప్రశ్నలు? నేనింక సమాధానాలు చెప్పను"

"చెప్పక పోతే చలమయ్య చెబుతాడు. కానీ నాకు వాటిని వినాలని వుండదు."

"ఎందుకని? చలమయ్య చెప్పేవన్నీ నిజమే తుచ తప్పకుండా..."

"రాఘవరావు పెద్ద సంస్కర్త! నిన్నెందుకు పెళ్లి చేసుకో లేదు?"

"ఆయన్నేమీ అనకండి! సంస్కర్త అయినా హృదయమున్న మనిషి; మంచి మనిషి; గొప్ప వాడు."

"ఏమిటా గొప్ప? పెళ్లి చేసుకునే ధైర్యం లేక పోయింది.. నీకు ఆస్తి పెట్టి పోయాడని కృతజ్ఞత కాబోలు"

"ఏం? అది గొప్పదనం కాదా? కొన్ని పరిస్థితుల్లో ఆయన విధిలేక పెళ్లికి ఒప్పుకుని కూడా వుండ వచ్చు. పెళ్లి చేసి కుంటే ఆస్తి ఎలాగు యివ్వాలి. అప్పుడది ఏం గొప్ప? ఏనిర్బంధమూ లేక పోయినా ఆస్తి యిచ్చారంటే అందులోనే ఆయన మంచి తనం తెలుస్తోంది కదా?"

"నువ్వెందుకు పెళ్లిచేసుకొమ్మని అడగలేదు?"

"మన యింగ్లీషు మేస్టారు ఏ సందర్భంలోనైనా సరే తరచు ఒక వాక్యం ఉపయోగించేవారు జ్ఞాపకం వుందా? Beggers can not be choosers."

"అంటే నువ్వు ప్రేమ భిక్ష అడిగావా?"

"ప్రేమ భిక్షా కాదు, ఆస్తి భిక్షా కాదు! జీవితం పెట్టే భిక్ష తప్ప... ప్రేమా, ఆస్తీ అంటూ ఎన్నుకోవటం ఎక్కడుందీ? జరిగేవి జరుగుతాయి. నా పెళ్లి నేను కోరు కుంటే జరిగిందా? రాఘవరావు గారూ అంతే!... కాని ఆయన నన్నొక వ్యక్తిని చేశారు. జీవితం మీద నాకిప్పుడు కొంత అధికారం వుంది."

"అందుకని నన్నిప్పుడు వడ్లు తెమ్మని పురమాయిస్తున్నావ్!"

"ఏం? ఎందుకు అడగ కూడదు? ప్రేమకూ డబ్బుకూ అంత వైరుధ్యమెందుకూ? తల్లిదండ్రులు పిల్లల మీద డబ్బు ఖర్చు పెట్టకుండానే ప్రేమ చూపిస్తున్నారా? పిల్లలు వాళ్లనుంచీ ఆస్తి పాస్తులు ఆశించ కుండానే ప్రేమిస్తున్నారా? తెచ్చుకోవలసింది ఎప్పుడో ఒకప్పుడు జీవితం మీద అధికారం.. అంత దాకా యితరుల ప్రేమ మీదా ఆస్తి మీదా ఆధార పడవలసిందే, తప్పదు!"

"అయితే డబ్బుంటే జీవితం మీద అధికారం వస్తుందంటావ్."

"డబ్బుకు కూడా లొంగి పోకూడదు. అప్పుడే జీవితం మీద అధికారం."

"నువ్వడుగుతున్న వడ్లకి నేను మంచి ధర కోరుతున్నాను. అప్పుడు నీ అధికార మేమైంది? వడ్లు పంపించటం నాకిష్టం లేదు, అప్పుడు?"

"మరీ చిన్నపిల్లాడిలా అడుగు తున్నారు. మంచి ధర అంటే న్యాయమైన ధర, నేనివ్వగలిగిన ధర, యివ్వటానికి సిద్ధంగానే వున్నాను! మీకు పంపించటం యిష్టం లేక పోతే ఏం చేస్తాను? అది మీ యిష్టం.. వూరుకుంటాను."

"అయితే ఆలోచించ వలసిందే!"

"ఇందులో ఆలోచించే దేమిటి? ఇష్టముంటే పంపుతారు లేక పోతే లేదు. అంత సందేహించేట్లయితే పంపకండి"

"అది కాదు మా అన్నని అడగాలి కదా."

"మీరు వేరు పడ్డారటగా.. చలమయ్య చెప్పాడు?"

"అయినా ఆయనదే పెత్తనం!.. ఇన్నాళ్లూ చలమయ్య ధాన్యం సంగతి చూచేవాడా?"

"చెప్పవలసిన ప్రశ్నలన్నిటికి సమాధానం చెప్పాను, ఈ అర్థం లేని మాటకూ చెప్పాలా? ఇక ప్రశ్నలు లేవు... ఇన్నాళ్లూ నాకు పొలముండేది; పొలం అమ్మేశాను.. చాలా?"

పద్మమణి కంఠంలో ధ్వనించిన అధికారానికీ, తన చాపల్యానికీ శ్రీధర్ సిగ్గు పడ్డాడు. ఆమె కాఫీ గ్లాసు తీసుకుని లోపలికి వెళ్లి పోయింది. చిట్ట చివర ఆమెకు కోపం వచ్చిందనిపించింది. పద్మమణి తిరిగి వచ్చి "నేను వంట చెయ్యాలి. ఇక మీరు వెళ్లి నెమ్మదిగా మీ అన్న గార్ని అడిగి వడ్లకి ధర కట్టి మీ కిష్టం వుంటే పంపండి, లేక పోతే మానెయ్యండి. సెలవు" అని సమాధానం కోసం ఎదురు చూడ కుండా లోపలికి వెళ్లి పోయింది.

సూర్యాస్తమయమయింది. ఇంటింటా దీపాలు పెట్టారు. ఆ దీపాల కాంతిలో ఏదో ఆనంద రేఖ, క్రొత్త ఉత్సాహం మనస్సుకి తగులు తోంది. ముసురుతున్న చీకట్లలో ఇటు నటు వెడుతున్న జనాన్ని గమనించకుండా, దీపాల్ని ఒక్కొక్క దాన్నీ చూచి కళ్లు చికిలిస్తూ వీధులు దాటుతున్నాడు శ్రీధర్. కళ్లు చికిలించినప్పుడల్లా దీపాలు తనలో నవ్వుతూ సరాగా లాడుతున్నాయి... "నిజం చెప్పండి.. నేను మారానా?... ఎందులో మారాను?.. ఎట్లామారాను?..." అనుకుంటున్నప్పుడల్లా హృదయం గంతులేస్తోంది. గబగబా నడచి వూరి బయటగా వున్న స్కూలూ, దాని కెదురుగా వున్న చెరువు కట్టా చేరుకున్నాడు. చెరువు కట్ట మీద కొంత సేపు నడచి, తర్వాత స్కూలు ఆవరణలో ప్రవేశించి స్కూలు చుట్టూ వూరికే తిరిగాడు.. పద్మమణి ఓణీ వేసుకొని టెన్నికాయిట్ ఆడుతూ, తెల్లని ఎండలో స్వచ్ఛమైన సౌందర్యంతో స్కూలుకు గబగబా నడచి వస్తూ, మెల్లగా అడుగులు వేసు కుంటూ విలాసంగా జడ అల్లు కుంటూ గేమ్సు తర్వాత యింటికి వెడుతూ...అక్కడే ఆ ప్రదేశం నిండా కనిపిస్తోంది... "ఎందుకంత సిగ్గు పడే వారు ఆ రోజుల్లో?.. నాకు తెలుస్తూనే వుండేది... మీరెప్పుడో ఒక సారి మాట్లాడక పోతారా అనుకునేదాన్ని!..." అప్పుడు మాట్లాడి వుంటే, జీవితం ఎట్లా మారి పోయి వుండేదో యిద్దరికీ!

ఇప్పుడు?...ఇప్పుడు?....ఇప్పుడు?

పెళ్లయింది.. లోకం తెలిసింది...

డబ్బుకు లొంగి పోకూడదు.. అప్పుడే జీవితం మీద అధికారం!

అసురసంధ్య

కబుర్లు!... తను లొంగి పోలేదూ డబ్బుకోసం రాఘవరావుకి?.. శ్రీధర్‌కి హృదయం బద్దలయ్యేలా ఏడవాలనిపించింది చీకటినీ, నిశ్శబ్దాన్నీ, గతాన్నీ, ఏకాంతాన్నీ చీలుస్తూ...

డబ్బు! డబ్బు! తార పెంకె తనానికీ, తండ్రి మరణానికీ ఆస్తి పంపకానికీ, తను ఓబయ్య మామ చేతిలో కీలు బొమ్మ కావటానికీ, రెండు వేలు.. కాదు...ఒక వంద రూపాయల కోసం మంగమ్మను చేజాచటం, అదే ఓం ప్రథమం తన బానిసత్వానికి... ఆ వంద రూపాయల వెనుకా ఒక కథ... దాన్ని తండ్రితో చెప్పటానికి భయపడటం...నాగరాజు దగ్గర తన డబ్బు పుచ్చుకోక పోవటమే యీ చరిత్ర కంతటికీ మూలాధారమా!! డబ్బు పుచ్చుకోవటం కాదు (ఓబయ్య దగ్గర) డబ్బు, తన డబ్బు, తను తిరిగి పుచ్చుకోక పోవటమే (నాగరాజు దగ్గర)— అదే తను చేసిన అపరాధమా? ఏమిటీ కార్యకారణ సంబంధం? ఇది నిజమా? మరి హేతు పద్ధతిని అన్వయించి చూస్తే నిజమే !! చరిత్ర యిలా కాక ఎలా వ్రాస్తారు? అయితే చరిత్రలో యీ కార్య కారణ పద్ధతిని నిగ్గుదేల్చి 'సత్యా'లన్నీ— అని మనం చెబుతున్నవి— ఏం మహా 'సత్యా'లు! అసత్యాలే అనుకోవాలి! కార్యకారణ సంబంధం ఒక పేక మేడ! లేక పోతే నాగరాజు దగ్గర తను పుచ్చుకోక పోయిన వంద రూపాయలకూ తను ప్రస్తుతం అనుభవిస్తున్న వైఫల్యానికి ఏమిటీ సంబంధం!

ఇప్పుడా నాగరాజుని "ఏమయ్యా! నా వందా నా కిచ్చేయ్! నీమంచి చెడ్డలు నీవి!" అని అడిగితే— ఎక్కడున్నాడో నాగరాజు!— ఒకవేళ అతను యిస్తే మాత్రం జరిగిన వన్నీ జరగనట్లే అయి తన పూర్వ చరిత్ర మారుతుందా? చరిత్రను కార్యకారణ పద్ధతితో విశ్లేషించి నేర్చుకునే పాఠాలు ఎందుకు పనికొచ్చేట్టు? ఎందుకూ పనికి రావు! నవ్వుకోటానికి లేక ఏడ్చుకోటానికీ తప్ప!

ఈ పేక మేడ ఎలా నైనా మరో స్వరూపంలో— మధ్యలో కొన్ని చేర్పులతో మార్పులతో వేరుగా ఏర్పడి వుండటానికి అవకాశం వుందా? ఉదాహరణకి ఆ వంద రూపాయల్ని గురించీ తను తండ్రితో నిజం చెప్పి వుంటే? — తండ్రి బహుశా అకథ నమ్మి వుండడు; నాగరాజు చేసిన పాడు పని అవండలో తనే చేసి వచ్చి, అలా వాడి మీద చెప్పాడని అనుకునే వాడు! పోనీ తను ఆ వందా మంగమ్మత్త దగ్గర పుచ్చుకుని కూడా తర్వాత ఆమె ముఖం చూడక పోతే?— అదంత సులువైన సంగతిగా కనిపించదు!.. అంటే ఈ చరిత్ర మరోలా తయారు కావటానికి తనే మరో తరహా వ్యక్తి అయ్యుండాలి! ఈ చరిత్రకు తనకూ అవినాభావ సంబంధం... ఈ చరిత్రే తను, తనే యీ చరిత్ర!.. ఇందులో మూలాధార మైన కారణం ప్రతి స్టేజీలోను తనూ తన వ్యక్తిత్వం తప్ప— నాగరాజు దగ్గర డబ్బు పుచ్చుకోక పోవటం అనే ఒకానొక చారిత్రక సంఘటన కాదు!

పద్మమణితో ఒక్క సారి కూడా ఆ రోజుల్లో మాట్లాడక పోవటానికి కూడా పరిస్థితులు కావు, తన సిగ్గూ బెరుకూ ఏదో తన వ్యక్తిత్వం లోని గుణం అంటే 'తను' 'మూలకారణం!'

ఎవరీ 'తను'? ఎలా యీ 'తను'ని గుర్తించటం? జరిగిన చరిత్ర ద్వారా గుర్తించినా, భవిష్యత్తులో యీ 'తను' స్వరూపం ఎలా వుంటుందో నిశ్చయ మేమిటి?

పద్మమణి తనను యిప్పటికీ ఆకర్షిస్తూనే వుంది. తనకు పద్మమణి జీవితంలో అంటుకో దగిన పరమార్థమా? ఎవరినైనా అడిగితే, "ఛీ! ఛీ! మంచి వాడివి చెడి పోతున్నావ్"అంటారు. పరమార్థమో కాదో ఎలా తెలుసుకోవటం? చిరకాల వాంఛితం కావటం వల్లనా, ఆమె కళ్ళు తనని మంత్ర ముగ్ధుణ్ణి చేసి ఆమె వైపు లాక్కుంటూ వుండటం వల్లనా, లేక స్నేహం ప్రేమ గొప్ప విలువలు కావటం వల్లనా? దేన్ని బట్టి, ఏ ఆదర్శాన్ని బట్టి, తనలో కలిగిన యీ ఆనందాన్ని, యీ ఆశను యీ అనుభవాన్ని రెండు చేతులా స్వీకరిస్తూ దానికి తన జీవితాన్ని తన వ్యక్తిత్వాన్ని అంకితం చెయ్యాలి?

ఇది యిలా తేలే సమస్య కాదు. దీనికి సమాధానం లేదు. పై కారణా లేవీ తనకు నచ్చ లేదు, నచ్చలేదని ఆనందాన్ని, అనుభవాన్ని త్రోసి పుచ్చటానికీ మనస్కరించటం లేదు, స్వీకరించేందుకు అంగీకరించేందుకూ ఏవిధంగా చూచినా (ధర్మం, ఆదర్శం, దృష్ట్య) సమర్థనమే లేదు!.. తను ఏం చెయ్యాలి?.. జవాబు లేదు!

చంద్రోదయ మైంది. చంద్రుణ్ణి నక్షత్రాల్నీ ప్రశ్నించాడు. "నే నేం చెయ్యాలి? నే నెందుకు జీవిస్తున్నాను? నే నెవరు?" ప్రకృతిలో చంద్రుడికీ నక్షత్రాలకీ, కొండలకీ చెట్లకీ, పక్షులకీ మృగాలకీ అస్తిత్వాన్ని గూర్చిన విచికిత్స లేక పోవటం ఎంత హాయి, ఎంత సుఖం! అందుకే విషాద మనేది మానవునికి ప్రత్యేకం కాబోలు!

చలి వేస్తోంది...ఆకలిగా కూడా వుంది.

శ్రీధర్ యింటికి బయల్దేరాడు.

సరిగా ఆంజనేయ స్వామి గుడి దగ్గర పొలం గట్టు దిగుతూ వుండగా కాలికి ఏమిటో మెత్తగా తగిలి చుట్టేసుకుంది క్షణంలో, తటాలున చేత్తో లాగి దూరంగా విసిరేశాడు. పాము! సందేహము లేదు; మడమకు పై భాగంలో కరచి నట్లుగా కూడా వుంది! గుడిలో దీపం వెలుగుతూ వుంది ! కాని గుడి తలుపులు మూసి వేసి వున్నాయి, ఎవ్వరూ లేరు, సాహాయ్యం అర్థించడానికి.

చేతి రుమాలు తీసి గాయానికి పై భాగంలో బిగించి కట్టుకుని యింటికి నడిచాడు.

ఇంట్లో చెప్పగానే పాము కాటు వైద్యుడూ, మంత్ర గాడూ వచ్చారు. విష సర్పమో కాదో నాగుబామో కాదో తేల్చి చెప్ప లేక పోయారు. హాస్పిటలుకి వెళ్లారు. ఇంజెక్షన్ యిప్పించారు.

"చీకటి పడ్డాక అంత సేపూ అక్కడేం జేస్తున్నట్టు ఒంటరిగా కూచుని?" అని అడుగుతోంది రుక్మిణమ్మ.

"ఏమీ తోచక కూర్చున్నాను".

"ఏమిటో నీ సంగతి! బందరు మంచి ఉత్తరం వచ్చి ఎన్నాళ్లయింది! వెళ్లి రమ్మంటే వెళ్లక పోతివి! ఇంకా చిన్న

తనమా, నయానా భయానా చెప్పటానికి? నీపట్టు నీదే గాని చెప్పిన మాట విన్పించు కోక పోతే ఎట్లా?'' అంటోంది.

''నేను వెళ్లను వదినా, అంతే!''

ఆ రాత్రికి నిద్రపోగూడ దన్నారు. అప్పటికి కొంత వావు తప్ప ఏ దుష్ఫలితమూ లేక పోవటంతో విష సర్పం కాదని అందరికీ ధైర్యం కలుగుతోంది. మంత్ర వైద్యుడితో పాటు వచ్చిన చలమయ్య తోడు కూర్చున్నాడు. రెండో సినిమాకి— నిద్ర రాకుండా వుండటానికి—వెళ్దా మంటున్నాడు. రుక్మిణమ్మకూ నరసింహాలుకీ యిష్టం లేదు. చివరకు నరసింహాలు కూడా శ్రీధర్‌తో, చలమయ్యతో సినిమాకి బయల్దేరాడు....

ఇప్పుడు విషమెక్కి చని పోతే ఎలా వుంటుందీ? ఎంతో బావుంటుంది! అని వూహిస్తున్నాడు శ్రీధర్. మృత్యువుని గూర్చి ఆలోచిస్తూంటే అతనిలో దిగులేమీ కలగటం లేదు! జీవితం తనను కాటు వేసింది! ఆ రాత్రి జాగరణలో, చలమయ్య మాటల్లో, రుక్మిణమ్మ పరామర్శలో, అన్నయ్య కబుర్లలో పద్మమణి ధ్యాస ఒక లయగా వర్షిస్తూనే వుంది.!

17

రెండురోజుల తర్వాత అన్నయ్యనడిగి శ్రీధర్ పద్మమణి యింటికి అయిదువందల రూపాయలు పంపి వూరుకున్నాడు. వారం రోజులు గడిచాక స్కూల్లో సత్యం అతని దగ్గరకు వచ్చి ''అమ్మ వడ్డధర కనుక్కురమ్మంది'' అన్నాడు. శ్రీధర్ అతణ్ణి చూస్తూ రెండు క్షణాలు ఆలోచించి, చిరునవ్వుతో ''తెలీదు, ధరకట్టలేదు. మీ అమ్మనే తెలుసుకొని పంపించమను'' అన్నాడు. మరుసటిరోజు సత్యంవచ్చి ''అమ్మ మిమ్మల్ని రమ్మంది'' అని కబురు తెచ్చాడు. ''నాకివ్వాళ వీలుపడదు'' అని వెళ్లిపోయాడు శ్రీధర్.

ఒక నెలరోజులు గడిచాయి. సత్యం ఒకరోజు వంద రూపాయల నోట్లు తెచ్చి ''వడ్డడబ్బు, మీకివ్వమన్నది అమ్మ'' అంటూ యివ్వబోయాడు. శ్రీధర్ తీసుకోలేదు, ''నేను వచ్చి మాట్లాడ తానని చెప్పు'' అన్నాడు.

ఆ సాయంత్రం వెళ్లాడు.

''ఏమండీ..నెలాపంద్రెండు రోజులు.. లెక్క పెడు తున్నాను..రోజూ చూట్టమే వస్తారని...''

శ్రీధర్ మాట్లాడలేదు.

''డబ్బు వెనక్కి పంపించేశారేమిటి?'' అన్నది పద్మమణి.

''ధర అంతేనని ఎవరు తేల్చేరు?

''అందుకేగా మిమ్మల్ని రమ్మన్నదీ!...మీరు వస్తారని ఎదురు చూచింది!'' పద్మమణి అరమోడ్పు కన్నులతో, ఆకాంక్షతో చూస్తోంది.

''అది యివ్వాళకాదు, ఏళ్లతరబడి నాలో నా మనస్సులో పండిన పంట.''

''తెలుసు''

''దానికి నిన్ను ధర కట్టనివ్వను, నాకూ తెలీదు ధర'' ఏదో నిశ్చయం ధ్వనించింది ఆ మాటల్లో.

''అలాగే'' అన్నది పద్మమణి, వచ్చి దగ్గరగా నిల్చున్నది. ''ఆ పంటను నేను కోరటం...మిమ్మల్ని కోరటం...తప్పా? ఎందుకు సందేహించారు?'' అన్నది గోముగా.

శ్రీధర్ పద్మవైపు తదేకంగా చూస్తున్నాడు. అతని కన్నుల్లో ఆవేదన పద్మమణి గమనిస్తోంది.

''ఏమో నాకే తెలీదు! ఈ దీపశిఖలో జ్వలించి నశిస్తానో, అమరత్వం పొందుతానో!...నాకు నువ్వు కావాలి...నీలో లీనమై నేను లేకుండా పోవాలి....శరీరంతోకాదు, నా సర్వస్వంతో; నీతో కాదు, నీలోని నీతో...కాని శారీరకంగా దగ్గరకు రావటం శాశ్వతంగా దూరంగా పోవటమౌతుందేమో...జీవితం సృష్టించిన ఒక శూన్యం ఒక పంజరం నన్ను నీకు దూరంగా వుంచుతోంది...దాన్ని దాటలేని నా అశక్తత.....''

అతని కన్నులు అశ్రుపూరితాలయ్యాయి.

''ఏమిటండీ యిదంతా! మీదంతా అప్పటికీ యిప్పటికీ విచిత్రమే! నాకర్థం కాదు! పోనిద్దురూ....'' ఆమె చీరకొంగు తీసి అతని కళ్లమీద అద్దుతూ ''మీకెలా యిష్టమైతే అలానే వుండండి...మిమ్మల్నెవరు ఏమి అడిగారనీ!' అన్నది. శ్రీధర్ ఆమె చెయ్యి పట్టుకున్నాడు. ఆమె కిలకిలా నవ్వుతూ ''ఏం చెయ్య మంటారు మరి?'' అన్నది.

''నవ్వవద్దు.''

బాగుంది..మీతోపాటు?...నాకు కన్నీళ్లు రావు బాబూ!''

శ్రీధర్ ఆమెను తనవైపుకు లాగాడు. ఆమె అతని మీద వాలిపోయి వెంటనే చెయ్యి విడిపించుకుని దూరంగా పారిపోయింది.

శ్రీధర్ కుర్చీ మీదనుంచీ లేవలేదు. ఆమెవేపు తదేకంగా చూస్తున్నాడు. ఆమె అతనివైపు చూడకుండా అలమారా దగ్గరకు వెళ్లి ఏమిటో సర్దుతోంది, అతనికోసమే నిరీక్షిస్తూ. కొన్ని క్షణాల తర్వాత అతనివైపు తిరిగి చూచింది.

అతని ముఖంలో తీవ్రమైన ఆవేదన, కళ్లల్లో అభ్యర్థన, కాంక్ష ఆమె గుర్తించింది.

ఈసారి ఆమె అతని దగ్గరగా రాకుండా దూరంగా కుర్చీల కూర్చుని ''ఆరోజు ప్రశ్నలువేసి నాతో సమాధానాలు చెప్పించారు కాని, మిమ్మల్ని గురించి ఒక్కముక్కయినా చెప్పలేదు.భలే గడుసు దనం కదూ!'' అన్నది ఓరచూపులతో.

''చెబుతాను వింటావా? నువ్వెప్పుడూ నాయెదురుగా యిలా కూర్చోవాలనీ, నన్ను చూస్తూ వుండాలని వుంటుంది... నువ్వు నాకు దగ్గరగా వచ్చి, నన్ను తాకి తపోభంగం చెయ్యకూడదు. అలాచేస్తే నువ్వు నాకు దక్కవు...దక్కేది శరీరం మాత్రమే. అప్పుడు పెళ్లికి దీనికీ భేదం ఏమిటి?...పెళ్లి నీకూ అయింది, నాకూ అయింది!...అర్థం అవుతోందా? నాకు యీవరం యివ్వాలి నువ్వు!''

''మీనుంచీ నేనేమీ కోరటంలేదు!'' అన్నది పద్మమణి కోపంగా, ''మీ తపస్సు!..మీ తపస్సు ఎప్పటికైనా పూర్తి అవు తుందా? ముసలితనం వచ్చేలోగా?'' నవ్వుతోంది.

''ఇది నేను చెబుతానన్న ధర...నువ్వు యివ్వలేకపోతే పోనీ''

అనురసంధ్య

"నాకేం తెలుస్తుంది మీ గొడవ! మీ మాటలు నాకు అర్థమే కావటంలేదు, నిజం చెప్పాలంటే...పోనీ యిలానే మాట్లాడుతూ వుండండి యిష్టమైతే...నాకు అర్థం కావటంతో మీకు పనేమిటి? కాని మీ బాధేమిటి? జరిగిన వాటికి మనం చేసేదేముంది?"

శ్రీధర్ మాట్లాడలేదు...అవును, జరిగిన వాటికి మనం చేసేదేముంది? కాని జరుగుతున్న వాటి సంగతి?... అనుకుంటున్నాడు.

ఎవరో మెట్లెక్కి వస్తున్న ధ్వని.

"మా అమ్మా, పాపా" అన్నది పద్మమణి.

వెడల్పైన ముఖం, కళ్లకద్దాలు, పద్మమణి పోలికలున్న ఒక పెద్దావిడా, సన్నగా తెల్లగా ముద్దొస్తున్న పాపాయి వచ్చారు. పద్మమణి పరిచయం చెయ్యటంతో ఆవిడ శ్రీధర్‌ని తేరిపార జూచి తొట్రుపడుతూ 'నమస్కారం' అని, శ్రీధర్ ప్రతినమస్కారం చేస్తుండగానే లోపలికి వెళ్లిపోయింది. పాపాయి పద్మమణి దగ్గరికి వెళ్ళి ఒళ్లో ఎక్కికూర్చుంది.

"పేరేమిటి?" అన్నాడు శ్రీధర్.

"మాయ."

"ప్రపంచం మాయ, అందులో జీవితం, అనుభవం మాయ, అనికాబోలు!"

"అది మీ విషయం అనండి. మాకు అంతా నిజమే. అట్లాంటి వేదాంతాలు తెలీవు."

"ఏం వేదాంతాలూ?" అంటూ చలమయ్య అప్పుడే ప్రవేశిస్తూ అడిగారు.

"రండి, కూర్చోండి" అని కుర్చీ చూపిస్తూ పద్మమణి "అమ్మాయి పేరు మాయను గూర్చి. మాయ, వేదాంతం అంటున్నారు."

"మన మిత్రుడికి కాస్త బూర్జువా వేదాంతం ధోరణి వుందిలే" అన్నాడు చలమయ్య. తర్వాత శ్రీధర్ వైపు తిరిగి "ఏమిటి విశేషం? ఇక్కడ వచ్చి కూర్చుని కాలక్షేపం చేస్తున్నావే, బ్రదర్!" అన్నాడు.

ఆ ప్రశ్నలో చలమయ్య తనమీద అధికారమున్నట్టు ధ్వనిస్తుండటమే కాదు, దానిలో గర్వితమైన నీచత్వానికి శ్రీధర్ అసహ్యించుకున్నాడు. ఆతనికి పద్మమణి మీద కోపం వచ్చింది, ఆమె చలమయ్యను యింటికి రానిస్తూ గౌరవిస్తున్నందుకు. చలమయ్యవైపైనా చూడకుండా పద్మమణిని పలకరించకుండా, లేచి బయటకు వచ్చేశాడు.

మరుసటిరోజు స్కూల్లో చలమయ్య శ్రీధర్‌తో అన్నాడు: "ఏమిటయ్యా మాటాపలుకూ లేకుండా అలా పారిపోయి వచ్చేశావ్. రెండు నిమిషాలాగితే నేనూ వచ్చేవాణ్ణికదా! ధాన్యం డబ్బు కోసం యిక్కడున్నావని అంటే పోయేదేముంది! నాకు తెలీదా నువ్వెలాంటి వాడివైందీ! అయినా జాగ్రత్తగా వుండటం మంచిది. నీ డబ్బు నీకు ముట్టిందా? దాని మాయలో పడేవు జాగ్రత్త!"

శ్రీధర్ సందేహించాడు.

"ఏమిటి పలకవు? నీ యిష్టంబాబూ, మళ్లీ చెప్పలేదనేవు!"

శ్రీధర్ కోపంతో కుంచించుకుపోయాడు.

ఇది జరిగిన పదిరోజులకు శ్రీధర్ స్కూల్లో వుండగా ఓబయ్యగారు వచ్చి "శ్రీధర్ మీ మామగారూ, తారా, పిల్లలూ వచ్చారు, ఇంటికి వెళ్దాంరా.' అన్నాడు.

"ఎప్పుడు? ఏరీ? ఉత్తరంలేదే!" ఆశ్చర్యపోయాడు శ్రీధర్.

"పాపకు మూడోనెల కదోయ్! నాకు ఉత్తరం వ్రాశాటు ఎప్పుడు రావాలని. మంచిరోజు చూచుకుని మీరే వచ్చెయ్యండి అని సమాధానం వ్రాశాను. ఇవాళ దిగుతారని నాకూ తెలీదు. తెలిస్తే ముందే వచ్చి నీతో చెప్పేవాణ్ణి" అన్నాడు.

శ్రీధర్ హెడ్మాస్టరు దగ్గర సెలవు తీసుకుని ఓబయ్య మామతో బయల్దేరాడు. తార చేసిన అన్ని పనుల్లాగే వుంది యిది కూడా! వెళ్లి ఓబయ్యమామ యింట్లో దిగటం! వెంకయ్యగారికైనా ఆమాత్రం యింగితజ్ఞానం లేకపోయిందా? లేకేం? ఉండే చేస్తున్నారు.

శ్రీధర్‌ని చూడగానే మంగమ్మత్త గట్టిగా వాటేసుకుంది: "ఎన్నాళ్లకో! నన్ను బొత్తిగా మరిచే పొయ్యావు సిరీ! అంతగా బడి దగ్గరకొచ్చి పిలిచిందే అత్త, చూసొద్దామనే మనసే లేకపోయె నీకు...నేను చచ్చినా అంతే కద!" అంటూ ఏడుస్తోంది..శ్రీధర్ కేంచెయ్యాలో తెలీలేదు...."తీరిక లేదు" అని గొణిగి మెల్లిగా వదిలించుకున్నాడు.

లోపల్నుంచి అప్పుడే స్నానంచేసి బట్టలు ధరించి వచ్చాడు వెంకయ్యగారు. ఓబయ్యమామ ఆయన వెనకాలే స్వరాజ్యాన్ని ఎత్తుకుని వచ్చాడు. ఈ ఏడెనిమిది మాసాల్లో స్వరాజ్యం పెరిగింది. ఆ పిల్లను చూడగానే శ్రీధర్ హృదయం విచ్చుకుంది. "రా" అన్నాడు చేతులు చాచి. సందేహించకుండా శ్రీధర్‌వైపు వాలింది. చేత్తో అతని చెంపా నుదురూ తడుముతూ పరీక్షగా చూస్తోంది.

వెంకయ్యగారు శ్రీధర్‌ని పలకరించలేదు. శ్రీధర్ కూడా ముభావంగా వున్నాడు. ఓబయ్య "శ్రీధర్, కాళ్లూ చేతులూ కడుక్కో, భోంచేద్దాం" అన్నాడు...."నా భోజనమైంది. భోంచేసే స్కూలుకు వెళ్లాను." అన్నాడు..."మీరు లేవండి అన్నగారూ" అన్నాడు ఓబయ్య వెంకయ్య నుద్దేశించి. ఆయన ఇంటి పైకప్పును చూస్తూనే "ఊఁ" 'అన్నాడు.

ఓబయ్యా, వెంకయ్యా భోజనం చెయ్యటానికి లోపలికి వెళ్లాక మంగమ్మ పాపని పొత్తిళ్లతో తెచ్చింది. స్వరాజ్యాన్ని దించి శ్రీధర్ కొత్త పాపాయిని ఒళ్లోకి తీసుకున్నాడు. ఈ పాప తెల్లగా సున్నిపిండి వుండలావుంది. చిన్నముక్కు. నిద్రలోవుంది. స్వరాజ్యం తనని దించినందుకు ఏడుపు లంకించుకుంది. మంగమ్మ ఆ పిల్లను ఎత్తుకుంది..."పేరు ధనలక్ష్మి" అన్నది.

"ఎవరి నడిగి పెట్టారు?"

"హుష్....ఉరుకో..మళ్లీ మొదలెట్టకు..."

"ధన ఏమిటి? లక్ష్మి చాలదనా?"

"నువ్వలానే పిలుచుకుందుగానిలే!...ఓపికపట్టు... మళ్లీ రగడ పెంచుకోబోకు"

శ్రీధర్‌కు ఆ సలహా న్యాయంగానే తోచింది. ఒకవిధంగా అతని పంతం నెగ్గనే నెగ్గింది. అతను వెళ్ళలేదు, తారను రమ్మని వ్రాయలేదు. తార స్వయంగా వచ్చింది. ఇప్పుడు తనెందుకు గొడవ పెట్టుకోవటం అనవసరంగా?...

భోజనంచేసి వెంకయ్య విశ్రమించాడు. శ్రీధర్‌ను పలకరించనేలేదు. ఆడవాళ్ళు భోంచేస్తూ వుండగా ఓబయ్య, శ్రీధర్, స్వరాజ్యంచేత మాటలు చెప్తిస్తూ కూర్చున్నారు.

చివరికి తార దర్శనమిచ్చేటప్పటికి, శ్రీధర్ ఆమెలో వచ్చిన మార్పు గమనించాడు. శరీరం నీరు పట్టింది. ముఖంలో అస్వస్థత తాలూకు అస్వాభావికమైన మెరుగు కన్పిస్తోంది...భార్యాభర్తల్ని వదిలి ఓబయ్యా మంగమ్మా ఏదో నెపం మీద చెరోవైపూ తప్పుకున్నారు.

''పాపాయి ఎలావుంది?'' అని అడిగింది తార.

''నీకు నచ్చేలా వుంది'' అన్నాడు.

''మీకు నచ్చలేదా?''

''ఉత్తరం వ్రాయకుండా పెట్టకుండా దిగావే, కారణం?''

''అక్కడెంత కాలం వుంటాను?'' ఆమె ఆమాట అన్నతీరు శ్రీధర్‌కు తృప్తి కలిగించింది. ఆమె మీద సుముఖత్వం ఏర్పడింది.

''వచ్చినదానివి యిక్కడ దిగటమెందుకు?''

తార సమాధాన మివ్వలేదు.

''ఇంకో గంట తర్వాత, ఎండ తగ్గాక, బండీ తెస్తాను యింటికి వెళ్దాంపద''

''పిన్ని నడగండి.''

''ఆమె నడగట మేమిటి? ఇది మన విషయం''

''అవును. ఆమె నడగటం మంచిది''

అవతలి గదినుంచీ వింటూ వుందోఏమో మంగమ్మ ప్రవేశించి అందుకున్నది. ''అలా చక్కగా మాట్లాడుకోవాలి..ఎన్నాళ్ళయింది!..మీకు ఏం విందు చెయ్యాలా అని ఆలోచిస్తున్నాను. ఏమయ్యా ఈ పూటకి మామూలు భోజనమే అనుకో, రేపు విందు చేస్తాను....పిల్లకీ ప్రయాణబడలిక తగ్గుతుంది..''

''మేము యింటికి వెళ్తాము. కావలిస్తే తర్వాత తీరిక చూచుకుని ఒకరోజు విందుకు వస్తాము.'' అన్నాడు శ్రీధర్.

''ఏమిటేమిటీ? నాసంగతి తెలిసేనా యిలా మాట్లాడుతూవుంది?...తారా, నువ్వూ ఎక్కడికి వెడతారు?...ఇల్లు! ఇల్లు! ఎక్కడయ్యా నీ యిల్లు? పంచుకున్న తర్వాత కూడా యింకా నువ్వైతే చూరుపట్టుకుని ఊగులాడుతూ వున్నావుగాని, ఆపంచనే అమ్మాయీ బిడ్డలూ కూడా ఎందుకు? వాళ్ళ దయా ధర్మం ఏమి ఖర్మ? మాటకు రీతీపాతీ వుండాలి!''

''నీ సలహా, ఉద్దేశమూ ఎవరూ అడగలేదులే'' అన్నాడు శ్రీధర్.

''అమ్మాయి రానేరాదు. పో, ఏంచేస్తావో చేసుకో, పో'' అన్నది మంగమ్మ.

తార ఆమెను వారిస్తూ ''నువ్వేళ్ళు పిన్నీ! ఆయన యిష్టం ఎలానో అలాగే చేస్తారు'' అన్నది.

మంగమ్మ ముక్కుమీద వేలేసుకుని విస్తుపోయి తారను చూస్తూ నిలుచుని ''అందుకే అలూమగల పోట్లాట అద్దం మీద ఆవగింజ అన్నారు...నాదే బుద్ధితక్కువ..'' అని విస విసా లోపలికి వెళ్లిపోయింది.

''ఏమండీ పిన్నికి కోపం వస్తుంది. మనం వీళ్ళకి రెండు వేలు యివ్వాలి కూడాను. ఎందుకీ పంతాలూ కోపాలూ? నాకు వంట్లో బాగులేదు. ఇంజక్షన్లు తీసుకుంటున్నాను. పూర్తి కాకుండానే వచ్చేశాను. నాకు మనిషి సాయంలేంది జరగదు. మీ వదినెకీ ఎడ పిల్లాడు. ఇక్కడే వుంటే పిన్ని చేస్తుంది. ఆలోచించండి. మీ యిష్టం....'' తార ఆ మాటలు అంటూనే ఏడ్చేసింది. చీరకొంగు తీసి ముఖం దాచుకున్నది.

తారలో వచ్చిన మార్పుకు శ్రీధర్ అప్రతిభుడయ్యాడు. అనుభవాన్ని మించిన గుణపాఠం వుండదు కాబోలు ఎవరికీ! అనుకున్నాడు. అతనికి తార ఆరోగ్యాన్ని గూర్చి ఆదుర్దా కలిగింది. ఆలోచిస్తే అక్కడినుంచి వెళ్ళే ప్రసక్తి అప్పటికి వాయిదా వేయటమే మంచిదని తోచింది.

ఆ సాయంత్రం యింటికి వెళ్లి రుక్మిణమ్మతో తారా, వెంకయ్యగారూ వచ్చిన సంగతి చెప్పాడు. తారలో వచ్చిన మార్పుని గురించీ, జరిగిన సంభాషణను గురించీ చెప్పాడు. రుక్మిణమ్మ సంతోషం వెలిబుచ్చుతూ ''నువ్వింకనైనా పంతాలకు పోకు! మీరు సుఖంగా వుండటమే మాకు కావలసింది! తార యిక్కడికి వచ్చినా రాకపోయినా నువ్వు సంసారంతో అక్కడ వాళ్ళింట్లో వుండటం కంటె నాలుగురోజులు పోయాక వేరుగా ఒకయిల్లు తీసుకుని వుండటం మంచిది. వాళ్ళు పేచీ మనుష్యులు, ఎప్పటికేంచేస్తారో తెలీదు!'' అని సలహా యిచ్చింది.

మరునటి రోజే వెంకయ్యగారు వెళ్లిపోయారు—శ్రీధర్‌ను పలకరించకుండానే.

తార కారణంగా శ్రీధర్ నివాసం మొదట్లో కొన్నాళ్ళు అనిశ్చితంగా వుండి పోయింది...మధ్యాహ్నాలు సాయంత్రాలు ఓబయ్య యింట్లో,రాత్రి భోజనమూ పడకా అన్నయ్య యింట్లో ప్రొద్దున్నే తొమ్మిదిన్నరకి భోంచేసి స్కూలుకి వెళ్ళి మధ్యాహ్నమూ సాయంత్రమూ ఓబయ్య యింట్లో గడిపి, వేళ మించితే అక్కడే భోంచెయ్యడమూ లేకపోతే యింటికి వెళ్ళడమూ చేస్తున్నాడు. ఒకరోజు సాయంత్రం స్కూలునుంచి శ్రీధర్ ఓబయ్య యింటికి వెళ్ళేటప్పటికి అతనికి తన పడకా, పెట్టె, మేజా, కుర్చీ, పుస్తకాల బీరువా కనిపించాయి...''నేను వెళ్లి మీ వస్తువులు పట్టుకొచ్చేశాను, మీరు అక్కడికీ యిక్కడికీ తిరుగుతూ యిబ్బంది పడటం చూడలేక'' అన్నది తార.

''నాకెందుకు చెప్పలేదు? నాతో చెప్పకుండా ఎందుకు చేశావ్?'' అని గద్దించాడు శ్రీధర్.

అతని కోపానికి తార నివ్వెరపోయింది. భయపడిపోయింది.

''ఏమిటి మాట్లాడవేమిటి? నువ్వు తప్ప నాకెవ్వరూ లేరనుకున్నావా?'' అన్నాడు శ్రీధర్.

''నేను..నేను...కాదు ఆవిడే తీసుకువెళ్ళమంది!...'' తార మెల్లగా గుక్క తిప్పుకుంటూ, ''నాకేం పట్టింది? చూసొద్దామని వెళ్ళాను...మీరే నిత్యమూ పోరుతున్నారుగా వెళ్లిరమ్మని...

'యిబ్బంది ఎందుకు, మీ ఆయన సామాన్లు పట్టుకెళ్ళు' అని అప్పటికప్పుడు జీతగాడి చేత బండి కట్టించి పంపింది....''

''ఎవరు?'

''మీ వదినె! ఇంకెవరు?''

శ్రీధర్ తర్వాత ఏమీ మాట్లాడలేదు.

''ఇవి ఆ పక్క గదిలో సర్దమంటారా?'' అని అడుగుతోంది తార.

స్వరాజ్యాన్ని ఎత్తుకుని వాకిట్లోకి పోతూ శ్రీధర్ ''నీ యిష్టం'' అన్నాడు.

అతనికి అక్కడ వుండటానికి మనస్కరించటంలేదు. కాని ఒకవైపు వదినె తన సామాను పంపించి వెయ్యటం అతని హృదయాన్ని రంపపుకోత కోస్తోంది. ఒకవేళ తార అబద్ధం చెబుతోందేమో! వెళ్ళి నానా గొడవా చేసి సామాను పట్టుకొచ్చిందేమో! ఈ ఊహరాగానే స్వరాజ్యాన్ని యింట్లోవదిలి, అన్నగారి యింటికి నడిచాడు శ్రీధర్.

శ్రీధర్‌ను చూడగానే రుక్మిణమ్మ ''పాపా తారా వచ్చారు. పాప ముద్దుగావుంది.'' అన్నది.

''అవును, నేను చాలా అసహ్యంగా వున్నాను.''

''అంటే?...నీకేం లోటూ!''

''లోటులేనిదే! పెట్టే పడకా వీధిలో పారేసి వెళ్ళిపొమ్మన్నావటగా.''

''యిబ్బందిగా వుంటుందని పంపాను.''

''తనే అడిగిందా? నువ్వే తీసుకు వెళ్ళమన్నావా? అది నాక్కావలిసింది....''

రుక్మిణమ్మ అతని ముఖ కవళికలు పరీక్షించి ''అదేమిటి? అడిగితే ఏం? అడక్కపోతేనేం? నీ ధోరణి నాకేం బాగులేదు!... నీ సంసారం నువ్వు దిద్దుకోవాలిగాని ఎన్నాళ్ళు గడిచినా పోట్లాటలూ పంతాలూనేనా? పెళ్ళాం పిల్లలూ అక్కడా, నీ పడక యిక్కడా అయితే, లోకం ఏమంటుందీ? మేము నీకు లేనిపోనివి నేర్పి నిన్ను వాళ్ళకు దూరంగా వుంచుతున్నామనదూ? అయినా నీకేం సుఖం?....నే నిదివరకే చెప్పాను కదా...ఆ పిల్ల యిక్కడికి వచ్చి వుండదు, ఆ అదృష్టం దాటిపోయింది. వేరే యిల్లు తీసుకుని వుండటం నీకు సుఖం...ఆ ప్రయత్నమేదో అది చెయ్యకుండా నామీదా నీ భార్య మీదా పంతాలు వేసుకుంటే లాభంలేదు....'' అన్నది.

''అయితే యిక నీ యింటి గడప తొక్కొద్దంటావా?''

''అని నే నంటానా? నిన్ను నా పెద్దకొడుకుగా పెంచి పెద్దచేసి ఆమాట అంటానా? అంటానని ఎట్లా అనుకుంటావు?'' రుక్మిణమ్మ కంఠం రుద్ధమైంది. ''ప్రాప్తం లేదు, అంతే. రాత ఎలావుంటే అలా అవుతుంది...ఎక్కడున్నా సుఖంగా వుంటావనే కదా యింతా చెప్పటం...రా, తిను, వుండు, కాని మాకోసం నీ సంసారాన్ని కాదనుకుంటే నిన్నందరూ పిచ్చివాడి కింద జమకట్టరా? అదిగో దాని పెత్తనం, మరది సంసారాన్ని ముక్కలు చేసింది అని అందరూ నన్ను తిట్టిపొయ్యరా?..... నా కడుపున పుట్టిన వాడికైనా నేనామాటే చెబుతాను!''

శ్రీధర్ ఆలోచిస్తూ కూర్చున్నాడు. వదినె ఎన్నోరకాలుగా అతని కర్తవ్యాన్ని మళ్ళీమళ్ళీ బోధిస్తోంది. శ్రీధర్ వదినె కొడుకుని వళ్ళో పెట్టుకుని వింటున్నాడు బరువెక్కిన హృదయంతో.

నరసింహులు వచ్చాడు. పరిస్థితి తెలుసుకొని అతనుకూడా భార్య చెప్పిన మాటలే చెప్పాడు. ధాన్యం మొదలు, ఇంట్లో సామానూ వగైరా తమ్ముడి సంసారానికి కావలసినవన్నీ పట్టుకుపొమ్మని చెప్పాడు. రుక్మిణమ్మ మాత్రం మొదట వేరుగా యిల్లు చూచుకుని తర్వాత పట్టుకుపొమ్మని చెబుతోంది.

నరసింహులు వ్యవసాయం సంగతి కూడా ప్రస్తావించాడు. శ్రీధర్‌కు వచ్చిన వాటాలో కొంతభూమి ఓబయ్య పొలముతో కలిసేదిగా వుండటం వలన అది ఓబయ్య చేస్తేనే బాగుంటుందనీ, మిగతా భూమికూడా తను చెయ్యమంటే చేస్తాననీ, లేకపోతే ఓబయ్యే చెయ్యవచ్చుననీ వివరించాడు.

''ఏమో నాకు తెలీదు, నువ్వే ఏర్పాటు చెయ్యి'' అన్నాడు శ్రీధర్.

18

''ఇంగ్లీషు లెక్చరరు శేషాద్రి సన్యాసం పుచ్చుకుని వచ్చాడట. ఆత్మానందస్వామి అంటూ కొత్త పేరుతో వేషంతో తయారయ్యాడట. ఈ థియాసఫిస్టులు ఏం రంగులు ఫిరాయిస్తారయ్యా! సన్యాసి అయినవాడు ఏ మఠంలోనో భంగుతాగుతూ కూర్చోక మళ్ళీ కుర్రాళ్ళలోకి రావటమెందుకూ? వాళ్ళకి బూర్జువా మత్తుమందు పొయ్యటానికి రియాక్షనరీ ప్రోపగాండాకి కాకపోతే! పాఠం పదిహేను నిముషాలూ, మిగతా ముప్పావు గంటా వెధవ వేదాంతం కబుర్లూ...''అంటున్నాడు చలమయ్య టీచర్సు రూములో.

''ఎవరు చెప్పారు? పాతకాలం మనిషి! రెండేళ్ళయింది కదూ! కూతురు లేచి పోవటంతో ఊరినుంచి వెళ్ళిపోయాడు, యికరాడనే అనుకున్నాం. మళ్ళీ ఎందుకొచ్చాడో! అయితే సన్యాసం పుచ్చుకున్నాడా? కాషాయగుడ్డలూ....అవీ?'' అని అడుగుతున్నాడు మరొక టీచరు.

''ఆc..నిన్నను నా ప్రాతశిష్యుడొకడు కాలేజి స్టూడెంటు కనిపించి, యీ సన్యాసినే గొప్పగా వర్ణించాడు. 'జీత మక్కరలేదు, నాకు హాస్టలులో తిండి పెడితేచాలు, నా కిష్టమున్నన్నాళ్ళూ పాఠాలు చెబుతాను' అని తిరిగి వచ్చాడట. ఆహా! ఎంత త్యాగం, ఎంత త్యాగం అంటూ పరవశించిపోతున్నాడు యీ కుర్రవెధవ! అది కాదోయ్ అసలు థియాసఫీ అంటేనే దగా. ఇంగ్లీషువాళ్ళు మనదేశంలోని చచ్చుసమ్మకాల్నీ మతాన్నీ ఇంపీరియలిజంకు అండగా నిలబెట్టుకోటానికి బెసెంటు ద్వారా పన్నిన పన్నాగం అన్నమాట. వాళ్ళతో ఇండియన్ కాపిటలిస్టులు చేతులు కలిపారు.—అడయారులో వుండే వాళ్ళెవరు? తెల్లవాళ్ళూ, కేపిటలిస్టులూ, వాళ్ల తొత్తులు శేషాద్రిలాంటివాళ్ళూ....తేరగావస్తే బాగుంది తెమ్మని తప్పక చేర్చుకుంటారు. వీడైనా రాక ఎక్కడికి చస్తాడు? ఏదో కాషాయగుడ్డలు వేసుకుంటే, కూతురువల్ల వచ్చిన అప్రతిష్ఠ కొంతవరకు మూసిపెట్టుకోవచ్చు అని వీడి తాపత్రయం, అంతకంటె ఏమీలేదు! ముసలి నక్క!!'' అంటున్నాడు చలమయ్య.

చలమయ్య యీమధ్య కమ్యూనిస్టు ప్రచార భావాన్ని విరివిగా వెదజల్లుతున్నాడు తీరిక సమయాల్లో. నెహ్రూని ఇంగ్లీషు అమెరికన్ కేపిటలిస్టుల ఏజెంటు అనటం, కాన్‌స్టిట్యూషన్‌ని విప్లవాత్మకంగా లేదనటం మొదలైన రాజకీయపు చిలక పలుకులు వినబడుతూనే వున్నా ఒకరిద్దరు వాదించటం తప్ప పట్టించుకోలేదు. కాని శేషాద్రి మీద యీవిధంగా దుర్భాషలాడటం చలమయ్యలోని నీచత్వాన్ని శ్రీధర్‌కు దుర్భరం చేసింది. అంతవరకూ విని, యిక వినలేక లేచి వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం స్కూలు అవగానే యింటికి వెళ్ళకుండా దారిలో హోటల్లో కాఫీ త్రాగి శ్రీధర్ కాలేజివైపు వెళ్ళాడు. అక్కడ అక్కడ కుర్రాళ్ళు కనిపిస్తే శేషాద్రి గారెక్కడుంటున్నదీ అడిగి తెలుసుకున్నాడు. "ఆయనకు ఆల్‌కాట్ బంగళా మేడమీద పెద్ద గది యిచ్చారు. ఎప్పుడూ అక్కడే వుంటారు. వెళ్ళినవాళ్ళతో ఎక్కువ సేపు మౌనంగా వుండటం తప్ప మాట్లాడటం తక్కువ. క్లాసులకు వచ్చినప్పుడే ఏమైనా మాట్లాడటం ఎవరైనా మధ్యాహ్నం యింటర్వెల్‌లో లైబ్రరీలో కలుసుకోవచ్చు" అన్నాడు. హాస్టలుల వుంటున్న విద్యార్థి.

శ్రీధర్ ప్రయత్నం విరమించుకోలేదు. ఆల్‌కాట్ బంగళా వైపు నడిచాడు..

శేషాద్రిగారు—ఆత్మానందస్వామి—తివాసీమీద కూర్చుని దిండుకు అనుకుని చదువుకుంటున్నాడు. శ్రీధర్ వెళ్ళి ఎదురుగా నిలుచుంటే, తలెత్తి చూచి చిరునవ్వుతో తివాసీ మీద కూర్చోమని సౌంజ్ఞచేసి, పుస్తకంలో మళ్ళీ లీనమయ్యాడు. పది హేను నిముషాలు నిశ్శబ్దంలో గడచిపోయాయి. శ్రీధర్ ఆయన్ని తదేకంగా చూస్తున్నాడు—చూచేకొద్దీ హృదయంలో దుఃఖం, అప్యాయత, గౌరవం, భక్తి సమ్మిశ్రితమైన ఉద్వేగం అనుభవిస్తున్నాడు.

చివరకు ఆత్మానందస్వామి పుస్తకం మూసివేసి, శ్రీధర్ వైపు తిరిగాడు...కొన్నిక్షణాలు నిదానించి చూచి "శ్రీధర్ కదూ.. ఏం చేస్తున్నావు?" అన్నాడు. "బోర్డుహైస్కూలులో టీచరుగా చేరాను...ఏడాదిన్నర అయింది" అని సమాధాన మిచ్చాడు శ్రీధర్.

ఆత్మానందస్వామి చిరునవ్వుతో తలపంకించాడు.

"మీరు మారిపోయారు" అన్నాడు శ్రీధర్.

స్వామిజీ తల అడ్డంగా ఊపి "లేదు...మారేది జీవితం, ప్రపంచం, నేను కాదు. నువ్వు కాదు...ఆ కిటికీ తలుపులు తియ్యి" అన్నాడు.

శ్రీధర్‌లేచి స్వామి కెదురుగా తనకు వెనుకగావున్న కిటికీ తలుపులు తెరిచాడు. అస్తమిస్తున్న పడమటి సూర్యుడి కిరణాలు గదిలో ప్రవేశించాయి. కిటికీ బాగా క్రిందుగా వుండటంతో వాళ్ళు నేలమీద కూర్చునివున్నా కిటికీ అవతలి దృశ్యం, చెట్లూ, ఆకాశం, చక్కగా కనిపిస్తోంది...శ్రీధర్ ఓరగా కూర్చున్నాడు—కుడివైపు స్వామిజీని, ఎడమవైపు కిటికీని చూసేందుకు వీలుగా..

"కిటికీ అక్కడే వుంది. తలుపులు మాత్రమే తెరువబడినై" అన్నాడు స్వామిజీ.

శ్రీధర్‌కు ఆయన మాటలు ప్రోత్సాహం కలిగించాయి.

"మీ శిష్యుణ్ణి నేను—కేవలం మీదగ్గర చదువుకోవటం వల్లేకాదు, మీ ఉపదేశం పొందటంవల్ల కూడా రెండేళ్ళ క్రితం ఆధ్యాత్మికంగా కూడా మిమ్మల్ని గురువుగా ఆశ్రయించాను. మీరు స్వీకరించారనే నా విశ్వాసం. ఈ రెండేళ్ళూ మీదర్శనం లేకపోవటం నా దురదృష్టం—మళ్ళీ మీరిక్కడికి రావటం నా భాగ్యం" అనుకోకుండానే ఆ మాటలు అలా వచ్చేయి. శ్రీధర్ తనని గూర్చి యిలా నివేదించుకోవాలని ఎప్పుడూ ఊహించుకోలేదు. ఆక్షణంలో అలా అనటంలో ఏదో ఆత్మసంతృప్తి అనుభవించాడు.

"ఏం జరిగింది?" అని ప్రశ్నించాడు స్వామిజీ.

శ్రీధర్ తన కుటుంబంలో వచ్చిన మార్పునీ, తన ఆదర్శాల వైఫల్యాన్నీ, తనహృదయక్షోభనీ వివరించాడు.

"తలుపులు తెరవబడటం— సంకెళ్ళు వదలిపోవటం— అది బాధగానే కనిపించినా, అంతకంటెమార్గంలేదు విముక్తికి" అని వ్యాఖ్యానించాడు స్వామిజీ.

"నాకర్థం కావటంలేదు... జీవితం నుంచి పారిపోవాలనుకోవటం పిరికితనం కాదా?"

"అవును..ఎందుకు పారిపోవటం? సాధనకోసం అవసరమైతే కొంతకాలం దూరంగా వెళ్ళవచ్చు. కానివిముక్తి అనేది పారిపోవటం ద్వారా రాదు! వచ్చినట్లు కనిపిస్తే అది మార్పు మాత్రమే, నిజమైన విముక్తికాదు. మనిషిలోని 'వాసనలు' కల్పించేది జీవితం ఆ జీవితంలో, నుంచే ఆ' కల్పన' ని సమంగా దర్శించటం ద్వారానే 'వాసన'లకు స్వస్తి, అప్పుడే విముక్తి. అందుకు అడ్డదారి (Short cut) ఏమీలేదు."

"విముక్తి అంటే ఏమిటి?...శూన్యమా? క్రితంసారి నాకు మీరిచ్చిన ఉపదేశం,' ప్రేమించమని. ప్రేమను పెంచుకుని యితరులతో దాన్ని పంచుకొమ్మని...నాకు కలిగిన అనుభవం నాప్రేమ యీలోకంలో ఎవరికీ అక్కర లేదని..కాని కాని నా విశ్వాసాన్ని నేను వదులుకోలేను... మరి విముక్తి అంటే ఏమిటో నేనూహించలేకుండా ఉన్నాను."

స్వామిజీ కొన్ని నిముషాలు మౌనంగా ఉన్నాడు. "ప్రేమ. ప్రేమ... ప్రేమించమని అప్పుడు ఉపదేశించానా? అవును' అప్పుడు నాకంతే తెలుసు!" తర్వాత నవ్వుతూ లేచాడు..."పైకి పోదాంపద; సూర్యుడు అస్తమించాడు. సంధ్య చాల రమణీయంగా వుంది..."అన్నాడు.

ఆమాటల్లో ఒకనాటి రసోన్మాదియైన శేషాద్రి మళ్ళీ దర్శనమిచ్చాడు శ్రీధర్‌కు.

పైకి వెళ్ళిన తర్వాత డాబామీద యిటునటూపచారుచేసి స్వామిజీ ప్రకృతిని చూస్తూ ఆకాశంలోని రాగరేఖల్ని చూస్తూ నిలిచిపోయాడు చాలాసేపు. పున్నమి చంద్రుడు మెల్లగా పైకెగ బ్రాకు తున్నాడు...

ప్రక్కనే నిలబడి ఉన్న శ్రీధర్ భుజంమీద చెయ్యివేసి స్వామీజీ "శ్రీధర్ మనం సంకెళ్ళని ప్రేమిస్తాము, ఆ సంకెళ్ళ అవతలఉన్న సత్యాన్ని అందుకోవటానికి సంకెళ్ళు అడ్డం; సంకెళ్ళు

అంటే ఆదర్శాలు, మనుషుల్ని గూర్చిన మన అభిప్రాయాలు; యివి మనలో కల్పించే రసోన్మాదమే ప్రేమగా భ్రమిస్తాము. సంకెళ్ల నుంచీ విముక్తిపొంది చూడగలిగితే గాని ప్రేమకు సిద్ధి లేదు. విముక్తి శూన్యంలాగే ఉంటుంది. కాని అది వెలుతురు; తలుపులు తెరిస్తే వెంటనే కళ్లు వెలుగుని భరించలేక, మరే వస్తువునూ చూడలేక బాధపడి, కుంచించుకు పోయినట్లు, మాయ తొలగి పోయే అనుభవమూ బాధగానే ఉంటుంది. ప్రేమ శూన్యంగానే ఉంటుంది. బాధేమిటి?—సర్వం ఆ శూన్యంలో లయించినట్లే ఉంటుంది! కాని క్రమంగా ఆవెలుగుకి అలవాటు పడవచ్చు; దాని ద్వారా స్పష్టంగా చూడవచ్చు లోకాన్ని. అలవాటు పడటంకాదు ఆవెలుగులో ఐక్యంకావచ్చు..ప్రేమ, సత్యం అన్నీ పృథఃకరణ చెందిన ఆవెలుగే; చివరకు ఆవెలుగులో అవి లయించక తప్పదు. అదే విముక్తి!"

క్రిందికి దిగి వచ్చారు. కాని శ్రీధర్ మనస్సులో సందేహాలు సందేహాలుగానే వుండి పోయాయి. క్రిందికి వచ్చాక స్వామిజీ యిలా అన్నారు' గురు శిష్య సంబంధంలో ఒక రహస్యం వుంది. శిష్యుడికి చేయి అందించగల మెట్టులో గురువూ, గురువు చేయి అందుకోగల మెట్టులో శిష్యుడూ వుంటారు. ఇదీ యధార్థమైన సంబంధం; యిలా లేనిది యాదృచ్ఛికమైనదీ, తాత్కాలికమైనదీ మాత్రమే అవుతుంది. శిష్యుడికి చేయూత నివ్వటంలోనే గురువు తన సాధనని పూర్తి చేసుకోవటానికి వీలవుతుంది; లేకపోతే అతనికి పురోగమనం వుండదు..."

"నాకు చాల సందేహాలున్నాయి..."

"అవును అవి ఒక రోజులో తీరేవి కావు" అన్నాడు స్వామిజీ. ధ్యానానికి వేళవుతూందని, మరునటిరోజు రమ్మని ఆహ్వానించాడు శ్రీధర్ను.

శ్రీధర్ స్వామిజీ మాటల్ని తన జీవితానికి అన్వయం చేసుకోటానికి ప్రయత్నించాడు. విఫలుడయ్యాడు. ప్రగాఢమైన విశ్వాసాలు లేకపోవటం (చంద్రావతి ఉదంతం), ఉన్న విశ్వాసాలని నిలుపుకో లేక పరిస్థితులకు బలి యివ్వటం (సమిష్టి కుటుంబ విభజన విషయం) తన సమస్యగా ఉంటున్నప్పుడు, విశ్వాసాల శృంఖలాల్ని వదిలించుకొని వెలుగులోకి నడవ మంటున్నాడు తన గురువు.

విశ్వాసాలను వదలు కుంటే శూన్యమూ, పతనమూ తప్ప మరేమిటి?

'నేను' మారదు, జీవితమే మారుతుంది. అంటాడు స్వామిజీ. జీవితం కల్పన, మాయ. 'నేను' అనేదాన్ని జీవితం నుంచీ వేరుచేసి ఎలా చూడటం? ఆరెండింటికీ విభేదం చాల కృత్రిమంగా అసాధ్యంగా కనిపిస్తోంది తనకు!

పోతే, జీవితం యధార్థం, దాని మీద అధికారం ఉండాలి వ్యక్తికి అంటుంది పద్మమణి. జీవితం మీద అధికారం లేకపోవటమే, పట్టు తప్పిపోవటమే అనర్థాలకు కారణం అన్నది చంద్రావతి. స్వామిజీ జీవితం మాయ అని త్రోసి పుచ్చుతున్నారు! ఈ అభిప్రాయాలకు సమన్వయం తనకు కుదరటం లేదు!

మరునటి రోజు శ్రీధర్ తన మొదటి సందేహాన్ని— విశ్వాసాల శృంఖలాలను గూర్చి— స్వామిజీని ప్రశ్నించాడు. ఆయన యిలా అన్నాడు. "నీవిశ్వాసాలను వదులుకొమ్మని నేను చెప్పలేదు. కొంత ఆత్మ పరామర్శతో ఆ ప్రసక్తి తెచ్చాను. నీకొక వ్యక్తి జీవితాన్ని గూర్చి చెబుతాను విను— యౌవనంలో భార్యను ప్రేమించాడు, ఆరాధించాడు. ఆమె ఉన్నట్లుండి మరణించింది. మనో వైకల్యం ప్రాప్తించింది అతనికి. అప్పుడు థియాసఫిస్టులతో పరిచయం కలిగింది.—వాళ్ల 'సియాన్స్'లలో అతని భార్య ప్రేతాన్ని రప్పించి మాట్లాడించారు. అది ఎంతో మన శ్శాంతి కలిగించింది. కాని క్రమంగా అది చాల కృత్రిమ విధానంగా, కేవలం తన అపరిణత మనస్కతకు ఉపాధిగా అతనికి విశదమౌతూ వచ్చింది. తన ఆరాధ్య స్త్రీమూర్తికి చెందిన పరమార్థము, ఆమె శరీరంలో, కంఠస్వరంలో, మాటల్లోలేదు; అవి బాహ్యచిహ్నాలు, నశించాయి. వాటికోసం తహతహ లాడటం మనో దౌర్బల్యం.ఆమె తాలూకు పరమార్థం ఒక ఆదర్శ భావన— సౌందర్యము, సౌశీల్యము, పవిత్రత, ప్రేమ, మూర్తీభవించిన స్త్రీత్వం. ఈ ఆదర్శ భావన హైందవ నాగరకతలో, భారతీయ సంప్రదాయంలో విస్తృతంగా, విరాణ్మూర్తి అతనికి కనిపిస్తూ వచ్చింది. అందుకే ఆమూర్తిని ఆరాధిస్తూ వచ్చాడు. అతనికి ఒక కొమార్తె; ఆబాలిక అతని భార్య వదలిపెట్టి వెళ్లిన స్మృతి చిహ్నం- అంతేకాదు, అతని ఆదర్శ సంపద నిక్షిప్తమైన ఆశాపేటిక. ఆ బాలికకు వివాహం చేశాడు. కాని మూడేళ్లు గడవకుండానే ఆమె వితంతువై తిరిగి వచ్చింది. ఆమె భారతీయ మహిళాభ్యుదయానికి జీవితాన్ని అంకితం చెయ్యాలని అతని అభిప్రాయం; కాదు ఆమెకు అతని ఆదేశం... ఏడేళ్లు గడిచాయి, ఆకొమార్తె, ముప్పైఏళ్ల ప్రౌఢ, మళయాళీ వంటవాడితోలేచిపోయింది...అతని ఆదర్శ భావన, జీవిత కాలమంతా నిర్మించుకొన్న విశ్వాసం, బద్దలైంది. ఆదర్శ సంపదని ఆశాపేటికతో సహా దొంగలెత్తుక పోయారు. రెండోసారి అతనికి మనో వైకల్యం ప్రాప్తించింది.... హృషీకేశంలో ఒక గురువు సన్నిధానంలో అతనికి జ్ఞానోదయమైంది. 'నేను' అంటే ఏమిటి? నేను నిర్మించుకున్న గూడు, ఆదర్శం విశ్వాసం, 'నేను' కాదు; అది శిథిలం కావటంతో 'నేను' శిథిలం కాలేదు; నేను అనాదిగా అనంతంగా ఉన్నాను..అతను కొమార్తెను క్షమించ గలిగాడు, అర్థం చేసుకో గలిగాడు. అతడు అంతదాకా ఆరాధించిందీ, ప్రేమించిందీ భార్యను కాదు, కొమార్తెను కాదు; తను మానసికంగా నిర్మించుకున్న భ్రమను!.. సంకెళ్లూ పోయాయి; తలుపులు తెరుచు కున్నాయి. ఆవెలుగుకి అలవాటు పడుతున్నాడు... జీవితంనుంచీ మనుష్యుల్నించీ పారిపోలేదు, తిరిగి వచ్చాడు..తెలిసింది కదూ నేను నిన్న చెప్పిన వాక్యాల అంతరార్థం!.. ఆ వాక్యాలు నీకర్తవ్యాన్ని గూర్చి నేను చెప్పినవి కావు."

"అయితే నాకర్తవ్య మేమిటంటారు?"

స్వామిజీ నవ్వారు. "కర్తవ్యం యిదమిత్థమని ఆదేశించే మూర్ఖత్వం యిప్పుడు నాలో లేదు శ్రీధర్. ఇదిగో యిదీ నాజీవితం, నేను తెలుసుకొన్నది.....నేను తెలుసుకున్నదీ మన సంప్రదాయమే, అందుకు భిన్నంగా ఏమీలేదు అని చెప్పగలను...

కాని...సంప్రదాయాన్ని జీవితానికి అన్వయం చేసుకోవటంలో గట్టి చిక్కు వున్నది; అది ఎవరికి వారు చెయ్యవలసిందే.. నీ విషయంలో యిదివరకే నేను ఒక పొరపాటు చేశాను ప్రేమించు అంటే ఎవరిని? దేన్ని? ఎలా? సాధ్యమా? అ ప్రశ్నలకు సమాధానాలు తెలీకుండా సర్వజ్ఞుడిలా నీకు చెప్పాను, ఇవ్వాళ మళ్లీ నీ విశ్వాసాలు వదులుకొమ్మని ఎలా ఆదేశించ గలను? నీలో జరిగే జిజ్ఞాసకు కించిత్ సాహాయ్యము భగవచ్ఛ వుంటే నాద్వారా జరగ వచ్చు,అంతే తప్ప కర్తవ్యాన్ని గూర్చి నిన్ను నువ్వే ప్రశించుకోవాలి.. నీకు తోచినప్పుడు వస్తూవుండు...."

"విశ్వాసాల ప్రాముఖ్యతను గూర్చి చెప్పండి"

"విశ్వాసాల ప్రాముఖ్యతను కాదనటం లేదు. ఆదర్శాలు విశ్వాసాలు లేని మనిషి జీవితం మొగ్గ దొడుగని మొక్క. పువ్వులు వికసించితే గాని, రేకులు రాలితేగాని, పిందెలు కాయలూ రావు. అలాగే క్రమ పరిణామంలో ఆదర్శాలూ, విశ్వాసాలు వ్యక్తిని వదిలితేగాని ఫలసిద్ధి కాదు. పూతలేనిది పిందెలేదు; కాయలేదు. కాని విశ్వాసాల్ని ఆదిలో నిలుపుకోలేని వ్యక్తి పూతలేని మామిడి చెట్టు."

"జీవితం మాయఅంటే జీవితాన్ని నిరాకరించటంకాదా?"

"కాదు; జీవిత స్వరూపాన్ని వస్తుతః దర్శించటం— కాని ఆ దర్శనం ఆత్మజ్ఞానసిద్ధి తర్వాత గాని లభించదు!అంతదాకా విశ్వాసాల్ని నమ్ముకోవటమే శరణ్యం. చిత్తశుద్ధిలేక పోవటం, జీవితాన్ని మాయగా దర్శించటం రెండూ ఒకటి కాదు. జీవితంలో భీరుత్వం ప్రదర్శిస్తూ ఎప్పటికప్పుడు ఆదర్శాల్ని గోటమీటుతూ "ఏముందీ? మాయ!"—అనే దుఃస్థితి మనదేశంలో కలగటమే మన పతనానికి హేతువైంది. ఆ మనస్తత్వంలో మార్పు వచ్చే దాకా దేశానికి నిష్కృతిలేదు..."

అయితే మీరు విశ్వాసాలనీ ఆదర్శాలనీ అవసర మైనవిగానే సమర్థిస్తున్నారన్నమాట"

"అవసరం ఒక దశలో, అవరోధం మరోదశలో"

శ్రీధర్ ఆలోచనలో పడ్డాడు. ఆత్మానందస్వామి అయిన శేషాద్రి జీవితకథ వినటంతో ఆయనను గూర్చి ఎన్నో అర్థంకాని విషయాలు స్పష్టం అయ్యాయి. కాని శేషాద్రి వంటి వ్యక్తులు యిప్పుడేరీ? వాళ్ళు గతించిన యుగానికి ప్రతినిధులు. అది గాంధీ యుగం. ప్రగాఢమైన విశ్వాసాలతో, ఉజ్జ్వలమైన ఆదర్శాలతో అధికారంతో జీవించిన ఆ తరం వ్యక్తులకు సందేహాలు రాలేదు. కాలం మారి స్వప్నాలు భగ్నమౌతున్నా మమకారం వదలుకొని వాళ్లు లోకాతీతమైన వెలుగులోకే నడవ గలుగుతున్నారు! కాని ఈతరం వారి సమస్య వేరు. చంద్రావతి అన్నట్లు జీవితం మీద పట్టు తప్పిపోవటం నేటి సమస్య.ఆదర్శాలు విశ్వాసాలు అసలు లేకపోవటం! ప్రాతవాటిని నిలుపుకో లేక పోవటం! క్రొత్త వాటిని నిర్మించుకోలేక పోవటం! ఈసంధి యుగంలో జీవితం మీద అధికారం ఎలా లభిస్తుంది? సమాధానం సంప్రదాయంలో, శేషాద్రిగారిలో, లభించేలా కనిపించటం లేదు!

"మళ్లీ ఎప్పుడైనా వచ్చి దర్శనం చేసుకుంటాన"ని సెలవు తీసుకున్నాడు శ్రీధర్. స్వామిజీ అతనికి భగవద్గీత ప్రతి నొకదానిని యిచ్చి చదువుతూ, ఆత్మవిమర్శ చేసుకుంటూ ఉండమని ఆశీర్వదించాడు.

ఆరోజు శ్రీధర్ యింటికి వచ్చేటప్పటికి ఓబయ్య కాచుకుని ఉన్నాడు.

అప్పటికి నెలరోజులైంది శ్రీధర్ తారతో వేరింటి కాపురంపెట్టి. ఇంచు మించు సంవత్సర కాలం ఓబయ్య యింట్లోనే గడిపాడు. తార తన ఆరోగ్యమూ, పాపాయిపోషణా, కారణంగా మంగమ్మ సహాయాన్ని ఆపేక్షించి అక్కడి నుంచీ కదల లేదు. చివరకు శ్రీధర్ బలవంతాన కదిలింది.

నేరేడు మ్రాను బావి పొలంలో శ్రీధర్కువచ్చిన భాగాన్ని ఓబయ్యే సాగు చేస్తున్నాడు. దానికిచేరిన భూమికొంత ఓబయ్య సొంతం ఉన్నది. దానికి పూర్వం వేరుగా బావి ఉండేదట ఆబావి చాల భాగం పూడి ఇప్పుడు చిన్నపల్లం మాత్రం ఉండటం వల్ల కొన్ని ఏళ్లుగా ఒబయ్య భూమిలో సాగు లేదు. ప్రస్తుతం శ్రీధర్ వాటా పొలాన్ని చేస్తూ తన పొలాన్ని కూడా దున్నించి నేరేడుమ్రాను బావినీటితో దాన్ని సాగు చెయ్యాలని ఓబయ్య ఉద్దేశించాడు. అందుకు నరసింహులు అంగీకరించలేదు. బావి నీరు శ్రీధర్వాటాకుతప్ప ఓబయ్య భూమికి యివ్వటానికి వీల్లేదు అన్నాడు. ఓబయ్య నరసింహులు కార్పణ్యాన్ని శ్రీధర్కు చెప్పాడు. శ్రీధర్ అడగ్గా "వీల్లేదు" అన్నాడు నరసింహులు. చివరకు నీళ్ళుచాలక పోవటమే తను వీల్లేదనటానికి కారణమనీ చాలితే యివ్వటానికి తన కభ్యంతరం వుండదనీ, మిగిలితే కట్టుకొమ్మనీ చెప్పాడు తమ్ముడికి. శ్రీధర్ ఆమాటే వచ్చి ఓబయ్యకు చెప్పాడు. ఇది జరిగి కొన్ని నెలలయింది.

నరసింహులు మాటప్రకారం శ్రీధర్ కోరిక మీద కాదనకుండా నీళ్ళు వదిలాడు. కాని నీళ్ళు చాలకుండా పోవటంతో యిప్పుడు శ్రీధర్ వాటాపొలం పారేదాకా మాత్రమే కపిలె తోలటానికి అనుమతించాడు. ఓబయ్య మనుష్యులు అది లెక్కచెయ్యకుండా కపిలె తోలటంతో పెద్ద రగడ జరిగింది. ఓబయ్యకు బలగం తక్కువ కావటంతో వెనక్కు తగ్గారు. ఆవిషయమై శ్రీధర్తో చెప్పటానికి వచ్చాడు ఓబయ్య. శ్రీధర్కు అన్నయ్య నరసింహులు అవలింభించిన వైఖరి న్యాయంగానే తోచింది. మొదట్లో చెప్పినదానికి విరుద్ధంగా ఏమీ జరగలేదు......

"నువ్వే అట్లామాట్లాడతా వేమిటి? ఉన్ననీళ్లు పంట కంతటికీ సర్దుకోవాల్సిందే! మన పంటలో కొంత భాగం, పదనుకు వచ్చిందాన్ని పాడు చేసుకొమ్మనటం ఏమిన్యాయం? అన్నాడు ఓబయ్య.

"మొదటే చెప్పాడు కదా నీళ్లు తక్కువౌతాయని?"

"నీళ్లు యిన్నాళ్లూ సమంగా పంచాడా లేదా? నేను వకీల్ని కనుక్కొన్నాను. కోర్టులో వేసి ఇంజక్షన్ పుచ్చుకోవాలని నిశ్చయం చేసుకున్నాను. ఇదిగో వకాల్తనామా ఫారం తెచ్చాను. నువ్వొ సంతకం పెట్టితే రేపు దాఖలవుతుంది.."

"ఇది అన్యాయం, నాకిష్టం లేదు.. నువ్విలాంటివి చేస్తే నేను నాపొలాన్ని మాఅన్నయ్యకే అప్పగిస్తాను."

ఓబయ్య ఒక్క క్షణం నిర్ఘాంతపోయాడు. తర్వాత ఎంతో బాధపడ్డట్టుగా కనిపిస్తూ అనునయంగా చెప్పటం ప్రారంభిం

చాడు. "ఏమిటి మవ్వనేది? నీ ఆస్తి! నీ పొలం! శ్రీధర్, ఇవ్వాళ నాడైనా అదీ రేపు నీదే కదా! దాని నీటివసతి సంగతి ఈ రోజు తేల్చుకోకపోతే శాశ్వతంగా ఆహక్కుపోతుంది. అది బీడుగా ఉండి పోతుంది. అసలు పూర్వానికి అదీ ఆబావిలో సాగవుతూ వుండిందే! మీ నాన్న హయాంలో ఒకసారి రెండు మూడేళ్లు వరుసగా నీళ్లు తక్కువైతే మేం దున్నకపోతే, తర్వాత నీకు హక్కులేదు పొమ్మన్నాడు. అప్పుడు జరిగింది. అదీఅసలు సంగతి. నేనూ న్యాయంగానే అడుగుతున్నాను. నీకేం తెలుసు, నీ చదువేమో నువ్వేమో, ఈ వ్యవహారాల పుట్టుపూర్వోత్తరాలు!"

"నేను అన్నయ్యతో మాట్లాడి రేపు చెబుతాను."

"ఏం చెపుతావు? మీ అన్నయ్య పుర్రచెయ్యి చూపిస్తూనే వున్నాడుగా!" అన్నాడు ఓబయ్య కోపంగా.

ఈసంభాషణ వింటూనే ఉన్న తార కలుగజేసుకొని "అదేమిటండీ! వేరుపడ్డ తర్వాత ఎవరి మంచి వాళ్లు చూసుకుంటారుగాని ఈ చాదస్తమేమిటి? బాబాయిగారు చెప్పినట్లు చేయండి. ఇవ్వాళ పోగొట్టుకుంటే రేపు వస్తుందా?"అన్నది.

"నీకు తెలీదు నువ్వూరుకో! మామా, పంతం పట్టి అన్నదమ్ముల్ని విడదీశావు. అంతా నీయిష్ట ప్రకారమే జరుగుతున్నది. మానాన్న పోయాడు. ఎందుకీ తగాదాలు? న్యాయంగా వున్న హక్కులేవో అవి అనుభవిస్తే చాలదా? ఈవిషయంలో మాఅన్నయ్య అనీ కాదు, నాసొంత అనీ కాదు గాని న్యాయమేదో ఆ పక్షాన వ్యవహరించాలని నాఅభిప్రాయం. అంతకుమించి నేనేమీ చెప్పను...."

"నీకోసం నీభార్య పిల్లలూ, నేనూ మీఅత్తా, పడేబాధ నీకేమన్నా కనిపిస్తోందా? ఎంత సేపూ అన్న అన్న, వదినె వదినె అని ప్రాకులాడతావు గాని నీకు పెళ్లామూ పిల్లలూ, వాళ్లమంచీ చెడ్డా ఆలోచిద్దామనే లేదు! చదువుకొన్నవాడివి కదా, యివ్వాళ కాకపోతే రేపైనా బుద్ధిమారి దారికి రాకపోతావా అని ఆశలు పెట్టుకుంటూ వస్తున్నాము నేనూ, మీమామ గారైన వెంకయ్య గారూ! నీ పద్ధతీ, ప్రవర్తనా ఏమీ బాగుండటం లేదు శ్రీధర్! ఇదివరకు రాఘవరావు ప్రాపకంలో ఉండిన టీచరు ఎవర్తో ఆమె యింటికి ఎప్పుడూ వెళ్తూండట మేమిటి? దానికి వడ్లూ అవీ పంపి సంసారం నువ్వే జరుపుతున్నావని వూళ్లో పుకారుగా కూడా ఉంది! మహాన్యాయం, ధర్మం అని ఎవరికి ఈ ఉపన్యాసాలు? నేను చెప్పిన దాంట్లో న్యాయం లేకపోతే చెప్పుచ్చుక్కొట్టు! ఇంకనైనా ఈ కుర్రవేషాలు మానేసి ఆ టీచరుతో సంబంధం వదులుకో! ఎందుకయ్యా కట్టుకున్న భార్యను అలా ఏడిపిస్తావు? మింగలేక కక్కలేక కుళ్లిపోతోంది అమ్మాయి! పెద్దవాణ్ణి. అల్లుడివైనా కొడుకువైనా నువ్వే, ఏదో చచ్చే కాలానికి తలకొరివి పెట్టి, యిన్ని నీళ్లు వదులు తావనే ఆశకొద్దీ భ్రమకొద్దీ నీచుట్టు తిరుగు తున్నవాణ్ణి, యింతా చెప్ప వలసి వచ్చింది. నీ యిష్టం ఏం చేసుకుంటావో చేసుకో! నాక్కావలసి వచ్చిందా యిదంతా? అక్కరలేకపోతే దానం చేసుకో! ఇక నుంచీ నీపొలం వ్యవహారాలు నాకక్కర్లేదు. నువ్వేచూసుకో" అని ఏకధాటిగా ఓబయ్య తన మనస్సులో ఉన్నదంతా వెళ్లగక్కి లేచిపోవటానికి సిద్ధమయ్యాడు.

తార ఏడుస్తూ ఓబయ్యకి అడ్డం వెళ్లింది. "బాబయ్యా వన్నేంజేసి వెళ్తారు? మీరిట్లా వదిలేస్తే ఆయన మరీ నాక్కాకుండా పోతారు! చెప్పండి! ఆయనకు అర్థమయ్యేట్లు చెప్పండి! అన్నా వదెనా ఏ మత్తు మందు చల్లారో మొదటినుంచీ ఇదేవరస!... మదరాసులో కాపురం చేసిన నాలుగు రోజులూ తప్పితే తర్వాత యీాయనికి నేనెంత చేదు విషమై పోయానో! కారణ మేమిటో అడగండి బాబయ్యా! మీరు అడిగే పెద్దలు అడక్కపోవటం వల్లే గదా యిలా బరి తెగించి పోయారు! న్యాయం ధర్మం అని స్కూల్లో పాఠాలు చెప్పటంకాదు యింట్లో ఏమి న్యాయం వెలగబెడుతున్నారీయన?"

ఓబయ్య సానుభూతితో వింటూ నిలబడి ఉన్నాడు.

శ్రీధర్ నివ్వెరపోయి చూస్తున్నాడు. అతనికి నోట మాట రాలేదు! ఓబయ్యా, తారా తనమీద వేసిన ఈ అపవాదు— యిలా అకస్మాత్తుగా రేగిన దుమారం— యిన్నాళ్లుగా తనని గూర్చి తనదగ్గర వాళ్లు ఏర్పరచుకున్న వింత అభిప్రాయాలూ— ఉన్నట్లుండి అగ్ని పర్వతం బ్రద్దలైనట్లు, దాని మీద కూర్చున్న తను ఎక్కడికో విసరి వేయబడినట్లూ, అంతా కలగా ఉంది.

"ఏమండీ! యిప్పటికైనా మనసు మార్చు కోండి! పిల్లల ముఖం చూడండి! బాబాయి చెబుతున్నట్లు చెయ్యండి. మన మేలు కోరేవారు, అనుభవంతో చెబుతున్నపుడు తోసి వెయ్యకండి. మీమీద ఆశలు పెట్టుకున్న వాళ్లను కాదనకండి.."అంటోంది తార శ్రీధర్ దగ్గరగా వచ్చి ప్రాధేయ పడుతూ.

"ఏమిటీ గోల! నాకేం అర్థం కావటం లేదు! ఏమిటి మామయ్యా నువ్వన్నది? ఏమిటీ అబద్ధాలు, ఆరోపణలు? ఎవడు నన్నుగురించి చేస్తున్నది యీ ప్రచారమంతా? ముందీ విషయం తేల్చు, తర్వాత పొలం సంగతి ఆలోచిద్దాం! ఆ టీచరు నా స్కూల్లో చదువుకున్నది. వడ్లు కావాలంటే పంపాను. ఇంటరు పరీక్షకు కట్టి చదువుతూ ఏవో పుస్తకాలు కావాలంటే సంపాదించి పెట్టాను.. అవును, సహాయం చేయటం తప్పా? ఇంతగా చిలవలూ పలవలూ కల్పించిన మహాను భావుడెవడో చెప్పు!" అన్నాడు ఓబయ్య నుద్దేశించి.

"ఎవరో ఎందుకూ? నువ్వే ఒప్పేసు కుంటున్నావు కదా! మరి నువ్వు దానింటికి వెళ్తూండబట్టే అంటున్నారు! ఏదో సామెత చెప్పినట్లు పిల్లి కళ్లు మూసుకుంటే లోకమూ మూసుకుంటుందా ఏం, మర్యాదస్తుల కొంపా నువ్వు వెళ్తూ వస్తుండడానికి? అంత మాత్రం ఇంగిత జ్ఞానం ఉండక్కర్లా?"

"అక్కడికి వెళ్లటం తప్పంటే నేనొప్పుకోను! లోకంలో పదిమందీ చెప్పేది కాదు, మనస్సాక్షి చెప్పేదే ధర్మం! నువ్వే ఆలోచించు మామయ్యా!"

"ఇంక అంతకంటే ఏం సమాధానం చెబుతావులే! ఏసాక్షైనా కానీ, భార్యను రొష్టు పెట్టకయ్యా మహానుభావా! అని నీమంచికే చెబుతారు ఎవరైనా."

తార అందుకున్నది "పోనివ్వండి సహాయం చేశారు మంచి ఉద్దేశంతోనే. ఇంకా దాని యింటికి వెళ్ళడ మెందుకూ? నిన్నా యివ్వాళాకూడా వెళ్ళారే! రోజూ ఏం పని ఉంటుందండీ? స్కూలు అవగానే కాఫీకి కూడా రారు బాబాయి; యిదిగో యీవేళ అవుతూంటుంది!" అన్నది తార.

"నిన్నా యివ్వాళ కాలేజిలో ఆత్మానందస్వామి గారిని దర్శించడానికి వెళ్ళాను. రోజూ డైరీ నీకు అప్పగిస్తూ వుండా లేమిటి? నాయిష్టం!"

"ఏదో చెబుతారు,ఇంట్లోవుండేదాన్ని నాకేంతెలుస్తుంది?"

"పోన్లేఅమ్మాయ్...మంచి ఉద్దేశంతోనే వెళ్ళాడు. యిక దాని గడప తొక్కడు!.. అలాంటి వాళ్ళతో సంబంధం పెట్టు కోవటం అప్రతిష్ఠ శ్రీధర్! తాటి చెట్టు క్రింద నుంచుని మజ్జిగ తాగినా కల్లే తాగుతున్నా డంటారు అమ్మాయ్! అనుమానాలు పెంచుకుంటే లాభం లేదు. ఆ చలమయ్యగాడు యిటాంటి వెన్నైనా పుట్టిస్తాడు!... అసలు వాడితో నువ్వు తిరుగుతూ ఉండటమే నాకు బాగు లేదు శ్రీధర్! వాడేనటగా మొదట నిన్ను దానింటికి తీసుకెళ్ళింది! అన్నీ వాడి మాటలే! వాణ్ణి నమ్మబోకు.. చూడబ్బాయ్, యీపొలం సంగతి విషయంలో నామాట విను, యివాళ పోగొట్టుకుంటే తర్వాత రాదు! నేను చెబుతున్నాను కదా; యిది మాకు పూర్వం ఉన్న హక్కే! కొత్తగా అడుగు తున్నది కాదు. మీనాన్న హయాంలో మా అశ్రద్ధవలన ఆయన ప్రాబల్యంవల్లా మాపొలానికి నీళ్ళు పెట్టడం ఆగిపోయింది. అంతే! అందువల్ల నేను చెప్పేది ఏమిటంటే పోసీ నిన్ను ప్రతివాదిగా గానే చేరుస్తాను. నువ్వు అడ్డు చెప్పకుండా చూస్తూ ఉండు. సాక్ష్యం వగైరా నేను చూచుకుంటాను. నాదగ్గర పాత డాక్యుమెంటు, రికార్డు ఉన్నాయి, వెధవది శ్రద్ధతీసుకోలేదుగాని యిన్నాళ్ళా యింట్లోనే ఉంది రికార్డు, యీ పాటికెప్పుడో తేల్చుకొని ఉండవలసిన వ్యవహారం."

శ్రీధర్ తల తిరిగిపోతుంది. పొలం వ్యవహారం కంటే చలమయ్యచేసిన దుష్ప్రచారం, పద్మమణిని గూర్చి లోకానికి ఉన్న అభిప్రాయం పద్మమణికీ తనకూ గల సంబంధం యొక్క యాథార్థ్యాన్ని గూర్చిన జిజ్ఞాస, అతని మనస్సును ఆక్రమించు కున్నాయి.

"న్యాయం జరగాలని నీ ఆదుర్దా; అంతే మామా" అన్నాడు.

"న్యాయమే శ్రీధర్!..మనం అన్యాయం జోలికే పోవద్దు! నీకే అర్థమౌతుంది, నువ్వు మాస్తూ వూరుకో చాలు! నువ్వు మీ అన్నదగ్గరకు వెళ్ళక్కర్లేదు. ఒకవేళ పిలిపించి ఏమైనా చెప్పేందుకు ప్రయత్నం చేస్తాడేమో; 'నాకు తెలియదు, మామ చూస్తున్నాడు' అని జవాబు చెప్పు, చాలు. అన్నాడు ఓబయ్య.

19

పద్మమణి ప్రయివేటుగా యింటరు పరీక్షకు చదువు తున్నది. శ్రీధర్ ఆమె యింటికి వారానికి రెండుసార్లు వెళ్తూనే ఉన్నాడు. ఈ విషయమై చలమయ్య ఒకటి రెండుసార్లు వ్యంగ్యంగా తనని హెచ్చరించినమాట నిజమే కాని అసూయతో యిలా తన కుటుంబంలోనూ, ఇతరత్రా ప్రచారం సాగిస్తున్నా డని ఇంతవరకు శ్రీధర్ వూహించుకోలేక పోయాడు.

ఆరాత్రి ఓబయ్య వెళ్ళిన తరువాత తారద్వారా ఒక ముఖ్యమైన సంగతి అతనికి తెలిసింది. పాపాయికి మూడోనెల ప్రవేశించగానే ఆలస్యం చెయ్యకుండా తార వచ్చివెయ్యటానికి కారణం—చలమయ్య ఓబయ్యతో ప్రథమంగా తన చెడు ప్రవర్తనను గూర్చి చెప్పినమాటలేనట! బందరునుంచి తిరిగి వచ్చిన తారలో తను గుర్తించిన మార్పుకి—అంటే ఆమె చూపిన లోంగుబాటుకీ, సుముఖత్వానికీ కూడా—అదే మూల కారణం అన్నమాట! ఈ విషయం క్రమంగా బోధపడగానే శ్రీధర్‌కు తారా వెంకయ్యా, మంగమ్మా, ఓబయ్యా ఒక క్రొత్త వెలుగులో వెలవెలపోతూ కనిపించారు .... ఆ రాత్రి శ్రీధర్‌కు నిద్ర పట్టలేదు.

వీళ్ళందరూ తన ప్రవర్తనని గర్హిస్తూనే, ఇన్నాళ్ళా అది నిజమని నమ్ముతూనే, తనకు గౌరవాన్ని, విలువనూ యిస్తున్నారన్నమాట! తనను గూర్చి యిటువంటి ప్రవాదము ఏమీ లేనప్పుడు తారా వెంకయ్యగారూ పూచికపుల్ల కంటె తక్కువగా చూశారు. వివాహవ్యవస్థ, కట్టుండబ్బూ తనకు భర్తమీద హక్కుల్ని ప్రసాదించాయనీ, అతన్ని కొంగుకు కట్టుకు తిరగవచ్చనీ అప్పట్లో తార అభిప్రాయం కాబోలు! ఆ హక్కులికి ప్రమాదం సంభవించిందని తెలియగానే తన వస్తువును తను భద్రపరుచుకోవాలని తిరిగివచ్చింది! ఇందులో మంగమ్మత్తా వోబయ్యమామా నిర్వహించిన పాత్ర—తార తనమీద విరుచుకు పడకుండా, అలా చేస్తే పరిస్థితి చెడుతుం దనీ, సర్దిచెప్పటం కాబోలు! అందుకే తార మంగమ్మత్తమీద అంతగా ఆధారపడుతోంది!—మాటకుముందు 'పిన్నిగారి నడగండి .... పిన్నిగారు చెప్పింది' అంటుంది.... పోతే మంగమ్మా ఓబయ్యా తనమీద వచ్చిన ప్రవాదాన్ని ఒక అవకాశంగా యిలా ఉపయోగించుకున్నారు.—తనని అన్న కుటుంబాన్నుంచీ వేరుచేసి కాపురం పెట్టించటానికీ, అన్నమీద కక్ష సాధించటానికీ తారను రప్పించారు సమయానికి! కళ్ళముందు నడిచే నాటకానికి వెనుక సూత్రాలు యిలా ఉన్నాయి!

అయితే ఓబయ్య వేస్తున్న బావినీటి తగాయిదా కేసు కూడా అందులోని భాగమే నన్నమాట! ఇందులో ఓబయ్య ఎంత గింజుకున్నా తను మాత్రం వేలు పెట్టబోడు! నిజంగా బలమైన రికార్డే ఉంటే, ఓబయ్యదే న్యాయమైతే లేక అన్నయ్యదే న్యాయమైతే, ఆ విషయం కోర్టే నిర్ణయిస్తుంది. ఈ సంగతి తను విశేషంగా ఆలోచించ నక్కరలేదు!

అన్నింటికంటె చిత్రంగా ఉన్న సంగతి— వీళ్ళందరూ ఇన్నాళ్ళా తనని గూర్చి యీ అపోహ పెట్టుకునే ఎందుకు వూరుకున్నారు అని! తార మాటల్నిబట్టి చూస్తే ఆమెకు యిదివరకే అడగాలని ఉంది. కాని మిగతావాళ్ళు సలహా యివ్వటంవల్ల కాబోలు వోర్పుగా ఉందన్నమాట! ఓబయ్యకు నిజంగా యీ విషయం పట్టినట్లు లేదు. తను అన్నయ్యతో కలుస్తానని మాట అనగానే తన నైతిక ప్రవర్తనని ప్రశ్నిస్తూ తారని కూడా తనమీదికి పురికొల్పాడన్నమాట! అంతకంటె

తనమీద ఓబయ్యకు ప్రస్తుతం పట్టుకూడా ఏమీ లేదు. లోగడ యిచ్చిన డబ్బుమాట ఎత్తటానికి ప్రోనోటుకు వాయిదా పోయిందాయె! వాయిదా పోకుండా చెల్లు ప్రాయించుకోలేదు. ఎందుకో? అశ్రద్ధా? లేక నిజంగానే తనమీద మమకారమా? రెండూనా? ఇలాంటి విషయాల్లో నిజం తెలుసుకోవటం అసాధ్యమే !

ఆలోచించేకొద్దీ జీవితమూ, దాన్ని ప్రవర్తింపజేస్తున్న యదార్థమైన శక్తులూ, జీవితభ్రమణంలో తల్లక్రిందులయి కనిపిస్తూన్న విలువలూ, అతనికి వింత కలిగిస్తున్నాయి. పైకి కనిపించే ఆదర్శాలూ, నైతిక ప్రమాణాలూ జీవితాన్ని నిజంగా నడపటమే లేదు! అలానే అయితే ఆదర్శాల అమాయకత్వంతో వివాహమందిరం ముంగిట భార్య తార ప్రేమ నర్థిస్తూ తాను నిలుచున్న ఆ రోజుల్లో తనకు ప్రేమా, గౌరవమూ లభించి వుండేవి. ఈనాడు తారను తను ఏమీ అర్థించటంలేదు! తారకు వ్యక్తిత్వంలేకపోవటం, తారలోని భీరుత్వం తనకు ఆమె మీద జాలి కలిగిస్తున్నాయి. తనని ఆమెవైపుకి లాక్కునే ఆకర్షణ తారలో అదృశ్యమైపోయింది! అయితే వివాహితుడుగా తను ధర్మాన్ని పాటించవద్దా? ధర్మం, ? కర్తవ్యం? నిర్దిష్టమైన విశ్వాసాలు లేనిదే ధర్మమూ, కర్తవ్యమూ ఎలా నిర్ణయించేది? అతనిలో పత్నీ ధర్మాన్ని గూర్చి, తన కర్తవ్యాన్ని గూర్చి జిజ్ఞాస ప్రారంభం అయింది.

పద్మమణి చరిత్ర తనకు తెలుసు. సంఘం దృష్టిలో ఆమెకు ఎలాంటి గౌరవమూ లేదు. కాని, ఈ విషయం బుద్ధికి తెలియటం వేరు; పద్మమణి వ్యక్తిత్వం ప్రత్యక్షానుభవంగా తనలో కలిగించే ఉదాత్తభావన, అనిర్వచనీయమైన పరితృప్తి, ఆనందం వేరు. రెండింటికీ ఎక్కడా సంబంధం లేదు. ఆ అనుభూతిని విశ్వాసాలరీత్యా యిదమిత్థమని ఇంతవరకూ నిర్ణయించుకోలేక పోయాడు—దాన్ని 'ప్రేమ' అని పిలవటానికి యిద్దరి జీవితాల్లోనూ ఆ నిర్వచనానికి తగిన పరిస్థితి, అందుకు అవకాశం ఏనాడో దాటిపోయాయి. భిన్నంగా ఎంతో జరిగిపోయింది కూడా. 'కామం' అనడానికి యిద్దరిమధ్యా తను గీచిన గీటు నిగ్రహంతో యిప్పటికీ పెద్ద ప్రయత్నం అంటూ అవసరం లేకుండానే నిలుపుకో గలుగుతున్నారు; 'స్నేహం' అనటానికి అంతకంటె ప్రదీప్తమైన, ఆత్మీయమైన, విశేషానుభూతి, ఏకీభావమూ యిద్దరిమధ్యా స్ఫురిస్తోంది....శ్రీధర్ యిదివరకే చాలసార్లు పరీక్షించాడు—పద్మమణి సమక్షంలో తనకు కలిగే అనుభూతిని, ఆ క్షణంలోనే సాంఘికమైన దృష్టితో, నైతికాదర్శానికి సంబంధించిన వ్యూహాలతో, విమర్శలతో చెదరగొట్టటానికి ప్రయత్నం చేశాడు. కాని సరోవరంలో సుప్రతిష్ఠితమైన చంద్రుని ప్రతిబింబాన్ని చిన్న చిన్న రాళ్ళువేసి చెదరగొట్టడానికి చేసే ప్రయత్నంలాగే ఆ విమర్శలూ, పరీక్షలూ విఫలమయ్యాయి. తాత్కాలికంగా మనస్సు వ్యూహాలతో నిండి కల్లోలితం కావటంతప్ప ఆ అనుభూతి వైశిష్ట్యం చెరగనూ లేదు. తరగనూ లేదు!......

ఒకసారి శ్రీధర్ పద్మమణిని అడిగాడు "శరత్ నవలలు నీకంతగా యిష్ట మని అంటున్నావు. ఆయన స్త్రీ పురుష సంబంధాల్ని సంప్రదాయ విరుద్ధమైన ప్రేమనీ చిత్రించటంలో అవలంబించే డొంక తిరుగుడూ, జాప్యమూ అది కేవలం భీరుత్వమని ఒక ఆక్షేపణవుంది. చలంలాగా విప్లవాత్మకంగా స్త్రీ వ్యక్తిత్వాన్నీ, స్వేచ్ఛనూ ఆయన సమర్థించలేక పోయాడు అంటారు. నీకేమనిపిస్తుంది?"

"మీ కేమనిపిస్తుందో చెప్పండి."

"ప్రశ్న వెయ్యటమూ, సమాధానం చెప్పటమూ రెండూ నేనేనా? మొదట నువ్వు చెప్పాలి."

"ఊహూం....మీరు."

"కాదు.....నువ్వు."

"ఊహూఁ.....".

"సరే అయితే! నాకు ఆ విమర్శ సబబుగానే అనిపిస్తుంది. దానితో ఏకీభవిస్తున్నాను" అన్నాడు శ్రీధర్.

"ఆహా! పాపం!నమ్మవలసిందే!" అంటూ నవ్వింది పద్మమణి.

శ్రీధర్ కూడా నవ్వేశాడు. "ఇంక నీ అభిప్రాయం చెప్పు మరి!" అన్నాడు.

పద్మమణి కొన్ని క్షణాలు ఆలోచించింది : "నాకు ఆ విమర్శ తప్పని తోస్తుంది. ఎందుకు తప్పో కారణం నేను సరిగా చెప్పలేక పోవచ్చు. నా అభిప్రాయంలో ధైర్యం అనేది ఒక పని చెయ్యటంలోనే కాదు, దాన్ని చెయ్యగలిగీ,చెయ్యకుండా ఉండటంలోనూ గొప్పగా కనిపిస్తుంది. శరత్ పాత్రలలో అదే విడమర్చి చెప్పుకోండి" అన్నది పద్మమణి.

"అవును. శరత్ పాత్రలు భయపడి ఎక్కడా తమ మనసుల్ని కప్పి వుచ్చుకోరు. వాళ్ళ సంఘర్షణ కూడా కేవలం సంఘంతో పిరికితనం మూలంగా ఏర్పడింది కాదు. అది వాళ్ళ అంతర్యంలో వాళ్ళకే వచ్చింది. ఏదో ఒకటి చలం పాత్రలలాగా చేసేస్తే అది ఆ సంఘర్షణని లోపల ఎదుర్కోలేని అశక్తత—పిరికితనమో తేలిక గుణమో అవుతుంది. అందుకే శరత్ పాత్రల గాంభీర్యమూ నిండుదనమూ చలం పాత్రలలో కనిపించదు." అన్నాడు శ్రీధర్.

"నే నొప్పుకోను. ఎవళ్ల గొప్పదనం వాళ్ళది! చలం పాత్రలలో కనిపించేది ధైర్యమూ, శరత్ పాత్రలలో కనిపించేది స్థైర్యమూ అనగూడదా?" అన్నది పద్మమణి.

"అంటే భయంలేక పోవటం, నిర్భయం అనేది సమాన గుణమంటావ్."

పద్మమణి తలవూపింది.

అలావుంటాయి ఆమెతో మాటలు. తన మనస్సు తనకే విదితమౌతూ ఉంటుంది ఆమె సమక్షంలో.

కాలం గడుస్తున్నకొద్దీ పద్మమణి తనలో కలిగించే అనుభూతి రంగులుదిద్దుకుంటూ దాని పరిపూర్ణతను ప్రస్ఫుటం చేసుకుంటున్నది. చలమయ్యవంటివారి ప్రచారానికి భయపడి తను దర్శిస్తున్న ఈ సత్యాన్ని కాదనటమా? తను భార్యకూ, పిల్లలకూ చేస్తున్న లోపంకాని, ద్రోహంకానీ యిందులో ఏమీ లేదే!

పద్మమణిని చూచి నేర్చుకోవలసిన వెన్నో అతనికి కనిపించాయి. ఆమెలో నిర్వేదం, నిస్పృహ ఎప్పుడూ కనిపించదు. ఎవరినీ దేన్నీ విమర్శించదు. చలమయ్య సంగతి వచ్చినాసరే, అతన్ని

లోని మంచితనాన్నే ప్రసక్తం చేస్తుందిగాని తేలికగా మాట్లాడదు. మళ్ళీ ఆమెకు చలమయ్యలో లోపాలు ఏమిటో అతని సంస్కారం ఏపాటిదో తెలీకపోలేదు. ఒక్కొక్కమాటలో ఆ జ్ఞానం తేటతెల్లమవుతూనే ఉంటుంది. రాఘవరావు మరణానంతరం ట్రైనింగ్ పూర్తి చేసుకుని, కమిటీ వారిని కలుసుకుని ఉద్యోగంతో చేరటమేకాదు, పూనికతో ఇంటరు పరీక్షకు చదువుతోంది పద్మమణి. సత్యాన్ని సాయంత్రాలు టైయిలరింగ్ నేర్చుకునేందుకు పంపుతోంది. సవతికొడుకుని టైయిలర్ని చేద్దామనే ఉద్దేశంతో కాదు. చదువుతోబాటు ఉపయోగకరమైన పని ఏదో ఒక్కదానిలో సత్యం కౌశలం సంపాయించాలని ఆమె ఉద్దేశ్యం. ఖర్చు లెక్క వ్రాసిపెట్టుకోవటంలోకాని, డబ్బు విషయమైన జాగ్రత్తలోగాని ఆమె చూపే దక్షత ఆశ్చర్యంగా కొంత ఎబ్బెట్టుగా కూడా ఉంటోంది....అతనెప్పుడూ స్త్రీలో యిటువంటి దక్షతను అందమైన గుణంగా భావించలేదు! కాని యివన్నీ ఆమెకు తనపైగల ప్రభావానికి కారణాలుగా చెప్పటానికి వీల్లేదు!

వేరుకాపురంపెట్టి సంసారం నిర్వహించటం ప్రారంభించాక శ్రీధర్‌కు ఆర్థిక పరిస్థితుల ఒత్తిడి బాగా అనుభవానికి వచ్చింది. ఏడాదిగా తను చేర్చి పెట్టుకొన్న రొక్కం క్రమంగా ఖర్చుపెడుతోంది. నరసింహులు అతనికి పంపకంలో అప్పూ యివ్వలేదు, రొక్కమూ యివ్వలేదు......కాబట్టి నెలసరి ఖర్చుకు యికమీద జీతం ఒక్కటే చాలక పోవచ్చు; ఈసారి అదనంగా వచ్చే ధాన్యమైనా అమ్ముకోవాలి, లేకపోతే యిప్పుడవుతున్నఖర్చులో పొదుపైనా జరగాలి......

ఓబయ్య నరసింహులిపై వేసిన వ్యాజ్యం నడుస్తోంది. ఆ విషయమై అన్నయ్య తనని పిలిచి అడుగుతాడనుకున్న శ్రీధర్‌కు అలాంటి పిలుపేదీ రాకపోవటం ఆశ్చర్యం కలిగించింది. ఒకటి రెండుసార్లు యింటికి వెళ్ళాడు. కాని రుక్మిణమ్మ ఈ సంగతి ప్రస్తావించలేదు. అది గుర్తించి శ్రీధర్‌కూడా మౌనం వహించాడు.

ఓబయ్య చేసిన వ్యవసాయం శ్రీధర్‌కు ఏడాదికి సరిపయే తిండిగింజల్ని మాత్రమే రాల్చింది; అమ్మేందుకు అదనంగా పంట ఏమీ మిగల్లేదు. శ్రీధర్ దగ్గరకు పిల్లలు ట్యూషన్ కోసం వస్తున్నారు. ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ట్యూషన్ చెప్పటం తప్పనిసరే అయింది. ప్రొద్దుటి పూట అయిదుమందికి చెబుతున్నాడు.

1952 ఎలక్షన్లువచ్చాయి. చలమయ్య కమ్యూనిస్టుపార్టీకి సానుభూతిపరుడుగా పనిచేశాడు. మదనపల్లెలో కమ్యూనిస్టు అభ్యర్థి గెలిచాడు. చలమయ్య స్వయంగా విజయంపొందినట్లు సంతోషించాడు......అతణ్ణిపట్ట పగ్గాలు లేకుండా ఉన్నాయి. ఆ వూపులోనే ఒక సంఘటన జరిగింది.

ఆరోజు సాయంత్రం శ్రీధర్ పద్మమణిని చూడటానికి వెళ్ళాడు. మెట్లెక్కగానే మాటలు వినబడ్డాయి.

"ఛీ, వదులు! మనిషి కొకసారి చెబితే బుద్ధుండాలి. మర్యాదగా చెబితే తెలుసుకోవాలి." అంటోంది పద్మమణి.

"ఏమిటె నీ మర్యాద? ఇన్నాళ్ళూ నీ చుట్టూ తిప్పుకుని, ఆశపెట్టి యివాళ యిదేనా మర్యాద! ఏం నేను వాడికంటె చెడపోయానా, ముసలాడు రాఘవరావుపాటి చెయ్యనా?... ఎందుకీ వేషాలు? సరదాగా ఉండక!......పద్మా, ఊఁ బెట్టు చెయ్యక, రా......" అది చలమయ్య గొంతు.

శ్రీధర్ గదిలో ప్రవేశించకుండా మెట్ల గుమ్మం దగ్గరే ఆగిపోయాడు.

"నీ మట్టిబుర్రకింకా ఎలా చెప్పాలి? ప్రతి ఆడదానికీ ప్రతి మగాడిమీదా ఉండాలని ఎక్కడ రాసిపెట్టి ఉంది?...... నా చుట్టూ తిరిగావంటే ఎందుకు తిరిగావో నీకే తెలియాలి. ఇంటికి వస్తే మనిషిగా యివ్వవలసిన గౌరవం యిచ్చాను. సత్యానికి ట్యూషన్ చెప్పినందుకు అణా పైసల్తో నీ డబ్బు నీకు ముట్టింది; ఆపైన నీకూ నాకూ ఏమిటి సంబంధం? నువ్వేదో వూహించుకుంటే అదంతా వట్టి భ్రమ అని చెబుతూనే ఉన్నాను. నువ్వు నన్ను గూర్చి యిలా నానా మాటలూ అనటం బాగులేదు చలమయ్యా! శ్రీధర్‌పేరుగాని, రాఘవరావుగారి పేరుగాని నీ కనవసరం."

"అయితే ప్రస్తుతం శ్రీధర్ నీ మొగుడు అన్నమాట."

"నీకు నమస్కారం. నీతో ఇక మాట్లాడటం నాదే బుద్ధి తక్కువ...దయచేసి యిక నా యింటికి రాకండి, వెళ్ళండి చలమయ్యగారూ!"

"ఆహా! ఏం టక్కులు! ఏం వయ్యారపు వినయాలూ..... రావే..."

"ఛీ! ఏమిటీ దౌర్జన్యం! వదులు!......నువ్వు మనిషివా పశువ్వా?...నేను అరుస్తాను...వదులు......అయ్యో.... ఓఁ."... పెనగులాట, పద్మనోరు నొక్కబడుతున్న శబ్దమూ......శ్రీధర్ ఒక్క గంతువేసి గదిలో పడ్డాడు. చలమయ్య వీపుమీద గట్టిగా గుద్దాడు. చలమయ్య వెనక్కు తిరిగి, "ఓ, నువ్వా?......." అని సంబాళించుకొని—"ఏం మిష్టర్! ఈ ముండకోసం మనం పోట్లాడుకోవాలా? ఇది కొన్నాళ్ళు నాతో పడుకొని, యిప్పుడు నీతో ఉంటోంది...మనలో మనకేం ఫ్రెండ్స్ కదా అని ఇన్నాళ్ళూ వూరుకున్నా......ఇప్పుడు నామీదే ఎదురు తిరుగుతూంటే బుద్ధి చెబుతున్నా........"

శ్రీధర్ చలమయ్య చంపమీద ఎడతెరిపి లేకుండా పటపట వాయించేశాడు. చలమయ్య శ్రీధర్ షర్టు ముందరిభాగం పట్టుకుంటూ కలియబడ్డాడు. ఇద్దరూ కొట్టుకొన్నారు. చలమయ్య విడిపించుకుని వెళ్ళిపోతూ, "ఈ సంగతి యింతటితో అయిపోలేదు. నాతో శత్రుత్వమా?" అన్నాడు.

శ్రీధర్ నలిగిన తన షర్టునీ, జుత్తునీ సరిచేసుకుంటూ పద్మమణివైపు చూచాడు. అరచేతుల్లో ముఖం కప్పుకుని ఏడుస్తోంది.

శ్రీధర్ ఆమెను దగ్గరకు తీసుకుని గట్టిగా హృదయానికి హత్తుకుంటూ మూర్ధాన్ని ముద్దుపెట్టుకున్నాడు. అతని కౌగిట్లో ఒదిగిపోయింది. ఆమె చేతి వేళ్ళని ముఖంనుంచి విడదీయటానికి ప్రయత్నించాడు. పద్మమణి చేతుల్ని మరింత గట్టిగా అదుముకున్నది. "పద్మా, యిలా చూడు....ఏడవకోక....చెయ్యి తియ్యి... అబ్బ....ఏమిటా మొండితనం! యిలా చూడమంటూంటే!...."

పద్మమణి అతనికి అభిముఖంగా తిరిగి చప్పున చేతుల్తో అతన్ని గట్టిగా చుట్టివేసి ముఖాన్ని అతని వక్షంలో దాచుకున్నది.

"నావైపు చూడమంటూంటే....ఊఁ...." ఆమెను నడుము దగ్గర పొదివిపట్టుకుని వెనక్కి వంచాడు. ఆమె తలెత్తి అతని కళ్లల్లోకి చూచింది. కన్నీటితో తడిసిన ఆమె కళ్లనీ, కను రెప్పల్నీ, చెంపల్నీ ఆగకుండా ముద్దులతో నింపివేసిన అతని పెదవులు చివరకు ఆమె పెదవులమీద సుదీర్ఘంగా ఆగిపోయాయి. పద్మమణి మెల్లగా అతణ్ణి తోసివేసి వదలించుకొని చప్పున లోపలికి వెళ్లిపోయింది.

శ్రీధర్ అలానే నిల్చుండిపోయాడు కొన్నిక్షణాలు. జరిగిన విషయమంతా వరుసగా మళ్లీ జ్ఞాపకం వస్తోంది. శ్రీధర్ వెళ్లి కుర్చీలో కూర్చున్నాడు. ఒకవైపు కొత్త ఉత్సాహం పొంగులు వారుతూ, లోకాన్ని జయించానన్నభావం, ఎవరినీ తను లక్ష్య పెట్టనన్నభావం, తనకు కావలసిందేదో లభించిందన్నభావం వెల్లివిరిసిపోతూవుంది. మరోవైపు చలమయ్య బెదిరింపును గూర్చి—ఏం జేస్తాడు? వెళ్లి ఓబయ్యతో, తారతో, అన్న య్యతో, రుక్మిణమ్మతో చెపుతాడా? స్కూల్లో ప్రచారం చేస్తాడా? కుర్రాళ్లతో చెప్పి గోడలమీద రాయిస్తాడా? అన్న కుతూహలం......తను చలమయ్యను ఎలా కొట్టగలిగాడా? క్షణంలో యింత జరిగిపోయిందా? అన్న ఆశ్చర్యమూ.....పద్మమణి ఇంట్లో ఒక్కర్తే ఉన్నట్లుందే! క్రిందిభాగం కూడా తాళంవేసివుంది! సత్యం టైలరింగ్‌కు వెళ్లివుంటాడు......అవకాశం చూచు కునే సాహసించాడన్నమాట! తను సమయానికి రాకపోయినట్లైతే పరిస్థితి బాగా విషమించేదే!......మొదలైన ఆలోచనలూ...... శ్రీధర్ అలానే కూర్చుండిపోయాడు. పద్మమణి ప్రవేశించి ఇదుగో "కాఫీ" అనే దాకా అతనికి బాహ్యస్మృతి లేదు......

"మీ అమ్మగా రెక్కడికి వెళ్లారు?"

"నాలుగురోజులైంది, ఆమె చెల్లెలు ఉత్తరం వ్రాస్తే వూరెళ్లింది పాపతో సహా."

"క్రింద అద్దెకున్నవాళ్లూ?"

"వాళ్లు ఖాళీచేసి వారం రోజులౌతోంది....మీ రీ మధ్య రాలేదు కదూ."

"కుర్రవాళ్లకి పరీక్షలొస్తున్నాయి. తీరటంలేదు !.... అయితే ఎవరూ లేనిది చూచే సాహసం చేశాడు—ఈ మణిని అపహరించేందుకు !"

"ఇది కౌస్తుభమణి అని తెలీలేదు."

"అవును, దీనిస్థానం అక్కడకాదు, యిక్కడ కదూ!" అంటూ శ్రీధర్ లేచివచ్చి ఆమెను కౌగలించుకోబోయాడు. ఆమె వారించి అతని భుజాలమీద చేతులువేసి దూరంగా ఉంచుతూ "మీ తపస్సు మాటేమిటి?" అంది నవ్వుతూ.

"నువ్వే నా తపస్సు" అంటూ ఆమెను, దగ్గరకు లాక్కున్నాడు.

20

ఆ రాత్రి శ్రీధర్ భోజనమయ్యాక అలవాటు ప్రకారం చదువుకోకుండా ఆలోచిస్తూ మంచంమీద పడుకున్నాడు. సాయంత్రం జరిగిన సంఘటనని గూర్చి, పొందిన అనుభూతిని గూర్చి అతనిలో ఎడతెగని ఆలోచనలు రేగుతున్నాయి.

పద్మమణి తనలో యిన్నాళ్లూ కలిగిస్తున్న విశిష్టమైన అనుభూతి ఏదైతేవుందో ఆ సర్వస్వాన్ని చేతుల్లోకి తీసుకుని తనదిగా చేసుకోవటమౌతుందని భావించాడు ఆమెను శారీర కంగా పొందటం; కాని ఆ ప్రతీక్ష యథార్థంలో నెరవేరలేదు! ఆ స్వప్నానుభూతీ, స్వర్గమూ, యింద్రియానుభవపు పరిధిలో యిమిడిపోవటానికి నిరాకరించాయి; ఆత్మగతమైన పద్మమణి శాపగ్రస్తఅయిన ఊర్వశిలా కేవలం సామాన్యస్త్రీగా తన చేతుల్లో మిగిలి పోయింది.! అక్కడినుంచీ వచ్చివేస్తున్నపుడు అనిపించింది—ఏమిటో పోగొట్టుకొన్నట్లు; మణిని పోగొట్టు కొని గాజుపెంకును అరచేతిలో దాచుకొన్నట్లూ......ఇది నిజంగా వ్రతభంగమే; తపోభంగమే తనకు! కాని ఎవరిది తప్పు? ఇందు లోనూ తన యిష్టానిష్టాలకు అతీతమైన పరిస్థితుల ప్రాబల్యమే గోచరిస్తోంది. తనకు వినిపించిన మాటలూ, కనిపించిన దృశ్యమూ, చలమయ్య ముష్కరత్వం అలాంటివి—క్షణంలో అంతా జరిగి పోయింది. పద్మమణిని రక్షించటం, చలమయ్యతో ముష్టి యుద్ధం; తన్నుతనే మరిచిపోయాడు. ఆ సంఘటన తర్వాత పద్మమణితో తన ప్రవర్తన నడిచినస్థాయి వేరుగావుంది. ఆమెను ఒక్కసారిగా తనదిగా భావించి స్పృశించటంతో తన శరీరమే పెత్తనం సాగించింది. పద్మమణి తనలో వెలిగించే జ్యోతి శరీరాను భూతిలో యిముడని తత్త్వంగా తనకు అందకుండా పోయింది! మిగిలింది కేవలం శరీర సుఖం!

సన్నజాజుల వాసన....

తార పలకరిస్తోంది: "ఏమండీ, మంచినీళ్లు కావాలా?".. వినిపించినా పలకలేదు. శ్రీధర్. "ఏమిటి, అప్పుడే నిద్ర పోయారా?" అంటోంది దగ్గరకు వచ్చి...ఊఁ?" అన్నాడు... "మంచినీళ్లు?" "వద్దు" అన్నాడు, కళ్లుమూసుకునే. తార వెళ్లిపోతున్న కదలికలో ఆమె కోపాన్ని పసిగట్టాడు. ఆమె వెళ్లి దీపాన్ని "ఉఫ్" అని గట్టిగా వూది ఆర్పేసింది.

'మంచినీళ్లు' భార్యభర్తల మధ్య దీపం ఆర్పివేయటానికి పూర్వం, ఒక సంకేతం. అలవాటు మీద ఏర్పడిన సంకేతం—యిద్దరూ ఒకమంచం మీద చేరటానికి. ఆమె పడుకొంటూం డగా ఒక్కొక్కసారి శ్రీధర్ 'తారా మంచినీళ్లు కావాలి' అంటాడు. 'లేచి వెళ్లి తాగండి' అంటుంది తన అసమ్మతిని సూచిస్తూ. వెంటనే ముసుగు బిగతీసి పడుకుంటుంది. లేకపోతే 'అప్పుడే తాగకూడదా కావలసినన్ని?' అంటూ లేచి ఏమీ తెలిని ముగ్ధలా మంచినీళ్లు గ్లాసునిండా పట్టుకొస్తుంది. భర్త గ్లాసుతోపాటు ఆమె చేతినికూడా పరిగ్రహిస్తే సిగ్గూ విసుగూ నటిస్తూ పక్కన చేరుతుంది. ఒక్కోసారి తార యాదాలాపంగా అడుగుతుంది, 'దీపం తీసెయ్యనా' అని, అప్పుడు శ్రీధర్ ఆమెను కోరటం జరుగుతుంది...ఇవాళే ఆమెను మొదటిసారిగా నిరాకరించాడు.

"సాయంత్రం ఎక్కడికి వెళ్లారేమిటి, చాల ఆలస్యంగా వచ్చారూ?" అని అడుగుతోంది తార చీకట్లోంచి. శ్రీధర్ జవాబు చెప్పలేదు. "మిమ్మల్నే, అప్పుడే నిద్రా?...ఇవాళ చదువుకోనూ

లేదు...ఏమిటి స్కూల్లో అంత తలమునకలుగా వుందావని? అలసిపోయినట్లున్నారు!...ఏమి ఉద్యోగమండీ! బతకలేక బడి పంతులు అన్నారు. మానాన్న మంచి ఉద్యోగం వేయిస్తానంటె వద్దన్నారు. హాయిగా పొలం దున్నుకున్నా నయం! మిమ్మల్ని అని లాభమేమిటి, నాఅదృష్టం...ఇటు ఇంట్లో చాకిరీ చేసుకోలేక, పిల్లల్తో వేగలేక నేను చస్తున్నాను. అటు మీరు ట్యూషన్లూ, స్కూలూ, పైగా ఎలక్షను డ్యూటీలు ఒకటే యాతన పడు తున్నారు! ఏం సుఖం? మా అక్కయ్య చూడండి, వాళ్ల కీపిడాది రైసుమిల్లులో ముప్పైవేలు లాభం వచ్చిందట—మరచిపోయా, మురళీని బాపట్ల డాక్టరుగా వేశారట....'' మురళీ సంగతి విని మౌనంగా వుండలేకపోయాడు శ్రీధర్. ''ఎప్పుడొచ్చింది వుత్తరం?'' అన్నాడు.

''మేలుకునే వున్నారన్నమాట! అప్పుడే నిద్రపోయినట్లు నటించారే!''

''ఉత్తరం.''

''మధ్యాహ్నం మీ రెళ్ళాక వచ్చింది...పాప అప్పుడే చిం చేసింది కూడా.''

''ఎవరు మీ అక్కగారేనా వ్రాసింది? అయితే నువ్వే చించి వుంటావు అందులో ఏవో పేచీ విషయాలుంటే..''

''ఏం కర్మ? అలాంటివి మీరూ మీవాళ్లూ చేసేవి! నాకేం భయంలేదు! అవును, ఏమైనా రాస్తుంది! ఏం? మీ ప్రయోజ కత్వాన్ని చూచి లోకం మురిసిపోవాలా?' 'ఏమిటే, నీకు మరది అసలు తిండి పెడుతున్నాడా? ఉత్తరమే రాయలేదు, కార్డు ముక్కన్నా కొని పెడుతున్నాడా?'అని యోగక్షేమాలు వ్రాసింది... ఇంకా చెప్పమంటారా?''

శ్రీధర్ పలకలేదు. ఇదంతా మామూలు రోకటి పాటే అయిపోయింది అతనికి. తార అలాగే మరికొన్ని మాటలు అంటూ గొణుక్కుంటూ నిద్రలోపడింది.

శ్రీధర్ ఆలోచన సాగుతూనే వుంది...తను పద్మమణిని వివాహమే చేసుకుని వుంటే ప్రేమ వివాహమే అయినా ఈపాటికి పద్మకూడా తారలాగే ''మంచినీళ్లు కావాలా?'' అంటూ వుండక, ఇంకోవిధంగా ఎలా వుండేది?...ఇదంతా మంచినీళ్లు తాగటమే!... గ్లాసులు భిన్నంగా వుండవచ్చు, తాగేవి మంచినీళ్లే!...'పూవులు వేరు, మధువొక్కటే' అన్నదే చంద్రావతి. మద్రాసులో దానికిదే అర్థమా? అదే నిజమా? ఆమెతో స్నేహం చేసినందుకు రౌడీల చేత దెబ్బలు తిన్నాడు! తన మీద జరుగుతున్న ప్రచారానికి అప్పు డెంత భయపడ్డాడు! ఇప్పుడు చలమయ్య బెదిరంపులకి చీమ కుట్టినట్లైనా లేదు!—అదీ తనలో వచ్చిన మార్పు! చంద్రావతి పట్ల నిలుపుకోలేని విశ్వాసం, యిప్పుడు పద్మమణిపట్ల ఎలా నిలుపుకోగలుగ తున్నాడు! పద్మమణి ఏ విధంగా ఆదర్శమూర్తి? పతివ్రతకాదు, భారతీయ సంస్కృతికి ప్రతినిధి కాదు, ఏమీ కాదు! ఒకనాటి స్వప్నం. ఆమె సాన్నిధ్యం తనలో ఏమిటో ఆనం దాన్ని కలిగిస్తుంది, ఎందుకు? ఆ ఆనందం కేవలం వాంఛ, శారీర కానుభవం తాలూకు ప్రతీక్ష కాదు....అని తెలిసింది యివాళే! ఇదమిత్థమని దాని ఆధారాన్నీ, ఉపాధుల్నీ నిర్ణయించటానికి వీల్లేని స్వాప్నికానందం! తన్మయత్వం! దాన్ని యివ్వాళ 'మట్టి పాత్ర' తో కొలిచే ప్రయత్నం విఫలమైంది! కాని యిందులో ఏది సత్యం, ఏది అసత్యం? 'మట్టిపాత్రే' సత్యం కదా బహి రుపాధుల్నిబట్టి? అందులో యిముడని 'స్వప్నం' అసత్యమే అనాలి. కాని ఆ'స్వప్నం'—ఏళ్ల తరబడిగా తనలో దాచుకున్న 'స్వప్నం' — అదే లేకపోతే 'మట్టిపాత్ర 'కూ కేవలం శరీర సుఖానికి విలువేమిటి? ఆ 'స్వప్నం' తనలో వికసించటం వల్లనే జీవితం మీద అధికారం, యిదివరకులేని స్వేచ్ఛ,ధైర్యమూ,ఆసక్తీ తనకు లభ్యమయ్యాయి! ఏ సమస్యను కానీ ఎదుర్కోగల ఆత్మవిశ్వాసమూ తనలో కలుగు తోంది! ఆ స్వప్నమే ఆదర్శాలు శిథిలమైన తనకు ధ్రువతార! అది తన ఆత్మశక్తి!

పద్మమణి పరీక్షలు వ్రాయటానికి నెల్లూరు (ఆంధ్రా యూనివర్శిటీ అప్పట్లో) వెళ్లింది. అక్కడినుంచీ పరీక్షలు బాగా వ్రాశాననీ, తల్లికి జబ్బుగావుందనీ, తను పినతల్లి యింటికి వెళ్లి తల్లిని తీసుకువస్తాననీ ఉత్తరం వ్రాసింది.

శ్రీధర్ చలమయ్యలు మాట్లాడుకోవటంలేదు. పరో క్షంగా తనను గూర్చి, తన నైతిక ప్రవర్తనను గూర్చి చలమయ్య విమర్శిస్తున్నాడని ఒకరిద్దరి ద్వారా శ్రీధర్‌కు తెలియవస్తూనే వుంది. శ్రీధర్ యీసారి ప్రచారాలనూ, తనను గూర్చి యిత రులు అనుకునే మాటల్నీ పట్టించుకోదలచుకోలేదు.

ఒకరోజు బజారులో వెళ్తూవుంటే సోడాకొట్టు దగ్గర కూర్చున్న రంగడు లేచి దగ్గరకువచ్చి 'అన్నా బాగున్నావా?' అన్నాడు. వాడు తనను పలకరించటం ఆశ్చర్యం కలిగించింది. ''ఆc...నువ్వు బాగున్నావా? ఏం విశేషం?'' అన్నాడు శ్రీధర్. ''ఏమీలా....ఊర్కేనే...యింటికేనా?'' ''ఇదుగో ఏవో యింటికి వస్తువులు కావాలంటేనూ...'' అంటూ శ్రీధర్ ఒక దుకాణంలో ప్రవేశించాడు. రంగడు కూడా వెంటనే వుండి శ్రీధర్ వస్తు వుల్ని కొన్న తర్వాత ఆసంచీ తను తెస్తానని పుచ్చుకున్నాడు.

రంగడు చిన్నతనంలో శ్రీధర్‌తో ఆడుకునేవాడు. నాలుగో తరగతిలో సహాధ్యాయి. తర్వాత బడి మానేశాడు. అటు వ్యవ సాయానికీ పనికిరాలేదు. అల్లరిగా తిరుగుతూ వుండేవాడు. తల్లిదండ్రుల్ని పీడించి యింట్లో ధాన్యం దగ్గరనుంచీ, తల్లి మెళ్లో గొలుసుదాకా కొల్లగొట్టేశాడు. తండ్రిపోయాక దొంగ తనాలు చేస్తూ ఒకసారి జెయిలుకు వెళ్లాడు. ప్రస్తుతం వాడి వ్యాపకం జూదగృహాల దగ్గర కాపలా; అప్పుడప్పుడు చిల్లరకొట్లు వర్తకు లొకరిద్దరి మీద దాడి (దాని క్కారణం వాళ్ళు తనుతెచ్చిన దొంగసొత్తుల ధర యింకా పూర్తిగా ముట్టజెప్పలేదని తిట్లలో వివరిస్తూ వుంటాడు)-వాళ్ళు వాడికి సిగరెట్లూ, అగ్గిపెట్టెలూ నైవేద్యంగా సమర్పించుకొంటూ శాంతింపజేస్తూ వుంటారు!

ఈ రంగడు శ్రీధర్‌ను ఎప్పుడైనా పలకరిస్తుంటాడు కాని యిలా ఎప్పుడూ వెంబడించలేదు. ఏదో విశేషమే వుందని గ్రహిం చాడు శ్రీధర్. ఇంటికి వస్తూ రంగడు శ్రీధర్‌తో అన్నాడు ''ఈమద్దె మా బళ్లో శలమయ్య అనే టీశరొస్తే నీకు తగాదా వచ్చి నువ్వు వాణ్ణి పట్టుకుని కొట్టినావంటే...ఆమాట నేను నమ్మ లేదనుకో...ఏం దబ్బా! మా అన్న ఎప్పుడూ తన పదువేమో

తనేమో, అంతేగాని అసలు ఆడోళ్ల జోలికే పోడే! నాకు తెలీదా!.. ఈ తగాదా అంతా శలమయ్యే పుట్టించి వుంటాడు అన్నాను. వాడు నారిగాడికీ మస్తానుగాడికీ సారాయి బోయించి, నిన్ను సూపించి, సమయంసూసి కొట్టమని పురమాయించినాడు మొన్న...వాళ్లు నాతో యీ మాటంటే అరెరెరె ఆయన మా అన్నయ్యే, మీరాయన జోలికి పోతే మీ పుచ్చె లెగరగొడ్తా!...నేన డుగుతా వూరుకోండి అనిజెప్పి, నిన్నడుగుతే ఏమాటా తెలుస్తుంది గదా అని, అందుకే నువ్వు బజార్లో అగుపడితే ఎంబడే వొస్తి... ఏందంటావ్ యీ సంగతి?''

శ్రీధర్ రంగడికి అర్థమయ్యే విధంగా తనకూ పద్మమణికీ గల స్నేహాన్ని, చలమయ్య పద్మమణి మీద చెయ్యబోయిన అత్యాచారాన్నీ, తను సమయానికి వెళ్లి అడ్డుపడటాన్నీ వివరించాడు. అంతావిని రంగడు ''అదా సంగతి! వాడు జెప్పేది అది కాదు, నువ్వే ఆపిల్లదాన్నేమో అంటే, తను మర్యాదకాదయ్యా అని బుద్ధిజెప్పబోతే అప్పుడు నువ్వు కొట్టి అవమానం చేస్తి వుంట...వాడు పార్టీ నంబరంట గూడా...'' ''అవును రంగయ్యా! అందుకే ఆ గుండెలు! లేకపోతే పొట్ట చేత్తో పట్టుకుని ఈవూరికి వచ్చి, మాయింటి దగ్గర మా ఆశ్రయంలో వుండి, మా సాయం పొంది, ఈ రోజు నన్ను కొట్టించేదానికి సిద్ధమౌతాడూ! దిక్కులేని ఆడమనిషి మీద దౌర్జన్యం చేసింది చాలక, సిగ్గు లేకుండా నన్ను సాధిస్తామను కుంటున్నాడా? అవును, ధైర్యం రాదూ మరి! మానాన్న పోయారు; మేం అన్నదమ్ములం వేరుపడ్డా, నాకు వెనకాల బలగమేముందీ! ఎందుకూ కొరగాని బడిపంతుల్ని; నేను ఏపార్టీ వాళ్లలోనూ చేరలేదు! నాకు రక్షణేమిటి? వాడు కొట్టిస్తే పడాల్సిందే మరి రంగయ్యా!...కాలం మారిపోయింది, ఉన్న ఊరైనా పరాయి ఊరైనా ఇప్పటి పరిస్థితియిదీ!'' అన్నాడు శ్రీధర్.

''అదేమిటన్నా మేమంతా సచ్చిపొయ్యామా? ఎంత శెడినా మనమంతా ఒకటే!నేను సూసుకుంటాలే! నీ కెప్పుడన్నా అవసరమొస్తే నాతో ఒకమాట సెప్పు సాలు...శలమయ్యేం జేస్తాడు శెలమయ్య! సరే నే నొస్తా...'' అని వెళ్లిపోయాడు రంగడు.

ఆ తర్వాత మూడు రోజులకి చలమయ్యను సినిమాదగ్గర రౌడీలు తన్నారని స్కూల్లో చెప్పుకున్నారు. వాళ్ల తాలూకు స్త్రీని సినిమా వదలి పెట్టిన తర్వాత వస్తుంటే చలమయ్య అమర్యాదగా పిలిచాడనే కారణంగా, ఆ స్త్రీ బూతులు తిట్టటం... రౌడీలు తన్నటం, అంతా గబగబా రెండు నిముషాల్లో జరిగిపోయిందట. తర్వాత చుట్టూ జనంచేరి పెద్దగోల జరిగిందట. ''ఏమయ్యా, బడిపంతులివి, అలగావాళ్లతో నీ కెందుకు?'' అంటూ పదిమందీ సానుభూతి చూపుతూ బుద్ధి చెప్పారట. చలమయ్య స్కూలుకి రాలేదు.

ఆ వేసవి సెలవుల్లో చలమయ్యను పుత్తూరు స్కూలుకు బదిలీ చేశారు. అతను రాచకీయాల్లో జోక్యం కల్పించుకున్నట్లు రిపోర్టు వచ్చిందనీ, అటువంటి రిపోర్టులకిక మీద అవకాశం యివ్వ కూడదనీ వార్నింగ్ కూడా వచ్చిందట.

శ్రీధర్‌తో యీసంఘటనలు ఎన్నో ఆలోచనల్ని రేపాయి. చలమయ్యను రౌడీలు తన్నటానికి తనే కారణమేమోనని అనుమానం కలిగి, రంగడు కనిపిస్తే పిలిచి అడిగాడు కూడా. ''అబ్బే, లేదన్నా! ఎవడి పాపాన వాడు పోతాడు...వాడికి ఆడవాసన అంటే ముక్కు తెగరెయ్యటం వుందంట, అందుకే మావాళ్లు మక్కెలిరగదన్నారు...'' అన్నాడు నవ్వుతూ. బహుశా చలమయ్య ఆ స్త్రీని నిజంగా ఏమైనా సరాగ మాడాడేమో! లేక రౌడీలు ఆ స్త్రీ ద్వారా చలమయ్యకు పరీక్ష పెట్టారో! సమాజంలో అడుగు పొరలోని వ్యక్తులు కూడా మరీ గుడ్డిగా ప్రవర్తించరనీ, వాళ్లల్లోనూ న్యాయాన్ని గూర్చిన స్పృహ వుంటుందనీ, వాళ్లు తెలివి తక్కువ వాళ్లు కారనీ గ్రహించాడు శ్రీధర్.

చలమయ్య చరిత్రను పర్యాలోచన చేస్తుంటే మార్క్సిజమ్ దేశంలో పేదల్నీ దీనుల్నీ ఒకవైపు మనుషుల్ని చేస్తూనే మరొకవైపు వాళ్లమీద సారామత్తులాగా ఎలా పనిచేస్తున్నదీ, పాశవిక ప్రవృత్తుల్ని ఎలా ప్రకోపింప జేస్తున్నదీ అవగతమైంది శ్రీధర్‌కు. ఆర్థిక సమానత్వం; అందరికీ తిండీ, బట్టా, యిల్లూ; సమాజంలో సమానమైన అవకాశాలూ—సాధించదగిన లక్ష్యాలే; కాని ఆ లక్ష్యసాధన మనిషి అంతరంగిక సంస్కారాన్ని ధ్వంసం చెయ్యకూడదు!...తనకి పెద్దగా డబ్బు లేకపోయినా, కార్లూ మేడలూ లేకపోయినా, తను ఏ ధనవంతుడికీ సంస్కారంలో తీసిపోడు; ఎవరి ఎదుటా భయపడుతూ సిగ్గుపడుతూ ప్రవర్తించడు. తన వ్యక్తిత్వం యిచ్చే ఆత్మవిశ్వాసం తనకు ఎప్పుడూ వుంది; ఇది కేవలం కార్లూ మేడలూ యిచ్చే ఆత్మవిశ్వాసం కాదు! చదువూ, స్వతంత్రమైన ఆలోచనా యిచ్చే ఆత్మవిశ్వాసం! దీని బదులు ధనవంతుల మీద వర్గద్వేషాన్ని పెంచుకుని దాన్నే ఆత్మవిశ్వాసంగా భ్రమపడే వ్యక్తులు నినాదాలతో తృప్తిపడి, జన్మహక్కైన తమ వ్యక్తి స్వాతంత్ర్యాన్నీ సంస్కారాన్నీ పార్టీకి అప్పగిస్తారు. పార్టీ అండనీ, అదియిచ్చే మద్దతునీ చూచుకుని మత్తెక్కిన వాళ్లలా ప్రవర్తిస్తారు. అలాంటివాళ్లకి భవిష్యత్తు ఏమిటి? ధనికవర్గాల వారి అధికారాన్నీ అదుపునీ తప్పించుకోవాలని చూస్తూ పార్టీ యంత్రానికి బానిసలు కావటం తప్ప! ఈ దుర వస్థ పోవాలంటే చదువూ సంస్కారం అభివృద్ధి చెందాలి. స్వతంత్ర భావాల్ని జనం ఊపిరిగా పీల్చుకోవాలి. ఈ లక్ష్యం ఆర్థికమైన జీవితావసరాలను గూర్చిన లక్ష్యాలకు ఎందులోనూ తీసిపోదు. వాటికంటె ముఖ్యమైంది కూడా! బీదవాడైనా చలమయ్య స్వయంగా తిండీ బట్టా సాధించాడు. సంస్కారం ఎప్పుడు సాధిస్తాడు? పార్టీలో ప్రవేశించిన అతని సంస్కారం రంగనివంటి రౌడీల సంస్కారాని కంటె తగుస్థాయిలో వుందే! వాళ్లలో వాళ్లకున్న ఆప్యాయతా, స్నేహధర్మం, న్యాయదృష్టి చలమయ్యలో లోపించాయే! లేకపోతే శేషాద్రిగారూ, పద్మమణి, తనూ, ఏం చేశారని చలమయ్య యిలా అవిశ్వాసంతో ప్రవర్తించటం!... రాచకీయాలవల్లా, రాచకీయపార్టీలవల్లా మనుషుల్లో సంస్కారం, సమరసభావం తరుగుతూ వుండేతప్ప పెరగటంలేదే!

21

ఓబయ్య నరసింహులిమీద వ్యాజ్యెం వేసి రెండేళ్లు కావస్తోంది. వాయిదాలమీద వాయిదాలు పడుతున్నాయి. నరసిం

హాలు వూరుకోలేదు. ఓబయ్య తన పొలంలో ప్రాత బావిని లోతుచేసి పునర్నిర్మాణం చేసేందుకని గవర్నమెంటు దగ్గర నుంచీ రెండువేలు కొంత సహకారధనంగా, కొంత ఋణంగా పొందాడనీ, అది డిప్యూటీ తాసిల్దారుకు లంచంపెట్టి సాధించాడనీ, యింతవరకు పూడిపోయిన తాలూకు గొయ్యి అలానే ఉందనీ, కలెక్టరును ఈ విషయమై విచారించవలసినదిగా పిటీషను పెట్టాడు. ఈ సంగతి బయటికివచ్చి విచారణ జరిగితే ఓబయ్య మొత్తం డబ్బు వెనక్కి కట్టవలసి రావటమేకాదు, తన పొలం నేరేడుమ్రాను బావి నీటితోనే పూర్వంనుంచీ సాగయ్యేది అనే ఓబయ్యతరపువాదనని ఖండించేందుకు వీలు దొరుకుతుందనీ, నరసింహులు అలాచేశాడు.

పిటీషను విచారణకు వచ్చేసంగతి ముందుగానే ఒక గుమాస్తాద్వారా తెలిసింది ఓబయ్యకు. వచ్చి శ్రీధర్‌తో చెప్పాడు. తను శ్రీధర్ చదువు కిచ్చినడబ్బు యిప్పుడు తనకు అవసరంగా కావలసి వచ్చిందనీ, శ్రీధర్ సర్దితేగాని వీల్లేదనీ కూర్చున్నాడు. శ్రీధర్ బాంక్‌లో వెయ్యి రూపాయలు దాచుకున్నమాట నిజమే. ట్యూషన్‌లు చెప్పి ఆర్జించిన డబ్బు. దానితో యింట్లో అందరికీ మంచి బట్టలు కొనాలనీ, ఫర్నిచర్ కొనాలనీ, వేసవి సెలవుల్లో బెంగుళూరు, మైసూరు సరదాగావెళ్ళి ఆ పని చేయ్యాలనే ఉద్దేశంతో శ్రీధర్ దాచాడు. కాని ఓబయ్య తన కిది ప్రాణాంతకమైన అవసరమనీ, తన పరువుదక్కదనీ కూర్చున్నాడు. తార కూడా ఇంటి అవసరాలని అలావుంచి ఆ వెయ్యి రూపాయలూ ఓబయ్యకు యివ్వమనే అన్నది. పైగా తన మెడలోని గొలుసు కూడా యిచ్చింది. శ్రీధర్‌కు యిది న్యాయంగానే తోచింది. సమయానికి ఓబయ్య తన చదువుకు సాయం చేశాడు మరి! ఆ విశ్వాసం తనకు ఉండాలి కదా! ఈ గవర్నమెంటు ఋణం సంగతి తెలిశాక ఓబయ్య వ్యవహారా లెలా నిర్వహిస్తున్నాడో అని అతని సమర్థతమీదా అనుమానం కలిగింది. శ్రీధర్ ఓబయ్యకున్న లావాదేవీల సంగతి వూళ్ళో వాకబు చేశాడు శ్రద్ధగా. ఓబయ్య తన పొలాన్నీ, ఇంటినీ యిదివరకే తనఖాపెట్టి బాగా ఋణగ్రస్తుడై ఉన్నాడని తెలిసింది. ఓబయ్యకు వ్యవసాయంలో శ్రద్ధ, జాగ్రత్త తక్కువ కావటంవల్ల దుబారా ఖర్చు, అనవసరమైన నష్టమూ ఎక్కువగా ఉంటోందనీ, దక్కవలసిన ఫలితం దక్కటంలేదనీ కూడా శ్రీధర్‌కు క్రమంగా తెలిసివచ్చింది. లేనిపోని డాబులకుపోతూ, ఋణంచేసి తెచ్చినడబ్బు జేబులో గలగలలాడించుకొంటూ, మధ్యవర్తిగా, పెద్ద వ్యవహర్తగా నలుగుర్లో తిరగాలని ఓబయ్య ఆశయమని గ్రహించటానికి అతనికి ఎంతోకాలం పట్టలేదు.

ఓబయ్య గవర్నమెంటు డబ్బు తిరిగి కట్టేశాడు. లంచం తిన్న డిప్యూటీ తాశిల్దారు చిక్కులో పడ్డాడు; యిలాంటివే మరికొన్ని కేసులు కూడా ఉండటంతో అతనికి ఉద్యోగం తగ్గించారు.

ఓబయ్య తన వ్యాజ్యంలో కూడా పై విషయాన్ని ఎదుర్కోవాల్సి వచ్చిందికాని రామలింగయ్య తండ్రి కాలంలోనే ఓబయ్య పొలంలో బావి పూడిపోయి ఉండటం మూలాన ఒక పర్యాయం నేరేడుమ్రాను బావి మరామత్తుకు ఓబయ్య తండ్రి పెద్ద మొత్తంయిచ్చి ఆ బావి నీటిలో హక్కు భుక్తాలు వ్రాయించుకుని ఉండటంవల్ల ఆ పాత అగ్రిమెంటు కాయితం పైకి రావటం మూలంగా ఓబయ్య తన కేసు గెలిచాడు. ఆవిధంగా కాలం మడతలలో అడుగునపడ్డ ఒక సత్యం బయట పడింది! ఇది కూడా శ్రీధర్‌కు ఒకవిధమైన కనువిప్పు కలిగించింది. న్యాయమనేదీ, సత్యమనేదీ ఒకరి పక్షాన్నే ఎప్పుడూ ఉంటుందనుకోవడం భ్రమ. తన తండ్రిగారు ఎంత ఉత్తములైనా, ఆయన ఎక్కడో అక్కడ, తెలిసో తెలియకో స్వార్థంతో వ్యవహరించి ఉండకపోలేదనే అభిప్రాయం ఏర్పడ్డది. లోకంలో మంచివాళ్ళుగా కనిపించే వాళ్లవల్ల ఎక్కడా అన్యాయం జరగదనీ, చెడ్డవాళ్ళుగా కనిపించే వాళ్లవల్ల ఎప్పుడూ న్యాయం నిలబడదనే అనుకోవటం ఒక రకమైన అజ్ఞానం. ఏ విషయమైనా ఎప్పటికప్పుడు నిష్పక్షికంగా లోతుకు వెడితేగాని సత్యం బోధపడదు. ఇలా ఆలోచిస్తూవుంటే శ్రీధర్‌కు తనకు తెలిసిన మంచివాళ్ళల్లో లోపాలూ, చెడ్డవాళ్లల్లో సుగుణాలూ ఎన్నో గోచరించాయి. జీవితం, విస్పష్టమైన వర్ణ రేఖా చిత్రంకాదు, అలుక్కుపోయిన వర్ణాంకిత చిత్రంగా కనిపించింది—ఇందుకో విశ్లేషించి వేర్వేరు భాగాలుగా తెలుసుకోవలసిన దానికంటె, యథాతథంగా మిశ్రమంగా గ్రహించవలసిన సత్యమే ప్రధానంగా తోచింది. ఏమంటే విశ్లేషణకు అంతూ పొంతూ కనిపించటంలేదు. ఎంతదూరమైనా సూక్ష్మాతి సూక్ష్మంగా విశ్లేషిస్తూ పోవచ్చు; అసంతృప్తి మిగిలే ఉంటుంది. కాని మొత్తంగా సమాహారంగా గ్రహించటంలో ఆబాధ లేదు; జీవితంలో ఏకత్వం సిద్ధిస్తుంది, తృప్తి లభిస్తుంది!

ఆంధ్రరాష్ట్ర అవతరణం సందర్భంలో తార అక్కయ్య నాగరత్నమ్మ ఆమె భర్త మద్రాసునుంచీ కారులో కర్నూలు వెడుతూ మదనపల్లిలో దిగారు. వాళ్ళున్నది ఒక్కరోజే అయినా వాళ్ళ ప్రభావం తారమీద పని చెయ్యటం, తత్ఫలితంగా ఆమె ప్రవర్తనలో కనిపించిన ఆకస్మికమైన మార్పు శ్రీధర్‌కు దుర్భరమైంది. శ్రీధర్ వేరు కాపురం పెట్టిన తర్వాత ధనాభావంవల్ల క్రొత్తగా గృహాలంకరణ వస్తువులు, అవసరమైనవి కూడా ఏమీ కొనలేకపోయాడు. తారకూ పిల్లలకూ రెండేళ్లనుంచీ మంచి బట్టలు లేవు. నాగరత్నమ్మ వచ్చీరాగానే ఈ లోపాన్ని గుర్తించటం, తత్ఫలితంగా తార మనస్సు చిన్నబుచ్చుకుని, ఆ కోపాన్నీ విరసాన్నీ శ్రీధర్‌మీద చూపటం జరిగింది. దానికితోడు తార మెళ్లో గొలుసు లేకపోవటానికి కూడా శ్రీధరే కారణమన్న ధోరణిలో నాగరత్నమ్మ మాట్లాడేటప్పటికి శ్రీధర్‌కు బాగా కోపం వచ్చింది. ఆ సందర్భంలో తార తను స్వయంగా యిష్టపడి గొలుసును ఓబయ్య అవసరానికి యిచ్చినట్లూ, అందులో శ్రీధర్ బలవంతమేమీ లేనట్లూ అక్కయ్యకు వివరించకుండా మౌనం వహించింది! ఈ విషయమై బాగా గొడవ జరిగింది. శ్రీధర్ దారిద్ర్యాన్నీ, చేతగానితనాన్నీ ఎత్తిపొడుస్తూ నాగరత్నమ్మ చెల్లెలి దారిద్ర్యానికి జాలిపడుతూ ఒక ఏడుపు ఏడిచింది. శ్రీధర్ నిరుత్తరుడయ్యాడు. ఆ సందర్భంలో నాగరత్నమ్మ భర్త పలికిన సాంత్వన వాక్యాలు మరీ దుర్భరంగా ఉన్నాయి. నాగరత్నమ్మ మరునటిరోజు తారనూ, పిల్లల్నీ తనతో రమ్మని ప్రయా

ణానికి సిద్ధం చేసింది. కర్నూలునుంచే సరాసరి తారను బందరు తీసుకువెళ్తానసీ, తనకు తండ్రి వెంకయ్యగారు కూడా వీలైతే అలా తారను తీసుకురమ్మని ఉత్తరం వ్రాశారనీ, శ్రీధర్‌తో యదాలాపంగా చెప్పింది. ప్రయాణం విషయమై తార శ్రీధర్‌తో ఒక్కమాటైనా ప్రస్తావించకుండానే సిద్ధమైంది.....ఆమె పిల్లల్తో కారెక్కి వెళ్ళిపోతూవుంటే శ్రీధర్ చూస్తూ నిలబడి పోయాడు.

పద్మమణి ఇంటరు పరీక్షప్యాసై బి. ఏ. కు చదువుతోంది. ఆమె తల్లి అస్వస్థతతో మరణించి ఏడాది అయింది. ఆరోజు చలమయ్య అత్యాచారానికి అడ్డుపడటంతో పద్మమణితో అతని సంబంధం మరింత సన్నిహితమైనప్పటికీ, తర్వాత ఆ విషయమై నిశితంగా ఆలోచించి క్రమంగా పద్మమణి సమక్షంలో నిగ్రహాన్నే అవలంబిస్తూవచ్చాడు శ్రీధర్. ఒకటి రెండుసార్లు ఈ విశేషాన్ని గమనించిన పద్మమణి కూడా అతని నియమాన్ని గౌరవిస్తూనే వచ్చింది. దానితోపాటు, శ్రీధర్ ఏడాదిగా తార పట్ల తన ధర్మమేమిటో తు. చ. తప్పకుండా పాటించాలనే ప్రయత్నంలోనే ఉన్నాడు. ఈకాలంలో అతనికి తార క్రొత్తగా అర్థమౌతూ వచ్చింది కూడా—తారకు స్వతహా వ్యక్తిత్వమంటూ లేదు. మొదట్లో తల్లిదండ్రుల ప్రభావంవల్ల ఒకరకంగా ప్రవర్తిస్తూ తనకు అసంతృప్తి కలిగిస్తూ వచ్చింది. ఆ ప్రభావం ఆమెమీద పనిచెయ్యని సమయాల్లో మద్రాసులో కాపురం పెట్టిన కొద్దిరోజులూ, ఆమె అనుకూలవతిగానే ఉండేది. తర్వాత ఓబయ్య, మంగమ్మా ఆమెకు మార్గదర్శకులయ్యారు. వాళ్ల యిల్లు వదలి వేరుకాపురం పెట్టిన తర్వాత ఆ ప్రభావంనుంచీ కూడా చాలవరకు విడుదల కలగటంతో, ఆమె ప్రవర్తనలో, మాటల్లో తనకు మళ్లీ అనుకూలమైన మార్పు కనిపించింది. దానితో తన వివాహ జీవితాన్ని యిప్పటికైనా స్వచ్ఛందంగా నిశ్చలమైన ఒక ప్రాతిపదికమీద నిర్మించుకోవాలనే ఆశాభావం శ్రీధర్‌లో కలిగింది. అప్పటినుంచి ఆత్మ విమర్శ చేసుకుని తనకు పద్మమణితోగల సంబంధాన్నీ, తారతోగల సంబంధాన్నీ వేర్వేరుగా స్వధర్మయుక్తంగా, నియమబద్ధం చేసుకునే ప్రయత్నంలో ఉన్నాడు.

కాని ఈ ఏడాది ప్రయత్నమూ సముద్రపు టొడ్డున కట్టిన ఇసుకగూడులా ఒక్క తరంగంతో ఎలా కొట్టుకుపోయిందో, తారతో తను భర్తగా నిర్మించదలచుకునే సంబంధానికి ఎప్పటికీ అస్థిరత్వమే విధిగా ఎందుకు వ్రాసిపెట్టివుందో అవగతమవుతూండగా శ్రీధర్ తారా పిల్లలూ ఎక్కివెళ్లిన కారు వైపే చూస్తూ నిలబడిపోయాడు. తారకు వ్యక్తిత్వం లేదు! తనదైన విలువలూ, వూహలూ అంటూ ఏమీ ఆమెకు లేవు! అవి ఏర్పడటానికి తగిన మనస్తత్వం ఏదీ? ఏ వాతావరణంలో, ఏ వ్యక్తుల మధ్యవుంటే వాళ్ల ప్రభావానికి లోబడుతుంది. డబ్బూ, దర్పమూ, మేడలూ, కార్లూ, ఆమె పుట్టింటివాళ్లు మొదటినుంచీ చూపుతున్న విలువలు. వాటితో శ్రీధర్ పోటీ పడగలిగితే ఆమె బహుశా అతని ప్రభావాన్ని సహజంగా అంగీకరిస్తుంది! అంతేకాని 'నాలో కేవలం డబ్బు యివ్వలేని సంస్కారం వుంది; యిది అంతకంటె ముఖ్యమైన విలువలు' అని శ్రీధర్ అంటే అతని ప్రభావానికి విధిలేక తాత్కాలికంగా లొంగినా, ఆ విశిష్టత తను గుర్తించి విశ్వాసంతో అంగీకరించే వ్యక్తిత్వం, స్వయం నిర్ణయశక్తి ఆమెకు లేనే లేదు! పుట్టింటినుంచీ ఎంతదూరంగా వున్నా, అటునుంచి ఉత్తరం వచ్చిన రోజున ఆమెలో కలిగే అలజడీ, వైఖరిలో కలిగే మార్పూ, ఎప్పటికప్పుడు ఆమె చాంచల్యాన్ని వ్యక్తం చేస్తూనే వచ్చాయి! కాని తను నిరాశ చెందలేదు. క్రమంగా తను జీవితంలో పాఠాలు నేర్చుకుంటూ వచ్చినట్లే ఆమెలోనూ ఒక వ్యక్తిత్వం రూపొందుతూ వస్తోందని శ్రీధర్ ఆశించాడు; భ్రమించాడు. ఆ ఆశ ఒక్కసారిగా భగ్నమైంది... ఆమె నాగరత్నమ్మతో వెళ్లిపోయింది......

చాలరోజులతర్వాత శ్రీధర్ అన్నయ్య యింటికి వెళ్లాడు. "ఇన్నాళ్లూ కనిపించలేదేం? వ్యాజ్యెం ఓబయ్య వేశాడుగాని నువ్వు వేశావని మేమనుకోలేదే!" అన్నది సూటిగా రుక్మిణమ్మ.

"స్కూల్లో పని తొందర, ట్యూషన్లూ....తారావాళ్లు ఇవాళే వూరికి వెళ్లారు. వాళ్లక్కయ్య నాగరత్నమ్మవచ్చి తీసుకెళ్లింది."

శ్యామలకు జడవేస్తున్న రుక్మిణమ్మ అతని ముఖంవైపు నిదానించి చూచి "నీ కిష్టంగానే పంపావా?" అన్నది.

"ఎందుకట్లా అడుగుతావు వదినా?"

"నీ ముఖంచూస్తే తెలుస్తోంది! వచ్చి రెండేళ్లుదాటిందేమో పుట్టింటికి వెళ్లిరావాలని ఉండదా ఏమిటి? అందుకూ నీకు కష్టమే! వెళ్లి నాలుగు రోజులుండి రానీ!"

"కష్టం లేదు, ఏంలేదు!...అయితే వ్యాజ్యెం సంగతి అన్నయ్య ఏమనుకుంటున్నాడు?.....మరి తాతలనాటి సంగతి, ఉండేహక్కు లేదంటే పోతుందా?"అన్నాడు విషయం మారుస్తూ.

"ఎవరు లేదన్నారు? ఎవరికి పుట్టిందంత అన్యాయం? ఆ సంగతి మొదట ఓబయ్యకే తెలీదు!.....ఆ పాత రికార్డంతా నువ్వే చూసిపెట్టిఉంటావని అంటున్నారు మీ అన్నయ్య. చూసినవాడివి పోనీ ఆ సంగతి వచ్చి చెపితే సరిపోయేది కదా!...కోర్టుల చుట్టూ అనవసరంగా తిరగాల్సివచ్చిందని బాధపడుతున్నారు."

"నేను చూడనే లేదు రికార్డు. అసలు నేను పట్టించుకోలేదు వదినా! ఈ గొడవల్లో తలదూర్చటానికి నాకు తీరికే లేదు."

"ఏమో నాయనా, అంతా మాయ! అన్నీ అనుమానాలూ! మాకేం తెలుస్తుంది నీ సంగతి! పెద్దవాళ్లైపోతే గడ్డాలూ, మీసాల్తోపాటు ఎన్నో విద్యలూ, వ్యవహారాలూ కదా!......వాటి సంగతి ఎట్లాఅయినా ఉండనీ నువ్వు వచ్చిపోతూ ఉండు చాలు!.... రేపు శ్యామలని చూట్టానికి వస్తున్నారు పెళ్లివాళ్లు...... ప్రొద్దున్నే వచ్చెయ్, బడికి సెలవుపెట్టు."

"ఏ వూరు?"

"అనంతపురం. అబ్బాయి బి.ఏ. ప్యాసయ్యాడు. వకీలుకు చదువుతున్నాడు. ఉండేవాళ్లే...... "

శ్యామల ఇంటర్‌మీడియెట్‌లో ఒక పార్టులో పాసయి మానేసింది. "అయితే శ్యామల పరీక్షలకంటె పెళ్లే సులువు అనుకుంటూ ఉందన్నమాట!" అన్నాడు శ్రీధర్.

"అని నీకు నేనొచ్చి చెప్పాను, పాపం!" అంటూ వెక్కిరించింది శ్యామల.

"అయితే ఎందుకు ఫెయిలయ్యావ్? సెప్టెంబరులో ఎందుకు పరీక్షకు వెళ్లలేదూ?"

"నేనేమిటి, నాతో చాలమందే ఫెయిలయ్యారు! సెప్టెంబరుకి ట్యూషన్ పెట్టుకుంటానంటే నాన్న వద్దన్నారు."

"పోన్లే పెళ్లయ్యాక మొగుడి దగ్గర ట్యూషన్ చదివి ప్యాసవుదువుగాని."

"చిన్నాన్నా నీ మాటలన్నీ యిక్కడనేగాని, పిన్నిచేత ఏమాత్రం చదివిస్తున్నావు ట్యూషన్?"

"ఊరుకో, చిన్నాపెద్దా లేకుండా ఏమిటదీ?" అని మందలించింది రుక్మిణమ్మ.

కాని శ్యామల అన్నమాట శ్రీధర్‌లోని గాయాన్ని రేపకుండా పోలేదు. ఆటలాడుతూవుండి ఎక్కడినుంచో హడావుడిగా పరుగెత్తుకు వచ్చిన రామగోపాలాన్ని (రుక్మిణమ్మ కొడుకు) దగ్గరకు లాక్కున్నాడు. "ఒరే, ఆడాళ్లకు చదువురాదుగాని నువ్వు బాగా చదువుకుందువులే!" అన్నాడు యాదాలాపంగా. అయితే నీ కూతుళ్లకు అసలేరాదు!" అంటూ నవ్వింది శ్యామల.

రుక్మిణమ్మ పనిమీద లోపలికి వెళ్లిపోయింది.

"పోన్లేవే, నీకు పెళ్లయి నువ్వు సుఖంగా ఉంటే చాలు" అన్నాడు శ్రీధర్ నిస్పృహగా.

"ఏమిటి చిన్నాన్నా, అలా ఉన్నావ్! పిన్నీ నువ్వూ పోట్లాడుకున్నారేమిటి?" అన్నది శ్యామలదగ్గరగా వచ్చి.

శ్రీధర్ శ్యామలవైపు చూస్తూ చిన్నగా తల పంకించాడు.

"పాపం, పిన్నికి నిన్ను చూస్తే భయం......నేను చెప్పనా, నువ్వు అన్నిటికీ తప్పు పట్టుకుంటావు మహా సీరియస్‌గా...... అసలు నీతో వేగటం కష్టంలే......"

ఈ వ్యాఖ్యానం శ్రీధర్‌కు ఆశ్చర్యాన్ని కలిగించింది.

"అదేమిటి? ఎప్పుడు చెప్పింది నీతో అట్లా అని"

"చెప్పటం కాదులే......నాకు తెలుసు.....ఒకటి రెండు సార్లు చూశాను. నీమాటలు తేలిగ్గా తీసుకోలేదు...ప్రతి దానికీ 'మీ బాబాయి ఏమంటారో' అంటూ భయపడుతుంది..."

శ్రీధర్ ఆలోచిస్తూ ఉన్నాడు. ఈ వ్యాఖ్యానంలో ఎంతవరకు సత్యం ఉంది? శ్యామల అంటోంది....."సీరియస్‌గా తీసుకుంటేనే పోట్లాటలు.....నవ్వేస్తూవుంటే పోతుంది......"

"నువ్వలానే చెయ్యి......"

"నే నంతే! లేకపోతే విచారిస్తూ కూర్చుంటారేమిటి?"

శ్యామల ఈ రెండేళ్లలో ఎంత పెరిగింది!—ఆరిందాలాగ మాట్లాడుతోంది! అనిపించింది శ్రీధర్‌కు......

ఆరాత్రి ఆ విషయమే ఆలోచిస్తూ పడుకున్నాడు.

ప్రస్తుతం విద్యార్థులు దేన్నీ సీరియస్‌గా తీసుకోవటం లేదు. స్కూలు పిల్లల్లోనూ, కాలేజి పిల్లల్లోనూ తాడు గమనించినంతవరకూ ఈ విషయం పెద్ద లోపంగా కనిపించింది. చదువూ, పరీక్షలే కాదు, కవిత్వం, ప్రేమవంటి విషయాల్లో కూడా చాలా తేలిగ్గా భావిస్తున్నారు. ఈ ఆరేడేళ్లలోనే ఇంత భేదం అతనికి గోచరమౌతోంది. కాని మరో దృక్పథంనుంచి చూస్తే ఈ ధోరణిలోనూ మంచి ఉందేమో! "నువ్వు మహా సీరియస్‌గా ఉంటావు!" అని విమర్శించింది శ్యామల. తారతో తన సంబంధాన్ని మొదటినుంచీ తను సీరియస్‌గానే తీసుకున్నాడు! దాని కారణం తనలోని ఒక ఆదర్శ భావన. ఆ భావనకు తగినట్లు ఆమెకు వ్యక్తిత్వం ఉండాలని ఆశించాడు. అలా లేదని కోపగించాడు, విమర్శించాడు, అలిగాడు. కాని ఆమె లేదు. అల అంతే! వ్యక్తిత్వాన్నీ, విలువలనీ, స్వయం నిర్ణయశక్తినీ యిలా ఎంత మంది ఆలోచిస్తారు! పుట్టి పెరిగిన వాతావరణంలో అందరూ ఎలా ఆలోచిస్తారో, దేన్ని ప్రధానంగా భావిస్తారో, ఆ ధోరణిని బట్టి బతుకుతూ ఉంటారు చాలమంది. జీవితం చాల భాగం అనుకరణ, అలవాటు! చాల మందికి జీవితం పూర్తిగా అలవాట్లమయం! ఈ యాంత్రిక శక్తుల్నించీ, స్వకీయమైన ఇచ్ఛ, నిర్ణయం అనేది ఏర్పరచుకోవాలనే వ్యక్తిత్వం ఎవరికో కొందరికే ఉంటుంది! వారు దానికోసం అన్వేషిస్తూ, బాధపడుతూ ఉంటారు. జీవితం వాళ్లకు అడుగడుగునా బాధగానే ఉంటుంది! కాని ఒకసారి తనదైనమార్గం స్పష్టం అయ్యాక, జీవితంమీద అధికారం లభిస్తుంది; తర్వాత యాంత్రిక శక్తులు అలాంటి 'వ్యక్తుల్ని' ఏమీ చెయ్యలేవు!

శ్రీధర్‌కు పై ఆలోచనదృష్ట్యా తనకూ తారకూ గల భేదం, యిద్దరి మధ్యా వున్నదూరం స్పష్టంగా గోచరించింది. తను వ్యక్తిత్వంకోసం, జీవితంమీద అధికారం కోసం అన్వేషిస్తున్నాడు మొదటినుంచీ. ఆ దృష్టితోనే, అందరూ తనలాంటివాళ్లనే భ్రమతోనే వ్యవహరిస్తున్నాడు. అందుకే యితరులు తనకు అర్థం కావేదు! ఇతరులు యాంత్రికంగా వాళ్లేం చేస్తున్నారో వాళ్లకే అర్థం కాకుండా, రకరకాలైన పేర్లతో అన్వేషించేది శరీరసుఖం, లేక డబ్బు, లేక మనుష్యులమీద అజమాయిషీ తారకు. తనెప్పటికీ అర్థంకాడు; తనకు ఇప్పుడు తార అర్థమౌతోంది. తారతో యిక మీద తను ఆశించిన ధార్మిక బంధం అసాధ్యమనే తెలుస్తోంది! తను డబ్బు, సుఖం ఆమెకు యివ్వగలిగినంతమేర ఆమె తనని అంగీకరిస్తుంది, లేకపోతే లేదు !

ఈ క్రొత్త దృష్టితో శ్రీధర్ తనకు సంబంధించిన వాళ్లనందరినీ ఒకసారి సరాసర్పించి చూచుకున్నాడు. శేషాద్రిగారినీ, చంద్రావతి, పద్మమణి తనవంటివారేననిపించింది. నాగరాజుకూడా తనవంటివాడే కాని అతని మార్గమేమిటో తనకు అంతుపట్టటం లేదు. నైతిక సిద్ధాంతాల్నిగూర్చీ, ఆదర్శాలను గూర్చీ, కాలం మార్పును గురించీ నాగరాజు మాటల్లోని సత్యం తనకు క్రమంగా బోధపడుతోంది. కాని అతని ప్రవర్తనలో చాలభాగం అర్థంకావటం లేదు. మంగమ్మా, ఓబయ్యా ఎలాంటివాళ్లు? వాళ్లకి కావలసింది ఆస్తిమీద, మనుష్యుల మీద అజమాయిషీ! వాళ్లు యాంత్రిక జనతలోవాళ్లు! అన్నయ్యా రుక్మిణమ్మవదినా ఏ కోవకు చెందిన వాళ్లు? సంప్రదాయానికి భంగం రాకుండా వాళ్లు అన్వేషించేవి కూడా సుఖమూ, డబ్బూ! అంతకంటే పేరూ, ప్రతిష్ఠా, మర్యాదా, మన్ననావేమో! వాళ్లూ యాంత్రిక జనతలో భాగమే! అందువల్లే తనను చిన్నప్పటినుంచీ పెంచిన రుక్మిణమ్మ వది

నకూ తన హృదయాన్నీ, దాని ఆవేదననీ, బాధనీ గ్రహించే శక్తి లేదు; ఎంత అభిమానం, సానుభూతి ఉండి ఏం లాభం? సంపాదన, పెళ్ళాం, పిల్లలూ, సంసారంలో భార్యా భర్తలూ, వీటిని గురించిన సాంప్రదాయికమైన అలవాట్లతోనే ఆమె తననీ తన వైవాహిక జీవితాన్నీ చూడగలుగుతోంది! తారకు తనమీద ఎందుకు కోపం వచ్చిందో, తను తారమీద ఎందుకు అలిగాడో ఎప్పుడైనా తర్కించి తెలుసుకునే ప్రయత్నం చేసిందా? సంసారంలో ఈ ఒడిదుడుకులు సహజం అనే యాంత్రికమైన భావం తప్ప అంతకు మించిన స్పృహ లేదు! తనకు బాల్యం గడిచాక, ఆమె మాతృపోషణ అవసరం తీరాక, తను అందరు మగవాళ్ళలాగే 'విద్యలూ, వ్యవహారాలూ' నేర్చి ఆమెకు అంతకంటె అర్థంకాని పురుషలోకంలో కలిసి పోయాడన్నమాట! ఆమెకు తనలో అర్థమయ్యే భాగం యిప్పటికీ బాల్యానికి సంబంధించిందే—ఆమె అభిమానంకోసం, సాంత్వనంకోసం ఎప్పుడైనా వెళ్తే సానుభూతితో పలకరించి కడుపునిండా కుడుపబెట్టి పంపుతుంది! పోతే అన్నయ్య—లోకంలో పరువు, ప్రతిష్ఠల్నీ, న్యాయాన్నీ గౌరవించే అందరు అన్నయ్యలూ తమ్ముళ్ళపట్ల ఏం చేస్తారో అదే చేస్తాడు! అన్నయ్య దృష్టిలోనూ తను వ్యక్తిగా లెక్కకు రాడు !

తనలో యింత ఆలోచనను పురికొల్పి, ఒక క్రొత్త దృష్టికి కారణమైన వ్యాఖ్యానం శ్యామలనుంచీ వచ్చిందే. తనకంటె చిన్నదైన శ్యామల ఏ కోవకు చెందుతుంది? ఆమె జీవిత ప్రాంగణంలో నిల్చుని వుండి, ఏవైపు మొగ్గుతుందో! కాని ఆమె దృక్పథమే వేరుగావుంది. దేన్నీ సీరియస్‌గా తీసుకోకపోవటం! వ్యక్తిత్వానికీ, వక్తిగతమైన సంబంధాలకూ ప్రాముఖ్యత నిచ్చే శేషాద్రిగారు కాని, చంద్రావతి కాని, తను కాని, జీవితాన్ని సీరియస్‌గా తీసుకునేవారే! చంద్రావతి ఒక్కసారి అన్నది: ''జీవితాన్ని యింత సీరియస్‌గా తీసుకోవటంవల్లే చేతగానివాళ్ళమై బాధపడుతున్నాం. మనం సెంటిమెంటల్ క్రీచర్స్''అని. కాని అలా అనటం యాంత్రికంగా వుంటే ఈ బాధ తప్పును గదా అనే భావంతో విసుగ్గా అన్నది. అంతేకాని తేలిగ్గా నవ్వేస్తూనే, విశ్వాసాల అగ్ని పరీక్షకు నిలవకుండానే పట్టు తప్పిపోయిన జీవితం మీద అధికారాన్నీ, వ్యక్తిత్వనిష్ఠమైన విలువల్నీ సాధించవచ్చునని ఆమె అభిప్రాయం కాదు!.....వ్యక్తిత్వాన్నీ, వ్యక్తిగతమైన సంబంధాల్నీ అన్వేషిస్తూనే తేలిగ్గా నవ్వేస్తూ ఉండటం ఎందువల్ల సాధ్యం కాకూడదూ? బహుశా సాధ్యమేనేమో!

శ్రీధర్ భావనలో ఒక క్రొత్తయుగం మెరిసింది—క్రమంగా ప్రస్ఫుటమౌతున్న ఈ క్రొత్త యుగంలో రెండు తరహాల మనుష్యులూ ఉంటారు—వ్యక్తిత్వాన్నీ స్వయం నిర్ణయాన్నీ ప్రధానంగా అన్వేషించే మైనారిటీ, అలవాట్ల ప్రకారం ఆటొమాటిక్‌గా సుఖం, డబ్బు, ఆజమాయిషీ అన్వేషించే మెజారిటీ. కాని అందరూ తేలిగ్గా నవ్వేస్తూ ఉంటారు. దేన్ని గురించీ సీరియస్‌గా బరువుగా మాట్లాడరు!

ఇది కేవలం ఊహాగానం కల్పనకాదు అన్పించింది శ్రీధర్‌కు. 1948 లో నాగరాజు ఆహ్వానించగా క్రిస్టియన్ కాలేజి హాస్టలు ఉత్సవానికి వెళ్ళిన సాయంత్రం కనిపించిన సిసీలియావంటివారే ఈ క్రొత్తయుగపు వైతాళికులు అనితోచింది. నాగరాజుతో ప్రేమ కలాపం నడిపినన్నాళ్ళూ నడిపి భ్రూణహత్యకు సిద్ధపడిన ఆ అమ్మాయి భయంతో బాధతో ఆవేదనతో ఆ పని చెయ్యలేదు! తేలిగ్గానే అందుకు సిద్ధమైంది! అంతేకాదు, నాగరాజుతో వ్యవహారానికి స్వస్తిచెప్పి వేరొక యువకునితో వివాహానిక్కూడా చప్పున ఒప్పేసుకుంది! అంటే నాగరాజుతో ప్రణయాన్ని ఆమె ఎంత తేలిగ్గా తీసుకున్నట్లు! ఇది దృక్పథంలోనే మార్పు......యాంత్రికంగా శరీర సుఖాన్నీ, కాలక్షేపాన్నీ ఆమె అన్వేషించిందనే అనుకున్నా, ఆమె అందులో పరిస్థితులదృష్ట్యా వచ్చిన మార్పుని ఎంత తేలిగ్గా అంగీకరించింది! దృక్పథానికి సిద్ధాంతరూపం కల్పించిన నాగరాజు కూడా అంత తేలిగ్గా అంగీకరించలేకపోయాడు!

తర్వాత యిటీవల సబ్—కలెక్టరుగా వచ్చిన తమిళుడు తనకు లయోలా కాలేజిలో పూర్వ పరిచితుడు శివరామన్‌తో మాట్లాడి రావటానికి వెళ్తే అతడు టీ యిచ్చి కబుర్లు చెబుతూ ఢిల్లీలో ఒళ్ళమ్ముకునే స్త్రీల బజారునుగూర్చి హాస్య స్ఫోరకంగా వర్ణించిన వైనమూ శ్రీధర్‌కు గుర్తు వచ్చింది. ఆ మిత్రుడు స్వానుభవాలే, జంకూ, గొంకూ లేకుండా, తేలిగ్గా నవ్వుతూ చెప్పేశాడు! అతనికి వ్యక్తిగతమైన సంస్కారంలేదనీ, కేవలం విషయ లాలసుడైన యాంత్రిక మానవుడనీ చెప్పటానికి ఆధారం లేదు. తనకు అతనితో ఎక్కువ పరిచయం లేదు. కాని అతని బుద్ధి కుశలతమీదా వ్యక్తిత్వంమీదా నమ్మకం వుంది. ఈ ఆఫీసరూ, నాగరాజూ ఒక కోవకు చెందినవారే అయివుంటారనటం అసంభావ్యమైన విషయమూ కాదు!

ఒక 'సెక్స్' విషయంలోనే కాదు. సులువుగా డబ్బు సంపాయిస్తున్నవారిలో, రాచకీయాల్లో డబ్బునూ, పలుకుబడినీ ఖర్చు పెడుతున్నవారిలో యిటువంటి తేలిక దృష్టే వ్యక్తమౌతోంది. ఇది క్రొత్త యుగంకాక మరేమిటి? ఇది పూర్తిగా యాంత్రిక యుగం. వీరిలో సంస్కారం, వ్యక్తిత్వం, స్వయం నిర్ణయశక్తి, జీవితంమీద అధికారం కలిగి ఉన్నవాళ్లు బొత్తిగా లేరని చెప్పటానికీ వీల్లేదు! చాలమంది యాంత్రికంగా, అదృష్టం అనే వీచికమీద పైకి విసిరి వేయబడుతూ ఉండవచ్చు కాని వారిలో వ్యక్తిత్వం కలవాళ్ళూ కొందరు తప్పక ఉంటూనే ఉన్నారు; వారి జీవన దృక్పథం యింకా సిద్ధాంతీకరింపబడలేదు గాని!

ఆలోచనలు యింతదూరం సాగేటప్పటికి, శ్రీధర్‌కు ఆరోజు తార వెళ్ళిపోవటంతో ఏర్పడిన హృదయావేదన మబ్బు విడిచినట్లు విరిసిపోయింది. జీవితాన్నీ, తన చుట్టూవున్న మనుష్యుల్నీ తనూ తేలిగ్గా నవ్వుకుంటూనే అవలోకించగలడన్న ధీమా కలిగింది. ఇది మానవులమీద ఏవగింపు కాదు; నిర్లక్ష్యం, అపహాస్యం కాదు; వాళ్ళని క్రొత్తగా అర్థం చేసుకోవటంవల్లా, జీవితాన్ని క్రొత్తగా దర్శించటంవల్లా కలిగిన ఉత్సాహం, ఆనందం!

* * *

శ్రీధర్‌లో వెల్లివిరిసిన నూతనోత్సాహం నాటకాల్లో అభినివేశంగా వ్యక్తమౌతూ వచ్చింది. స్కూలు నాటకాలు వేయించటంలో శ్రీధర్ పొందిన మెప్పు క్రమంగా అతణ్ణి ఒక చిన్న

నాటక సమాజానికి కార్యదర్శిని చేసింది. ఈ సమాజంలో సభ్యులు టీచర్లు, లాయర్లు, స్కూలు కాలేజి విద్యార్థులు, పద్మమణి మరియిద్దరు స్త్రీలు కూడా చేరారు. శ్రీధర్ నాటక కళలో అనుభవం గడిస్తున్నాడు.

శ్యామల వివాహం ఫిబ్రవరి 1954 లో జరిగింది. శ్రీధర్ బందరువెళ్లి తారను తీసుకు వచ్చాడు. అంతవరకూ ఆమె ఉత్తరాలైతే రాస్తూ ఉందిగాని మదనపల్లికి తిరిగి రాలేదు. ఈసారి శ్రీధర్ ఆ విషయమై పంతగించలేదు.

ఓబయ్యా మంగమ్మలు కూడా తిరుపతిలో పెళ్లికి హాజరవటం ఒక విశేషం. పాత పగలన్నీ విస్మరించినట్లే వాళ్లు మొదట్లో ప్రవర్తించారు. కాని శ్యామలకు ఆరువేలు కట్నమూ, నగలూ చదివించేటప్పటికి ఓబయ్యా నలుగురితోనూ అనేశాడు 'ఇది తమ్ముడికి చూపించకుండా దాచిపెట్టుకున్న డబ్బు' అని. శ్రీధర్ వూరుకోమ్మని కటువుగా మందలించాడు. అంతటితో కోపంవచ్చి మంగమ్మా, ఓబయ్యా పెళ్లింటినుంచీ బయటికి నడవారు. శ్రీధర్ వెళ్లి ఎంత బతిమాలినా ఆగకుండా బస్సెక్కి వచ్చేశారు.

తార గొలుసు, ఓబయ్యా అవసరానికి తాకట్టు పెట్టుకొన్న గొలుసు, వెనక్కి తిరిగిరాలేదు. ఓబయ్యా తను చేస్తున్న వ్యవసాయంలో శ్రీధర్‌కు ఎప్పటి కప్పుడు తిండిగింజలు పంపటం తప్ప లెక్కగా ఏమీ తేల్చటంలేదు. ఇది శ్రీధర్‌కు అసంతృప్తి కలిగిస్తోంది. వచ్చిన ఫలసాయంలో చాల భాగం ఓబయ్యా తనకున్న ఋణాలకు వడ్డీలు కట్టడంలో తన అనవసర ప్రయాణాలలో, వ్యాసకాలలో ఖర్చు పెట్టేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. కాని ఓబయ్యాను నిక్కచ్చిగా ఆ విషయమై ప్రశ్నించ లేకపోతున్నాడు శ్రీధర్.

పెళ్లితో గొడవచేసి వచ్చేశాక శ్రీధర్ మంగమ్మత్తతో అన్నాడొకరోజు. "మామకు వయస్సు పైబడుతోంది. నువ్వా పొలాల్లో సంగతి చూడలేవు. పొలం మొత్తం ఎవరికైనా కౌలుకిస్తే బాగుంటుందేమో!"

మంగమ్మ విరుచుకుపడ్డది "నువ్వు బడిపంతులివయ్యావు అని నీలాగే అందరూ పుస్తకాలు చేతో్ పట్టుకుని కుర్చీమీద కూర్చుంటే జరుగుతుందనుకుంటున్నావా సిరీ! అయ్యవారివైతే అయ్యావుగాని నువ్వు మాకేం పాఠాలు చెప్పనక్కరలేదు! చచ్చేదాకా వోపికున్నంతవరకూ మేము చేసేది చేస్తుండాల్సిందే! మా బతుకు మాదే! తప్పుతుందా? పెళ్లాం పిల్లలతో ఇక్కడికొచ్చి ఉండరా నా తండ్రీ అని బతిమలాడితే నీకు లేదుగాని మమ్మల్ని ముసలికాలంలో సుఖపెట్టాలనుకుని ఈ సలహా ఇస్తున్నావా అల్లుడా? ఆహా! నువ్వు ఆవులూ, ఎద్దులూ, పేడా, గంజరమూ అంటే ఆమడదూరంలో మసులుతావుగాని 'ఏం, ఈసారి పంట తక్కువైందేం?' అని అడగటం మానుకుంటావా? సొంతంగా చేస్తుంటేనే యిట్లా వుంది యీ సంసారం ఆకుకి అందకుండా పోకకి పొందకుండా. కౌలుకిస్తే ఎసట్లోకి బియ్యం ఉండవు నాయనా!"

తన సలహాలోని అంతరార్థం ఆమె యిట్టేపట్టేసిందనీ, అందుకు బదులుగా పరిష్కారమార్గం కూడా—తను కుటుంబంతోవెళ్లి ఆమె యింట్లో ఉండటం—సూచిస్తోందని గ్రహించాడు శ్రీధర్. తను వ్రాస్తున్న నాటకంలో మంగమ్మని, ఓబయ్యని పాత్రలుగా ప్రవేశపెట్టి నవ్వేయటంకంటె మరేం చేయాలో తెలీలేదు అతనికి!

తార తన గొలుసుని గూర్చి గొడవ పెట్టింది. తన పుట్టింట్లో ఆ గొలుసు లేకపోవటాన్నిగూర్చి తను చాలా కించపడవలసి వచ్చిందనీ, ఏమైనాసరే అది తనకు తిరిగి వచ్చేట్టు చూడాలనీ పట్టుబట్టింది. శ్రీధర్ ఒక కోమటి దగ్గర ఋణం చేసి ఓబయ్యకు తీసుకువెళ్ళి ఆ నగ వదిలించి తెచ్చి తారకు యిచ్చేశాడు. తార తన కోరిక యింత సులువుగా, శీఘ్రంగా నెరవేరుతుందనుకోలేదు. ఆమె శ్రీధర్‌లో వచ్చిన మార్పుకు సంతోషించింది.

కాని శ్రీధర్ నాటకాలమీద కాలవ్యయం చేస్తూండటం ఆమెకు కష్టంగావుంది. ఒకవైపు భర్త నటుడుగా నలుగురిలో పేరు రావటం యిష్టంగానే ఉన్నా, భర్తతో కలిసి పద్మమణి నటిస్తున్న నాటకం చూచాక ఆమెలో ఈర్ష్య రేకెత్తింది. దీనికితోడు శ్రీధర్ తెస్తున్న జీతం చాలకపోవటం, తన అక్కయ్య సంసారం చూచివచ్చిన తర్వాత తారకు చాల కంటకమైపోయింది......

శ్రీధర్‌కూ, పద్మమణికీగల ప్రత్యేక సంబంధం నాటక సమాజంలో అందరి మనస్సుల్లోనూ రూఢి అయిపోయింది. సంఘ నియమాల అమోదించని సంబంధమే అయినా శ్రీధర్ మంచితనమూ, సౌహార్ద్యమూ, అందరియెడల అతనుచూపే స్నేహభావమూ, పద్మమణి హుందాతనమూ, మాట పొదుపరితనమూ వారిద్దరికీ నాటక సమాజ సభ్యుల్లో గౌరవ మర్యాదల్ని కలిగించింది. నాటక సమాజం 1955 లో రాష్ట్ర నాటక కళా పరిషత్తు పోటీల్లో పాల్గొని, ప్రదర్శించిన నాటకానికి రెండవ బహుమతి తెచ్చుకున్నది. శ్రీధర్‌కాని పద్మమణికాని తమ ప్రావీణ్యాన్నిగూర్చీ గొప్పలు పోలేదు; ప్రధాన భూమికలు నిర్వహించటంలో పాత్ర రూప గుణ శీలాదులనుబట్టే అర్హులైన మిగతా సభ్యులకు గూడా సదవకాశాలు లభిస్తుండటం మూలాన పద్మమణి, శ్రీధర్ ఎవరి ఈర్ష్యాసూయలకూ పాలుకాలేదు. పైగా వారిద్దరి అన్యోన్యతా విశిష్టమైన వైయక్తికమైన అనుబంధంగా అంగీకార్యమే అవుతూ వచ్చింది.

నాటక కళలో అభినివేశం కల్గించుకున్న తర్వాత శ్రీధర్ మానసికానుభూతి మానవ ప్రకృతిలోని వైవిధ్యాన్నీ, మానవ జీవితంలోని వింతనూ, విషాదాన్నీ, రసమార్గంలో సంభావించుకొని తత్త్వ సంస్పర్శతో పరిపక్వమౌతూ వచ్చింది. ఒకటి రెండు నాటకాల్లో పద్మమణితో ప్రేక్షకుల ఎదుట రంగస్థలంమీద నటించిన అనుభవం తర్వాత, ఏకాంతంలో కూడా ప్రసిద్ధ నాటక సమావేశాల్ని ఆమెతో కలిసి నటిస్తూ రసానుభూతి పొందాడు. ఆమె చిత్రాంగి తను సారంగధరుడు; తను నలుడు ఆమె దమయంతి; ఆమె చింతామణి తను బిల్వమంగళుడు—అలాగే కథల్లో సన్నివేశాల్లో తమ కథకాని కథ, విషాదం కాని విషాదం, తమ వైరాగ్యంకాని వైరాగ్యం తమ అనుబంధం కాని అనుబంధం తమదై తమ ప్రత్యేకతను లయింపజేసి, సంయోగ

వియోగాల్లో సుఖ దుఃఖాల్లో, అనంతమైన జీవన లీలలో ఆమే తనూ ప్రకృతీ పురుషులుగా నిత్య నూతనులుగా ఆత్మ దర్శనం పొందటం—అది ఒక సాధనగా తపస్సుగా అతనిలో రూపొందింది. కేవలం శారీరక సంయోగం యివ్వలేని రూపం అతని 'స్వప్నానికి' ఈ విధమైన సాధన ద్వారా లభించింది. ఇప్పుడు వారిద్దరిమధ్యా పరిధుల్లేవు. శరీరమూ, మనస్సూ, ఆత్మా అన్న విభేదాల్లేవు. ఎప్పుడు కలుసుకున్నా, వాళ్ళకు వాళ్ళుగా ఉండటం అంటేనే, ఒక మాటలో, ఒక చిరునవ్వులో, ఒక చూపులో, ఒక స్పర్శలో, ఒక ముద్దులో, పరస్పరతలో లభించే అద్వైతమైన అస్తిత్వ సత్యమే కనిపిస్తోంది—ఒకరు వినా మరొకరు లేరు!

పిల్లల జబ్బులూ, తార రుసరుసలూ, ట్యూషన్లూ, నిత్యావసరాలూ, పొలాల్ని పండించుకుంటూ తనకు రావలసిన ఫలసాయాన్ని ముట్టజెప్పని ఓబయ్య మంగమ్మ తరచు మన స్సుకి రాపిడి కలిగిస్తూనేవున్నా, ఈ అపశ్రుతులు శ్రీధర్‌లోని దివ్య సంగీతాన్ని స్పృశించలేకపోతున్నాయి.

కాలం గడుస్తోంది.

22

మాయ, పద్మమణి కొమార్తె తొమ్మిదేళ్ల అమ్మాయి, డిఫ్తీరియా జ్వరంతో ఆకస్మికంగా చనిపోయింది. డాక్టరు అసమర్థతవల్ల మొట్టమొదటే రోగ నిదానం సరిగా జరగ లేదు. కారణం ఏమైతేనేం, మాయ పోవటం పద్మమణిలో మార్పు తెచ్చింది. చావు పుట్టుకల్ని గురించి వేదాంత వాక్యాలు పలకవచ్చుగాని, మనస్సుమీద కొన్ని సంఘటనలు చూపే ప్రభావం మాత్రం తీసివెయ్యటానికి వీల్లేనిది. ఆ ప్రభావానికి హేతు బద్ధమైన వివరణ ఏమీ ఉండదు!

''రాత్రంతా కలలే శ్రీధర్! అది నాతో మాట్లాడుతూ వుంది. నేను ముభావంగావుంటే ముఖం తన వైపుకు చేత్తో లాక్కుంటూ, 'అమ్మా, కోపమెందుకే?' అంటూ చెబుతూ వుంది—స్కూలు సంగతులు పాఠాల సంగతులు, దాని స్నేహి తుల సంగతులు—నేను నోరు విప్పలేక పోతున్నాను. 'అమ్మా, నేను పెద్దయ్యాక డాక్టర్‌కి చదివి గొప్ప లేడీ డాక్టర్నవు తాను. అప్పుడు నీకేమో మందులు వూరికేనే యిస్తాను కదా! అంటోంది......మీకు గుర్తుందా జ్వరంలో డాక్టర్ని గురించి అది ఎన్ని ప్రశ్నలు వేసింది! దాన్ని సరియైన డాక్టరుకి చూపించలేకపోయిన నిర్భాగ్యురాల్ని నేను! '......తుడుచుకుంటూంటే ఆగకుండా వచ్చే కన్నీటితో పైట చెరగు పూర్తిగా తడిసి పోయేది......

మొదట నెలరోజులు సెలవు. తర్వాత మరో నెల రోజులు పొడిగింపు......పద్మమణి శోకభారాన్ని తేలిక చెయ్యటానికి శ్రీధర్ శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు. కాని అతను చూపించే ఆప్యాయతే ఆమెను కరగించివేస్తుంది.

అతని గుండెల్లో తల ఆన్చి ''ఏమండీ, నేను మళ్లీ మాయను చూడలేనా? నిజంగానే చూడలేనంటారా?......మాయ నాకు కలల్లో కనిపిస్తుందే, మాయ నాక్కావాలి, మాయను నాకు తెచ్చిపెట్టలేరా? అంటుంది తీవ్రంగా పిచ్చిగా. ''పద్మా! ఈసారి మాయ నీ కోసమేగాదు, నా కోసం కూడా వస్తుంది. తప్పకుండా మళ్లీ నీకు జన్మిస్తుంది!'' అంటాడు శ్రీధర్..

''ఏమండీ, కలకూ, నిజానికి ఏమిటీ భేదం? మాయ నాక్కనిపించని యీ నిజం కల కాకూడదా?......మీరెవరు? మీరు మాత్రం నా కలలోని వారు కారా?......అవునండీ, నా కిప్పు డర్థమవుతోంది. నా కలని, ఆ ఆనందాన్నీ—నాకు బాగా తెలీటం లేదనే—దేవుడు యిలా రెండు భాగాలుగా చేశాడు. మీరున్న కలనీ, మాయవుండే కలనీ వేరు చేశాడు—మేలుకున్నప్పుడు మిమ్మల్నీ, నిద్రలో దాన్నీ చూస్తూ ఉండమని! కాదంటారా?'' ఆమె యిలా మాట్లాడుతూవుంటే ఆమెకు నిజంగా పిచ్చెత్తి పోతుందేమోనని భయంవేస్తుంది శ్రీధర్‌కు......

కాని ఒక్కొక్కసారి ఆమె మాటలు ఎంతో అర్థ స్ఫూర్తినిస్తుంటాయి. ''శ్రీధర్! దానికి 'మాయ' అని పేరు పెట్టటంలోనే కాదు, దాని తండ్రి నాకు ఎన్నోసార్లు వేదాం తాన్ని బోధించాలని ప్రయత్నం చేశారు. కాని నేను నేర్చుకో లేదు! ఆయన మాటల్ని బళ్లో టీచరు మాటల్ని పిల్లలు ఖాతరు చేసినట్లు, కొంత గౌరవంతో, కొంత భయంతో చెవిలో వేసుకునేదాన్నేకాని అవేవీ నా హృదయాన్ని మాత్రం స్పృశించలేదు! ఎప్పుడూ నవ్వుకునేదాన్ని నాలో నేనే ఎవరి క్కావాలి యీయన వేదాంతం అని! ఆయన జుట్టుకి రంగు వేసుకుంటాడని, అన్నేళ్లు వచ్చినా పాండ్స్‌క్రీమ్ వాడుతాడనీ నవ్వేదాన్ని! ఆనాటి నా అల్లరికి యిలా శాస్తి చెయ్యటానికే యీ పిల్లని నా గుండెకు గ్రుచ్చిపోయారనిపిస్తుంది. ఈ ముల్లు తియ్యటం మీకు చేతకాదా శ్రీధర్?'' అని లోతుగా, బాధగా ప్రశ్నిస్తుంది పద్మమణి.

''శ్రీధర్, నాకు మాయేకాదు, అంతకంటె మంచి కూతురు కావాలి. అప్పుడుకాని మాయను మరచిపోలేను......'' అంటూ మాతృత్వ కాంక్షను వ్యక్తం చేస్తుంది......

''నాలో ఏదో లోపం ఉంది. నేను దాన్ని సరిగ్గా చూడ లేదు కాబోలు! ఏదీ నా ఉద్యోగం, నా చదువూ అని ఎంతకాలం వృధా చేశాను! ఆ కాలమంతా అది నాకోసం ఎదురు చూచి, ఎదురుచూచి......విసిగిపోయి......వెళ్లిపోయింది......'' ఆమె కంఠం రుద్ధమైపోతుంది. తర్వాత ఎడతెగని కన్నీళ్లు!

ఈరోజుల్లో శ్రీధర్ ఎక్కువకాలం పద్మమణి యింట్లోనే గడుపుతున్నాడు. అతను రాత్రిళ్లు భోజనానికి ఉంటానని చెబితేతప్ప ఆమె భోజనం మానేస్తుంది. తన తిండి విషయం ఆలోచించదు. అందువల్ల తప్పనిసరిగా చాలసార్లు శ్రీధర్ అక్కడే గడపవలసి వస్తోంది. ఇంటికి వెడుతూ వస్తూవున్నా, ప్రొద్దుటి పూట ట్యూషన్లూ, తర్వాత స్కూలూ, మిగిలిన వ్యవధి పద్మ మణి యింట్లో గడుపుతూ ఉండటంవల్ల తారకూ, పిల్లలకూ అతడు ఈ రెండు నెలల్లో బాగా దూరమైపోయాడు.

తార ఊరుకోలేదు. వెళ్లి ఓబయ్య, మంగమ్మలతో చెప్పింది. వాళ్లు ఈ విషయంలో ఏమీ కలుగజేసుకోలేదు. చివరకు వెళ్లి రుక్మిణమ్మతో కూడా చెప్పింది. రుక్మిణమ్మ ఓర్పూ, సహనమూ బోధించింది. శ్రీధర్‌ను పిలిపించి తను కనుక్కుంటూ

వని చెప్పింది. చివరకు ఓర్పు నశించి ఒక ఆదివారం ట్యూషన్ కుర్రవాళ్లు వెళ్లిపోయాక నిలవదీసి అడిగింది తార—

"ఏమండీ, మీకు ఈ యిల్లంటే ట్యూషన్ చెప్పటానికి తప్ప మరెందుకూ పనికిరాని సత్రంగా కనిపిస్తోందా? ఇది దాని యింట్లోనే సాగిస్తే సరిపోతుంది కదా! దీనికిమాత్రం లోకాన్నిచూచి భయపడటం ఎందుకు?"

"నేను లోకాన్నిచూచి భయపడటంలేదే!"

"లోకాన్ని చూచి భయపడరు. మరిదేన్నిచూచీ భయపడరు!! అయితే మీకు నీతి, ధర్మం, మట్టూ, మర్యాద అంటూ ఏమీ లేదా? పెళ్ళాం పిల్లలంటే మీకేమీ కారన్నమాట! ఏమిటండీ మీరింత బరితెగించిపోయారు? మేము ఏం కావాలని మీ అభిప్రాయం?" తార కంఠం హెచ్చు స్థాయిలో వుంది.

"ఇప్పుడేం జరిగిందనీ, ఏం వచ్చిందనీ యీ ఆక్రోశం? ఆమె కూతురు చనిపోతే, ఒకటే తపిస్తోంది; ఒంటిపాటు, నిర్లక్ష్యంచేస్తే పిచ్చెత్తుతుందో, ఆత్మహత్య చేసుకుంటుందో అనే స్థితి. నేను లేకపోతే ఉపశమనంలేదు. అందుకే ఉండవలసి వస్తోంది......"

"లోకంలో ఎవరికీ పిల్లలు చావటంలేదా? దీనికూతురే అపురూపంగా చచ్చిందా? అన్నీ వేషాలు. నాటకాల మనుష్యులకి అన్నీ నాటకాలే! దానికి ఎన్ని గుండెలు! మీమీద దానికి ఏం అధికారం ఉందని యిలా చేస్తోంది! ఉంచుకుంటే ఉంచుకున్నారు గాని ప్రొద్దస్తమానం దాని కాళ్ల దగ్గరే పడివుండే ఖర్మ ఏమిటి? మీకు సిగ్గూ, ఎగ్గూ లేదా? మాంసం తింటారని బొమికెలు మెడగట్టుకుని తిరుగుతారటండీ? ఏమిటి మీ పిచ్చి!'

"నేను చేస్తున్నదాంట్లో సిగ్గు పడాల్సిన అవసరమేమీ నాకు కనిపించటంలేదు! అధికారం ఎవరిమీద ఎవరికి ఉంటుంది? ఎలా వస్తుంది? తాళి కట్టించుకోగానే, మంత్రాలు చదవగానే వచ్చిన హక్కూ, అధికారం, కేవలం లాంఛనం, అంతకంటె ప్రధానమైంది మనిషికీ మనిషికీ మధ్య ఉండే అనుబంధం; దానికి అధికారంకాదు, అర్హత సంపాయించాలి! నేను నీకేమీ అన్యాయం చెయ్యలేదే; నిన్ను కాదనలేదే. వేశ్యాలోలత్వంతో తాగి వచ్చి నిన్ను రోజూ చావ బాదటంలేదే! నీకూ నాకూ వున్న సంబంధం ఏమిటో దాని విలువ దానికివుంది. అంతకంటె ఎక్కువా తక్కువా ఎంత కోరుకున్నా ఎంత గింజుకున్నా సాధ్యంకాదు! నాకు అలాంటి భ్రమలు చాలనాళ్లై వదలిపోయాయి!"

"ఏమిటి మీరు చేస్తున్న నిర్వాకం? ఇప్పుడు మీరు వెళ్తున్న దెవరో వేశ్యకాక పతివ్రతా? దానికి ఎన్నో మొగుడు మీరు? మీకు తెలియకుండా చాటుగా యింకెంతమందో! మీరు సంపాయిస్తున్న వేలకూ, ఇక్కడున్న నౌకర్లకూ, చాకర్లకూ, మీరు పెడుతున్న సుఖానికీ నేను మురిసిపోతూ కూచోవాలని మీ ఉద్దేశమా? ఉండే జమీందార్లు కూడా యిట్లా మాట్లాడరే! ఎముకలు, అరిగేటట్టు చాకిరీచేస్తూ తిండికీ, గుడ్డకూ మొహంవాచి, చాలీ చాలని ఈ సంసారం ఈడ్చుకొస్తున్నది ఎందుకని? ఏం, ఎందుకు చెయ్యాలి? మీకూ, మీ పిల్లలకూ?? మీ ముష్టితిండికోసం కూచోలేదు ఎవళ్లూ యిక్కడ! ఎప్పటికైనా మీరు దారికి వస్తారనే ఓర్పుతో ఉన్నాను......... ధర్మంతో ఉన్నాను, నీతితో ఉన్నాను. మీరు తాగిరావటం లేదని నేను సంతోషించాలా? ఓ యబ్బో! యిదన్నమాట మీ ఆంతర్యం? తాగిరండి, మీకే తెలుస్తుంది! తార అంటే మీ కాలికింద చెప్పు అనుకుంటున్నారేమిటి? అసలు యింతకాలం మిమ్మల్ని ఉపేక్షించటం నాదే తప్పు! మీ నాటకాలూ, మీ తిరుగుళ్లూ మీ బెదిరింపులూ ఏమిటో తేలిపోవాల్సిందే! చెప్పండి, మీకు అది కావాలా నేను కావాలా? ఇకనుంచీ మీరు ఈ గడపదాటి దాని యింట్లో అడుగుపెట్టారంటే నే నిక్కడ ఉండను. మీరూ నా ముఖం చూడక్కరలేదు! ఏ సంగతి మీరే నిశ్చయించుకోండి! ......తను అనదలచుకున్న నాలుగు మాటలూ స్పష్టంగా అనేసి లోపలికి వెళ్లిపోయింది తార.

ఇది తార వ్యక్తిత్వానికి రుజువా?

తార తనని బంక్ష పెట్టుతోంది—వ్యక్తిగా కాదు భార్యగా ఈ విభేదం సాధ్యమా? వివాహ వ్యవస్థ, సంప్రదాయం, సంఘం ఆమెకు ప్రసాదించిన అధికారంతో ఆమె శాసిస్తోంది. చలమయ్యకు పార్టీ సభ్యత్వం ప్రసాదించే అధికారంవంటిదే యిదీ; కాని దీనికున్న సాంప్రదాయికమైన, బలవత్తరమైన మద్దతు రాజకీయపార్టీల్లో యింకా రాలేదు. అంతే భేదం! రెండింటిలోనూ సాముదాయకమైన ఏర్పాట్లకు, అలవాట్లకు, విశ్వాసాలకు ప్రాధాన్యం, వ్యక్తిత్వం లేనివాళ్లకు ఆ లోపం తీర్చే యంత్రాంగం యిదంతా తార స్వచ్ఛందంగా వ్యక్తిగా తనతో సంబంధాన్ని వాంఛిస్తున్నట్లయితే, తన ప్రవర్తననీ, తన ఆంతర్యాన్నీ యింతకంటె మెరుగ్గా, సవ్యంగా అర్థం చేసుకోవాలి. అప్పుడామెకు పద్మమణి కూడా అర్థం అవుతుంది! అది ఏనాటికైనా సాధ్యమో కాదో ఎవరు చెప్పగలరు!

శ్రీధర్ పద్మమణి యింటికి వెళ్లిపోయాడు.

మరునటిరోజు ప్రొద్దున ట్యూషన్ చెప్పడానికి ఇంటికి వచ్చాడు. కూతురు స్వరాజ్యం వచ్చి "నాన్నా, మేము తాతయ్యవాళ్ల వూరువెడుతున్నాం యివ్వాళ." అని చెప్పింది. "అలాగే తొందరగా తిరిగిరండి." అన్నాడు శ్రీధర్. శ్రీధర్ ఆరోజు భోజనం చెయ్యకుండానే స్కూలికి వెళ్లి పోయాడు.

ఓబయ్య శ్రీధర్‌ని కలుసుకోవటానికి స్కూలు దగ్గరకు వచ్చాడు "అదేమిటి తార వెళ్లిపోతానంటూ ఉంది! పెద్దవాళ్లం మేముండీ నీకు బుద్ధి చెప్పలేక పోయ్యామని ఏడుస్తోంది! ఏమిటి నీపిచ్చి ఇంటికేరానటం లేదట! ఆ మనిషిమీద యిష్టం ఉంటే ఎప్పుడైనా చాటుగా వెళ్లివస్తూ ఉండు. అంతేగాని దానితో కాపురంపెట్టేస్తానంటే ఎట్లాకుదురుతుంది.? నలుగురిలో నీ మంచీ మర్యాదా చూచుకో నక్కరలేదా? నువ్వొచ్చి తారకు నచ్చజెప్పి ఏదో సర్దుకుపోవాలి గాని, తెగేదాకా లాగితే లాభం లేదు.! నీమంచికే చెబుతున్నా, పోదాంరా" అని పిలిచాడు. బలవంతంగా చెయ్యి పట్టిలాగాడు.

(సశేషం)

నన్నయ సౌపర్ణాఖ్యానము

శ్రీ వడలి మందేశ్వరరావు

ఆదిపర్వములోని ద్వితీయాశ్వాసమును నన్నయ రెండు భాగములుగా విభజించాడు. మొదటి భాగము సౌపర్ణాఖ్యానము, రెండవ భాగము ఆస్తీకు చరితము. ఒకవిధముగ పూర్వభాగము ఉత్తర భాగమునకు పీఠిక: ఇంకొక విధముగ దేనికది ఒక స్వయం సంపూర్ణమైన కథ. పూర్వభాగమునందు సర్పములు అగ్నిహోత్రుని కాహుతి యగుట తప్పనిసరియైనట్లు తోచును. ఇందలి సర్పముల భవిష్యత్తు పూర్తిగ భయావహమైనది. ఉత్తరభాగ ప్రారంభమునుండియు సర్పయాగ ముడిగింప చేయుటకు ప్రయత్నములు కొనసాగినవి. సర్పయాగ ముడిగింప బడునన్న ఆశ క్షణ క్షణమునకు పెరుగుచు వచ్చినది. పూర్వభాగమందు సూచింపబడిన సర్పకులప్రళయము ఉత్తర భాగమున శాంతి పొందుటతో కథ కొక పూర్ణత కల్గినది. కాగా, పూర్వభాగ మొక స్వయం సంపూర్ణమైన ఆఖ్యానము: దాని కొక ఫలశ్రుతి చెప్పబడినది. అట్టిదే ఉత్తర భాగ మొక స్వయం సంపూర్ణమైన కథ: దాని కొక ఫలశ్రుతి చెప్పబడినది. ఈ రెండు కథలను కలిపి చూచినను సర్వాంగ సౌష్ఠవమైన ఒకే ఒక కథగా గోచరించును. ఇదే ఈ అశ్వాసమందలి కథన శిల్ప విశేషము.

అయితే పూర్వ కథకును ఉత్తర కథకును మధ్యగల కాలము మాత్రము అనంతమైనదిగ తోచును. పూర్వ కథయందలి పాత్రల ప్రవర్తన వేఱు. ఉత్తర కథలోని పాత్రల ప్రవర్తన వేఱు. పూర్వ రంగము నేటిది కాదు. ఆనాటి వాతావరణమే వేఱు. అది 'ఆదియుగము' నాటి కథ. అప్పుడు కశ్యప ప్రజాపతివలన 'చరాచర భూత రాశి యెల్ల నుద్భవిల్లె' (1–3–59). ఈ కాలము ఇటీవలి దన్న భ్రమను పొందకుండుటకు నన్నయ 'కశ్యప ప్రజాపతి తొల్లి పెద్దకాలము తపంబుసేసి, పుత్త్రకామేష్టిఁ జేసె'నని కాలమును కొన్ని యుగములు వెనుకకు నెట్టినాడు. కద్రూవినతల గర్భములు అండములగుట, ఆ అండములవియుటకు అనేక శతవర్షములు పట్టుట, కద్రువ సర్పములకు, వినత విహగములకు తల్లులగుట, దేవదానవులు పాలసంద్రమును ద్రచ్చుట మున్నగున వన్నియు సహృదయుని సృష్ట్యాది దినములలోనికి తీసికొనిపోవు సన్నివేశములు. కాలములో ఇంత వెనుకకు పోగల్గిననాడే సౌపర్ణాఖ్యానమందలి సొగసు హృద్గోచరము కాగలదు.

ఉత్తర భాగమందలి రచనా పద్ధతి వేఱు త్రోవను బట్టినది. పూర్వభాగమందలి సర్పములపై మనకు రోత కల్గినది. ఉత్తరభాగమునందు వాని పట్ల సానుభూతి కల్గుచున్నది. పూర్వోత్తర భాగములను కలుపు శేషుని నిర్వేదముతో ఈ సానుభూతి ప్రారంభమైనది. పూర్వభాగమందలి కథ ఎన్నడో జరిగినది. అందలి పాత్రల ప్రవర్తనా విధానము గూడ చిత్రమైనది. అచట శాపములన్నియు విపరీతములు. తల్లి కొడుకులను, కొడుకు తల్లిని శపించును. ఉత్తరభాగమునందు శృంగి పరీక్షితుని శపించుటకు తగినంత కారణము కనబడుతుంది. శాపమిచ్చినందులకు పశ్చాత్తాపము కనబడుతుంది. ఆ శాప ఫలమును అనుభవించకుండా ఉండడానికి వెఱవును వెతుకుతాడు పరీక్షిత్తు. పూర్వభాగమందలి సర్పములు శాపోపహతములు; కాని తప్పించుకొనుటకు వెఱవు నాలోచించుకొనే ప్రజ్ఞ వానికి లేదు. పూర్వభాగమందలి ఈ సర్పములే కాలాంతరమున ఉత్తర భాగమునందు వేఱొక విధముగా ప్రవర్తిస్తాయి. సర్పయాగానికి విఘ్నాన్ని కల్గించాలా? ఉడిగింప

చేయవలెనా?—అన్న సమస్యను గూర్చి సర్పములన్నీ సభచేసి చర్చిస్తాయి.[1]

కాగా పూర్వభాగమం దెన్నడో ఎక్కడనో జరిగిన కథనుండి ఉత్తర భాగమునకు వచ్చుసరికి ఈ కథాభాగ మిటీవలిదన్న భ్రాంతి కల్గుతోంది. అయినప్పటికి ఈ రెండు కథలను అలముకొనియున్న వాతావరణము పురాణమైనదనే తోస్తుంది.

సౌపర్ణాఖ్యానమందలి పాత్రలలో మానవత్వము గోచరించడానికి అవకాశమున్న పాత్ర లిర్వురే. వారు కద్రూ వినతలు. కశ్యప ప్రజాపతిని సాధారణ మానవులను చూచు దృష్టితో చూడలేము. ఆయన వాలఖిల్యులతోబాటు లోకాతీతుడు, జగదారాధ్యుడు. కద్రూ వినతలనుగూర్చి మనకు చాల విషయములు తెలుసును. కాని వారేలనో మనకు కథలో రూపుకట్టరు. వీరిర్వురు నీడలవలె, సృష్టిని పొదగడానికి శక్తిమంతములైన ప్రకృతులవలె కలువునబోసిన రెండు మాతృభావములవలె గోచరిస్తారేగాని ఇద్దరు వ్యక్తులవలె కనబడరు. కాని వారిద్దరిలోను ఎంతో మానవత్వమున్నది. వారిలో అసూయ ఉన్నది, స్పర్ధ కనబడుతుంది. పందెము వేసుకోవడ మన్నది, ఒకరి కింకొకరు దాసి కావడము ఉన్నది. అయినను రక్తమాంసములున్న మగువలలా కానరారు. కాని ఉత్తర భాగములోని సర్పములు మానవాకృతిని దాల్చినట్లు, సరిగ్గా మానవులే అయినట్లు ప్రవర్తిస్తాయి. మిగత సన్నివేశాలు అలా ఉండగా :

"ధరణి సుర మంత్రహోమ
స్ఫురణను వివశులయి భూరిభుజగ ప్రభులొం
డొరుఁ బిలుచుచు నధిక భయా
తురులై కుండాగ్నులందుఁ దొరఁగిరి పెలుచన్."
(1–2–211)

"అతివేగాకుల చిత్తులై పడి రుదా
త్తాశీవిషాగ్నుల్ సితా
సిత పీతారుణ వర్ణ దేహులు నవా
స్ఫగ్రక్తనేత్రుల్ మహో
న్నతు లేక త్రిక పంచ సప్త నవ నా
నా మస్తకుల్ పల్వు రు
దత నాగేంద్రులు బ్రహ్మ దండ హతి నా
ర్త ధ్వానులై వహ్నిలోన్"
(1–2–213)

కట్టలుకట్టలుగా పాములు అగ్నిహోత్రంలో పడిపోతోంటే కవి వాట్లకు ఒక రూపాన్ని కల్పించాలని, కల్పిస్తాడని మనము ఆశించము. కాని ఈ పాముల అవస్థ ఆధునికమారణాయుధాలకు ఆహుతి అయిపోతూన్న ఏ నగానకీ నగరవాసుల్నో స్ఫురింపచేస్తోంది. నన్నయ కథన శిల్పములోని విశేష మిదే : ఆయన మానవులను నీడలుగా మార్చగలడు. కాలుచేతులులేని పాముల్ని, పక్షుల్ని కూడ తన శిల్ప మంత్ర దండ సాయమున సహస్ర పాదునిగానో మహానీతియుతునిగానో, కామక్రోధాలకు ఆస్పదమైన మానవులవలె కనబడునట్లుగానో, మలచగలడు.

సౌపర్ణాఖ్యానములోని గరుడుని జననము వఱకును నడచిన కథ మొదటిభాగ మనుమంటే యీ భాగమును చిత్రమైన సాయం సంధ్యా వాతావరణ మలముకొని ఉన్నట్లుగా కనబడుతుంది. సాయం సంధ్య సర్వప్రాణి సమ్మోహనకరమైనది. ఇక్కడ ప్రశ్నలకు సమాధానములకు అవకాశము లేదు. ఈ సౌందర్య పరివేషమందు వ్యక్తులు మనకు గోచరింపరు, వారి గొంతులు వినబడతాయి. తద్వారా వారి మనసులను మనము గుర్తిస్తాము.

సముద్ర మథన కథకు కూడ ఈ సౌందర్య పరివేషమున్నది. అందుచేతనే అందులో ఎంతో వివరణకు, అవకాశమున్నా అవన్నీ కనబడవు. ఈ ఘట్టముచదువుతోంటే దూరమున నుండి సముద్ర మథనాన్ని మనం చూస్తూన్నట్లుగా ఉంటుంది. దూరాన జరుగుతూన్న ముఖ్యమైన సంఘటనలు మనకు కనబడుతూన్నట్లు, ఒక మూగి చలన చిత్రాన్ని చూస్తున్నట్లు ఉంటుంది కాని మన కళ్ల ఎదుట ఆధునిక పరికరాలతో, విద్యుద్దీపాలతో, శబ్ద విస్తారక, శబ్దగ్రాహక పరికరాలతో ఆధునిక రంగస్థలంమీద ప్రదర్శింపబడే ఐదంకముల నాటకమువలె కనబడదు. అందుచేతనే ఈ ఘట్టములోని వస్తువులన్నీ ఉదాత్తములైనవి: అవి ఫలానావి అని నిరూపింపగల్గుతున్నాము. నర నారాయణులు దానవులను పారద్రోలడం కూడా ఈ సాయం

1. పూర్వభాగమునందు గరుడుడు తల్లికి దాస్యము నుండి విముక్తిని కల్గించాడు. ఇది శాపఫలమును అనుభవించకుండా ఉండడానికి మార్గాన్ని ఆలోచించడంకాదు.

నన్నయ సౌపర్ణాఖ్యానము

సంధ్యా వాతావరణాన్ని గాఢతరం చేయడానికి తోడ్పడింది.[2]

కొట్టవచ్చినట్లుగా కాకుండా, మసక మసకగా ఉదాత్త ఫణితిలో వస్తువులు కానవచ్చే ఇట్టి ఒకానొక సాయంసంధ్యలో కద్రూవినతలు వినోదార్థము విహరించ బయలు దేరారు. కాలము సాయం సంధ్య; వారి విహారము వినోదార్థము. ఈ రెండు అంశములు చాల ముఖ్యమైనవి. తర్వాతి కాలమందలి వసుచరిత్రకారునికి శ్లేష వెన్నతో బెట్టిన విద్య. ఇక్కడ నన్నయ సాధించిన శ్లేష కూడ అట్టిదే. (1—2—27) ఇందులో ప్రయత్నం ఎక్కడా కానరాదు. కద్రూ వినతల విహారము వినోదార్థము కనుక వారు దారి పొడుగున జరిపిన సంభాషణలు, వారు చూచిన వింత వస్తువులు, వారికి కల్గిన ఆనందము, మున్నగువానిని గూర్చి పూసగ్రుచ్చినట్లు వ్రాయాలని చాలమంది కవులు సంకల్పించి ఉండేవారు. కాని నన్నయ చూపే వేఱు. కద్రూ వినతలు తమ చుట్టును గల ప్రకృతిని ఎలా చూస్తున్నారో మనకు కూడా అలాగే చూపాడు నన్నయ. ఈ రచన 'వినోదార్థము'గా రచింపబడింది కాక, కద్రూవినతల వినోదాన్ని ప్రతిఫలింప చేసేది. మొదటి పద్ధతి జీవితానికి ఒక దర్పణంగా ఉండవచ్చునేమో! కాని నన్నయ పద్ధతిలో పఠిత, శ్రోత కూడ సాయం సంధ్యలోని సముద్ర తీరాన్ని కద్రూవినతల కళ్లతో, వారి ఉత్సాహముతో చూడగల్గుతున్నాడు.

వినోదార్థము విహరించు కద్రూ వినతలకు సముద్రము ఒకసారి ఉద్యానవనముగా, ఒకసారి నాటక ప్రయోగమువలె, ఒకసారి దివములాగ కనబడింది. ఇదంతా వినోదమే. అలాగే కద్రువకు అతి ధవళమైన అశ్వము సంపూర్ణ చంద్రునిలో కనబడింది. కాని చిత్రమేమంటే ఆమె ఆ చంద్రుని మచ్చను కూడా చూసింది. 'వాలము నల్లన' అన్నది. అంటే వినత నవ్వింది: 'నీ వే కన్నులం జూచితే యక్క! యెక్కడిది నల్ల? ఈ యశ్వరాజుమూర్తి మహాపురుషు కీర్తియుం బోలె నతి నిర్మలంబై యొప్పుచున్నయది!'' అని వినత అనగా, 'నవ్వి వినతకుఁ గద్రువ యిట్లనియె :

> ''అమ్మహాశ్వంబు ధవళదేహంబు నందు
> నల్ల గలిగిన నీ విపు నాకు దాసి
> వగుము మఱియందు నల్లలేదయ్యేనేని
> నీకు నే దాసి నగుదుఁ బన్నిదము సఱుము''.

(1—2—32)

ఇందులో 'నవ్వి' అన్నమాట రెండుమార్లు వచ్చింది: కద్రూ వినత లిర్వురూ నవ్వుతూనే మాట్లాడుకుంటున్నారు. పందెము కూడ కేవలము వినోదముగానే ప్రారంభమయినట్లు కనబడుతుంది. కాని పందెము నొడ్డువఱకేగాని, ఆమీద ఆవేశాలు కావేషాలు పెరగడానికి ఎక్కువ కాలము పట్టదు. అంతవఱకు నవ్వే కద్రూ వినత లిర్వరూ ఒక్కసారిగా గంభీరులు అయిపోయారు.

''ఇట్లిద్దఱు నొండొరులకు దాసీత్వంబు పణంబుగా నొడివి పన్నిదంబుసఱచిన, వినత 'యయ్యశ్వంబు డాసి చూతము ర'మ్మనినఁ గద్రువ 'యిప్పుడు ప్రొద్దు లేదు, రేపకడ చూత' మని యిద్దఱు మగిడి తమ నివాసంబులకుం బోయి యున్న......''

(1—2—33.)

ఈ వచనంలో వినోదానికి, నవ్వులకు స్వస్తి చెప్పబడింది. ఇప్పుడు కొడుకులతో మాటాడే కద్రువ నోట అలంకారములు కానరావు. అహంకారం కనబడదు. తన్ను రక్షింపుడని కొడుకులను బతిమి

---

2. ''నరచాప ప్రవిముక్త దారుణ బృహ
న్నారాచ ధారల్ భయం
కర దైతేయ నికాయ కాయములపైఁ
గప్పెన్ దిశల్ నిండ బం
ధుర ధాత్రీధర తుంగ శృంగ తటసం
దోహంబుపైఁ గప్పు డు
ర్ధర ధారా ధర ముక్త సంతత పయో
ధారావళిం బోలుచున్.
''పత దుర్వీధర ధాతు నిర్ఝర జలా
భంబై మహాదేహ ని
ర్గత సాంద్రారుణ పూర మొక్క మొగి నొ
ల్కం ద్రెస్సి నారాయణో
న్నత దోర్దండ విముక్త చక్ర నిహతిన్
నాకద్విష న్మస్తక
ప్రతతుల్ ఘోర రణంబునం బడియె భూ
భాగంబు గంపింపఁగన్.''
(1–2–23, 24)

లాడుతోంది. వారు అధర్మానికి అంగీకరించకపోతే "కోపోద్దీపితముఖియై,

"అనుపమముగ జనమేజయుఁ
డను జనపతి సేయు సర్పయాగ నిమిత్తం
బునఁ బాములు పంచత్వము
ననియెడు మని యురగములకు శాపం బిచ్చెన్."

(1—2—36.)

కద్రూ వినతల వినోదము ఎలా పర్యవసించినదో గమనిస్తే, నన్నయ భారత భాగములో ఆయన జీవితాన్ని ఎంత జాగ్రత్తగా, శ్రద్ధగా, తత్త్వవేత్తగా పరిశీలించాడో తెలుస్తుంది.

ఈ కథలోని తొలి పద్యంలో నన్నయ ఒక మహా శిల్పిగా, పాత్రల మనస్తత్వాన్ని చాల సున్నితంగా, సునిశితంగా ప్రదర్శింపగల లోకజ్ఞునివలె, మానవ జీవితంలోని రహస్యాన్నెఱిగిన తత్త్వజ్ఞునివలె కనబడతాడు. కద్రువయు వినతయు పుత్రార్థినులై అనేక సహస్ర వర్షములు కశ్యపు నారాధించారు. కశ్యపుడు ప్రసన్నుడై, "మీ కోరిన వరంబు లిచ్చెద; వేడుం" డనిన:

"అనల తేజులు దీర దేహులు
నైన యట్టి తనూజులన్
వినుత సత్త్వులఁ గోరెఁ గద్రువ
వేవురం గడు వేడ్కతో
వినత గోరె సుపుత్రులన్ భుజ
వీర్యవంతుల వారి కం
టెను బలాధికులైనవారిఁ గ
డింది వీరుల నిద్దఱన్."

(1—2—3.)

ఇది పైకి చాల సామాన్యమైన, అమాయకమైన పద్యంలా కనబడుతుంది. కద్రువ అనల తేజులు, దీర్ఘదేహులు అయిన తనూజులను వేయి మందిని కోరింది. వినత వారికంటె బలవంతులైన ఇద్దరు పుత్రులను కోరింది. ఇంతకంటె సూటిగా మాట్లాడడం అసంభవమేమో అనిపిస్తుంది. మానవ జీవితంలో కూడా అలాగే జరుగుతుంది. మనం అమాయకంగా ఏదో చిన్న కోర్కెను కోరుకుంటాము. అది ఫలిస్తుంది. కాని అనుభవంలోనికి వచ్చేసరికి మన కోర్కెలోని తెలివి తక్కువతనం వెల్లడవుతుంది. అంతేకాదు. తానొకటి తలచిన దైవ మొకటి తలచినదన్న దానికి సామ్యముగా ఫలితం కనబడగానే మానవుని అసహాయా స్థితికి నివ్వెరపోతాము. తన కొడుకులు దీర్ఘదేహులు కావాలని కద్రువ కోరుకుంది: వారు ప్రాంశువులు కాలేదు కాని దీర్ఘమైన పన్నగములయారు. వారు అనల తేజులు కావాలని కోరుకొన్నది. వారు తమ విషాగ్ని చేత లోకాలను దహించ సమర్థులయారు. తక్షకుని విషాగ్నికి ఒక వటవృక్షం, ఒక మహారాజు, అతని ఏకస్తంభహర్మ్యము అన్నీ దగ్ధమైపోయాయి. కద్రువ కొడుకులు అనల తేజులే అయారు. కాని చిత్రమేమంటే ఈ అనలతేజులే జనమేజయుడు చేసే సర్పయాగములో అనలానికి ఆహుతి అవడంలోనే విధి దుర్విపాకము ప్రస్ఫుటమవుతుంది.

వినత ఇద్దరే పుత్రులను కోరింది. వారు కద్రువ కొడుకులకంటె బలవంతులు కావాలని కోరుకున్నది. అంటే ఆమెకు, కద్రువకు మనసులలో మనకు తెలియని రవరవ లేవో ఉన్నాయని అనుమానం కల్గుతుంది. ఇక పద్యం నడకలో

"...... వారి కం
టెను బలాధికులైన వారి......"

అని అనడంలో మూడవపాదం చివర 'కం' అనే అక్షరంతో విరగడం చేతను, నాల్గవ పాదము 'టెను' అన్న లఘువులతో ప్రారంభమవడంచేతను, పద్యగతి ఇక్కడ ఒక్కసారి సడలి, కాస్త కుంటువడి వినత కోర్కెను కోరడంలో ఆమె మోమాటాన్ని, భయాన్ని ప్రతిఫలింపచేస్తోంది. అంటే శబ్దములవల్లనే గాక, పద్యము విరుపులోనే నన్నయ పాత్రయొక్క మానసిక స్థితిని లలిత లలితముగా ఆవిష్కరింప గల్గాడన్నమాట. ఇది ఒక అద్భుతమైన సృష్టి.

తన కొడుకు లిద్దరూ కద్రువ కొడుకుల కన్న భుజ వీర్యవంతులు కావాలని వినత కోరడంలో ఆమె కోర్కె న్యాయమైనది కాదన్న ఊహ ఒకటి శ్రోతకు కల్గడం న్యాయం. కాని ఈ ఊహ శ్రోతకు కల్గడానికి ముందుగానే పైన వివరించినట్లు పద్య పాదం విరగడంలోని సొగసువల్ల, ఆమె మెత్తదనం మన మనసుకు తోచి, ఆమె ఏదో బలవత్తరమైన కారణము చేతనే ఇలా అడుగుతోందని మనకు స్ఫురిస్తుంది. అందుచేతనే ఆమె మన సానుభూతిని కూడ పొందగల్గుతుంది.

అంతే కాదు: ఈ పద్యంలో కద్రూ వినతల స్వభావాలను ద్యోతమానము చేసే మాటలు రెండు

ఉన్నాయి. కద్రువ 'తనూజు'లను వేయిమందిని కోరింది. ఆమెకు ఈ శరీరం మీాద మమకారం హెచ్చు. ఆమె వాంఛలన్నీ శరీరాన్ని అట్టి పెట్టుకొని ఉండేవే. అట్టివారిని ఆత్మాభిమానం, ఆత్మోత్కర్ష అంటిపెట్టుకొని ఉంటాయి. అట్టి వారే నిండు చంద్రునిలో నల్లను వెతుకుతారు; ఇతరుల చేత దాస్యాన్ని చేయించుకోవాలని కోరుకుంటారు. వారిలోనే ప్రభుత్వ లక్షణం హెచ్చుగా కనబడుతుంది. వారి కోర్కెలన్నీ స్వర్గలోకపు పొలిమేరల వఱకు ప్రయాణము చేస్తాయి.

కాని తనూజులంటే ఎంతో మమకారంగల కద్రువ, ఆ తనూజులే సర్పయాగంలో పంచత్వమును పొందాలని శపించింది. ఎంతో లోకజ్ఞుడైన కవి కాని, ఇట్టి శాపాన్ని ఇచ్చిన తల్లినోట 'తనూజ' శబ్దాన్ని పలికించ సాహసించడు. కవులలో నన్నయ లోకోత్తరమైన లోకజ్ఞుడు, మహాసాహసి.

ఇక వినత కోరింది 'సుపుత్రులను'. పుత్రులనడంతోనే ఆమెకు పారలౌకికమైన, పారమార్థికమైన చూపు గలదని స్పష్టమవుతోంది. అందులో సుపుత్రులను కోరుకున్నది. కాని, కద్రువ తన ప్రేమకు స్థానముగా భావించిన తన కొడుకులను ఎలా శపించిందో, అలాగే తన్ను ఎంతో ఉద్ధరిస్తాడనుకున్న కొడుకు తన్ను దాసివి గమ్మని శపించాడు. ఇది విధి వైపరీత్యము! ఈ పద్యము ఇన్ని విధాలుగా ఈ ఆశ్వాసంలోని కథను, పాత్ర చిత్రణను, కథ యొక్క పరమార్థాన్ని ఇముడ్చుకుంటూ ఆలోచనామృతము, రమణీయార్థప్రతిపాదకము అవుతూ ధ్వని కావ్య మవుతోంది.

సౌపర్ణాఖ్యానమందలి కథ—సముద్ర మథన కథను మినహాయిస్తే—ఒకదాని తర్వాత నొకటి జరిగిన సంఘటనలను వరుసగా ఏకరువు పెట్టడంతో ఉంటుంది. ఇలా చెప్పబడిన వాట్లలో గరుడుడు తనకు ఆహారముగా ఉదధిలోఉన్న నిషాదులను మ్రింగడం ఇభ కచ్ఛపములను భక్షించడం కూడా రెండు సంఘటనలుగా మనం గ్రహించవచ్చును. ఈ రెండింట అక్కడక్కడ రచన ఎగుడు దిగుడులుగా ఉండి ఆ యా చోట్ల నన్నయ రచనవలె కనబడదు. ఇది పరిశీలింపదగిన అంశము.

ఇక మిగత భాగము నెఱసులు లేని దూది పింజనుండి వడుకబడిన అతి సున్నితమైన సన్నని దారమువలె నడిచింది. యయాతి చరిత్రలో ఆరేడు కథలు ఒకే కథగా అల్లబడినవి. ఆ కష్టము వేఱు. ఇక్కడ ఒకే ఒక వస్తువును సాగదీయవలెను. ఇది మొదటి దానికన్న కష్టమైనది. ఏమన ఇందులో వైవిధ్యము కానరాక శ్రోతకు తొందరగా విసువు కల్గడానికి అవకాశ మెక్కువ ఉన్నది.

ఇలా విసువు కల్గకుండా ఉండడానికి నన్నయ కథను నడిపిన మార్గము పరిశీలింపదగినది. నన్నయ ప్రధాన కథలోనికి మఱి రెండు అంశాలను కూడా జొనిపాడు. దీనివలన ప్రధాన కథ నుండి ఇతర విషయములపట్ల శ్రోత దృష్టి మరలుతుంది. అన్నదమ్ములైన సుప్రతీక విభావసులు కలహించుకొని ఒకరి నొకరు శపించుకొన్న ఘట్టము ఇటువంటిది. దీనిని ఎంతో పెంచి వ్రాయవచ్చును. కథ అన్నదమ్ముల మధ్య నడిచింది. ఇద్దరు మంచివారిలాగే కనబడుతున్నారు. కాని ధన లోభం చాల పెద్దది. ధనాన్ని పంచుకోవడం దగ్గర తగాయిదా వచ్చింది. ఒకరి నొకరు శపించుకొన్నారు. ఒకడు ఏనుగ అయాడు, మఱొకడు కూర్మమయాడు. జన్మలు మాఱినా, రూపాలు మాఱినా, పూర్వ వైరం పోలేదు. నిత్యము వారికి పోరాటము తప్పలేదు.

మంచి కథకు కావలసిన లక్షణాలన్నీ ఇందులో ఉన్నాయి. పెంచి వ్రాస్తే ఇందులో పాత్రీకరణమునకు, ధనలోభాన్ని గూర్చిన తత్త్వ చింతనకు ఎంతో అవకాశముంది. కాని మంచి కథ దొరికింది కదా అని కావ్యములో దానిని విస్తృత పరచి చెప్పాలన్న లోభము కూడా ధనలోభములాగే పెద్దదని నన్నయకు తెలుసును. అందుచేతనే ఈ భాగాన్ని మూడు, నాల్గు గద్య పద్యాలలో ముగించాడు. దీనివలన శ్రోతకు ప్రధాన కథనుండి కాస్త విశ్రాంతి కల్గింది. అది చాలు శ్రోతకు. నూతనోత్సాహముతో తర్వాతి కథను విన నారంభిస్తాడు. శ్రోత ఈ గజ కచ్ఛపములు గరుడునికి ఆహార మవడంతో ఈ అవాంతర కథకు ఒక పరిపూర్ణత్వము కల్గడము, ప్రధాన కథకు పుష్టి కల్గడము—రెండూ కూడా సాధింప బడ్డాయి.

దేవలోకములో పుట్టిన మహోత్పాతములను చూసి, ఇంద్రుడు బృహస్పతిని 'ఇది యేమి నిమిత్తం'బని అడుగగా, బృహస్పతి గరుడుని మహా

త్మ్యమును గూర్చి చెప్పాడు. ఈ భాగము ప్రధాన కథకు అవసరమే. దీనివలన శ్రోతకు ప్రదాన కథ నుండి విశ్రాంతి లభించడమేగాక, రాబోవు కథకు శ్రోత మనసు నిది సన్నద్ధపరుస్తోంది.

ఇక గరుడుని కథ అంతా అద్భుతముల పుట్ట: గరుడునికి నిషాద గణము ఆహార మవడం, గజ కచ్ఛపాలను చేత నిఱికొంచుకొని ఎగిరిపోవడం రౌహిణమనే పాదప మాతనిని తన శాఖమీద కూర్చొని ఆహారాన్ని భుజించమని ఆహ్వానించడం, దానిమీద కూర్చొనేటప్పటికి అది ఫెళఫెళ విరగడం, దానిని తన ముక్కున గఱచికొని కశ్యపునివద్దకు వెళ్లడం మున్నగునవి లోకంలో మనకు కానరాని విషయాలు. అలాగే గరుడుడు అమరవీరుల్ని ఓడించి అమృతాన్ని తీసికొనిపోయే ఘట్టము కూడా మనకు నమ్మకాన్ని కల్గించే ఘట్టము కాకపోవచ్చును.

కాని ఈ కథనంతా అలముకొని ఉన్న ఈ లోకోత్తరమైన విషయాలే ఈ కథను లోకపు సరిహద్దులనుండి మనలను దూరంగా తీసికొని పోయి, దీనినొక రొమాంటిక్ కథగా చేస్తోంది. కాలము 'ఆదియుగము'నకు చెందిన దవడంతోబాటు ఇందులో కనబడే అద్భుతాలవలన లోకాలన్నింటిని స్పృశించే విశేషాలవలన, సౌపర్ణాఖ్యానము రొమాంటిక్ కథగా కనబడుతుంది.

అయితే రొమాంటిక్ కథలను చెప్పడంలో తగిన జాగ్రత్త వహించక పోతే ఇవి ఫెయిరీ టేల్స్‌గా దిగజారే ప్రమాదమున్నది. ఈ ప్రమాదం నుండి రక్షించుకోవడం కష్టమవడంచేతనే కొందఱు కథకులు ఇట్టి కథలలో మానవత్వ స్ఫురణ ఎక్కువగా గోచరించేటట్లు చేసి, ఆ కథను లౌకిక పరిధులలోనే నడుపుతారు. దీనివలన కథ కొక వాస్తవికత లభిస్తుంది. కాని కథలోని రొమాంటిక్ ఎలిమెంట్ తిరోహితమైపోతుంది.

నన్నయ సౌపర్ణాఖ్యానానికి వాస్తవికత నంటగట్టలేదు, దానిని ఫెయిరీ టేల్‌గా దిగజారనీయలేదు. అండమునుండి వెలువడిన గరుడుని గూర్చి నన్నయ ఒక ఉత్పలమాల చెప్పాడు.3. ఈ పద్య నిర్మాణములోను, సమాస ఘటనములోను, ఒక ఉదాత్తత ఉన్నది. దీని తర్వాతి రెండు కంద పద్యాలు కూడ గరుడుని గూర్చి చెప్పబడినవే. వీటి వలన ఒక్కసారిగా గరుడుడు మన మనసునంతా ఆక్రమిస్తున్నాడు. ఈ మూడు పద్యాల ప్రాతిపదిక వలన ఇతడే ప్రధానమైన పాత్ర అయి, మన దృష్టి అంతా ఈ పాత్రమీదనే కేంద్రీకరించబడుతోంది. గరుడుడు సాధించిన అద్భుతాలను, విజయాలను గూర్చి మనము ముందెన్నడో శంకించ దలచుకుంటే అంతవఱకు ఆగనక్కర లేకుండా ఆశంక ఏదో ఇక్కడే మనం వెలిబుచ్చాలి. ఈ మూడు పద్యాలలోని గరుడుని మనము అంగీకరించ దలచుకుంటే, గరుడుడు తర్వాత నిర్వహించిన అద్భుత కృత్యాలను గురించి మనము ఆశ్చర్యపడవలసిన అవసరము కాని, అదంతా పుక్కిటి పురాణమని శంకించవలసిన పని గానిలేదు.

ఈ విషయాన్నే ఇంకొక విధముగా చెప్పడానికి ప్రయత్నిస్తాను. గణిత శాస్త్రములో కొన్ని స్వయంసిద్ధములు ఉంటాయి. వాట్లని నిరూపించడం అసంభవము. అసలు శాస్త్రజ్ఞుడు వానిని నిరూపిస్తాననడు. "ఈ స్వయం సిద్ధాలను మీరు అంగీకరించండి. వీనిని మీరు అంగీకరిస్తే, నేను ఇంకేమీ క్రొత్త అంశాలను నూతన స్వయం సిద్ధాలను ఇందులోనికి జొనపకుండా కట్టుదిట్టమైన ఒక శాస్త్రాన్ని తయారుచేసి పెట్టగలను" అంటాడు. మన మా స్వయంసిద్ధాలను అంగీకరిస్తే ఇంకొక రకమైన శాస్త్రము తయారవుతుంది. యూక్లిడ్ ఒక సరళరేఖకు వెలుపలమున్న ఒక బిందువు గుండా ఆ సరళరేఖకు ఒకే ఒక సమాంతరరేఖను గీయవచ్చునన్న స్వయంసిద్ధాన్ని అంగీకరించాడు. ఈ స్వయం సిద్ధాన్ని అంగీకరిస్తే ఒక త్రిభుజములోని కోణముల మొత్తము రెండు లంబకోణము లవుతుంది. అలా కాకుండా ఒక సరళ రేఖకు వెలుపలనున్న ఒక బిందువునుండి ఆ సరళరేఖకు ఒకటికన్న

---

3. "ఆతతపక్ష మారుత ర
యప్రవికంపిత ఘూర్ణితాచల
వ్రాత మహార్ణవుండు బల
వన్నిజ దేహసముజ్జ్వల ప్రభా
ధూత పతంగ తేజుఁ డుది
తుండయి తార్క్ష్యుడు తల్లికిన్ మనః
ప్రీతి యొనర్చుచున్ నెగసె
భీమ జవంబున నభ వీథికిన్."
(1—2—38.)

ఎక్కువ సమాంతర రేఖలను గీయవచ్చునని అంగీకరించబడింది అనుకోండి. అప్పుడూ ఒక శాస్త్రం ఉత్పన్న మవుతుంది. (ఉత్పన్నమయింది కూడా!) కాని ఈ శాస్త్రము ప్రకారము త్రిభుజములోని మూడు కోణముల మొత్తము రెండు లంబకోణములు ములు కావు!

అలాగే నన్నయ కొన్ని అద్భుత విషయాలను చెప్పదలచుకొన్నాడు. అవి మన లౌకిక ప్రమాణాలకు అందేవి కావు. అందుచేత మన సంకోచాలను, సంశయాలను కాస్త విస్మరించాలి. అప్పుడే సౌపర్ణాఖ్యానమందలి, సౌందర్యాన్ని చూడగల్గుతాము. అయితే నన్నయ ఎప్పటి కప్పుడు ఒక నూతన విషయాన్ని చెపుతూ, "దీన్ని కూడా మీరు నమ్మండి!" అని కోరలేదు. శాస్త్రజ్ఞుడు కొన్ని స్వయంసిద్ధాలను ఆధారంగా చేసుకొని, అసిధారావ్రతంగా శాస్త్ర నిర్మాణానికి ఎలా పూనుకుంటాడో, అలాగే నన్నయ కూడా తొలి మూడు పద్యాలలోనే గరుడునికి ఒక రూప కల్పన చేశాడు. "ఇదీ ప్రాతిపదిక. దీన్ని మీరు అంగీకరిస్తే, మిగత కథ అంతా సత్యమైనదనే భావిస్తారు. దీన్ని మీరు అంగీకరించకపోతే మిగత కథ చదివినా నమ్మలేరు!" అని నన్నయ అన్నట్లుగా నడిచింది ఈ మూడు పద్యాల రచన.

ఇక ఈ మూడు పద్యాలు చదువుతూన్నంతసేపు ఆ రచనా విధానానికి పూర్తిగా వశ్యులమైపోయి, చెప్పిన విషయాన్ని మౌనంగా, హృదయపూర్వకంగా అంగీకరిస్తాము. ఎప్పుడైతే శ్రోత ఇలా కట్టువడిపోయాడో, అప్పు డిక మిగత కథను గూర్చి శంకించే అవకాశమే లేదు. నన్నయ ఈ మూడు పద్యాలలోను శ్రోతలో ఇట్టి మనఃస్థితిని ఏర్పడేటట్లు చేశాడు.


ఇలా ఏర్పడిన మనఃస్థితి స్థిరముగా నిలవడానికి మరికొన్ని అంశాలు తోడ్పడాలి. అందులో ఒకటి కథలో మానవస్పర్శ కానరావడం. అట్టి అవకాశాలు ఉంటే నన్నయ వానిని జారవిడువలేదు. ముఖ్యంగా కద్రువ ఇంద్రు నారాధించిన ఘట్టములోను, గరుడుడు అమృతాన్ని తీసికొనిరావడానికి బయలుదేరేటప్పుడు తల్లి కొడుకును దీవించడంలోను,[4] ప్రదర్శితమైన మానవత గుర్తింప దగ్గది. మొదటి పద్యములో మూర్ఛితులైన ఉరగులను విగత పరితాపులుగా చేయుటకు తల్లి కద్రువ ఇంద్రు నారాధించిన సందర్భములోనిది. రెండవ పద్యంలో వినత గరుడుని ఆశీర్వదించడం కనబడుతుంది. మొదటి పద్యమందలి పదముల కూర్పు ఒక మధురమైన మంత్రములోని శబ్దాల కూర్పును స్ఫురింప చేస్తూంటే రెండవ పద్యములో తల్లి డగ్గుత్తికతో, గర్వముతో, ఆశతో కొడుకును మంత్రములకన్న శక్తిమంతములైన మాటలతో దేవతలందఱినీ ఆహ్వానిస్తూ తన కొడుకును కాపాడమని చెపుతూన్నట్లు ఉంది. ఈ విధమైన రచన వలన అద్భుతానికి మానవత్వమును బాసటగా నిలిపి, సౌపర్ణాఖ్యానమును ఉదాత్త రసాన్వితముగా చేయగలిగాడు నన్నయ్య.

ఈ కథలో ఇట్టి మానవత్వ స్ఫురణ చివరి వఱకు ప్రదర్శితమవుతూనే ఉన్నది. గరుడుడు అమృతాన్ని తీసికొని కూడా 'ఆస్వాదింపక యలోలు' డగుట, ఉరగులు 'అమృతోపయోగ కుతూహలంబున నొండొరులం గడవఁ గృత స్నానాలంకృతులై చనుదెంచుట' మున్నగునవన్నియు ఈ మానవత్వాన్ని పరిరక్షించే ఘట్టములే.

---

4. "నరసుర సిద్ధ కింపురుష
నాగ నభశ్చర ముఖ్యులెల్ల నీ
కరుణయ వేచి యింద్రుడు త్రిజ
గంబులు నీ కులిశాభిరక్షణ
స్ఫురణనచేసి సుస్థిరత
బొందుఁ బురందర సర్వలోక సుం
దర శరణంబు నాకగుము
దానవ సూదన పాకశాసనా!"
(1—2—46)

"అనిలుడు పక్ష యుగ్మ మమృ
తాంశుఁడు వీపు నలుండు మస్తకం
బినుఁడు సమస్త దేహమును
నెప్పుడుఁ గాచుచు నీ కభీష్టముల్
ఘనముగఁ జేయుచుండెడు జ
గన్నుతయున్నతియున్ జయంబుఁ జే
కొనుమని యిచ్చె దీవనలు
గోరి ఖగేంద్రునకుం బ్రియంబునన్."
(1—2—56)



డిస్ట్రిబ్యూటర్లు : నవయుగ ఫిలిమ్స్, గాంధీనగరం, విజయవాడ-3. జెమిని పిక్చర్స్ సర్క్యూట్ (ప్రై) లి॥ కింగ్స్‌వే, సికింద్రాబాద్ A. P.

భారత చరిత్రలో అజ్ఞాత పుటలను తెరిచే లోథాల్


శ్రీ ఎస్. ఆర్. రావ్

నలభై సంవత్సరాల క్రితం 1921 లో హరప్పా, మొహెంజోదారోలను కనుగొన్నప్పటినుంచి భారతదేశం అతి ప్రాచీనమైన నాగరికతలలో ఒక్కదానికి పుట్టినిల్లని నిర్ధారితమైంది.


ఈ సింధులోయ సంస్కృతి ఈజిప్టు నాగరికతకు, సుమేరియన్ నాగరికతకు భిన్నమనడానికి కారణం, సింధులోయ నాగరికత పూర్తిగా పట్టణ నాగరికత కావడమే. క్రీస్తుకు పూర్వం 2,500 సంవత్సరాలకే సింధులోయ ప్రజలు మంచిబాటలు, మురుగు నీటి కాలువలు సక్రమంగా ఏర్పాటు చేసుకోగలిగి ఉండేవారు. మొహెంజోదారోలో ఒక ఉమ్మడి స్నానాగారం ఉండేది. శాస్త్రీయంగా ధాన్యం నిలువ చేసుకొనడానికి ఒక ధాన్యాగారం ఉండేది. వారు చాల విద్యావంతులు. వ్రాతకు గూఢ లిపిని, చిత్ర లిపిని వాడేవారు. వ్యాపారం సక్రమంగా కొనసాగేది. సింధులోయ ప్రాంతమంతా ఒకే రకం తూనికరాళ్ళు ఉండేవి.

హరప్పా, మొహెంజోదారో ఈ రెండు పట్టణాలూ ఒకే పద్ధతిని నిర్మించబడ్డాయి. ఈ రెండు నగరాలలోని మృణ్మయ పాత్రలు, రంగుల చిత్రాలు, రాతి ఆయుధాలు, లోహపు ఆయుధాలు, నగలు, ముద్రలు, ఆటవస్తువులు గూడ ఒకే విధంగాఉండడం చూపరుల దృష్టిని ఆకర్షిస్తుంది. సింధులోయ ప్రజలు సుమేరియన్ ప్రజలతో వ్యాపార సాపారాలు చేస్తున్నప్పటికీ, కళలు, వాస్తు శిల్పాలు, మత సాంఘికాచారాలు, వ్యాపార వాణిజ్యాలు మొదలైన వాటిలో తమ ప్రత్యేకతను రక్షించుకొంటూనే వచ్చారు.

అంతటి సువ్యవస్థితమైన నాగరికత అకస్మాత్తుగా ఎలా మటుమాయమైపోయిందో ఇంకా ఆశ్చ



ఎత్తయిన ప్రాంతంలో కట్టిన ఎగువ పట్టణం దృశ్యం.



నావలు ప్రవేశించే తూము, అదనపు నీరు పారిపోవడానికి మరవ వున్న కృత్రిమమైన ఓడరేవు. దీనిపొడవు 219 మీటర్లు, వెడల్పు 37 మీటర్లు. 60 టన్నుల ఓడలు ఇక్కడ లంగరు వేయవచ్చు.

ర్యమే. దానిని కనుగొనడానికి ఇంతవరకూ ఎలాటి ఆచూకీ దొరకలేదు.


ఈ సింధులోయ నాగరికత క్రీస్తుకుపూర్వం 1500 సంవత్సరాలలో మరుగైపోయిందని చరిత్రకారులు భావిస్తున్నారు. అప్పటినుంచి, క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దిలో బుద్ధుని కాలం వరకు భారతదేశ చరిత్రలో పెద్ద అఖాతం ఏర్పడింది. అప్పటి విషయాలు ఏవీ తెలియకపోయాయి. సింధులోయ నాగరికతను 40సంవత్సరాలక్రితం కనుగొన్నారు. సింధులోయ నాగరిక్షత భారత నాగరకతలో ఎంతవరకు మిళితమై, దానిని ప్రభావితం చేసిందో కనుక్కొని "అజ్ఞాతయుగంపై" కొత్త వెలుతురు పరపడానికి ప్రయత్నం చేసేలోగా 1947 లో దేశం విభక్తమైపోయింది.

దేశ విభజన ఫలితంగా హరప్ప, మొహెంజోదారో, తదితర సింధుతీర పురాచరిత్ర స్థలాలన్నీ పాకిస్తానుకు వెళ్లాయి. అందువల్ల భారత ప్రభుత్వం పురాతత్త్వ శాఖవారు ఇండియా పాకిస్తాన్ సరిహద్దులలోని (ప్రాచీన సరస్వతి, దృషద్వతి తీరభూములయిన) ఘగ్గర్, చౌతాంగ్ లోయలలో హరప్పా నాగరికత గల స్థలాల కోసం త్రవ్వకాలు సాగించదలచారు. (ఇక మీద హరప్ప సంస్కృతి అనే మాటను ఇతర సంస్కృతులకంటె విభిన్నమైన హరప్పా మొహెంజోదారోలలో కనుగొన్న సింధులోయ ప్రజల పట్టణ సంస్కృతి అనే భావంలో వ్యవహరించబడుతుంది.)

ఘగ్గర్‌లోయ తవ్వకాలవల్ల 20 హరప్పా సంస్కృతి స్థలాలు కనిపించాయి. వాటిలో కాలీబంగన్ చాల ముఖ్యమైనది. సౌరాష్ట్రకు సంబంధించినంతవరకు 1954 లో మరల నేను జరిపిన తవ్వకాలవల్ల హరప్ప సంస్కృతితో సంబంధం ధ్రువపడినా, విచిత్రమైన సింధులోయ ముద్రికలు ఈ తవ్వకాలలో దొరకనందున నిశ్చితంగా హరప్పా సంస్కృతితో సంబంధమున్న స్థలాల కోసం అన్వేషించవలసి వచ్చింది. కాఠియవాడ్ ద్వీపకల్పాన్ని పరిసర భారత భూభాగంలో కలిపే ప్రయత్నంలో సర్వే జరుపుతున్నప్పుడు లోథాల్ పరిశోధకుల కంటబడింది. 1955 నుంచి 1961 వరకు ఇక్కడ తవ్వకాలు జరిగాయి. వీనివల్ల గుజరాత్‌లో బాగా వ్యాపించిన హరప్పా సంస్కృతికి సంబంధించిన కొత్త లక్షణాలు తెలియవచ్చాయి. ఈవిధంగా ఇంతవరకు హరప్పా సంస్కృతికి చెందిన 80 పురా పరిశోధక స లాలు కనుగొనబడినవి.

లోథాల్ అనే గుజరాత్ మాటకు మొహెంజోదారో అనే సింధీ మాటకు ఏమిటి అర్థమో అదే అర్థం—అంటే "చచ్చిన వాళ్ల దిబ్బ" (మనరాష్ట్రంలోని దయ్యాల దిబ్బలాగ). ఈ దిబ్బ అహమదాబాద్‌కు 75 కిలోమీటర్ల దూరంలో కాంబే సింధుశాఖ మొగలో ఉంది. క్రీస్తుకు పూర్వం 2450 సంవత

భారతచరిత్రలో అజ్ఞాత పుటలను తెరిచే లోథాల్




మృణ్మయ వృషభం.

రాలనాడు ఇక్కడ ఒక చిన్న గ్రామం ఉండేది. దానిలోనివారు మట్టి మిద్దెలు, మట్టి ఇటుకలతో కట్టిన ఇళ్లలో నివసించేవారు. తరుచుగా వచ్చే నదీ ప్రవాహం దెబ్బ తగులకుండా పల్లెచుట్టూ మట్టి కట్ట కట్టినట్టు కనిపిస్తుంది. గ్రామంలోని ప్రజలు బహుశా వ్యవసాయం, చేపలు పట్టడం, వాటి వ్యాపారం నమ్ముకున్న సరళ స్వభావులయి ఉంటారు. పలువైన రాళ్ల పూసలు తయారు చేసేవారు. ఏనుగుదంతం, నత్తగుల్లలు, ఆలిచిప్పలు చెక్కి అందమైనవస్తువులుతయారు చేసేవారు. అభ్రక మిశ్రమంలాగ మెరిసే ఎర్రటి మట్టితో పాత్రలు సిద్ధపరచేవారు. పాత్రల నమూనాలు, వాటిపై చిత్రపు పనులు హరప్ప మృణ్మయ పాత్రలకంటే భిన్నమైనవి.

వ్యాపారం కోసం సముద్రాలపై తిరిగే హరప్పా ప్రజలు లోథాల్ రక్షణగల ఓడ రేవు కావడం, దానికి ఆనుకుని ఉన్న భూభాగం పత్తి, గోధుమ, వరి పండే సారవంతమయిన భూభాగం కావడం గుర్తించారు; సింధు ఉప్పుకయ్యనుంచి లోథాల్‌కు వచ్చారు. అక్కడినుంచి మరికొంత దిగువకు కిమ్ ఉప్పుకయ్యలోని భగత్రావ్ వరకు వచ్చారు. వారి రాక అంటే స్థానిక ప్రజల జీవితంలో మార్పన్నమాట. కాని, రెండు తెగల ప్రజలు సహకారంతో చాల శతాబ్దాల వరకు సహజీవనం చేసినట్టు అక్కడ దొరికిన ఇరుతెగలవారి వస్తువులనుబట్టి తెలుస్తున్నది. కాని, హరప్పా ప్రజల సామగ్రి నాణెమైనది కావడంవల్ల చాల ప్రజాదరం పొందింది. ఆ వస్తువులు ఏమిటంటే అందంగా రంగులు అలదిన మృణ్మయ పాత్రలు, స్ఫటిక ఫలకాలు, చురకత్తులు, బాణముఖాలు, లోహ పరికరాలు, ఉలులు, బర్మాలు, మేకులు, రాగి కంచు మేకులు, చౌకపు రాతి తూనికరాళ్లు, రాచిప్ప ముద్రలు మొదలయినవి. కొత్తగా వచ్చినవారు మురుగు కాలవలు తవ్వి, రోడ్లు కూడా వేశారు.

వీరు వచ్చిన ఒక్క శతాబ్ది తర్వాత పెక్కుసార్లు వరదలు వచ్చి వారిని నాశం చేశాయి. కాని, ఒక మేధావి అయిన నాయకుని నాయకత్వంలో స్థానికులు సహకారంతో కృషి చేయడంవల్ల ఊరికి భద్రత, అభ్యుదయమూ కలిగాయి. వరదలకు దెబ్బ తిన్న ప్రాకార కుడ్యాలను మరమ్మతుచేసి వెడల్పుచేశారు. వరద దెబ్బ తగులకుండా ఈ ప్రాకారంలో ఇళ్ళు,



ఒక ఇంటి అగ్నికుండంవద్ద దొరికిన రంగుల కూజా.

మూడు నాలుగు మీటర్ల ఎత్తు మట్టి ఇటుకల అరుగులపై కట్టారు. పట్టణాన్ని ఒక వ్యవస్థతో నిర్మించారు. ఉన్నతస్థలం—నిమ్నస్థలం ఈ రెంటినీ విడదీసి, వీటిని పెక్కు విశాలమైన బాటలతో కలిపే ఏర్పాట్లు చేశారు.

పారిశుద్ధ్యపు పద్ధతులు అత్యద్భుతమైనవి. వీధిలోని మురుగుకాలువలకు ఇండ్ల స్నానాగారాల మురుగు తూములను కలిపారు. ఈ మురుగు కాలువలు కొన్ని భూగర్భంలో కప్పిఉండేవి. కొన్ని కప్పకుండాను ఉండేవి. మురికి చెత్తను నడవేసే పెద్ద జాడీలను అడపా దడపా పరిశుద్ధంచేసే ఏర్పాట్లు ఉండేవి. ఇండ్లవారు వీధులలో అంగుళం మేర కూడా దురాక్రమణ చేసుకునే అవకాశంలేదు. పురపాలక సంఘం నిబంధనలు కచ్చితంగా ఉండేవి. ఇళ్ళు ఏర్పాట్ల ప్రకారం వరుసలుతీరి కట్టేవారు. మురుగ కాలువలునిండి మురుగునీరు పైకి ఉబుకకుండా సరి చేయడానికి నేడు ఉన్నట్టు గుండ్రటి రంధ్రాలు (మ్యాన్ హోల్సు) ఏర్పాటయాయి.


పరిశ్రమ సంస్థలు

నదుల ఉభయ తీర ప్రాంతాలలోని సుక్షేత్రాలలోపండే అదనపు ధాన్యం నిపుణులైన లోహపు పనివారికి, పూసలు తయారుచేసేవారికి, ఏనుగుదంతం, శంఖాలు, నత్తగుల్లల కార్మికులకు, పడవ పనివారికి, నావికులకు, వ్యాపారస్థులకు సరిపోయేవి. లోథాల్‌లో ప్రధాన పరిశ్రమ పూసలు చేయడం. విలువగల రాళ్ళు నర్మదానదీ తీరంలో లభించేవి. అవి ఈ లోథాల్ పూసల కర్మాగారాలకు వెళ్ళేవని తెలియవచ్చింది. పరిశ్రమాగారాలలో పూసలు చేయడానికి నడుమ విశాలమైన వేదికలు ఉండేవి. కార్మికులు నివసించడానికి గదులు కూడా ఉండేవి. ముడి సరుకును వేడి చేయడానికి, తయారయిన దానిని పక్కా చేయడానికి పలయాకారంగాపుండే ఆవములను వాడేవారు. అప్పటి లోథాల్ రత్న వ్యాపారులు రత్నాలు సంపాదించే ప్రాంతాలే నేడు కాంబే రత్న వ్యాపారులకు రత్నాకరాలు కావడం గమనించదగిన విషయం. అంతేకాక రత్నాలను తీర్చి దిద్దే పద్ధతి కూడా సరిసమానం.

కెంపులు, స్ఫటికాలు, పచ్చలు, రాతిచిప్పలు మొదలయిన రాళ్ళు లోథాల్‌నుంచే సుమేరియన్ నగరాలకు ఎగుమతి అయ్యేవి. లోథాల్ దిగువ పట్టణంలో బజార్లలో ఆలిచిప్పల గాజుల, రాగి పాత్రల కార్ఖానాలు బహిరంగంగానే ఉన్నట్టు ఆధారాలు దొరికాయి. పట్టణం ఉత్తరపు చివర ఆరు ఇటుకలు పేర్చిన కుండ కొలుములున్న రాగికార్ఖానాలు కనిపించాయి. రాగి పరికరాలు, మట్టి మూసలు కనిపించాయి. పలువురు తామ్రకారులు ఒకే ఇంట్లో పని చేసినట్లు తెలుస్తున్నది.

మరొక తామ్రకారుని చిన్న కార్ఖానాలో ఒక ఇటుకలు కప్పిన కొలిమి, రాతి దాగిలి, మట్టి తూనిక రాళ్ళు మొదలయినవి దొరికాయి. ఈ తామ్రకారులు రాగి గట్లు ఇతర ప్రాంతాలనుంచి తెప్పించుకొని తుత్తినాగం కలిపి కంచు తయారు చేసేవారు. రాతి, కంచు ఉలులు, మామూలు ఉలులు పదునైన అంచులుగల

భారత చరిత్రలో అజ్ఞాత పుటలను తెరిచే లోథాల్



ఒక ఇంట్లో దొరికిన నావ మట్టి నమూనా. కూపదండం, తెరచాప క్రొత్తగా పెట్టినవి.

గండ్రగొడ్డళ్ళు, తొలిచే సాధనాలు, బర్మాలు, వడ్రంగులువాడే ఇతర పరికరాలు, ముద్రలు తొలచే సాధనాలు, ఓడ పనివారు పడవలను తయారుచేసే పరికరాలు— వీటిని ఈ పట్టణంలో తయారు చేసేవారు.

ఓ డ రే వు

లోథాల్ ప్రజలు చేసిన అతి ముఖ్యమైన సేవ, ఓడలు నిలవడానికి, సరకుల ఎగుమతుల దిగుమతులకు అనుకూలించే పెద్ద రేవును నిర్మించడం, కంచుయుగం నాటి మానవులు కృత్రిమమైన ఇలాంటి రేవును నిర్మించినందుకు ప్రపంచంలో దొరికే మొదటి ఆధారం ఇదే. 219 × 37 మీటర్ల స్థలాన్ని తవ్విన తర్వాత చదునుచేసి, ఆవంలో కాలిన ఇటుకలతో చుట్టూ ఒక మీటర్ ఎత్తు గోడ కట్టారు. ప్రవాహం రావడం, మొదలయిన ప్రమాదాలను ఆలోచించే ఈ నిర్మాణం జరిగింది. పెద్ద వరదలు వచ్చినప్పుడు పడవలు ఈ రేవులోకి వెళ్లడానికి ఉత్తరపు గట్టున దాదాపు 13 మీటర్ల వెడల్పు ద్వారమొకటి ఏర్పాటు చేశారు. పడవలు ఒక కాలువద్వారా ఈ ద్వారం చేరుతారు. రేవులో నీరు ఎక్కువయినప్పుడు చెరువు నీరు మరవ పారి వెళ్లిపోయేట్టు దక్షిణపు గట్టున మరవ కట్టడం కూడ లోథాల్ వాస్తు శాస్త్రజ్ఞుల అపూర్వ ప్రతిభ. ఈవిధంగా నీరు నిలవచేసే ఏర్పాట్లు జరిగాయి. రేవు గోడలోని రంధ్రాలనుబట్టి, లంగరు రాళ్లను బట్టి ఇక్కడ పడవలు లంగరు వేసేవని స్పష్టమవుతున్నది. లోథాల్‌లో దొరికిన మృణ్మయ నావ ప్రతిమలో వాడిఅయిన వెన్నుదూలం, కూపకం పెట్టడానికి ఏర్పాట్లు ఉన్నాయి.

క్రీస్తుకు 2000 సంవత్సరాలకుపూర్వం నది ఈ రేవును పాడుచేసి, మరొక వైపుగా పారింది. కాని

ప్రజలు మరొక కాలువ తవ్వి తూర్పు గట్టున ద్వారం ఏర్పాటు చేశారు.

పడమటి ప్రాకార కుడ్యానికి ఆనుకొని సరకుల ఎగుమతి దిగుమతుల కోసం బంకమన్ను, ఇటుకలతో ఒక అరుగువంటిది వేశారు. అరవై టన్నుల ఓడలు కూడ ఈ రేవులో సులభంగా లంగరు వేయగలిగేవి.

కోష్ఠాగారాలు

పట్టణ నిర్మాతలు, ఎంతో వ్యాపారం జరిగే అంతర్జాతీయ నౌకాశ్రయమైన లోథాల్‌లో కోష్ఠాగారాల అవసరం కూడ గ్రహించారు. కనుక ఎగువ పట్టణపు ఆగ్నేయా మూలలో 48.5×42.5 మీటర్ల కోష్ఠాగారం 3.5 మీటర్ల ఎత్తు ఇటుకల అరుగుపై కట్టారు. దురదృష్టవశాత్తు 12 ఇటుక పునాది స్తంభాలుతప్ప అంతా వరదలకు కొట్టుకొని పోయింది. ఈ స్తంభాల పునాదులపై కర్రచట్రాలు అమర్చి సరకులపై వాన ఎండ తగులకుండా [illegible]రాలవంటివి వేసేవారేమో! కొందరు విద్వాంసులు ఇవి ధాన్యాగారాలని అన్నారు. ఈ కోష్ఠాగారంలో దొరికిన ఎగుమతి సరకులలో సింధులోయ ముద్రికలను పోలిన 75 మట్టి ముద్రికలు దొరికాయి. వాటివెనుకవక్క బస్తాలను కట్టే తాళ్లు, గుడ్డలు, దారాలు మొదలయిన వస్తువుల గుర్తులున్నాయి. ఈ ముద్రికలను కేవలం రక్ష తాయెత్తులలాగ వాడేవారనే సిద్ధాంతం దీనితో పరాస్తమైంది. వీటిని సరకుల బంగీలను సీలు వేయడానికి కూడా వాడేవారని రుజువయింది.



కోష్ఠాగారం మూలబంధం.

వ్యాపార వాణిజ్యాలు

లోథాల్ వారికి విలువగల రాళ్లు, లోహాలు కరవు కావడంవల్ల వాటిని దిగుమతి చేసుకోవలసి వచ్చింది. లోథాల్ రత్న వ్యాపారులు ఈ విలువగల రాళ్లను కిం ఉప్పుకయ్యలోనికి హరప్ప రేవు అయిన భగత్‌రావ్‌రేవు ద్వారా రాజ్ పిప్లా గనులనుంచి దిగుమతి చేసుకొనేవారు. ఇప్పటి కాంబే రత్న వ్యాపారులు కూడా రాజ్ పిప్లానుంచే వాటిని సంపాదిస్తున్నారు. లోథాల్ ఈ రత్నాలను పూసలకు బహ్రీన్ దీవుల ద్వారా సుమేరియన్ నగరాలకు ఎగుమతి చేసేది. మెసపొటేమియా (ఇరాక్) లోని ఉర్, బ్రాక్, హమ్మా, కిష్, లగష్ మొదలయిన పట్టణాలలోను, ఎల్మ్ (ఇరాన్) లోని సూసా నగరంలోను దొరికిన సింధు లోయ ముద్రికలతోపాటు చెక్కిన రత్నాలు, చెక్కని రత్నాలు, కూడా దొరికాయి. బహ్రీన్ దీవులలో ఇటీవల గుండ్రటి సింధులోయ మృణ్మయ ముద్రికలు దొరికినట్టు వార్తలు వచ్చాయి. వీటిపైన సింధులోయ లిపి కూడ ఉంది. బ్రాక్, కిష్ నగరాలలో సింధులోయ రకపు తూనికరాళ్లు దొరికాయి. లోథాల్‌కు బహ్రీన్ దీవులతోను, సూసా, కిష్, ఉర్‌లతో వాణిజ్య వ్యాపారాలు సాగుతుండేవని కింద పేర్కొన్న ఆధారాలవల్ల రుజువైంది! (1) ఒక గుండ్రటి బహ్రీన్ రాచిప్ప ముద్రిక (2) సుమేరియన్ లక్షణాలున్న మృణ్మయ ప్రతిమ(3)సూసాలోదొరికినట్టి రక్షరేఖవంటి మండివేసుకొని పడుకునివున్న ఎద్దు ప్రతిమగల రక్షరేకు (4(క్రీస్తుకు పూర్వం 2300 సంవత్సరాలనాటి ఉర్, బ్రాక్ మొదలయిన స్థలాలలో దొరికిన అతుకుల మృణ్మయ పాత్రలు (5) సూసాలో దొరికిన దానివంటి గుండ్రటి రాగి కణిక.

ముద్రలు, నగలు చేయడానికి అవసరమైన రాచిప్పవంటి తెల్లరాయి, బంగారు దక్కన్‌నుంచి, మైసూరునుంచి దిగుమతి చేసుకొని ఉంటారు. స్ఫటికం సుక్కుర్, రోహ్రీలనుంచి దిగుమతి చేసుకుని ఉంటారు.

ఈ సముద్ర వ్యాపారం బాగా సాగిపోతూ ఉండి ఉంటుంది. వ్యాపారస్థులు పనివారికి, నావికులకు ఆర్థిక సహాయం చేస్తుండేవారు. ఒక విదేశ వ్యాపారంచేసే వ్యాపారస్థుని ఇంట్లో రెండు ముద్రికలు, ఉర్‌లో లభించిన వాటివంటి ఎనిమిది బంగారు పతకాలు, సుమేరియన్ వనితనంగల రంగు మృణ్మయ పాత్రలు దొరికాయి. మృణ్మయ ముద్రికలలో ఒకటికంటే హెచ్చు ముద్రికలను గుర్తులు కనిపించడంవల్ల వ్యాపారంలో వాటాదారు పద్ధతి కూడ ఉన్నట్టు స్పష్టమవుతున్నది.


ప్రజల మతం, ఆచారాలు

లోథాల్ ప్రజల జీవితంలో మతానికి ప్రాధాన్యం ఉన్నట్టుకాని, లోథాల్ ప్రజా పాలకుడు మతంతో అధికారాలు పొందిన వాడయినట్టుగాని కనిపించదు. అలా ఉండిఉంటే ఎగువ నగరంలో అగ్నివేదికలు, ఇతర కట్టడాలు ఉండేవి.

అయితే, లోథాల్ ప్రజలు ఏదో ఒక రకపు అగ్ని పూజ జరుపుతున్నట్లే కనిపిస్తున్నది. దిగువ పట్టణంలోని పెక్కు ఇండ్లలో బూడిదవున్న ఇటుకల గుంటలు, కుండ బొచ్చెలు, త్రికోణాకారమైన మట్టి అగ్ని కుండాలు కనిపించాయి. మరి రెండు చోట్ల ఇటుకలతో కట్టిన అగ్ని వేదికలు కనిపించాయి. ఒకదానికి ఒక రంధ్రం, అర్ధ చంద్రాకారమైన గాడి ఉన్నాయి. పక్కనే అందమైన రంగుల కూజా పెట్టి ఉంచారు.

లోథాల్ ప్రజలలో పశువులను బలి యిచ్చే పద్ధతి కూడ ఉండినట్టు రుజువయింది. ఒకటవ వీధిలోని ఒక ఇంట్లో చెక్కిన ఆవు ఎముకలు, బంగారు పతకం, రంగువేసిన పెంకు ముక్కలు, మాంసపు రంగు పూసలు, బూడిద కనిపించాయి. ఈవిధంగా సింధులోయవారి మత విశ్వాసాలకన్నా లోథాల్‌వాసుల పూజా విధానం, మత విశ్వాసం భిన్నమయినదిగా తెలియవచ్చింది. లోథాల్‌వారికి దేవీమాత పూజగాని, లింగపూజగాని తెలియవు. లోథాల్ ముద్రలలో మానవ మూర్తులుగాని, దేవతామూర్తులుగాని కనిపించవు. కనుక సింధులోయలోని కొమ్ములుగల దేవతతో ఇక్కడి మూర్తులను పోలిచే ప్రసక్తే లేదు.

మాతృదేవి పూజగాని, శృంగదేవుడు---పశుపతి పూజగాని, ఘగ్గర్, సట్లెజ్ లోయలలోని కాలీబంగన్



రాచిప్పరాయివంటి రాతితో చేసిన ముద్రలు.

రూపార్‌లలో ఎంతమాత్రమూ ఆచారంగా లేదు. ఈ పూజలకు మారు కాలీబంగన్‌లో అగ్నికుండాలు కనిపించాయి. ఈవిధంగా హరప్పాలోని మతాచారాలకు, ఇతరత్రా వున్న మతాచారాలకు భేదం ఉన్నట్టు కనిపిస్తుంది.

హరప్పా, మొహెంజోదారో, లోథాల్, రూపార్ లలోని ప్రజలలో వివిధ మతాలవారు నివసించడం మనం గుర్తింపవలసిన విషయం.

ఉత్తర క్రియలు

హరప్పా, రూపార్, కాలీబంగన్‌లలోలాగే, లోథాల్ లోను ప్రజలు మృతులను పాతిపెట్టేవారు. అయితే ఈ ఖనన సంస్కారంలో అద్వితీయమైన విషయమేమిటంటే, ఇద్దరు ముగ్గురుని కలిపి ఖననంచేయడం. హరప్పారీతి ఖనన స్థలాలు ప్రతి ఖద్ధింట మూడింటిలో రెండు రెండుశవాలు కనిపించాయి. ఒకదానిలో నలుగురి శవాలను ఒక మానవజాతి శాస్త్రజ్ఞుడు కనుగొన్నాడు. వారిలో ఇద్దరు స్త్రీలయినట్టు ఆయన తెలుసుకున్నాడు. దీనినిబట్టి అప్పుడు సహగమన పద్ధతి ఆచారంలోఉండేదని స్పష్టమవుతున్నది. వెడల్పుతక్కువగాను, పొడవు ఎక్కువగాను ఉండే కపాలంగల అస్థిపంజరాలు, ఇరుకు ఫాలంగల మానవాస్థిపంజరాలు కనిపించాయి. దీనివల్ల లోథాల్ ప్రజలలో నానాజాతివారుండేవారనడం నిస్సందేహం.

కళారంగంలో లోథాల్ హరప్పా సంస్కృతి అభివృద్ధికి గొప్ప కృషి చేసింది. మృణ్మయ పాత్రలపై పెంపుడు జంతువులు, మృగాల చిత్రాను పరిసరానుగుణమైన వర్ణాలలో చిత్రించే పద్ధతి అభివృద్ధి పొందింది. లోథాల్ ప్రజలు పూర్తిగా వాస్తవికతావాదులు. వారు ఎలాంటి సంప్రదాయానికీ, రీతికీ కట్టుబడలేదు. లోహాల పోతలోను, విగ్రహాల చెక్కడం

లోను లోథాల్ శిల్పులు హరప్పా శిల్పులకు ఏమీ తీసిపోరు. రాగితో చెక్కిన కుక్క, కుందేలు, మట్టి వృషభం, ఖడ్గమృగం, ఎలుగుబంటి వారి నైపుణ్యానికి ఉదాహృతులు.

కాలీబంగన్‌లో ఇటీవల జరిపిన తవ్వకాలవల్ల ప్రాగ్‌హరప్పా సంస్కృతిపై కొంత వెలుగు ప్రసరించింది. ఈ ప్రాగ్‌హరప్పా సంస్కృతి ఘగ్గర్ లోయలో వ్యాపించి ఉండేది. సింధులోయలోని కోట్—డిజి సంస్కృతిని పోలి ఉండేది. సౌరాష్ట్రంలోను హరప్పా సంస్కృతి చిహ్నలున్నాయి. కాని, హరప్పా సంస్కృతి స్థానికమా అనడం తొందరపాటవుతుందేమో!

గుజరాత్‌లో హరప్పా సంస్కృతి వినాశానికి కారణం క్రీస్తుకు పూర్వం 1900 లో తరచు వరదలు రావడం, తత్ఫలితంగా సంస్కృతి పెగిపోవడమూ నని అనడానికి తగిన ఆధారాలున్నాయి. తర్వాత కొన్ని శతాబ్దాలకు వినాశోన్ముఖమైన హరప్పా సంస్కృతి రంగ్‌పూర్‌లో లభించిన ఎర్రటి మృణ్మయ పాత్ర లనుబట్టి ఆ పేరుతో ప్రసిద్ధిపొంది క్రీస్తుపూర్వం 800 వరకూ కొనవూపిరితోవుంది. సింధులోయలోను, హరప్పా, మొహెంజోదారో సంస్కృతి తరచు వరదల దెబ్బలు తింటున్నట్టు సాక్ష్యముంది. పూర్తిగా నశించి పోవడానికి పెక్కు కారణాలు కావచ్చు. కాని వాటిలో ముఖ్యమైంది, లోథాల్, రంగ్‌పూర్‌లలో పెద్ద వరదలు.

ఆర్యుల దండయాత్రలవల్ల అవి నాశమయిన వని కొందరు పాశ్చాత్యులు చెప్పిన వాదాలు ఇటీవల సింధు నగరాలలో లభించిన ప్రతికూల కారణాలవల్ల పరాస్తమయాయి. ఆ దాడులు జరిగినట్టు చెబుతున్న కాలంలో హరప్పా ప్రజలు హరప్పాలో లేరు. అంతే కాకుండా, హరప్పా జాతికి దండయాత్ర చేసిన జాతికి మధ్య కాల వ్యత్యాసం చాల ఉంది. మొహెంజోదారో లోను పెద్ద మానవ వధ జరిగినట్టు సాక్ష్యాలు లేవు. కనుక మొహెంజోదారో, హరప్పాలపై ఆర్యులు దాడి చేశారనడం కేవలం ఊహకాని, వాస్తవం కాదు.

సింధులోయ నగరాలు నాశనమయిన తర్వాత హరప్పా ప్రజలు ఘగ్గర్, గంగా తీరాలకు బయలు దేరారు. వారు సౌరాష్ట్రలోను, ఇతరత్రాను చాల కాలం ఉండినారు. భారత దేశంలోని ఈ అజ్ఞాత యుగంపై పెక్కు పురాతత్త్వ పరిశోధక సంస్థలు— రంగ్‌పూర్ (సౌరాష్ట్ర), హస్తినాపూర్ (ఉత్తరప్రదేశ్), మహేశ్వర్ (మధ్యప్రదేశ్), అహారా (రాజస్థాన్), పురాతత్త్వ శాఖలు సాగిస్తున్న తవ్వకాలు, పరిశోధనల వల్ల కొత్త వెలుగులు ప్రసరించవచ్చు.

(1965 జులై 4 "యోజన" నుంచి)

దెసలను కొమ్మ లొయ్య నతిదీర్ఘములైన కరంబులన్ ప్రియం
బెసగగ నూది సక్కి రజనీశ్వరు డున్నతలీల బేర్చు నా
కసమను పేరి భూరుహము కొంతనిరంతర తారకా లసత్
కుసుమచయంబు గోయుట కొకో యన బ్రాకె సముత్సుకాకృతిన్.

(ఎఱ్ఱన—నృసింహపురాణం.)

లేఖలు:

విశ్వనాథోక్తి

సభలకు వెళ్లజాలకపోయినను తిరుపతి సాహిత్య సభలను గురించి జూలై నెల భారతిలో ప్రచురితమైన వ్యాసమును సునిశిత దృష్టితో పఠించుకొనిన వారిలో నే నొకడను. ముఖ్యముగ శ్రీ విశ్వనాథగారి ఉపన్యాసంనుండి సంగ్రహింపబడిన వాక్యములను చదివి కవిసమ్రాట్టులు, మహాకవులు సైత మింత నిరాధారముగను, అసభ్యముగను, అసహనముతోడను మాటలాడగలరా అని ముక్కుపై వ్రేలిడికొనవలసి వచ్చినది. ప్రతియొక్క చర్యకూ సమాన వ్యతిరేక చర్య ఉన్నట్లే దానిపై శ్రీ గొడారి ఏసోబు వ్రాత ఆగస్టు భారతిలో కన్పించటములో ఎట్టి విశేషములేదు. కాని శ్రీ విశ్వనాథవారికి 'సుభాషితములు' చెప్పుటలో 'క్రీస్తుమతంవాడిని' అని చెప్పికొనిన శ్రీ ఏసోబు కూడ చాలవరకు ప్రమాదమునకు లోనైనారు. మహామహులు, మానవాతీతులు మహాప్రవక్తలును అగు కారణ జన్ములు కీర్తి ప్రతిష్ఠలు నిలబడుటకు సామాన్య మానవుల సహాయమేమియు అవసరములేదు. విశ్వనాథవారు 'క్రీస్తును' 'గాడు' అనగానే ఆయన కీర్తి ఏవిధంగానూ హెచ్చనట్లే 'క్రీస్తు' పైన ఉండే భక్తితో విశ్వనాథవారి గోత్ర ప్రవర్తనలగూర్చి చర్చించుటవలన 'క్రీస్తు' ఘనత పెరుగ లేదనే చెప్పవలెను. ఇది వారి వారి అజ్ఞత, సంకుచితత్వములను మాత్రమే తెలియజేయునని చెప్పక తప్పదు. తనను సిలువ వేసిన వారిపైననే దయ జూపుమని ('For give them father, for they know not what they do') అనుచు భగవంతుని కోరిన కరుణా స్వరూపుడు ఏసు క్రీస్తు. అట్టి మహామహుని పరిశుద్ధాత్మ తనను అజ్ఞత చేతనో మరియొక భావముతోడనో తేలబల్కిన వ్యక్తి తెగనాడబడుటచే సంతృప్తి వహించియుండదు. పైగా తన అనుయాయుడునని చెప్పికొనువాని వర్తనవలన బాధనే పొందియుండునేమో! ఇట్లనుట శ్రీ విశ్వనాథగారి ప్రసంగము సముచితమైనదనుటకాదు. సముచితమని జ్ఞానవంతులు హర్షింపజాలరు.

అర్థం చేసికొనకపోతే మతమనే దొక నల్లమందువలె పని చేస్తుంది. క్రూసేడులు గాని, మతం పేరిట మన దేశంలో జరిగిన మారణ హోమములుగాని, మానవుని 'సంస్కృతిని—నాగరికతను' వ్యక్తం చేయజాలవు. ఎన్ని మతము లెన్ని విధములుగ చెప్పినను చివరకు 'ఏకం సత్ విప్రా బహుధా వదంతి' అనే వేదవాక్యమే సారాంశం. సాహిత్య సభాపరిశీలకుడు వ్రాసిన 'విశ్వనాథవారి ఉపన్యాసం నుండి జ్ఞానమును పొందాలనటం ఉన్మాదమే అవుతుంది.... వారి సిద్ధాంతాలను గౌరవించటం—మోమోటము, దురభిమానము వదలితే అందరికీ సాధ్యమయ్యే పని కాదు—ఆయన ఉపన్యాసంలో......సత్యమూ, హేతువూ లేవు'—ఇత్యాది వాక్యాలే వారి ఉపన్యాస వైశిష్ట్యాన్ని తెల్పుచున్నవి. అవి చాలు. మరల ఆయన పలికిన 'తేలిక పలుకుల'నే ఆధారముగ చేసికొని ఇంకా 'తేలిక వ్రాతలు' వ్రాసినందువలన సాధింపబడగల ప్రయోజన మేమియు లేదు. పైగా శ్రీ ఏసోబు గారు పోను పోను శ్రీ విశ్వనాథగారిని వదలివేసి 'బ్రాహ్మణులు అనుకునేవారు తప్ప' అని—'విశ్వనాథవారు ఆర్యులు—బ్రాహ్మణులు కదా!' అని తన వాదాన్ని తప్పు త్రోవకు

నడిపించుకున్నారు. ఇచ్చట విమర్శ 'ఒకానొక వ్యక్తి యొక్క చేష్ట' పైననే గాని, వ్యక్తిపైన, వ్యక్తికి గుఱించిన యితర విషయములపైన కాదు అని గ్రహింపవలసియున్నది. 'విశ్వనాథవారు ఆర్యులు—బ్రాహ్మణులు కదా—ఆర్య భాష ఎలా పోయింది' అనుటలో ఆర్యులు—బ్రాహ్మణులు ఆర్య భాషను మాట్లాడి తీరవలెననియా ఉద్దేశ్యము? కాని ఒక వ్యక్తి మాట్లాడే భాష అతడు జన్మించిన ప్రాంతం, సంఘం మొదలగు అంశములపై ఆధారపడి ఉంటుంది కదా! శ్రీ ఏసోబు క్రిష్టియన్ కద. క్రిష్టియనులు ప్రపంచంలో అధిక సంఖ్యాకులు విదేశీయులై ఉంటూ (భారతీయులు గాకుండా) విదేశీయ భాషలన్న మాట్లాడుచుండగా శ్రీ ఏసోబు తెలుగు భాషనే ఏల మాట్లాడవలెను అనుట ఏమి భావ్యము? శ్రీ ఏసోబు తెలుగు వాడైనట్లే శ్రీ విశ్వనాథవారు సైతము ఆంధ్రులే. కావున సాహిత్య చర్చ లొనరించునపుడు— ఆ మాటకు వస్తే ఏ చర్చ నొనర్చునపుడైనను, వివాదగ్రస్త విషయాన్ని వదలి వ్యక్తి దూషణకూ, సబంధ రహిత విషయ ప్రస్తావకు పాల్పడుట వలన ఆ చర్చకు శోభగాని, చర్చా పాఠకులకు విజ్ఞానముగాని చేకూరనట్లే చర్చాకారులకు సైతము గౌరవము చేకూరదనుట నిర్వివాదాంశము. ఈ సత్యం శ్రీ విశ్వనాథ వారికి వర్తించినట్లే శ్రీ ఏసోబుకు కూడ వర్తించి తీరుతుంది.

కాని నేడు మన దేశానికి కావలసినది— 'మతాలు వేరైనను మనమంతా భారతీయులం, భాషలు వేరైనను, మనమంతా భారతీయులం' అను సమష్టి భావం—మరియు 'నాకొక్కటే మాతృ దేశం—అదే భారత దేశం! నా కొక్కటే జాతీయత—అదే భారత జాతీయత' అను వ్యక్తిగత భావం.

కోవూరు. వి. రాజగోపాలరావు.

(ఈ విషయంపై ఇక ప్రచురణ జరగదు. భా. సం.)

అతిథి కడు నల్పుడైన నత్యధికుడైన
నింటి కేతేర ప్రియమందు నెవ్వడేని
వాని గౌరవ మది గౌరవంబు కాని
కాదు గౌరవ మాకారగౌరవంబు.

(నన్నెచోడ—కుమార)